॥ ఓం శ్రీపరమాత్మనే నమః ॥

# అథ చతుర్థోఽ ధ్యాయః - జ్ఞానకర్మసన్న్యాసయోగః

## (నాల్గవ అధ్యాయము - జ్ఞానకర్మసన్న్యాసయోగము)

భగవద్గీత మొదటి అధ్యాయంలో అర్జునుని ద్వారా వ్యాసాచార్యులు సంసారంయొక్క సమస్యను వెలిబుచ్చారు. ఆ సమస్య మూడు రూపాల్లో ఉంటుంది – రాగం, శోకం, మోహం.

**రాగం** – బాహ్యవస్తువులమీద భావపరంగా ఆధారపడతాము
**శోకం** – భావపరంగా ఆధారపడటంవల్ల మనస్సు బాధపడుతుంది
**మోహం** – రాగం, శోకాలవల్ల బుద్ధి సరిగ్గా పనిచేయదు

అర్జునుడు ఈ మూడు దశల్లో పడిపోయినప్పుడు, ముందు తనే తన సమస్యను పరిష్కరిద్దామనుకున్నాడు, కాని సాధ్యం కాలేదు. అప్పుడు ఒక తెలివైన పని చేశాడు. భగవంతుణ్ణి శరణువేడి, ఆయనను గురువుగా స్వీకరించాడు.

భగవద్గీతలో కృష్ణపరమాత్మను భగవంతునిగా కాకుండా, గురువుగా చూస్తాము.

**వసుదేవసుతం దేవం కంసచాణూరమర్దనమ్**
**దేవకీపరమానందం కృష్ణం వందే జగద్గురుమ్** – ధ్యానశ్లోకాలు

అర్జునుడు తెలివిగా కృష్ణపరమాత్మను శరణు వేడాడు. కృష్ణుడు కూడా గురువుగా జవాబు చెప్పటానికి సిద్ధపడ్డాడు. రెండవ అధ్యాయంలో కృష్ణపరమాత్మ అర్జునుని సమస్యకు సమాధానం ఇవ్వటం మొదలుపెట్టాడు. **ఆత్మజ్ఞానం మాత్రమే సంసారంనుంచి విముక్తి కలిగించగలదు.** ఇదీ కృష్ణపరమాత్మ బోధ సారాంశం. అందువల్ల భగవద్గీతను **ఆత్మవిద్య** అని కూడా అంటారు. గీతలో అనేక అంశాలు చర్చించాడు. ఆఖరికి ఆహారనియమాలు కూడా వదలలేదు. కాని ముఖ్యాంశం జ్ఞానం. అందువల్ల గీతను **మోక్షశాస్త్రం** అని కూడా అంటారు.

**వ్యవహిత పృథనాముఖం నిరీక్ష్య స్వజనవధాద్విముఖస్య దోషబుద్ధ్యా**
**కుమతిమహరదాత్మవిద్యయా యశ్చరణరతిః పరమస్య తస్య మేఽస్తు** – భీష్మస్తుతి శ్లోకమ్ 1-9-36

భీష్మాచార్యులు కృష్ణపరమాత్మతో చెబుతాడు, 'ఓ దేవా! నువ్వు అర్జునుని సమస్యను ఆత్మవిద్య ద్వారా పారద్రోలావు.' అందువల్ల భగవద్గీత భక్తిశాస్త్రం, కర్మశాస్త్రం, యోగశాస్త్రం కాదు. **భగవద్గీత జ్ఞానశాస్త్రం.**

రెండవ అధ్యాయం మొత్తం భగవద్గీతయొక్క సారాంశం. రాగ, శోక, మోహాలను పోగొట్టటానికి రెండు దశల్లో ఆధ్యాత్మిక సాధనను చెయ్యాలన్నాడు కృష్ణపరమాత్మ. అవి – కర్మయోగం, జ్ఞానయోగం. ఒకటి ప్రవృత్తిమార్గం, ఇంకొకటి నివృత్తిమార్గం. కర్మయోగం అనాత్మ గురించి చెపితే, జ్ఞానయోగం ఆత్మ గురించి చెబుతుంది.

ఈ రెండింటి గురించీ టూకీగా రెండవ అధ్యాయంలో చెప్పాడు కృష్ణపరమాత్మ. కర్మయోగం చిత్తశుద్ధిని కలుగజేస్తుంది. ఈ సందర్భంలో కృష్ణపరమాత్మ ఒక విషయాన్ని సుస్పష్టంగా తేటతెల్లం చేశాడు. కర్మయోగం దానంతట అది మోక్షాన్ని ఇవ్వలేదు. చిత్తశుద్ధిని మాత్రమే కలుగజేస్తుంది; దాని తరువాత జ్ఞానయోగానికి రావాలి. కర్మయోగం కర్మను ఎలా సరియైనరీతిలో చేయాలో, ఎలా సరియైన దృక్పథంతో చేయాలో నేర్పిస్తుంది. ఈశ్వరార్పణబుద్ధిని, ప్రసాదబుద్ధిని కలుగజేస్తుంది.

దాని తరువాత జ్ఞానయోగానికి వచ్చి ఆత్మవిచారణ చేయాలి. అది కూడా సమర్థవంతమైన గురువు దగ్గర శాస్త్రాన్ని నేర్చుకోవాలి. అది కూడా శ్రవణ, మనన, నిదిధ్యాసనల ద్వారా నేర్చుకోవాలి. ఈ రెండు యోగాల గురించీ టూకీగా చెప్పాడు కాబట్టి వాటిని వివరంగా చెప్పదలచుకున్నాడు కృష్ణపరమాత్మ.

భగవద్గీత బోధ టీవీలో న్యూస్ చదివే పద్ధతిలో ఉంటుంది. న్యూస్‌లో ఏం చేస్తారు? ముందు హెడ్‌లైన్స్ చెప్పి, తరువాత ఆ విషయాలన్నీ వివరంగా చెప్పి, మళ్ళీ హెడ్‌లైన్స్‌తో ముగిస్తారు. భగవద్గీత కూడా అంతే. రెండవ అధ్యాయంలో భగవద్గీత సారాంశం అంతా చెప్పి, 3–17 అధ్యాయాల్లో వాటిని వివరించి, మళ్ళీ 18వ అధ్యాయంలో సారాంశాన్ని చెప్పాడు. దీన్ని **సంక్షిప్త, విస్తార, సంక్షిప్త పద్ధతి** అంటారు. అలా కర్మయోగం జ్ఞానయోగాల గురించి రెండవ అధ్యాయంలో టూకీగా చెప్పాడు. ఇప్పుడు వాటిని విస్తారంగా చెప్పాలి. మూడవ అధ్యాయంలో కర్మయోగం గురించి విస్తారంగా చెపితే; నాలుగు, ఐదు అధ్యాయాల్లో జ్ఞానయోగం గురించి విస్తారంగా చెబుతాడు. జ్ఞానయోగం అర్థం చేసుకోవటానికి కొంచెం కష్టం కాబట్టి, దానికి రెండు అధ్యాయాలను కేటాయించాడు. మూడవ అధ్యాయాన్ని కర్మయోగం అంటారని చూశాము. నాల్గవ అధ్యాయాన్ని **జ్ఞానకర్మసన్న్యాసయోగము** అంటారు. అలా ఎందుకంటారో తరువాత చూద్దాము.

ఈ నేపథ్యంతో నాల్గవ అధ్యాయంలోకి అడుగు పెడదాము. ఇందులోనూ, ఐదవ అధ్యాయంలోనూ జ్ఞానయోగం గురించి వస్తుంది. వీటిని బాగా అర్థం చేసుకోవాలంటే ముందు రెండవ అధ్యాయంలో చెప్పిన జ్ఞానయోగ భాగాన్ని ఒకసారి గుర్తుకు తెచ్చుకోవాలి. 12 నుంచి 30 వరకూ శ్లోకాలు జ్ఞానయోగం గురించిన సంక్షిప్త బోధ.

**న త్వేవాహం జాతు నాసం న త్వం నేమే జనాధిపాః ।**
**న చైవ న భవిష్యామః సర్వే వయమతః పరమ్ ॥** – 2.12

**దేహీ నిత్యమవధ్యోఽ యం దేహే సర్వస్య భారత ।**
**తస్మాత్ సర్వాణి భూతాని న త్వం శోచితుమర్హసి ॥** – 2.30

వీటి మధ్యనున్న శ్లోకాల్లో జ్ఞానయోగం గురించి చెప్పబడింది. ఇప్పుడు మనం చూడబోయేది వీటి వ్యాఖ్యానం.

**శ్రీభగవాన్ ఉవాచ**

శ్లో. 1 **ఇమం వివస్వతే యోగం ప్రోక్తవానహమవ్యయమ్ ।**
**వివస్వాన్ మనవే ప్రాహ మనురిక్ష్వాకవేఽబ్రవీత్ ॥**
ఇమమ్, వివస్వతే, యోగమ్, ప్రోక్తవాన్, అహమ్, అవ్యయమ్,
వివస్వాన్, మనవే, ప్రాహ, మనుః, ఇక్ష్వాకవే, అబ్రవీత్ ॥

| | | | |
|---|---|---|---|
| అహమ్ | = నేను | మనవే | = (తన కుమారుడైన వైవస్వత) మనువునకు |
| ఇమమ్, అవ్యయమ్ | = ఈ శాశ్వతమైన | ప్రాహ | = బోధించెను |
| యోగమ్ | యోగమును | మనుః | = (ఆ) మనువు |
| వివస్వతే | = సూర్యునకు | ఇక్ష్వాకవే | = (తన కుమారుడైన) ఇక్ష్వాకునకు |
| ప్రోక్తవాన్ | = చెప్పియున్నాను | అబ్రవీత్ | = ఉపదేశించెను. |
| వివస్వాన్ | = సూర్యుడు | | |

**శ్రీభగవానే ఉవాచ**
**అహమ్ ఇమమ్ అవ్యయం యోగం వివస్వతే ప్రోక్తవాన్ ।**
**వివస్వాన్ మనవే ప్రాహ । మనుః ఇక్ష్వాకవే అబ్రవీత్ ।**

తా: శ్రీభగవానుడు ఇట్లు పలికెను – నేను నిత్యసత్యమైన ఈ యోగమును సూర్యునకు చెప్పియున్నాను. సూర్యుడు తన పుత్రుడైన వైవస్వతమనువునకు దీనిని బోధించెను. ఆ మనువు తన కుమారుడైన ఇక్ష్వాకునకు ఉపదేశించెను.

**1. అవతార రహస్యం: శ్లోకాలు 1 –12:** కృష్ణపరమాత్మ ఉద్దేశ్యం జ్ఞానయోగం గురించి విస్తారంగా చెప్పటమే అయినా, అసలు విషయంలోకి అడుగు పెట్టేముందు, 1 నుంచి 12 శ్లోకాల వరకూ వేరే రెండు అంశాల గురించి చెప్పబోతున్నాడు. అవి – **గీతాస్తుతి; అవతార రహస్యం.** 13వ శ్లోకంనుంచి అసలు బోధ మొదలవుతుంది.

ఎ) **గీతాస్తుతి** – గీత వేదాల సారం. కృష్ణపరమాత్మ గీతాబోధను తన స్వంతబోధగా చెప్పుకోవటం లేదు. వేదాలను అపౌరుషేయాలు అంటారు. అవి సాక్షాత్తూ భగవంతుణ్ణుంచే వచ్చాయి. ఋషులు వాటిని తమ సత్త్వగుణంతో అందుకున్నారు. అప్పటినుంచి ఇది గురుపరంపరగా వస్తున్నది. కాని మధ్యకాలంలో మనుష్యులలో వాటిమీద శ్రద్ధ తగ్గింది. ఇది సాక్షాత్తూ పరమాత్మనుంచే వచ్చింది కాబట్టి, మానవాళికి మేలు చేయటంకోసం, ఆ బోధను పునరుద్ధరించే బాధ్యత కూడా పరమాత్మమీదే ఉంది.

అందువల్ల భగవంతుడు కృష్ణునిగా అవతారమెత్తాడు. కృష్ణావతారం కంసవధకోసం మాత్రమే కాదు. అది ముఖ్యకారణం కాదు. నిజానికి కంసుని వధించటానికి పరమాత్మ క్రిందికి దిగి రానవసరం లేదు. కంసుని తలమీద ఒక మెరుపు మెరిపిస్తే చాలు. దానికోసం గర్భవాసం, కారాగారవాసం, అసురుల వధలు చేయాల్సిన పని లేదు. వేదాలను పునరుద్ధరించటంకోసం భగవంతుడు కృష్ణునిగా అవతారమెత్తాడు. అందువల్ల కృష్ణపరమాత్మ

అర్జునునితో అంటాడు – నా ప్రాథమిక బాధ్యత **జగద్గురువు**గా బోధించటం. ఓ అర్జునా! నీ ద్వారా నేను మొత్తం మానవాళికి బోధ చేస్తున్నాను. అందువల్ల గీతాబోధ చివర్లో కృష్ణపరమాత్మ ప్రత్యక్షంగానే చెబుతాడు 'ఓ అర్జునా! నాకు అందరూ ఇష్టమే, కాని గీతాబోధ చేసేవారంటే మరీ ఇష్టం'. స్వామీజీ అంటారు, 'కృష్ణపరమాత్మ నన్ను ఇంకా ఎక్కువగా ప్రేమించటానికి కారణం నేను గీత క్లాసులు తీసుకుంటున్నాను.' (సంవత్సరమంతా, చెన్నై మహానగరంలో ఎక్కడో ఒకచోట స్వామీజీ గీతాబోధ చేస్తూనే ఉంటారు. గీత ఎన్నిసార్లు చెప్పి ఉంటారో లెక్కలేదు.) కృష్ణపరమాత్మ అవతారం ఎత్తింది గీతాచార్యునిగా అవటానికి. గీత అంటే వేదాల సారం. ఇది గీతామాహాత్మ్యమ్.

> **సర్వోపనిషదో గావో దోగ్ధా గోపాలనందనః**
> **పార్థో వత్సః సుధీర్భోక్తా దుగ్ధం గీతామృతం మహత్** – ధ్యానశ్లోకాలు

ఉపనిషత్తులు ఆవు అయితే, గీత దాన్నుంచి వచ్చే పాలు; కృష్ణపరమాత్మ ఆ పాలను పిండే గోపాలుడు. అందువల్లనే ప్రతి అధ్యాయం చివర **ఇతి శ్రీ మద్భగవద్గీతాసు ఉపనిషత్సు** అని వస్తుంది. ఇప్పుడు శ్లోకం చూద్దాము.

**అహమ్ ఇమం యోగం ప్రోక్తవాన్** – ఓ అర్జునా! ఇదే బోధను నేను ఇంతకు ముందు వేదాల రూపంలో చేశాను. ఇప్పుడు వేరే పేరుతో చెబుతున్నాను. యోగం అంటే ఇక్కడ యోగద్వయం – కర్మ, జ్ఞాన యోగాలు. ఎవరికి చెప్పాడు?

**వివస్వతే** – ఈ జ్ఞానాన్ని సూర్యభగవానునికి చెప్పాను. సూర్యభగవానుణ్ణి **వివస్వాన్** అంటారు. వివః అంటే అన్నం; వివస్వాన్ అంటే అన్న ప్రదాత. సూర్యుడు పరోక్షంగా వానలు కురిపించటం ద్వారా మనకు అన్నం సమృద్ధిగా దొరికేలా చేస్తాడు. ఈ విషయాన్ని 9వ అధ్యాయంలో చెబుతాడు.

> **తపామ్యహమహం వర్షం నిగృహ్ణామ్యుత్సృజామి చ ।**
> **అమృతం చైవ మృత్యుశ్చ సదసచ్చాహమర్జున ॥** – 9.19

సూర్యుడే సముద్రంనుంచి నీటిని గ్రహించి, వానరూపంలో కురిపించి, పంటలు పండేలా చేస్తాడు. అందువల్ల మనకు ఆహారాన్ని ప్రసాదించేది సూర్యుడే, వృక్షాలకు ప్రాణశక్తిని ఇచ్చేది కూడా సూర్యుడే.

**వివః అన్నమ్ అస్య అస్తి ఇతి వివస్వాన్** – ఈ సూర్యభగవానునికి బోధ చేశాను. ఎటువంటి బోధ?

**అవ్యయమ్** – ఎన్నటికీ నాశనం లేని బోధ. శాశ్వతమైనది. అవ్యయమ్ అంటే సనాతనం. అందువల్ల మన ధర్మాన్ని **సనాతన ధర్మం** అంటారు.

అంటే భగవంతుడు మహావిష్ణువు సూర్యభగవానునికి బోధించాడు. అతను ఏం చేశాడు?

**వివస్వాన్ మనవే ప్రాహ** – వివస్వుడు తన పుత్రుడైన మనువుకు చెప్పాడు. అతను సూర్యవంశానికి చెందినవాడు. రాముని పరంపరను సూర్యవంశమనీ, సీత పరంపరను చంద్రవంశమనీ అంటారు.

**సూర్యవంశ సముద్భూతం, సోమవంశ సముద్భవామ్**
**పుత్రం దశరథస్యాద్యం, పుత్రీం జనక భూపతేః**

వైవస్వత మనువుచేత కలియుగం నడుపబడుతున్నది. వైవస్వతమనువు నడుపుతున్నాడు కాబట్టి ఈ యుగాన్ని వైవస్వతమన్వంతరం అంటారు. మనం మనువు పుత్రులం, అందువల్ల మానవులం. మనువు ఏం చేశాదు?

**మనురిక్ష్వాకవేఽ బ్రవీత్** – మనువు, ఇక్ష్వాకునకు బోధించాడు. మన సాంప్రదాయంలో ఆధ్యాత్మ జ్ఞానం రెండు పరంపరలుగా వస్తున్నది. ఒకటి క్షత్రియపరంపర, ఇంకొకటి బ్రాహ్మణపరంపర. బ్రాహ్మణపరంపరలో సనక, సనాతన, సనందన, సనత్కుమారులు వస్తారు. వివసుడు, మనువు, ఇక్ష్వాకుడు లాంటివారు క్షత్రియ పరంపరలోకి వస్తారు. కృష్ణపరమాత్మ క్షత్రియపరంపరను ఎందుకు చెబుతున్నాడంటే గురుశిష్యులిద్దరూ క్షత్రియ పరంపరకు చెందినవారు కాబట్టి.

శ్లో. 2 **ఏవం పరంపరాప్రాప్తమిమం రాజర్షయో విదుః ।**
**స కాలేనేహ మహతా యోగో నష్టః పరంతప ॥**
ఏవమ్, పరంపరాప్రాప్తమ్, ఇమమ్, రాజర్షయః, విదుః,
సః, కాలేన, ఇహ, మహతా, యోగః, నష్టః, పరంతప ॥

| | | | |
|---|---|---|---|
| పరంతప! | = ఓ పరంతపా! (అర్జునా) | విదుః | = తెలుసుకున్నారు |
| ఏవమ్ | = ఈ విధముగా | సః, యోగః | = ఆ యోగము |
| పరంపరాప్రాప్తమ్ | = పరంపరగా ప్రాప్తించిన | మహతా, కాలేన | = చాలాకాలము క్రిందటనే |
| ఇమమ్ | = ఈ యోగమును | ఇహ | = ఈ భూలోకమందు |
| రాజర్షయః | = రాజర్షులు | నష్టః | = లుప్తమయింది. |

**హే పరన్తప! ఏవం పరమ్పరా–ప్రాప్తమ్ ఇమమ్ (యోగం)**
**రాజర్షయః విదుః । సః యోగః మహతా కాలేన ఇహ నష్టః ।**

తా: ఓ పరంతపా! (అర్జునా!) ఈ విధముగ పరంపరా ప్రాప్తమైన ఈ యోగమును రాజర్షులు తెలుసుకున్నారు. కాని, అనంతరము ఈ యోగము కాలక్రమమున భూలోకమందు లుప్తమయింది.

**ఏవం పరంపరాప్రాప్తమ్** – పరంపరగా వస్తున్న ఈ బోధ. ఈ బోధ గంగానదిలా వస్తున్నది. మన సాంప్రదాయంలో గంగను జ్ఞానంతో పోలుస్తారు. రెండూ శాశ్వతమైనవి; గంగ శివుని జటాఝూటంనుంచి వచ్చింది, జ్ఞానం కూడా సదాశివుణ్ణుంచి మొదలైంది; గంగ శరీరాన్ని శుద్ధం చేస్తే, జ్ఞానం మనస్సును శుద్ధం చేస్తుంది.

**మలనిర్మోచనం పుంసాం జలస్నానం దినే దినే ।**
**సకృత్ గీతాంభసి స్నానం సంసారమలనాశనమ్ ॥**

శ్రీ గీతామాహాత్మ్యమ్‌లో విష్ణుమూర్తి గీతను చదివితే కలిగే ఫలం వివరిస్తాడు. రోజూ 18 అధ్యాయాలూ చదివితే మంచిది. కాని మాకెక్కడ తీరికుంది అనకుండా రోజుకు 9 చదివినా, 6 చదివినా, 3 చదివినా, 2 చదివినా, 1 అధ్యాయం చదివినా మంచిది అంటాడు. అక్కడ కూడా ఆగడు, రోజుకు ఒక అధ్యాయంలో నాల్గవవంతు లేదా 5 శ్లోకాలు, 4 శ్లోకాలు, 3 శ్లోకాలు, 2 శ్లోకాలు, 1 శ్లోకం, కనీసం అర్ధశ్లోకం చదివినా చాలంటాడు. చూడండి ఎక్కడినుంచి ఎక్కడికి వచ్చాడో. 18 అధ్యాయాలనుంచి సగం శ్లోకం చదివినా పుణ్యం అంటున్నాడు.

**గేయం గీతానామసహస్రం ధ్యేయం శ్రీపతిరూపమజస్రమ్** – భజగోవిందమ్

అలా భగవద్గీత గురుశిష్యపరంపరగా వస్తోంది. ఎవరు పొందారు ఆ జ్ఞానాన్ని?

**రాజర్షయః విదుః** – రాజర్షులందరూ ఈ జ్ఞానాన్ని పొందారు. మనం చిన్న కుటుంబం నడుపుతూనే క్షణం తీరిక లేదు అంటాము. రాజులు రాజ్యభారాన్ని మోస్తూ ఆత్మజ్ఞానాన్ని పొందారు. మనస్సుంటే మార్గముంటుంది. బృహదారణ్యకోపనిషత్తులో చాలామంది గురువులూ, శిష్యులూ రాజర్షులే! అజాతశత్రువు గురువు, జనకుడు శిష్యుడు. అందువల్ల రాజుగా ఉంటూ జ్ఞానం పొందవచ్చు.

కాని కాలక్రమేణా ఈ ఆత్మవిద్య అంతరించి పోతున్నది – అనేక టీవీ ఛానల్లు వచ్చేసాయి. టీవీ ఎరుగని రోజుల్లో ఐదువేల సంవత్సరాల ముందే కృష్ణపరమాత్మ మనుష్యులకు దీనిమీద శ్రద్ధ తగ్గటం గురించి మాట్లాడుతున్నాడు.

**పరంతప** – హే అర్జునా; **సః యోగః నష్టః** – ఈ బోధ భూమినుంచి అంతరించిపోయింది లేదా ప్రాముఖ్యత తగ్గింది.

**మహతా కాలేన** – కాలక్రమేణ. కాలక్రమేణ ఈ బోధ నశించిపోయింది.

శ్లో. 3 **స ఏవాయం మయా తేఽద్య యోగః ప్రోక్తః పురాతనః ।**
**భక్తోఽసి మే సఖా చేతి రహస్యం హ్యేతదుత్తమమ్ ॥**
సః, ఏవ, అయమ్, మయా, తే, అద్య, యోగః, ప్రోక్తః, పురాతనః,
భక్తః, అసి, మే, సఖా, చ, ఇతి, రహస్యమ్, హి, ఏతత్, ఉత్తమమ్ ॥

| | | | |
|---|---|---|---|
| (త్వమ్) | = నీవు | మయా | = నాచేత |
| మే, భక్తః | = నా భక్తుడవు | తే | = నీకు |
| చ | = ఇంకా | ప్రోక్తః | = చెప్పబడుచున్నది |
| సఖా, అసి, ఇతి | = ప్రియసఖుడవు, కనుక | హి | = ఎందుకంటే |
| సః, పురాతనః | = ఆ ప్రాచీనమైన | ఏతత్ | = ఇది |
| యోగః, ఏవ | = యోగమే | ఉత్తమమ్ | = మిక్కిలి ఉత్తమమైనది |
| అయమ్ | = ఇది (ఈ యోగము) | రహస్యమ్ | = గోప్యమైనది. |
| అద్య | = నేడు | | |

**సః ఏవ అయం పురాతనః యోగః మయా అద్య తే ప్రోక్తః ।**
**(త్వం) మే భక్తః సఖా చ అసి ఇతి, హి ఏతత్ ఉత్తమం రహస్యమ్ ।**

తా: ఈ యోగము ఉత్తమమైనది. రహస్యముగా ఉంచదగినది. నీవు నాకు భక్తుడవు, ప్రియసఖుడవు. కనుక, మిక్కిలి పురాతనమైన ఈ యోగమును నేడు నీకు వివరిస్తున్నాను.

ఈ బోధను రక్షించటం నా కర్తవ్యం. ఈ మానవాళికి ఈ బోధను తెలియజేసిందే నేను కాబట్టి, దాన్ని అంతరించి పోకుండా రక్షించే బాధ్యత కూడా నాదే! అందువల్ల ఈ బోధను నీకు చేయటానికి నిశ్చయించుకున్నాను. నిన్ను మానవాళికి ప్రతీకగా ఎంచుకున్నాను అంటున్నాడు కృష్ణపరమాత్మ.

**సః ఏవ పురాతనః యోగః మయా ప్రోక్తః** – సః ఏవ అంటే అదే యోగం. ఏమిటా యోగం? కర్మ, జ్ఞాన యోగం. దీన్నే వేదం అంటారు. వేదాన్ని రెండు భాగాలుగా విభజిస్తారు – వేదపూర్వభాగం, వేద అంతభాగం. వేదపూర్వభాగాన్ని కర్మకాండ అనీ, వేద అంతభాగాన్ని జ్ఞానకాండ అనీ అంటారు. కర్మకాండ చిత్తశుద్ధిని ఇస్తే, జ్ఞానకాండ జ్ఞానాన్ని ఇస్తుంది. ఈ యోగద్వయాన్ని నేను చెప్పాను. ఎప్పుడు? పురాతనః – పూర్వం. ఇది చాలా పురాతనమైనది.

ఇందులోని గొప్పతనమేమిటంటే వైదిక ఋషులు కూడా ఈ జ్ఞానం మేము కనుక్కున్నాము అనరు. వారు కూడా పూర్వం మా గురువులు చెప్పారు అంటారు.

**ఇతి శుశ్రుమ ధీరాణాం యే నస్తద్విచచక్షిరే** – ఈశావాస్యమ్ 10

దీన్నిబట్టి ఈ బోధ ఆరంభమెప్పుడో చెప్పలేము. మహా అయితే వేదాల ప్రారంభం ఎప్పుడో చెప్పగలము అంతే. అందువల్ల నేను పురాతన ఆచార్యుడను అని చెప్పాడు కృష్ణపరమాత్మ. అయితే తన బోధ చేయటానికి అర్జునుణ్ణే ఎందుకు ఎన్నుకున్నాడు? దీనికి జవాబు చాలా తేలిక. అర్జునుడు అడిగాడు కాబట్టి, చెప్పాడు! ధర్మరాజు అడిగినా సంతోషంగా చెప్పి ఉండేవాడు. కాని ధర్మరాజు అడగలేదు; భీముడు అడగలేదు; ద్రోణుడు అడగలేదు.

**కార్పణ్యదోషోపహతస్వభావః పృచ్ఛామి త్వాం ధర్మసమ్మూఢచేతాః ।**
**యచ్ఛ్రేయః స్యాన్నిశ్చితం బ్రూహి తన్మే శిష్యస్తేఽహం శాధి మాం త్వాం ప్రపన్నమ్ ॥** – 2.7

నేను నీకు శిష్యుణ్ణి, నాకు చెప్పు అన్నాడు. శిష్యుడవటానికి ఉండాల్సిన అర్హతేమిటి? శ్రద్ధా, భక్తి.
**శ్రద్ధా భక్తి జ్ఞానయోగాదవైహి.**

**భక్తః అసి మే** – ఓ అర్జునా, నువ్వు నా భక్తుడివి అంటున్నాడు కృష్ణపరమాత్మ. అంతేకాదు,

**సఖా చ ఇతి** – నా సఖుడవు కూడా. నువ్వు అడగకపోయినా నేను నీకు చెప్పి ఉండేవాణ్ణి. ఎందుకంటే నువ్వు నా స్నేహితుడివి. స్నేహితుడు తప్పు చేస్తుంటే, అది ఎత్తి చూపాల్సిన బాధ్యత స్నేహితునికి ఉంది.

**పాపాత్ నివారయతి యోజయతే హితాయ**
**గుహ్యం నిగుహ్యతి గుణాన్ ప్రకటీకరోతి**
**ఆపద్గతం చ న జహాతి దదాతి కాలే**
**సన్మిత్ర లక్షణమిదం ప్రవదంతి సంతః** – నీతి శతకమ్

స్నేహితుడు తప్పు చేస్తుంటే అతనికి అది ఎత్తి చూపాలి. వినకపోతే వదిలేయాలి. కృష్ణపరమాత్మ నువ్వు నా భక్తుడవు, నా స్నేహితుడవు కూడా కాబట్టి నీకు బోధ చేద్దామనుకుంటున్నాను అన్నాడు. ఎటువంటి బోధ?

**ఏతత్ ఉత్తమం రహస్యమ్** – అది ఈ జగత్తులో అత్యంత రహస్యమైనది. ఆత్మజ్ఞానాన్ని అత్యంత రహస్యమైనదాన్నిగా పరిగణిస్తారు. ఎందుకంటే మనలో అతి దగ్గరగా ఉన్నదాన్ని మనం అసలు పట్టించుకోము.

ఒక దొంగ ఒక ధనవంతునితో కలిసి రైలులో నాలుగైదు రాత్రులు ప్రయాణం చేశాడు. ప్రతి రోజూ పొద్దున్న ఆ ధనవంతుడు దొంగ ఎదురుగా డబ్బు లెక్క పెట్టుకునేవాడు. రాత్రి దాచేవాడు. రాత్రి ఆ దొంగ వెతికితే, డబ్బు దొరికేది కాదు. ఇంక ఉండబట్టలేక దొంగ ధనవంతుడినే అడిగేశాడు. అతను చెప్పాడు, 'నేను రాత్రి నీ దిండు కింద పెట్టి పడుకునేవాణ్ణి, పొద్దున్నే తీసేసుకునేవాణ్ణి. నీవు నీ దిండు కింద తప్ప అంతా వెతికావు.'

మనం చేసేది అదే. జీవితంలో ప్రశాంతత లేదు అనుకుంటాము. దానికోసం బాహ్యంగా వెతుకుతాము. మనలోనే ఉందని తెలుసుకోము. అందువల్ల దీన్ని ఉత్తమ రహస్యం అంటారు. మీ పరుగులు ఆపి, మా దగ్గరకు రండి, మీకు శాంతి ఎక్కడ దొరుకుతుందో చెబుతాము అంటారు ఋషులు. కాని మనకు పరుగులు ఆపి, వినే తీరిక లేదు. గీతాబోధ పదవీ విరమణ అయ్యాక వినాలి అనుకుంటాము. అదెలా ఉంటుందంటే – ఒక వ్యక్తి చార్ ధామ్ యాత్ర చేసివచ్చాక అతనికి స్వెట్టరు, షాల్ ఇచ్చినట్టు ఉంటుంది. **గీత మన జీవనవిధానాన్ని బోధిస్తుంది**; జీవితమంతా గడిపేశాక చివర్లో విని ఏం లాభం?

**అర్జున ఉవాచ**

శ్లో. 4 **అపరం భవతో జన్మ పరం జన్మ వివస్వతః ।**
**కథమేతద్విజానీయాం త్వమాదౌ ప్రోక్తవానితి ॥**

అపరమ్, భవతః, జన్మ, పరమ్, జన్మ, వివస్వతః,
కథమ్, ఏతత్, విజానీయామ్, త్వమ్, ఆదౌ, ప్రోక్తవాన్, ఇతి ॥

| | | | |
|---|---|---|---|
| భవతః, జన్మ | = మీ జన్మ | ఆదౌ | = కల్పాదియందు (సూర్యునకు) |
| అపరమ్ | = ఇటీవలిది | ఏతత్ | = ఈ యోగమును |
| వివస్వతః, జన్మ | = సూర్యుని జన్మ | ప్రోక్తవాన్ | = చెప్పావు |
| పరమ్ | = అతి ప్రాచీనమైనది (కల్పాది యందు జరిగినది) | ఇతి | = అని |
| | | కథమ్ | = (నేను) ఎలా |
| త్వమ్ | = నీవు | విజానీయామ్ | = తెలిసికొనగలను? |

**అర్జునః ఉవాచ!**

**భవతః జన్మ అపరం, వివస్వతః జన్మ పరం, (అతః) త్వమ్**

**ఆదౌ ఏతత్ ప్రోక్తవాన్ ఇతి కథం విజానీయామ్?**

తా: అర్జునుడు పలికెను – కృష్ణా! నీ జన్మ ఇటీవలిదే. సూర్యుని జన్మ కల్పాదియందు జరిగినది. అంటే అతి ప్రాచీనమైనది. కనుక, నీవు సూర్యునకు దీనిని ఉపదేశించుట ఎలా సాధ్యపడును? దీనిని నేను ఎలా అంగీకరించాలి?

ముందు మూడు శ్లోకాల్లో, కృష్ణపరమాత్మ గీతామాహాత్మ్యం గురించి చెప్పాడు. అది వేదాలసారం అని చూశాము. అందువల్లనే గీతను **స్మృతి గ్రంథము** అంటారు. వేదాన్ని **శ్రుతి** అంటారు. పరమాత్మనుంచి ఋషులు విన్నారు కాబట్టి, అది శ్రుతి అయింది. వారు విన్న వేదాల సారం అంటే విన్నదాన్ని వారి స్మృతిపథంలోంచి తీసి, ఇచ్చారు కాబట్టి గీతను **స్మృతి** అంటారు.

**నిగమ కల్పతరోర్గలితం ఫలమ్ శుఖముఖాదమృతద్రవసంయుతం**

**పిబత భాగవతం రసమాలయం ముహురహో రసికా భువి భావుకాః** – భాగవతమ్

**నిగమకల్పతరోర్** – వైదిక చెట్టు వైదిక జ్ఞానాన్ని ఉత్పత్తి చేసింది; భాగవతజ్ఞానాన్ని శుకమహర్షి తీసుకుని, జీర్ణించుకుని ఇచ్చాడు. అంటే జీర్ణమయి వచ్చిన సగం సారాన్ని మనం జీర్ణించుకుంటే చాలు. అలా గీత స్మృతి గ్రంథము అయింది.

**బి). అవతార రహస్యం –** ఇప్పుడు రెండవ అంశంలోకి అడుగుపెట్టబోతున్నాము. అది అర్జునుడు వేసిన ప్రశ్నకు జవాబుగా వస్తుంది. కృష్ణపరమాత్మ చెప్పిన విషయంమీద అర్జునునికి ఒక సందేహం కలిగింది. ముందు కృష్ణపరమాత్మ చెప్పిన విషయమేమిటి?

నేను సూర్యభగవానునికి చేసిన బోధే, ఇప్పుడు నీకు చేయబోతున్నాను అన్నాడు. సూర్యభగవానుడు ఎప్పుడో సృష్టి మొదట్లోనే వస్తాడు. కృష్ణపరమాత్మ దేవకీపుత్రుడు, ఇంచుమించుగా తన వయస్సువాడు; అందువల్లనే కృష్ణుడే అన్నట్టుగా తన సఖుడు సూర్యభగవానునికి చెపితే, తనకు చెప్పలేదు; తనకు చెపితే అప్పుడు చెప్పగలిగి ఉండేవాడు కాదు. కాలప్రమాణం కుదరటం లేదు. అందువల్ల అదెలా సాధ్యం? ఇదీ అతని సందేహం. ఇప్పుడు శ్లోకం చూద్దాం.

**అర్జున ఉవాచ** – అర్జునుడు అడిగాడు. ఏమని?

**భవతః జన్మ అపరమ్** – నీ జన్మ ఈ మధ్య జరిగింది; కాని సూర్యభగవానుడో?

**పరం జన్మ వివస్వతః** – సూర్యభగవానుని పుట్టుక ఇప్పుడు కాదు, వందలు కాదు, వేల సంవత్సరాల ముందు జరిగింది. ఆయన సృష్టి ఆదినుంచి ఉన్నాడు.

**కథమ్ ఏతత్ విజానీయామ్** – ఈ రెండు వాక్యాలనూ నేనెలా జీర్ణించుకోగలను? ఏమిటా రెండూ? ఒకటి, తనకు ఇప్పుడు బోధిస్తున్నాడు. అందులో సందేహం లేదు. కంటికి కనపడుతున్నది. కాని జీర్ణించుకోలేనిది ఏమిటి?

**త్వమ్ ఆదౌ (వివస్వతః) ప్రోక్తవాన్** – కృష్ణుడు సూర్యునికి అంతకు ముందు బోధించాడనే విషయాన్ని విశ్వసించటం ఎలా?

కృష్ణపరమాత్మను పూర్తిగా కాదనలేదు, అలాగని స్వీకరించనూ లేదు. తన గురువుగా కృష్ణపరమాత్మమీద శ్రద్ధ ఉంది. కాని ఈ విషయం కొరుకుడు పడటం లేదు.

**శ్రీభగవాన్ ఉవాచ**

శ్లో. 5 **బహూని మే వ్యతీతాని జన్మాని తవ చార్జున ।**
**తాన్యహం వేద సర్వాణి న త్వం వేత్థ పరంతప ॥**
బహూని, మే, వ్యతీతాని, జన్మాని, తవ, చ, అర్జున,
తాని, అహమ్, వేద, సర్వాణి, న, త్వమ్, వేత్థ, పరంతప ॥

| | | | |
|---|---|---|---|
| పరంతప! | = ఓ పరంతపా! | వ్యతీతాని | = గడిచాయి |
| అర్జున! | = ఓ అర్జునా! | తాని, సర్వాణి | = వాటిని అన్నింటిని |
| మే, చ, తవ | = నావి, నీవి | అహమ్, వేద | = నేను ఎరుగుదును |
| బహూని, జన్మాని | = అనేక జన్మలు | త్వం, న, వేత్థ | = నీకు తెలియదు |

**శ్రీభగవానువాచ**
**హే పరన్తప అర్జున! మే తవ చ బహూని జన్మాని వ్యతీతాని,**
**తాని సర్వాణి అహం వేద, త్వం న వేత్థ ।**

తా: శ్రీ భగవానుడు తెలిపెను – ఓ పరంతపా! అర్జునా! నాకును నీకును అనేక జన్మలు గడిచాయి. కాని, వాటిని అన్నింటిని నేను ఎరుగుదును. నీకు తెలియదు.

అర్జునుని ప్రశ్నకు జవాబుగా కృష్ణపరమాత్మ అవతార విశేషాలను చెబుతున్నాడు. ఇది మన వైదిక సాంప్రదాయంలో విశేష అంశం. కృష్ణపరమాత్మ దేవుని అవతారానికి, మనుష్య పుట్టుకకూ మధ్యనున్న భేదాన్ని వివరిస్తున్నాడు ఇందులో. మనిషి పుట్టుకను జన్మ అనీ, దేవుని పుట్టుకను అవతారం అనీ అంటాము. ఈ జన్మ, అవతారాల మధ్య మూడు ప్రాథమిక భేదాలు ఉన్నాయి. శ్లోకంలోకి వెళ్ళేముందు అవేమిటో చూద్దాము.

అవి – కారణ భేదం, స్వరూప భేదం, కార్యభేదం

1. **కారణ భేదం** – జీవుని పుట్టుకకూ, దేవుని అవతారానికీ మధ్య కారణంలోనే భేదం ఉంది. జీవుడు అవిద్య లేదా అజ్ఞానంవల్ల పుడతాడు. జీవుడు అజ్ఞానంవల్ల 'నేను' అనే అహంకారంలో ఉంటాడు. అహంకారంవల్ల నేను కర్త అనుకుంటాడు. కర్తగా కొన్ని కర్మలు చేస్తాడు. ఆ కర్మలకు కర్మఫలాలు వస్తాయి. అంటే పుణ్యపాపాలు కలుగుతాయి. పుణ్యపాపాలవల్ల సుఖదుఃఖాలు అనుభవించాలి. సుఖదుఃఖాలు అనుభవించటానికి పునరపి

జననం, పునరపి మరణం పొందుతూ ఉంటాడు. అందువల్ల ఈ జన్మలో మనుష్యజన్మకు కారణం – అజ్ఞానం, అహంకారం, కర్త, కర్మ, కర్మఫలం, పుణ్యపాపం, సుఖదుఃఖాలు, పునర్జన్మ. అందువల్ల మనిషి జన్మను కింద పడటం అంటారు.

అదే ఈశ్వరుని విషయానికి వచ్చేసరికి ఈశ్వరుడు సర్వజ్ఞుడు. తన జ్ఞానంవల్ల కిందకి రావాలని తనే నిశ్చయించుకుంటాడు. వచ్చి ఏంచేస్తాడు? తరువాత చూద్దాం. ఇప్పుడు మనం చూడాల్సింది ఎందుకు వచ్చాడు అన్నది. జీవిజన్మ అజ్ఞాన జనితం అయితే, ఈశ్వరుని అవతారం జ్ఞానజనితం. ఈశ్వరుని అవతారం దయతో, జ్ఞానంతో, కావాలని, తెలిసి చేస్తున్న అవతరణ. మనషి జన్మను **కింద పడటం** అంటే, భగవంతుని అవతారాన్ని **కిందకు దిగటం** అంటారు.

2. **స్వరూపభేదం** – జీవుని జన్మ అజ్ఞానంవల్ల ఏర్పడుతుంది కాబట్టి, జీవుడు సంసారిగా కొనసాగుతాడు. అతను ఏడుస్తూ పుడతాడు అంటే పుట్టటమే దుఃఖంతో పుడతాడు, ఆ దుఃఖమే జీవితాంతం కొనసాగుతుంది. అతను నిస్సహాయుడు; బాధాతప్తహృదయుడు, బానిస.

**సమానే వృక్షే పురుషో నిమగ్నోఽ నిశయా శోచతి ముహ్యమానః** – ముండకమ్ – 3.1.2

కాని ఈశ్వరుడు జ్ఞానంతో శరీరధారణ చేస్తాడు కాబట్టి అతనికి సంసారం అంటదు. భగవానుడు బద్ధుడు కాదు. అందువల్ల భగవానుడు **నిత్యముక్తస్వరూపుడు** అయితే జీవుడు బద్ధస్వరూపుడు.

అవతార శరీరానికీ, జీవశరీరానికీ మధ్య ఇంకో భేదం ఉంది. ఏమిటది? జీవశరీరం సరాసరి మాయనుంచి పుట్టలేదు. మాయ అంటే ప్రకృతి. ప్రకృతి లేదా మాయనుంచి పంచభూతాలు వస్తాయి. వాటినుంచి మానవశరీరం వస్తుంది. అందువల్ల జీవశరీరాన్ని **పాంచభౌతిక శరీరం** అంటారు. అదే ఈశ్వరుని విషయానికి వచ్చేసరికి, మాయనుంచి సరాసరి ఈశ్వర అవతారశరీరం వస్తుంది. అందువల్ల అవతారశరీరాన్ని **మాయిక శరీరం** అంటారు.

మాయిక శరీరమంటే మాయనుంచి స్థూలశరీరం; పాంచభౌతిక శరీరం అంటే మాయనుంచి పంచభూతాలు, పంచభూతాలనుంచి స్థూలశరీరం. అందువల్ల రెండవ భేదం చూస్తే జీవునిది **సంసారిక పాంచభౌతిక శరీరం**; ఈశ్వరునిది **ముక్తమాయిక శరీరం**. అందువల్ల భగవంతునిది **మాయామానుష వేషం** అంటారు.

3. **కార్యభేదం** – జీవుడు పుట్టేది కేవలం పుణ్యపాపాలను క్షయం చేసుకోవటానికి. జీవునికి గత జన్మలనుంచి పోగుచేసుకు వచ్చిన పుణ్యపాపాలను సంచితకర్మలు అంటారని చూశాము. అందులో కొన్ని ఫలించి ప్రారబ్ధకర్మగా మారతాయి. వాటిని అనుభవించటానికి ఈ భూమ్మీదకు వస్తాడు. ప్రారబ్ధకర్మను సుఖదుఃఖ అనుభవం ద్వారా క్షయం చేసుకోగలడు. సుఖదుఃఖాలను అనుభవించాలంటే, దానికి స్థూలశరీరం కావాలి. అందువల్ల జీవికి ఉన్న ప్రారబ్ధకర్మ నిశ్చయిస్తుంది, అతను ఎలాంటి శరీరం పొందాలో! పుణ్యం ఎక్కువ ఉంటే మంచి శరీరం, మంచి తల్లిదండ్రులు, మంచి వాతావరణం ఉంటాయి. పాపం ఎక్కువ ఉంటే అనారోగ్యం, బాధాకర పరిస్థితులు ఉంటాయి. **పుణ్యపాపక్షయంకోసం** జీవుడు పుడతాడు.

అవతారం విషయంలో అజ్ఞానం లేదు; అందువల్ల సంసారం లేదు అని చూశాము. అందువల్ల పుణ్యపాప క్షయం చేసే ప్రశ్న లేదు. అందువల్ల ఈశ్వరుడు **పుణ్యపాప అతీతుడు**. లోకసంగ్రహంకోసం అవతారం ఎత్తుతాడు. ఈశ్వరుని రాకను **లీలగా** వర్ణిస్తారు.

**పరిత్రాణాయ సాధూనాం వినాశాయ చ దుష్కృతామ్ ।**
**ధర్మసంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే ॥** – 4.8

అందువల్ల ఈశ్వరుడు **ధర్మ సంస్థాపనార్థం** అవతారం ఎత్తుతాడు. శిష్టరక్షణ, దుష్టశిక్షణ చేయటానికి వస్తాడు ఈ భూమ్మీదకు. అందువల్ల ఎటువంటి శరీరం అనేది ఆయన వచ్చే దుష్టశిక్షణనుబట్టి ఉంటుంది. అందువల్లనే పురాణాల్లో ప్రతి అవతారం ముందు దేవతలు వెళ్ళి భగవానునికి మొర పెట్టుకోవటం చూస్తూంటాం. ఉదాహరణకు రావణసంహారం చేయాలి – రావణాసురుడు కోరిన వరం ఏమిటి? మనిషి తప్ప నన్ను ఎవరూ చంపకూడదు అన్నాడు. మనుష్యులు తనను చంపలేరనుకున్నాడు. రావణాసురుణ్ణి చంపటంకోసం మనిషి అవతారం ఎత్తాడు. అవతారం ఉద్దేశ్యం ఏమిటి? ధర్మసంస్థాపన.

అలాగే హిరణ్యకశిపుని విషయానికి వచ్చేసరికి అతని హిరణ్యాక్షవరాలకు తగ్గ అవతారాన్ని ఎత్తాల్సి వచ్చింది. మనిషి కాదు, జంతువు కాదు అన్నాడు. అందువల్ల నరసింహావతారం ఎత్తాల్సి వచ్చింది. ఆయుధాలు వాడకూడదు అన్నాడు. తన గోళ్ళనే ఆయుధాలుగా వాడాడు.

అంతేకాదు, ఒక్కోసారి భక్తుడు భగవానుని ఒకరూపంలో చూడాలని కోరుకోవచ్చు. ఒక అమాయకుడు భగవంతుణ్ణి ఏ రూపంలో కొలవాలని ఆలయపూజారిని అడిగాడు. ఆయన ఏదో చికాకులో ఉండి దున్నపోతు రూపంలో కొలవమన్నాడు. దాన్ని ఈ అమాయకుడు ఉపదేశంగా స్వీకరించి, అలాగే భక్తితో కొలవసాగాడు. భగవానుడు ఆ పూజారికి, తద్వారా జగత్తుకు పాఠం నేర్పాలనుకున్నాడు. తనను ఏ రూపంలోనైనా కొలవవచ్చు అని నిరూపించదలుచుకున్నాడు.

ఒకరోజు పూజారులు ఉత్సవవిగ్రహాలను బయటికి తీయటానికి ప్రయత్నిస్తుంటే, అవి ఎంతకీ కదలటం లేదు. ఈ అమాయకుడు వెళ్ళి అక్కడ దున్నపోతు కొమ్ము మీకు అడ్డు వస్తున్నది. ఆ విగ్రహాలను కొంచెంగా వంచి తీయండి అన్నాడు. ముందు అతన్ని అదిలించినా, తరువాత అలా వంచితే తీయగలిగారు. అలా భగవంతుడు, భక్తుణ్ణి అనుగ్రహించటంకోసం ఏ రూపునన్నా దాల్చగలడు.

ఈ మూడు భేదాలు మళ్ళీ టూకీగా చూస్తే: కారణ భేదం – జీవి జన్మ అజ్ఞానంవల్ల, ఈశ్వరుని అవతారం జ్ఞానంవల్ల; స్వరూప భేదం – జీవి సంసారి, ఈశ్వరుడు అసంసారి; జీవిది భౌతిక శరీరం, ఈశ్వరునిది మాయిక శరీరం; కార్యభేదం – జీవిది పుణ్యపాపక్షయంకోసం, ఈశ్వరునిది లోక సంగ్రహంకోసం.

అవతారానికి అజ్ఞానం లేదు కాబట్టి మూడు కాలాలూ తెలుస్తాయి. అతను సర్వజ్ఞుడు. జీవునికి తన పూర్వజన్మ ఏమిటో తెలియదు, భవిష్యత్తులో రాబోయే జన్మ ఏమిటో తెలియదు.

ఒక వ్యక్తిది అవతారమా, జన్మా అనే విషయం ఎలా తెలుస్తుంది? తెలిసే మార్గం లేదు, ఎక్కడైతే శాస్త్రం ఎవరినైతే అవతారంగా వర్ణిస్తుందో, అతనిదే అవతారంగా స్వీకరిస్తాము. శాస్త్రం ప్రకారం రామునిది అవతారం; కృష్ణునిది అవతారం. శాస్త్రం చెపితే తెలుసుకోవాలే తప్ప ఒక వ్యక్తిది అవతారమని నిరూపించనూ లేము, కాదని కొట్టి పారేయనూ లేము.

సిద్ధులు ఉంటే అది అవతారం క్రిందకి వస్తుందా? రాదు. రాక్షసులకు బోలెడు అసాధారణమైన సిద్ధులుంటాయి. ఇంద్రజిత్తు అనేక శరీరాలను దాల్చగలడు; అతను తనకి తోచినప్పుడు అంతర్ధానమవగలడు. కొన్ని సాధనలు చేస్తే మనిషి కూడా కొన్ని సిద్ధులను పొందగలడు. అందువల్ల సిద్ధులనుబట్టి అవతారం అనలేము.

అలాగే పరిమితులనుబట్టి కూడా అవి అవతారాలు కావని కొట్టి వేయలేము. రాముణ్ణి అవతారంగా, నిస్సందేహంగా అందరూ కొలుస్తారు. కాని చాలాచోట్ల అతను మానవమాత్రునిగా ప్రవర్తించాడు. సీత జాడను తెలుసుకోవటానికి వానరులను నలుదిశలకూ పంపించాడు. అవతారం సర్వజ్ఞుడు అనే సిద్ధాంతం ప్రకారం అతను ఆంజనేయస్వామిని సరాసరి లంకకే పంపించి ఉండేవాడు. అలాగే కష్టపడి వారధి కట్టకుండా సముద్రంమీంచి నడిచి వెళ్ళిపోయి ఉండేవాడు. అందువల్ల సిద్ధులు ఉన్నంత మాత్రాన అవతారపురుషులు అవరు, లేనంత మాత్రాన కాకపోరు.

కృష్ణపరమాత్మ అవతారంగా అర్జునునికి మోక్షాన్ని ఇవ్వటం లేదు. గురువుగా మోక్షమార్గాన్ని బోధిస్తున్నాడు. కాకపోతే కృష్ణపరమాత్మ అవతారం అని అందరికీ తెలుసు.

**పరిత్రాణాయ సాధూనామ్** – సత్పురుషులను రక్షించటానికి అవతారమెత్తాడు. ఇదీ అవతారమహిమ. ఆ విషయం ఈ శ్లోకాల్లో చెబుతున్నాడు. ఇప్పుడు శ్లోకం చూద్దాము.

**బహూని మే వ్యతీతాని జన్మాని తవ చార్జున** – ఓ అర్జునా! నీకూ, నాకూ అనేక జన్మలు గడిచాయి. కాని తేడా ఏమిటి?

**అహం తాని సర్వాణి వేద** – నేను సర్వజ్ఞుణ్ణి. అందువల్ల నాకు నా ముందు అవతారాల గురించి కూడా తెలుసు.

**త్వం న వేత్థ** – కాని నీకు నీ గతజన్మల గురించి తెలియదు.

**పరంతప** – ఓ అర్జునా,

అవతారానికీ, జన్మకీ – కృష్ణుడు సాక్షాత్తూ పరమాత్మ కాబట్టి, తన ముందు అవతారాల గురించి తెలుసు. ఇది కారణభేదం.

శ్లో. 6 **అజోఽపి సన్నవ్యయాత్మా భూతానామీశ్వరోఽపి సన్ ।**
**ప్రకృతిం స్వామధిష్ఠాయ సంభవామ్యాత్మమాయయా ॥**
అజః, అపి, సన్, అవ్యయాత్మా, భూతానామ్, ఈశ్వరః, అపి, సన్,
ప్రకృతిమ్, స్వామ్, అధిష్ఠాయ, సంభవామి, ఆత్మమాయయా ॥

| | | | |
|---|---|---|---|
| (అహమ్) | = నేను | సన్, అపి | = అయినను |
| అజః | = జన్మరహితుడను | స్వామ్, ప్రకృతిమ్ | = నా ప్రకృతిని |
| అవ్యయాత్మా | = శాశ్వతుడను | అధిష్ఠాయ | = అధీనములో ఉంచుకొని |
| సన్, అపి | = అయినను | ఆత్మమాయయా | = నా యోగమాయచే |
| భూతానామ్ | = సమస్త ప్రాణులకు | సంభవామి | = అవతరించుచుందును. |
| ఈశ్వరః | = ఈశ్వరుడను | | |

**(అహం) అజః అవ్యయ-ఆత్మా అపి సన్, భూతానామ్ ఈశ్వరః అపి సన్,**
**స్వాం ప్రకృతిమ్ అధిష్ఠాయ, ఆత్మ-మాయయా సమ్భవామి ।**

తా: నేను జన్మరహితుడను, శాశ్వతుడను, సమస్త ప్రాణులకు ఈశ్వరుడను. అయినను నా ప్రకృతిని అధీనములో ఉంచుకొని, నా యోగమాయచే అవతరించుచుందును.

ఈ శ్లోకంలో అవతారస్వరూపాన్ని వర్ణిస్తున్నాడు.

**(అహమ్) అజః** – నాకు పుట్టుక లేదు. **న జాయతే ఇతి అజః**

**అవ్యయాత్మా** – నాకు మార్పు లేదు. అజః అంటే జన్మవర్జితః, అవ్యయాత్మా అంటే జరామరణ వర్జితః; నాశనం లేదా మరణం లేదు. అంటే సంసారం లేదు.

**భూతానామ్ ఈశ్వరః** – సమస్తప్రాణులకు ఈశ్వరుణ్ణి. నాకు చావు, పుట్టుకలు లేకపోగా, నేనే అందరికీ అధిష్ఠాన దేవుణ్ణి. నేను స్వతంత్రుణ్ణి. నేను నిస్సహాయంగా కిందికి తోయబడలేదు. కావాలని నేనే కిందికి దిగివచ్చాను. ఎలా వచ్చాను?

**ప్రకృతిం స్వామ్ అధిష్ఠాయ** – ప్రకృతిని నా అధీనంలో పెట్టుకుని వచ్చాను.

**సంభవామి** – నేను శరీరం తీసుకుంటాను. ఎలా?

**ఆత్మమాయయా** – మాయాతత్త్వం సహాయంతో, మాయిక శరీరాన్ని పొందుతాను.

జీవిశరీరం పాంచభౌతికం కాని అవతారం మాయిక శరీరం. ఇది స్వరూపభేదం. భగవానునికి గర్భవాసం కూడా అవసరం లేదు. నరసింహావతారం చూడండి. గర్భవాసం చేయలేదు.

శ్లో. 7 **యదా యదా హి ధర్మస్య గ్లానిర్భవతి భారత ।**
**అభ్యుత్థానమధర్మస్య తదాత్మానం సృజామ్యహమ్ ॥**
యదా, యదా, హి, ధర్మస్య, గ్లానిః భవతి, భారత,
అభ్యుత్థానమ్, అధర్మస్య, తదా, ఆత్మానమ్, సృజామి, అహమ్ ॥

| | |
|---|---|
| భారత! | = ఓ అర్జునా |
| యదా, యదా | = ఎప్పుడెప్పుడు |
| ధర్మస్య | = ధర్మమునకు |
| గ్లానిః | = హాని |
| అధర్మస్య | = అధర్మమునకు |
| అభ్యుత్థానమ్ | = వృద్ధి |
| భవతి | = అవుతుందో |
| తదా, హి | = అప్పుడే |
| అహమ్ | = నేను |
| ఆత్మానమ్ | = నా రూపమును (స్వయంగా) |
| సృజామి | = ప్రకటించుచుందును |

**హే భారత! యదా యదా హి ధర్మస్య గ్లానిః, అధర్మస్య (చ)**
**అభ్యుత్థానం భవతి, తదా అహమ్ ఆత్మానమ్ సృజామి ।**

తా: ఓ భారతా! (అర్జునా!) ధర్మమునకు హాని కలిగినప్పుడును, అధర్మము మితిమీరి పెరిగి పోవుచున్నప్పుడును నన్ను నేను సృజించుకొందును. అంటే సాకారరూపముతో ఈ లోకమున అవతరింతును.

ఈ శ్లోకంలో అవతార ఉద్దేశ్యం ఇవ్వబడింది. ముందు శ్లోకంలో స్వరూపం చూశాము. ఇప్పుడు ఉద్దేశ్యం. ఉద్దేశ్యం ఏమిటి?

**యదా యదా హి ధర్మస్య గ్లానిర్భవతి భారత** – ఓ అర్జునా! ఎప్పుడు ధర్మానికి హాని కలిగినా,

**అధర్మస్య అభ్యుత్థానమ్** – అధర్మం పెరిగిపోయినా,

**తదాత్మానం సృజామ్యహమ్** – అప్పుడు నన్ను నేను సృష్టించుకుంటాను.

మన శరీరంలో సహజంగా రోగనిరోధక శక్తి ఉంది. కంట్లో దుమ్ము పడితే, కన్నీళ్ళు వస్తాయి. తిన్నదేదైనా పడకపోతే విరోచనాలు వస్తాయి. ఇవి ఎప్పుడూ రావు. ఎప్పుడెప్పుడు సమస్య వస్తే అప్పుడు వస్తాయి. అదే సూత్రం విశ్వానికి వర్తిస్తుంది. విశ్వం భగవంతుని శరీరం. ఆ శరీరంలో ఎప్పుడెప్పుడు సమస్య వస్తే, అప్పుడప్పుడు భగవంతుడు అవతారం ఎత్తుతాడు.

ఆయుర్వేద శాస్త్రంలో ఆరోగ్యాన్ని ధాతుసమ్యం అనీ, అనారోగ్యాన్ని ధాతువైషమ్యం అనీ అంటారు. అన్ని అంశాల మధ్య సమతుల్యత ఉంటే అది ఆరోగ్యం. అలా సమష్టిపరంగా ఉండే సమతుల్యతను ధర్మం అంటారు. ఈ సమతుల్యతే విశ్వాన్ని రక్షిస్తుంది.

**ధర్మో విశ్వస్య జగతః ప్రతిష్ఠా లోకే ధర్మిష్ఠ ప్రజా ఉపసర్పంతి ధర్మేణ పాపమపనుదతి**
**ధర్మే సర్వం ప్రతిష్ఠితం తస్మాద్ధర్మం పరమం వదన్తి** – మహానారాయణోపనిషత్తు 79.7

ధర్మం మాత్రమే ప్రపంచంయొక్క ఆరోగ్యం; అదే ప్రపంచాన్ని నిలబెడుతుంది. భగవానుడు ఈ జగత్తును సృష్టించాడు. అందువల్ల దాన్ని నిలబెట్టే బాధ్యత కూడా ఆయనదే. ఆయన సృష్టికర్త మాత్రమే కాదు, స్థితికర్త కూడా. అందువల్ల నేను స్థితికర్తగా వస్తాను అంటున్నాడు. ఎప్పుడు వస్తాడు? ధర్మానికి హాని కలిగినప్పుడు. ఆయన తనంతట తాను, కావాలని శరీరాన్ని ధరిస్తాడు అంటే లోకసంగ్రహంకోసం అవతరిస్తాడు.

అదే జీవికీ, అవతారానికీ మధ్య భేదం. మన శరీరధారణ మన ఇష్టం కొద్దీ జరగలేదు. మన ప్రారబ్ధకర్మవల్ల వచ్చింది మనకు మన శరీరం. ఇది కార్యభేదం.

శ్లో. 8 **పరిత్రాణాయ సాధూనాం వినాశాయ చ దుష్కృతామ్ ।**
**ధర్మసంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే ॥**
పరిత్రాణాయ, సాధూనామ్, వినాశాయ, చ, దుష్కృతామ్,
ధర్మసంస్థాపనార్థాయ, సంభవామి, యుగే, యుగే ॥

| | | | |
|---|---|---|---|
| సాధూనామ్ | = సత్పురుషులయొక్క | ధర్మ | = ధర్మమును |
| పరిత్రాణాయ | = పరిరక్షణకోసం | సంస్థాపనార్థాయ | = సుస్థిరమొనర్చుటకు |
| దుష్కృతామ్ | = దుష్టులయొక్క | యుగే, యుగే | = ప్రతియుగమందును |
| వినాశాయ | = వినాశనముకోసం | సంభవామి | = (నేను) అవతరింతును |
| చ | = ఇంకా | | |

**సాధూనాం పరిత్రాణాయ, దుష్కృతాం వినాశాయ,**
**ధర్మ-సంస్థాపన-అర్థాయ చ, (అహమ్) యుగే యుగే సమ్భవామి ।**

తా: సత్పురుషులను పరిరక్షించుటకును, దుష్టులను రూపుమాపుటకును, ధర్మమును సుస్థిరమొనర్చుటకును నేను ప్రతియుగమందును అవతరించుచుందును.

భగవానుడు ఎలా ధర్మాన్ని నిలబెడతాడు? ఎలా అధర్మాన్ని నాశనం చేస్తాడు? ధర్మాన్ని పాటించేవారిని రక్షించటం ద్వారా ధర్మాన్ని నిలబెడతాడు.

**ధార్మికపురుషాణాం రక్షణేన ధర్మః రక్షితః భవతి**

విజ్ఞాన శాస్త్రాన్ని పెంపొందించాలంటే శాస్త్రజ్ఞులను పెంపొందించాలి; సంగీతాన్ని నిలబెట్టాలంటే సంగీత విద్వాంసులను రక్షించుకోవాలి; అలాగే ధర్మాన్ని నిలబెట్టాలంటే ధార్మికపురుషులను పరిరక్షించుకోవాలి.

**సాధూనాం పరిత్రాణాయ** – నేను ధార్మికపురుషులను రక్షించటంకోసం అవతారం ఎత్తుతాను. అధర్మాన్ని ఎలా నాశనం చేస్తాడు?

**అధార్మిక పురుషాణాం నాశనేన అధర్మః నష్టో భవతి**

**వినాశాయ చ దుష్కృతామ్** – దుష్టులను నాశనం చేయటం ద్వారా అధర్మాన్ని నాశనం చేస్తాను. **శిష్టరక్షణం; దుష్టశిక్షణం.**

**భీష్మద్రోణతటా జయద్రథజలా గాంధారనీలోత్పలా**
**శల్యగ్రాహవతీ కృపేణ వహనీ కర్ణేన వేలాకులా**
**అశ్వత్థామవికర్ణఘోరమకరా దుర్యోధనావర్తినీ**
**సోత్తీర్ణా ఖలు పాండవై రణనదీ కైవర్తకః కేశవః** – ధ్యానశ్లోకాలు 5

తార్కికంగా ఆలోచిస్తే కౌరవుల సైన్యం సంఖ్యాపరంగా, శక్తిపరంగా కూడా బలమైనది. శక్తే కాదు, కుయుక్తులు కూడా తెలిసినవారు దుర్యోధనుడు, శకుని. ఒక్క భీష్మాచార్యులే పాండవుల సైన్యాన్ని చీల్చి చెండాడగలడు. ద్రోణాచార్యుడు పాండవులకు గురువు కాబట్టి గురువుగా ఆయనకు తన శిష్యుల బలహీనతలు తెలుసు. ఇన్ని విశేషాలు వీరి వైపు ఉన్నా కౌరవులు ఎందుకు గెలవలేదు? పాండవులు ఎందుకు గెలిచారు? **కైవర్తకః కేశవః–** కేశవుడు వారివైపు ఉండబట్టి. ఆయన శిష్టరక్షణం, దుష్టశిక్షణం చేయబట్టి.

అధార్మిక పురుషులను రెండు రకాలుగా శిక్షించవచ్చు. దుష్టశిక్షణకు సామదానభేదదండోపాయాలు అంటారు. అంటే ముందు దండోపాయం జోలికి పోకుండా సామదానభేదాల ద్వారా ఆ వ్యక్తిలో మార్పు తీసుకురావచ్చు. అధర్మంనుంచి ధర్మం వైపుకు నడిపించవచ్చు. భగవంతుడు ఆ పని ఎప్పుడూ చేస్తాడు. రావణాసురుణ్ణి, 'ఇవాళ పోయి, రేపు రా,' అన్నాడు భగవంతుడు.

దుర్యోధనుడికి కూడా ఒక అవకాశం ఇచ్చాడు. తను దూతగా వెళ్ళి, పాండవులకు ఐదు ఊర్లన్నా ఇమ్మని అడిగితే, ఐదు ఊర్లు కాదు కదా సూదిమొన మోపేంత స్థలం కూడా ఇవ్వనన్నాడు. **తస్మాత్ యుధ్యస్వ భారత–** అర్జునా, యుద్ధం చేయి అన్నాడు.

భగవంతుడు ధర్మాన్ని ఇంకో పద్ధతిలో కూడా నిలబెడతాడు. అదెలా? క్షత్రియులను, బ్రాహ్మణులను రక్షించటం ద్వారా. వీరిద్దరూ వీరి పద్ధతిలో ధర్మాన్ని నిలబడతారు. క్షత్రియుడు అధార్మికవ్యక్తిని శిక్షించటం ద్వారా ధర్మాన్ని రక్షిస్తాడు. బ్రాహ్మణుడు ధర్మాన్ని బోధించటం ద్వారా ధర్మాన్ని రక్షిస్తాడు. బ్రాహ్మణుడు తన బోధ ద్వారా విలువలను పెంపొందిస్తాడు. దయానంద స్వామీజీ అద్భుతంగా అంటారు: **ఒక విలువయొక్క విలువకు మీరు విలువనిచ్చినప్పుడు, ఆ విలువను విలువ అంటారు.**

భగవంతుని అవతారం చూస్తే, కృష్ణపరమాత్మ రెండూ చేశాడు. ధర్మరాజులాంటి ధర్మపురుషులను రక్షించాడు; దుర్యోధనుడివంటి అధర్మపురుషులను చంపించాడు. ఇది కృష్ణునియొక్క క్షత్రియధర్మం. గీత బోధించటం ద్వారా ధర్మాన్ని నిలబెట్టాడు.

**ధర్మసంస్థాపనార్థాయ** – తను అవతారం ఎత్తటానికి వెనకనున్న ఉద్దేశ్యం చెప్పాడు. ధర్మాన్ని రక్షించటానికి! విష్ణుమూర్తి ఎత్తిన పది అవతారాల్లో రామావతారం, కృష్ణావతారం శ్రేష్ఠమైనవి. రామావతారంలో తానే ధర్మానికి ప్రతీకగా నిలిచాడు. రాముని చరిత్రను రామాయణం అంటారు. అంటే రామ+అయనం. రాముడు గడిపిన జీవనవిధానం.

కృష్ణపరమాత్మ ధర్మాన్ని బోధించాడు. అందువల్ల **రాముడు చేసింది చేయండి, కృష్ణుడు చెప్పింది చేయండి అంటారు**. కృష్ణుడు వెన్న దొంగిలించాడు, ఆయనకు ఎనిమిది మంది భార్యలు ఉన్నారు అనకండి. ఆయన చెప్పిన బోధను పాటించండి.

**సంభవామి యుగే యుగే** – ప్రతియుగంలో నేను అవతారం ఎత్తుతాను.

ఇక్కడ అక్షరాలా ప్రతి ఒక్క యుగంలో వస్తాను అని కాదు అర్థం. ఎప్పుడు అవసరమైతే అప్పుడు వస్తాను అని అర్థం. ఒకయుగంలోనే పదిసార్లు అవసరం ఏర్పడవచ్చు; ఇంకో యుగంలో అసలు అవసరమే రాకపోవచ్చు; అందువల్ల షరతు ఏమిటంటే, ఎప్పుడు అవసరమైతే అప్పుడు వస్తాడు.

శ్లో. 9 **జన్మ కర్మ చ మే దివ్యమ్ ఏవం యో వేత్తి తత్త్వతః ।**
**త్యక్త్వా దేహం పునర్జన్మ నైతి మామేతి సోఽర్జున ॥**
జన్మ, కర్మ, చ, మే, దివ్యమ్, ఏవమ్, యః, వేత్తి, తత్త్వతః,
త్యక్త్వా, దేహమ్, పునః, జన్మ, న, ఏతి, మామ్, ఏతి, సః, అర్జున ॥

| | | | |
|---|---|---|---|
| అర్జున! | = ఓ అర్జునా! | వేత్తి | = తెలుసుకొనునో |
| మే, జన్మ | = నా అవతారము(లు) | సః | = అతడు |
| కర్మ, చ | = కర్మ(లు) | దేహమ్, త్యక్త్వా | = తనువును చాలించిన పిదప |
| దివ్యమ్ | = దివ్యము(లు) | పునః, జన్మ, న, ఏతి | = మరల జన్మను పొందదు |
| ఏవమ్, యః | = ఇలా ఎవరైతే | మామ్, ఏతి | = నన్నే చేరును |
| తత్త్వతః | = తాత్త్వికముగా | | |

**హే అర్జున! యః మే దివ్యం జన్మ కర్మ చ ఏవం తత్త్వతః వేత్తి,**
**సః దేహం త్యక్త్వా, పునః జన్మ న ఏతి, (కిన్తు సః) మామ్ ఏతి ।**

తా: ఓ అర్జునా! నా జన్మ (అవతారములు)లు, కర్మలు దివ్యములు. అంటే నిర్మలములు. అలౌకికములు. ఈ తత్త్వరహస్యమును తెలిసికొనినవాడు తనువును చాలించిన పిదప మరల జన్మించడు సరికదా, నన్నే చేరును.

**మోక్షమార్గం –** ముందు మంత్రంతో ఉపోద్ఘాతం అయిపోయింది. అంటే గీతాస్తుతి, అవతారస్వరూపం అయిపోయాయి. ఇప్పుడు ఈ శ్లోకంనుంచి అసలు అంశానికి వస్తున్నాడు కృష్ణపరమాత్మ. అది మోక్షమార్గం.

**యచ్ఛ్రేయః స్యాన్నిశ్చితం బ్రూహి తన్మే**
**శిష్యస్తేఽహం శాధి మాం త్వాం ప్రపన్నమ్** – 2.7

అర్జునుడు అడిగాడు, 'ఓ కృష్ణా, నాకు నిజంగా శ్రేయస్కరమైనది ఏదో అది చెప్పు'.

**ఈశ్వర స్వరూప జ్ఞానాత్ మోక్ష సిద్ధిః** – ఈశ్వరజ్ఞానం మోక్షాన్నిస్తుంది. ఇక్కడ ఒక విషయం గ్రహించాలి మనం. కృష్ణపరమాత్మ రెండవ అధ్యాయంలో ఆత్మజ్ఞానం పొందితే మోక్షం లభిస్తుందన్నాడు.

**ఆత్మన్యేవాత్మనా తుష్టః స్థితప్రజ్ఞస్తదోచ్యతే** – 2.55

ఇక్కడేమో ఈశ్వరజ్ఞానం పొందితే మోక్షం లభిస్తుంది అంటున్నాడు. ఇప్పుడు ఏది నిజం? ఆత్మజ్ఞానం పొందితేనా? ఈశ్వరజ్ఞానం పొందితేనా? మోక్షం విషయం వచ్చేసరికి శాస్త్రం ఒక్కటే మార్గం ఉందంటుంది.

ఎలా ఈ సమస్యను పరిష్కరించటం? ఎలాగంటే ఈశ్వరుడు వేరు, నేను వేరు కాదు. జీవ ఈశ్వర ఐక్యజ్ఞానం మోక్షాన్ని ఇస్తుంది.

దీనికి ఉదాహరణ, అల-సముద్రం. అల చూడటానికి చిన్నదైనా, దాని అసలు స్వరూపం ఏమిటి? నీరు. అలాగే సముద్రం చూడటానికి పెద్దదైనా, దాని అసలు స్వరూపం ఏమిటి? నీరు. అందువల్ల అల స్వరూపం గురించి మాట్లాడినా, సముద్రం స్వరూపం గురించి మాట్లాడినా మనం మాట్లాడేది ఒక్కదాని గురించే! **అది నీరు.**

అలాగే నా గురించి మాట్లాడినా, ఈశ్వరుని గురించి మాట్లాడినా మా ఇద్దరి అసలు స్వరూపం ఏమిటి? **సచ్చిదానంద స్వరూపం**. ఎవరైనా నాకు దేవుడు అర్థమయ్యాడు, కాని నా గురించి తెలియలేదు అన్నా; నాకు నా గురించి అర్థమయింది, కాని దేవుడి గురించి తెలియలేదు అన్నా ఈ సామెత గుర్తు తెచ్చుకోవాలి. ఎవరో కాటుక గురించి నాకు తెలియదా – అది పసుపులాగా తెల్లగా ఉంటుంది అన్నాడట. అంటే అతనికి కాటుక, పసుపు, తెలుపు రంగు ఈ మూడూ తెలియవన్నమాట.

**యః వేత్తి** – ఒకవేళ ఎవరైనా తెలుసుకుంటే! ఏమిటి?

**మే జన్మ** – నా జన్మను. అంటే నా అవతారస్వరూపాన్ని. కృష్ణుని అవతారస్వరూపం ఏమిటి? ఆయన శరీరం దాల్చిన కృష్ణుడు కాదు. అసలు కృష్ణస్వరూపం వేరే ఉంది.

**అజోఽపి సన్నవ్యయాత్మా భూతానామీశ్వరోఽపి సన్** – 4.6

అసలు కృష్ణతత్త్వానికి చావు, పుట్టుకలు లేవు. కనబడే సగుణ కృష్ణ వెనుక నిర్గుణ బ్రహ్మ ఉంది.

**దివ్యం కర్మ** – ఎవరైతే భగవంతుని లీలలను తెలుసుకుంటారో! ఏమిటా లీల?

**పరిత్రాణాయ సాధూనాం వినాశాయ చ దుష్కృతామ్** – 4.8

**తత్త్వతః** – తన నిజమైన స్వరూపాన్ని తెలుసుకుంటే; ఏమవుతుంది?

**త్యక్త్వా దేహం పునర్జన్మ నైతి మామేతి సోఽర్జున** – మామ్ ఏతి – నన్నే పొందుతాడు. ఓ అర్జునా, అతనికి పునర్జన్మ ఉండదు. అంటే అతనికి మోక్షం లభిస్తుంది.

భాగవతం చదివితే తెలుస్తుంది. గోపికలు మొదట్లో కృష్ణుని ఒక వ్యక్తిగా, గోపబాలకునిగా, అందగాడిగా ఆరాధించారు.

**అధరం మధురం వదనం మధురం నయనం మధురం హసితం మధురం**

**హృదయం మధురం గమనం మధురం మధురాధిపతే రఖిలం మధురం**

కాని, తరువాత అదే గోపికలు కృష్ణపరమాత్మను ఆత్మగా వర్ణించారు.

**న ఖలు గోపికానన్దనో భవన్ అఖిల దేహినామ్ అంతరాత్మదృక్**

ఓ కృష్ణా! ఇప్పుడు నువ్వెవరో మాకు తెలుసు; నువ్వు గోపాలనందనుడవు కావు; అందరి శరీరాలలో ఉన్న ఆత్మ చైతన్యానివి. ఎందుకు ఈ శరీరం తీసుకున్నావు అంటే –

**విఖన సార్థితో విశ్వగుప్తయే సఖ ఉదేయివాన్ సాత్వతం కులే** – గోపికాగీతమ్ 4

నీ భక్తులు కోరారు కాబట్టి, నువ్వు తాత్కాలికంగా ఈ మాయిక శరీరాన్ని దాల్చావు. ఈ జగత్తును దీవించటానికి వచ్చావు గాని, ఈ శరీరం నీ అసలు స్వరూపం కాదని మాకు తెలుసు. ఈ జ్ఞానాన్ని **తత్త్వజ్ఞానం** అంటారు. ఎవరైతే ఈ తత్త్వజ్ఞానాన్ని పొందుతారో, వారు మోక్షాన్ని పొందుతారు. ఆ మోక్షమేమిటి?

**సః మామ్ ఏతి** – మరణం తరువాత నాలో ఐక్యం చెందుతారు. అంటే ఈశ్వర ఐక్యం పొందుతారు.

శ్లో. 10 **వీతరాగభయక్రోధా మన్మయా మాముపాశ్రితాః ।**
**బహవో జ్ఞానతపసా పూతా మద్భావమాగతాః ॥**
వీతరాగభయక్రోధాః, మన్మయాః, మామ్, ఉపాశ్రితాః,
బహవః, జ్ఞానతపసా, పూతాః, మద్భావమ్, ఆగతాః ॥

| | | | |
|---|---|---|---|
| వీతరాగ, భయక్రోధాః | = రాగభయ క్రోధరహితులు | జ్ఞానతపసా | = జ్ఞానరూప తపస్సుచే |
| మన్మయాః | = నాయందే అనన్యభక్తితో స్థితమైనవారు | పూతాః | = పవిత్రులై |
| | | మద్భావమ్ | = నా స్వరూపమును |
| మామ్, ఉపాశ్రితాః | = నన్ను ఆశ్రయించినవారు (అగు) | ఆగతాః | = పొందియుండిరి |
| బహువః | = పెక్కుమంది భక్తులు | | |

**వీత–రాగ–భయ–క్రోధాః, మన్మయాః మామ్ ఉపాశ్రితాః,**
**జ్ఞాన–తపసా పూతాః, బహవః మద్భావమ్ ఆగతాః ।**

తా: ఇదివరలో గూడా సర్వదా రాగభయ క్రోధరహితులైనవారు, దృఢమైన భక్తి తాత్పర్యములతో స్థిరబుద్ధి గలిగి, నన్ను ఆశ్రయించిన భక్తులు పెక్కుమంది జ్ఞానతపస్సంపన్నులై, పవిత్రులై నా స్వరూపమును పొంది యుండిరి.

దైవాన్ని అర్థం చేసుకోవటం రెండు దశల్లో జరుగుతుంది. ముందు సగుణ ఈశ్వరుణ్ణి అర్థం చేసుకుంటే, తర్వాత నిర్గుణ ఈశ్వరుణ్ణి అర్థం చేసుకోగలుగుతాము. దీన్ని ఏడవ అధ్యాయంనుంచి ఇంకా విపులంగా చూస్తాము. సగుణ ఈశ్వర దర్శనాన్ని కూడా రెండు దశల్లో వర్ణిస్తారు.

మొదటిది ఏకరూప ఈశ్వరదర్శనం. భగవంతుణ్ణి ఒక రూపంలో కొలవటం. అది ఏ రూపమన్నా అవచ్చు– రాముడు, కృష్ణుడు, దేవి, ఏదైనా. అది కూడా మీరు ఏ బంధంతో పిలిచినా పలుకుతాడు – తల్లిగా, తండ్రిగా, తనయునిగా, గురువుగా – ఏదైనా సరే! కొంతమంది భగవంతునితో మాట్లాడతారు; ఆత్మీయునిగా తలుస్తారు. కొంతమంది భగవంతునికి పడకగది, దోమతెర కూడా ఏర్పాటు చేస్తారు. అలాంటి వారికి భగవంతుడు

రాతివిగ్రహమో, కంచు విగ్రహమో కాదు, ఒక ప్రాణమున్న దేవుడు. అలా ఆత్మీయంగా కొలిచినకొద్దీ భగవంతునికి మరింత దగ్గరవుతారు. దీన్ని **ఏకరూప ఈశ్వరభక్తి** అంటారు.

తర్వాత దాన్ని పెంచి విశ్వరూప ఈశ్వరభక్తిగా మలచుకోవాలి. భగవంతుడు ఒక్క రూపంలో లేడు; నిజానికి విశ్వమంతా ఆయన రూపమే.

**భూః పాదౌ యస్య నాభిర్ వియదసురనిలశ్చంద్ర సూర్యౌ చ నేత్రే**

గీతలోనే 11వ అధ్యాయంలో ఇది చూస్తాము. ఏకరూప ఈశ్వరుణ్ణుంచి, విశ్వరూపదర్శనం చేస్తాము. కాని రెండూ సగుణ ఈశ్వరభక్తే అవుతుంది. దీన్నుంచి మూడవ దశకు రావాలి. అది **అరూప ఈశ్వర భక్తి** లేదా **నిర్గుణ ఈశ్వర జ్ఞానం**.

అందరూ మూడు దశలూ అనుభవించాలి. ఈరోజే మిమ్మల్ని సగుణ ఈశ్వరుడైన కృష్ణపరమాత్మను వదిలి నిర్గుణబ్రహ్మకు రమ్మనటం లేదు. అలా సగుణ ఈశ్వరుణ్ణుంచి నిర్గుణబ్రహ్మకు రావటం చాలా కష్టం. అందువల్ల ఎవరినైనా బలవంతపెడితే వారు చాలా బాధపడతారు. కాలక్రమేణా వారిలో పరిపక్వత వచ్చిన కొద్దీ వారే నేర్చుకుంటారు.

మీ చిన్నప్పుడు మీరు బెలూను కావాలని పేచీపెట్టి ఉంటారు. ఇప్పుడు పెట్టరు కదా! ఎలా బెలూనుమీద మీకు తెలియకుండానే అభిమానం పోయిందో, అలా మీకు తెలియకుండానే మీ మనస్సు **ఏకరూప ఈశ్వరభక్తినుంచి అనేకరూప ఈశ్వరభక్తికి** ఎదుగుతుంది. ఒక సాధకుడు ప్రయాణించే ఆ దశలను చెబుతున్నాడు కృష్ణపరమాత్మ ఈ శ్లోకంలో –

**వీతరాగభయక్రోధాః** – మొదటి దశ ఈశ్వరభక్తి చూపించి, కర్మయోగాన్ని పాటించటం. చేసే పనులను **ఈశ్వరార్పణ బుద్ధితో** చేయటం. వచ్చిన కర్మఫలాన్ని **ఈశ్వర ప్రసాదబుద్ధి**తో స్వీకరించటం.

**యత్కరోషి యదశ్నాసి యజ్జుహోషి దదాసి యత్** – 9.27

భగవంతునికి ఆహారాన్ని అర్పించి తినటంవల్ల మనం రోజూ ఇంట్లో వంట చేయాలి అంటారు పూజ్యస్వామీజీ. వారానికి ఒకసారి వండి, మైక్రోవేవ్‌లో వెచ్చబెడితే మనమూ, మన కుటుంబసభ్యులూ తినగలమేమో కాని భగవంతునికి దాన్ని అర్పించలేము కదా! గృహస్థాశ్రమం ఉన్నదే అందుకు – భగవంతునికి అర్పించాలని.

అటువంటి కర్మయోగంతో కూడిన జీవితం గడపటంవల్ల మనస్సులో ఉన్న మలినాలు పోతాయి. ఏమిటవి? రాగం, భయం, క్రోధం. రాగం అంటే బంధం. ఇన్నాళ్ళు మనం ఆనందానికి ప్రపంచంమీద ఆధారపడ్డాము. ఇది మొదటిదశ. కర్మయోగంలో ప్రపంచం మనకు శాశ్వతమైన ఆనందాన్ని ఇవ్వలేదని గ్రహించి దేవునిమీద ఆధారపడటం నేర్చుకుంటాము అంటే ప్రపంచంమీద ఆధారపడటంనుంచి దేవునిమీద ఆధారపడటం.ఇది రెండవదశ.

ప్రపంచం అశాశ్వతం. ఎవరితో నైనా రేపు వస్తాము అని అంటాము కాని ఆ రేపు అనే రోజు వస్తుందో రాదో తెలియదు. ఎవరైనా అకస్మాత్తుగా మరణించారని వింటే, మనమేం అంటాము? అయ్యో, నిన్ననే చూశానే; నిన్ననే ఆయనతో మాట్లాడానే అంటాము. జీవితం అశాశ్వతం, భగవంతుడు మాత్రమే శాశ్వతం. అందువల్ల ప్రాపంచిక వస్తువులమీద రాగాన్నుంచి భగవానునిమీద రాగంగా మలుచుకోవాలి.

దాని తరువాత మూడవ దశకు రావాలి. అంటే భగవానునిమీద ఆధారపడటంనుంచి, మనమీద మనం ఆధారపడే స్థాయికి రావాలి. ప్రపంచంమీద ఆధారపడటంనుంచి, భగవంతునిమీద ఆధారపడటంనుంచి, నామీదే ఆధారపడటం. ఎందుకంటే చైతన్యపరంగా ఆ భగవంతుడు నేనే అని అర్థం చేసుకోవటం.

అలా రాగం పోతే, భయం తగ్గుతుంది. ఎంత ప్రేమ ఉంటే, అంత భయం దాన్ని వెన్నంటే ఉంటుంది. అందువల్లనే కుటుంబసభ్యుల్లో ఎవరైనా ఇంటికి రావటం ఆలస్యమైతే, మనస్సు పరిపరి విధాల పోతుంది. ఒక్క మంచి ఆలోచన కూడా రాదు సరికదా, వారికి ఏదైనా ఏక్సిడెంట్ అయిందేమోనని కంగారు పడతాము. పూర్వం టెలిగ్రాములు ఉండేవి. టెలిగ్రామ్ రాగానే మనస్సు ఏదో కీడు శంకించేది. అందువల్ల, దాన్ని తెరవను కూడా తెరవకుండానే శోకాలు పెట్టేవారు కొందరు. తీరా చించి చూస్తే, అందులో ఏ పెళ్ళి శుభవార్తో ఉండేది. ఆ విధంగా రాగంవల్ల భయం కలుగుతున్నది కాబట్టి, రాగం పోతే భయం తగ్గుతుంది; క్రోధం తగ్గుతుంది.

ఎందరో ఆధ్యాత్మ మార్గాన్ని పాటించి, మోక్షాన్ని పొందారు. కాబట్టి మనం మోక్షం పొందటం కూడా అసాధ్యం కాదు. ఈ శ్లోకంలో దానికి పాటించాల్సిన సాధనల గురించి మాట్లాడుతున్నాడు కృష్ణపరమాత్మ.

**మన్మయా** – నా గురించి తపన. నేను అంటే ఈశ్వరుడు. మనస్సు అంతా ఈశ్వరమయంగా ఉండాలి. ఛెస్‌లో కాని టెన్నిస్‌లో కాని ప్రథమశ్రేణికి చేరుకోవాలంటే 24 గంటలూ తన లక్ష్యం గురించే ఆలోచిస్తూ ఉండాలి. అలా ఆధ్యాత్మిక చింతనలో వచ్చినవారు 24 గంటలూ దైవచింతనతోనే గడపాలి.

మొదట దేవుణ్ణి బాహ్యంగా కొలవాలి. ప్రపంచదృష్టినుంచి ఈశ్వరదృష్టికి రావాలి. ఈశ్వరదృష్టినుంచి ఆత్మదృష్టికి రావాలి. ఆత్మదృష్టి అంటే జీవ ఈశ్వర ఐక్యం అర్థం చేసుకోవాలి. నాలుగు పురుషార్థాలలో ఉత్తమమైన మోక్ష పురుషార్థం పొందాలంటే అది అంత తేలిక వ్యవహారం కాదు. ఎన్నో ఆటంకాలను ఎదుర్కోవాల్సి ఉంటుంది. మంచిపని చేద్దామని మొదలు పెట్టగానే మొదట వచ్చేదే ఆటంకం.

దేవదానవులు అమృతం చిలకటానికి ప్రయత్నించినప్పుడు ఎన్ని ఆటంకాలు ఎదుర్కొన్నారో తెలుసు కదా! ఆటంకాలే కాదు – మధ్యలో ఎన్నో ప్రలోభాలు కూడా వచ్చాయి. అయినా వారు చలించలేదు. అమృతం వచ్చేదాకా చిలుకుతూనే ఉన్నారు. అంతేకాదు, అడుగడుగునా దైవసహాయం కోరుతూనే ఉన్నారు.

**మాముపాశ్రితాః** – మన ప్రయత్నం మనం చేయాలి నిజమే. కాని దానికి ఈశ్వరకృప కూడా తోడవ్వాలి. అందువల్ల కృష్ణపరమాత్మ నా సహాయం కోరండి అంటున్నాడు.

మన్మయా పదం మనం ఫ్రీవిల్‌ను ఉపయోగించాలి అని సూచిస్తే, మాముపాశ్రితా పదం ఈశ్వర అనుగ్రహం కోరాలి అని సూచిస్తున్నది. ఇప్పుడు మన ఆధ్యాత్మిక ప్రయాణానికి కావాల్సిన రెండు ఇంజనులు సిద్ధంగా

ఉన్నాయి. ముందువైపు ఉన్న ఇంజను ఫ్రీ విల్, వెనక ఉన్న ఇంజను ఈశ్వర అనుగ్రహం. ఇప్పుడు వాహనం సిద్ధం! ఎటువైపు వెళ్ళాలి?

వీతరాగభయక్రోధాః – మన ఆంతర బలహీనతలను జయించాలి. రాగం, భయం, క్రోధాలను జయించాలి.

రాగః – రాగం అంటే బంధం; దాన్ని వెన్నంటే ఉంటుంది ద్వేషం. అందువల్ల ముందు ఈ రాగద్వేషాలను పారద్రోలాలి. ఈ రాగద్వేషాలు ప్రపంచాన్ని పొరపాటుగా అర్థం చేసుకోవటంవల్ల కలుగుతాయి. ప్రపంచం నాకు ఆనందం కలుగజేస్తోంది అనుకుంటే రాగం ఏర్పడుతుంది; ప్రపంచం నన్ను బాధపెడుతోంది అనుకుంటే ద్వేషం కలుగుతుంది.

**సుఖహేతు బుద్ధిః రాగకారణమ్, దుఃఖహేతు బుద్ధిః ద్వేషకారణమ్**

వేదాంతం ప్రకారం ప్రపంచం సుఖహేతువు కాదు, దుఃఖహేతువు కాదు. **అజ్ఞానికి ప్రపంచం దుఃఖహేతువు, జ్ఞానికి ప్రపంచం ఆనందస్వరూపం.** ఈ సత్యం నేను అర్థం చేసుకోనంతవరకూ, ప్రపంచంతో అవస్థలు పడుతూనే ఉంటాను. లేని వస్తువులు పొందే ప్రయత్నంలో సగం జీవితం, ఉన్న వస్తువులను వదుల్చుకునే ప్రయత్నంలో సగం జీవితం గడిచిపోతుంది. సమస్య బాహ్యంగా లేదు, నాలోనే ఉంది; నేను తెలుసుకుని నేను కళ్ళు తెరిచేసరికి నా వయస్సు 99కి చేరుకుంటుంది. దీనివల్ల మళ్ళీ జన్మ ఎత్తుతాను. మళ్ళీ జీవితం అట్టడుగు స్థాయినుంచి మొదలవుతుంది.

తెలివైన వ్యక్తి సమస్య నాలోనే ఉందని తెలుసుకుంటాడు. అందువల్ల **వీతరాగః** – రాగద్వేషాలను ఎలా అదుపులో పెట్టుకోవాలో తెలుసుకుంటాడు. కోరికలన్నిటినీ బంధకత్వం చూపని కోరికలుగా మలుచుకోవాలి. ఇది మొదటి దశ.

భయః – రాగంయొక్క ఫలితం భయం. ఎక్కడ ప్రేమ ఉంటే అక్కడ భయం ఉంటుంది. నేను ప్రేమించేవారు ఆలస్యంగా వస్తే అనేక భయాలు.

క్రోధాః – నేను కోరుకున్న వస్తువును పొందనివ్వకుండా ఎవరైనా అడ్డుపడితే వారిమీద కోపం. ఆ కోపం కూడా నా కోరికమీద ఆధారపడివుంటుంది. నాకు ఒక వస్తువు ఎంత ఇష్టమైతే, అది అందకపోతే అంత ఎక్కువ కోపం వస్తుంది.

రాగం, ద్వేషం, భయం, క్రోధం – ఈ నాలుగూ జతగా వస్తాయి. అందువల్ల ఆధ్యాత్మజీవనంలో వాటిని అదుపులో పెట్టుకోవటం నేర్చుకోవాలి. ఎలా అదుపులో పెట్టాలి?

భవిష్యత్తులో జరగబోయే అంశాలకు నేను తోడ్పడగలనే కాని, నేను వాటిని నిర్దేశించలేను అని అర్థం చేసుకోవాలి. నేను సహాయపడగలనే కాని, నేను నియంత్రించలేను. ఈ జ్ఞానం కలిగితే చాలు, అది నా కోపాన్ని తగ్గిస్తుంది.

ఒకవేళ ఈ సత్యాన్ని అర్థం చేసుకునే తెలివితేటలు లేకపోతే **దేవుణ్ణి శరణాగతి వేడటం** ఇంకో పద్ధతి. 'ఓ దేవా, భవిష్యత్తు నా చెప్పుచేతల్లో లేదు, కనీసం తప్పించుకోలేని విషయాన్ని తట్టుకునేందుకు తగినంత శక్తినివ్వు,' అని వేడుకోవాలి. తెలివైనవ్యక్తి తప్పని పరిస్థితికి సిద్ధపడతాడు. అది ఎలా సిద్ధపడతాడు అన్నది అతని స్థాయిని బట్టి ఉంటుంది. అర్థం చేసుకునే తెలివితేటలు ఉంటే తన జ్ఞానంమీద ఆధారపడతాడు, అర్థం చేసుకునే తెలివితేటలు లేకపోతే దేవుణ్ణి శరణు వేడటం ద్వారా సిద్ధపడతాడు. తీవ్రమైన బంధాన్ని, తీవ్రమైన ద్వేషాన్ని, తీవ్రమైన భయాన్ని, తీవ్రమైన కోపాన్ని జయించిన వ్యక్తిని వీతరాగభయక్రోధాః అంటారు.

శాస్త్రంలో ఇలా కామక్రోధాలు జయిస్తే దాన్ని శుద్ధ అంతఃకరణం అంటారు. ఈ నాలుగింటినీ – రాగ, ద్వేష, భయ, క్రోధాలను – జయించిన వాని అంతఃకరణం శుద్ధంగా ఉంటే, వాటికి బానిస అయిన మనస్సు కల్మషంతో కూడి ఉంటుంది. కర్మయోగం వీటిని జయించే మార్గం చూపుతుంది.

మనస్సు శుద్ధం అయ్యాక, ఏమిటి పరిస్థితి? మోక్షం వస్తుందా? రాదు అంటున్నాడు కృష్ణపరమాత్మ. ఇప్పుడు మనస్సు **శుద్ధచిత్తం** అయింది కాని జ్ఞానచిత్తం అవలేదు. కర్మయోగం చిత్తశుద్ధిని ఇవ్వగలదు కాని జ్ఞానాన్ని ఇవ్వలేదు. మనస్సులోని రాగద్వేషాలను పారద్రోలాక, జ్ఞానంకోసం ప్రత్యేకంగా కృషి చేయాలి.

**జ్ఞానం దానంతట అదే రాదు.** ఏ జ్ఞానమూ దానంతట అదే రాదు. ఫిజిక్స్ జ్ఞానం పొందాలంటే దానంతట అది రాదు. ఒక కాలేజీలో చేరాలి; అక్కడ చెప్పింది అర్థం కాకపోతే ట్యూషన్‌కు వెళ్ళాలి; కష్టపడి చదవాలి. అలాంటిది ఆత్మజ్ఞానం గురించి వేరే చెప్పాలా?

**జ్ఞానతపసా** – ఆధ్యాత్మజ్ఞానం కూడా దానంతట అదే రాదు. దానికోసం కష్టపడాలి. ఒక తపస్సులా చేయాలి. క్రమం తప్పకుండా గీతాబోధకో, ఉపనిషత్తు క్లాసుకో వెళ్ళటం ఆషామాషీ వ్యవహారం కాదు. అనేక ఆటంకాలు వస్తుంటాయి – బంధువులు వస్తారు, ఫోను వస్తుంది, కారు టైరు పంక్చరు అవుతుంది, అయినా ఒక తపస్సులా నేర్చుకోవాలి. జ్ఞానతపస్సునే జ్ఞానయోగం అని కూడా అంటారు. జ్ఞానం వేదాంత శ్రవణ, మనన, నిదిధ్యాసనల ద్వారా పొందుతారు.

**పూతా** – ఈ జ్ఞానం పొందినవారు పూర్తిగా పవిత్రులయ్యారు. రాగద్వేషాలను పారద్రోలితే కొంత చిత్తశుద్ధి కలుగుతుంది; కామక్రోధాలను పారద్రోలితే కొంత చిత్తశుద్ధి కలుగుతుంది; దీనివల్ల జ్ఞానయోగ్యతా ప్రాప్తి కలుగుతుంది. కాని అసలు కాలుష్యం లేదా ప్రాథమిక కాలుష్యం ఏమిటి? **అజ్ఞానం!** జ్ఞానయోగం ద్వారా చిత్తంలోని కాలుష్యం పూర్తిగా పోతుంది. గనుల్లో దొరికిన బంగారాన్ని ఎన్నో దశల్లో శుద్ధి చేస్తేనే కాని స్వచ్ఛమైన బంగారం అవదు. స్థూలమైన మలినాన్ని పోగొట్టడానికి స్థూలమైన పద్ధతి వాడితే, సూక్ష్మాతి సూక్ష్మమైన మలినాన్ని పోగొట్టడానికి సూక్ష్మాతి సూక్ష్మమైన పద్ధతిని వాడాలి.

మనలో మలినం మూడు స్థాయిల్లో ఉంది. అవి మలం, విక్షేపం, ఆవరణాలు. **మలం** అతి స్థూల స్థాయిలో ఉంది. అవి మనలో కలిగే రాగద్వేషాలు. రెండవ స్థాయి **విక్షేపం**. అది సూక్ష్మ స్థాయిలో ఉంది. అది నిలకడలేని, చలించే మనస్సు. మూడవ స్థాయి **ఆవరణం**. ఇది సూక్ష్మాతి సూక్ష్మమైనది. అది అజ్ఞానం. మూడు మలినాలను తొలగించటానికి మూడు పద్ధతులు ఉపయోగించాలి.

కర్మయోగం మలాన్ని; ఉపాసనయోగం విక్షేపాన్ని; జ్ఞానయోగం ఆవరణాన్ని తొలగిస్తాయి. కర్మయోగం ఆవరణాన్ని తొలగించలేదు; జ్ఞానయోగం మలాన్ని తొలగించలేదు. ఒక్కొక్క మెట్టు ఎక్కుతూ రావాలి. అవి వాడే క్రమం కూడా ముఖ్యం. జ్ఞానయోగంతో మొదలుపెట్టి, కర్మయోగంతో ముగించటం సాధ్యం కాదు. కర్మయోగంతో మొదలుపెట్టాలి. తరువాత జ్ఞానయోగానికి రావాలి.

**బహవః** – ఎందరో తమను తాము పునీతులను చేసుకున్నారు. మూడు దశల్లోనూ శుద్ధి పొందారు. అది కూడా ఒక్కళ్ళో, ఇద్దరో కాదు. అనేకమంది.

**మద్భావమ్ ఆగతాః** – మలినాలన్నిటినీ పోగొట్టుకున్నాక, ఏం పొందారు? వారు భగవంతుణ్ణి చేరలేదు; వారు భగవంతుణ్ణి కలువలేదు; వారు మలినం లేని నేను దేవుడు అని తెలుసుకున్నారు.

మలినం లేని జీవాత్మ పరమాత్మ; మలినంతో కూడిన పరమాత్మ జీవాత్మ. కాని మొదట్లో ఒక వ్యక్తికి ఈ విషయం తెలియదు. అందువల్ల భగవంతుడు ఎక్కడో ఉన్నాడు; ఆయన్ని కొలుస్తే శివలోక ప్రాప్తి కలుగుతుంది అని చెబుతారు. కాని అసలు జ్ఞానం పొందితే జీవాత్మ పరమాత్మల ఐక్యం అర్థమవుతుంది. నేను ఇంతసేపూ వెతుకుతున్నది నన్నే అని అర్థమవుతుంది. అందువల్ల కృష్ణపరమాత్మ వారు నా స్వరూపాన్ని పొందారు అంటున్నాడు. వారు నన్ను చేరారు అనటం లేదు; నా స్వరూపాన్ని పొందారు అంటున్నాడు. కృష్ణపరమాత్మ స్వరూపం ఏమిటి? **సత్యం జ్ఞానమ్ అనంతం బ్రహ్మ.** పరిపూర్ణత; భద్రత.

అందువల్ల ఈ నాలుగు దశలూ పాటించాలి. వాటిని టూకీగా చూస్తే –

| | |
|---|---|
| 1. **మన్మయా** | – ఆధ్యాత్మిక లక్ష్యాలు అంతిమ లక్ష్యాలుగా ఉండాలి. |
| 2. **మాముపాశ్రితాః** | – ఈ ప్రయాణంలో తోడుకోసం ఈశ్వరుణ్ణి శరణు వేడాలి. |
| 3. **వీతరాగభయక్రోధాః** | – చిత్తశుద్ధిని పొందటం – రాగ,ద్వేష, భయ, క్రోధాలను పారద్రోలటం ద్వారా |
| 4. **జ్ఞానతపసా** | – ఆత్మజ్ఞానం పొందటం – శ్రవణ, మనన, నిదిధ్యాసనల ద్వారా. |
| **మద్భావమ్ ఆగతాః** | – వారు మలినం లేని నేను దేవుడు అని తెలుసుకున్నారు. |

శ్లో. 11 **యే యథా మాం ప్రపద్యంతే తాంస్తథైవ భజామ్యహమ్ ।**
**మమ వర్త్మానువర్తంతే మనుష్యాః పార్థ సర్వశః ॥**
యే, యథా, మామ్, ప్రపద్యంతే, తాన్, తథా, ఏవ, భజామి, అహమ్,
మమ, వర్త్మ, అనువర్తంతే, మనుష్యాః, పార్థ, సర్వశః ॥

| | | | |
|---|---|---|---|
| పార్థ! | = ఓ పార్థా! | అహమ్ | = నేను |
| యే | = ఎవరు | తాన్ | = వారిని |
| మామ్ | = నన్ను | తథా, ఏవ | = ఆ విధంగా |
| యథా ప్రపద్యంతే | = ఏ విధంగా సేవించెదరో | భజామి | = అనుగ్రహింతును |

| | | | |
|---|---|---|---|
| మనుష్యాః | = మనుష్యులందరు | వర్త్మ | = మార్గమును |
| సర్వశః | = వివిధరీతులలో | అనువర్తంతే | = అనుసరింతురు |
| మమ | = నాయొక్క | | |

**యే యథా మాం ప్రపద్యన్తే, తాన్ తథా ఏవ అహం భజామి ।**
**హే పార్థ! మనుష్యాః సర్వశః మమ వర్త్మ అనువర్తన్తే ।**

తా: పార్థా! భక్తులు నన్ను సేవించిన రీతికి అనుగుణముగా నేను వారిని అనుగ్రహింతును. మనుష్యులందురు వివిధ రీతులలో నా మార్గమునే అనుసరింతురు.

ఇక్కడ కృష్ణపరమాత్మ ఇంకో అద్భుతమైన అంశాన్ని చెబుతున్నాడు. ఆధ్యాత్మిక సాధన మన అంతిమ లక్ష్యంగా ఉండాలని సూచిస్తున్నాడు. కాని అది బలవంతంగా ఎవరి నెత్తిమీదా రుద్దటం లేదు. నాకు మోక్షం వద్దని ఎవరైనా అంటే శాస్త్రం బలవంతపెట్టదు.

నిజానికి ఎవరైనా ప్రయత్నించేది మోక్షంకోసం. ఎవరు ఏది కోరుకున్నా, దాని వెనక ఉండే లక్ష్యం **స్వేచ్ఛ**. ఎవరైనా ఒక కారు కొన్నారంటే బస్సుల్లో వెళ్ళి, ఆటోల్లో వెళ్ళి, వాటిమీద ఆధారపడటంవల్ల అనేక సమస్యలను ఎదుర్కొని, తనకంటూ ఒక స్వంతవాహనం ఉంటే తన ఇష్టం వచ్చినట్టు వెళ్ళవచ్చనే ఉద్దేశ్యంతోనే కొన్నారు. ఆ కారు కూడా సతాయించటం మొదలుపెడితే వేరే మార్గం వెతుక్కుంటారు. దానివెనక కారణం ఏమిటి? **స్వేచ్ఛ**. ఎవరికైనా కావాల్సింది **స్వేచ్ఛ, స్వేచ్ఛ**.

ఒక్కోసారి పిల్లలు గుక్కపెట్టి ఏడుస్తారు. వారికేం కావాలో వారికే తెలియదు. కాని ఏదో కావాలని ఏడుస్తారు. తల్లి కష్టపడి తెలుసుకుని అది ఇస్తుంది. అలాగే మనకు కూడా ఏం కావాలో మనకు తెలియదు. శాస్త్రం ఓపికగా ఆగుతుంది. మనను ఒత్తిడికి గురిచేయదు. 'నువ్వు స్వేచ్ఛను కోరుకుంటున్నావు, నీకు అర్థమైతే మంచిదే. అర్థం కాకపోతే అర్థకామాల వెంట పరుగులు తియ్యి. స్వర్గలోకానికి వెళ్ళు, అన్ని ప్రయత్నాలు చేయి. చివరికి విసిగి వేసారిపోయి నా దగ్గరకు వస్తే నేను తిట్టను, ముందే చెప్పాను అయినా నువ్వు వినలేదు అనను, నీకు సహాయం చేయటానికి సిద్ధంగా ఉన్నాను,' అంటుంది శాస్త్రం.

శాస్త్రం ఎన్నడూ కామ్యకర్మలు చేయకూడదు అనలేదు. నిజానికి శాస్త్రమే ఎన్నో కామ్యకర్మలను వివరించింది. ధనకనకవస్తువాహనాలు ఏం కావాలన్నా కూడా వాటికి తగ్గ పూజలు, యజ్ఞాలు ఉన్నాయి. ఆవహంతీ హోమం చేస్తే పుష్కలంగా ధనం సమకూరుతుంది. స్వర్గలోకానికి వెళ్ళాలని ఉందా, హాయిగా వెళ్ళి రమ్మంటుంది. కృష్ణపరమాత్మ అంటున్నాడు 'నేను నాలుగు పురుషార్థాలను ఇచ్చాను. వాటిని పొందే మార్గాలను ఇచ్చాను. వాటిని పొందటానికి నీకు సహాయపడటానికి కూడా నేను సిద్ధంగా ఉన్నాను. మోక్షం కావాలంటేనే సహాయపడతాను అనుకోకు.'

**యే యథా మాం ప్రపద్యంతే** – ఎవరు ఏ కోరిక కోరితే నేను ఆ కోరికను తీరుస్తాను. అంతిమ లక్ష్యమైన మోక్షం ఉండగా, చిన్న కోరికలు కోరుతున్నావేమిటి అని విమర్శించను.

పిల్లవాడు బెలూను అడిగితే అది రెండు నిముషాల్లో పేలిపోతుంది, దాన్ని ఎందుకు కోరుతున్నావు అనదు తల్లి. అలాగే కొని ఇస్తుంది. ఎప్పుడో ఒకప్పుడు, పిల్లవాడే దాని మోజునుంచి బయటపడతాడని ఆశిస్తుంది. అలాగే కృష్ణపరమాత్మ కూడా తల్లిలాగా సహాయపడటానికి సిద్ధంగా ఉన్నాడు.

కాకపోతే ఒక షరతును విధిస్తున్నాడు కృష్ణపరమాత్మ. ఆ కోరికలు ధర్మబద్ధంగా ఉండాలి; వాటిని తీర్చుకునే మార్గం కూడా ధర్మబద్ధంగా ఉండాలి. నిజానికి అనుభవించటం జీవితంలో ఒక భాగం. కాని శాస్త్రం ఒక హెచ్చరిక చేస్తున్నది. అనుభవించేటప్పుడు జాగ్రత్త వహించమంటుంది. దేన్నైనా అనుభవించవచ్చు కాని, దానికి బానిస కాకూడదు. ఏ కోరికతో వచ్చినా నేను పారిజాతవృక్షంలా వారిని కరుణిస్తాను.

**తాంస్తథైవ భజామ్యహమ్** – వారు కోరిన వస్తువులే వారికి ఇస్తాను. ఆకలితో ఉన్న వ్యక్తికి అన్నం పెట్టాలి కాని తత్త్వబోధ నేర్పిస్తే లాభం లేదు.

**మమ వర్త్మానువర్తంతే** – వారికి నచ్చిన రీతిలో నన్ను కొలుస్తున్నారు.

**మనుష్యాః పార్థ సర్వశః** – వారికి ఏం కావాలంటే దాన్ని వారికి అనుగ్రహిస్తాను.

శ్లో. 12 **కాంక్షంతః కర్మణాం సిద్ధిం యజంత ఇహ దేవతాః ।**
**క్షిప్రం హి మానుషే లోకే సిద్ధిర్భవతి కర్మజా ॥**
కాంక్షంతః, కర్మణామ్, సిద్ధిమ్, యజంతే, ఇహ, దేవతాః,
క్షిప్రమ్, హి, మానుషే, లోకే, సిద్ధిః, భవతి, కర్మజా ॥

| | | | |
|---|---|---|---|
| ఇహ, మానుషే, లోకే | = ఈ మనుష్యలోకమందు | యజంతే | = పూజింతురు |
| కర్మణామ్ | = కర్మలయొక్క | హి | = ఎందుకంటే |
| సిద్ధిమ్ | = ఫలమును | కర్మజా, సిద్ధిః | = కర్మలను ఆచరించుటవల్ల కలుగు ఫలము |
| కాంక్షంతః | = కోరుకొనువారు | | |
| దేవతాః | = (ఇతర) దేవతలను | క్షిప్రమ్, భవతి | = (వారికి) శీఘ్రముగా లభించును |

**కర్మణాం సిద్ధిం కాంక్షన్తః (మనుష్యాః) ఇహ దేవతాః యజన్తే,**
**హి మానుషే లోకే కర్మజా సిద్ధిః క్షిప్రం భవతి ।**

తా: ఈ లోకమున కర్మఫలమును ఆశించువారు ఇతర దేవతలను పూజింతురు. ఎందుకంటే అలా చేయుటచే కర్మలవల్ల కలుగు సిద్ధి వారికి శీఘ్రముగా లభించును.

కృష్ణపరమాత్మ చెబుతున్నాడు. వేదాల్లో నేను రెండు మార్గాలను నిర్దేశించాను. వేదపూర్వభాగం కర్మకాండను సూచిస్తే, వేద అంతభాగం జ్ఞానకాండను సూచిస్తుంది. రెండు మార్గాలూ వాటికి తగ్గ ఫలితాలను ఇస్తాయి. ఏమిటా ఫలాలు?

**కర్మఫలం అనిత్యం.** కర్మఫలం అనిత్యమే కాకుండా మూడు దోషాలతో కూడి ఉంది. అవి – దుఃఖమిశ్రితత్వం, అతృప్తికరత్వం, బంధకత్వం. ఏదైనా సాధించాలంటే దానికి అవస్థ పడాలి, దాన్ని నిలబెట్టుకోవటం ఇంకా కష్టం. అది పోతే భరించలేని కష్టం. అందువల్ల కర్మఫలం దుఃఖమిశ్రితత్వం. ఎంత సాధించినా తృప్తి ఉండదు– అతృప్తికరత్వం. వాటిమీద అంతకంతకూ బంధం పెంచుకుంటాము – బంధకత్వం. అందువల్ల కర్మఫలం అనిత్యం.

**జ్ఞానఫలం నిత్యం.** మీకు నిత్యఫలం కావాలంటే కర్మ చేయటంవల్ల రాదని చెబుతుంది జ్ఞానకాండ. ఎందుకు? ఒక కర్మ చేస్తే దానికొక ఆరంభం ఉంటుంది. ఆరంభం ఉన్నదానికి అంతం ఉంటుంది. అంటే కాలపరిమితి ఉంటుంది. అందువల్ల పూర్ణత్వం అనే ఫలం ఏ కర్మవల్లా రాదు; అది జ్ఞానంవల్ల మాత్రమే సాధ్యం. పూర్ణత్వం ఉన్నదానికి కాలపరిమితి ఉండదు. అందువల్ల జ్ఞానఫలం నిత్యం.

విచారకరమైన విషయమేమిటంటే, వేదాల్లో ఈ విషయం స్పష్టంగా చెప్పబడినా, కర్మఫలాలు అనిత్యం అని తెలిసినా చాలామంది మనుష్యులు కర్మమార్గాన్నే ఎన్నుకుంటున్నారు. అంత తెలిసి తెలిసీ దాన్నే ఎందుకు ఎన్నుకుంటున్నారు? కర్మమార్గం పాటించటం తేలిక. దానికి చిత్తశుద్ధి అవసరం లేదు; సాధన చతుష్టయ సంపత్తి అవసరం లేదు. జ్ఞానమార్గానికి రావాలంటే రాగద్వేషాలను వదలండి అంటే జ్ఞానమార్గాన్నే వదలటానికి సిద్ధపడతారు మనుష్యులు. నాకు కొంతమందిని ద్వేషించటం ఇష్టం అంటారు పైగా.

**కర్మణాం సిద్ధిం కాంక్షంతః** – కృష్ణపరమాత్మ చెబుతున్నాడు; చాలామందికి కర్మఫలంమీదే ఆసక్తి ఎక్కువ. ధర్మార్థకామపురుషార్థాలని ప్రేయోమార్గం అంటారు కఠోపనిషత్తులో. చాలామంది ఈ ప్రేయోమార్గాన్నే ఎన్నుకుంటారు.

**శ్రేయశ్చ ప్రేయశ్చ మనుష్యమేతః తౌ సంపరీత్య వివినక్తి ధీరః**

**శ్రేయోహి ధీరోఽభి ప్రేయసో వృణీతే ప్రేయో మందో యోగక్షేమాద్వృణీతే** – కఠ – 1.2.2

మనుష్యుల ముందు స్వయంవరంలోలాగా ప్రేయోమార్గం, శ్రేయోమార్గం రెండూ నిలుచుంటాయి. తెలివైన వ్యక్తి శాశ్వతమైన ఫలాన్నిచ్చే శ్రేయోమార్గాన్ని ఎన్నుకుంటే, మందబుద్ధి ఉన్న వ్యక్తి అశాశ్వతమైన ఫలాన్నిచ్చే ప్రేయోమార్గాన్ని ఎన్నుకుంటాడు. ఎందుకు అశాశ్వతఫలాన్ని ఎన్నుకుంటాడు?

**కర్మజా సిద్ధిః క్షిప్రం భవతి** – ఎందుకంటే కర్మఫలం త్వరగా వస్తుంది.

జ్ఞానమార్గంలో జ్ఞానఫలం బాగుంటుంది; జ్ఞానం పొందటం కూడా తేలిక కాని జ్ఞానం పొందే ముందు అర్హత పొందటం కష్టం. ఇది పెళ్ళివంటిది. పెళ్ళి రెండు నిముషాల్లో జరిగిపోతుంది. కాని దాని ముందు సంబంధం వెతకటం, జాతకాలు కుదరటం, కట్నకానుకలు మాట్లాడుకోవటం, ఏర్పాట్లు చేయటంలాంటి అనేక దశలున్నాయి. అవి చాలాకాలం పడతాయి.

అలాగే జ్ఞానం ఒక్క వాక్యంతో వస్తుంది. **తత్త్వమసి. నువ్వు దేని గురించైతే వెతుకుతున్నావో అదే నువ్వు.** నీ వెతుకులాట మానేసి, నీ అసలు స్వరూపాన్ని స్వీకరించు. ఇది వేదాంత బోధ. కాని దీన్ని జీర్ణించుకోవటానికి

చాలా సంవత్సరాలు లేదా చాలా జన్మలు పడుతుంది. పూర్వజన్మసుకృతం ఉంటే కాని వేదాంతబోధకు రాలేరు. గీత నేర్చుకుంటున్నారంటేనే, మీకు పూర్వజన్మ సుకృతం ఉందని అర్థం.

**మానుషే లోకే** – చిత్తశుద్ధి పొందాలంటే చాలాకాలం పడుతుంది. అందువల్ల మనుష్యులు అశాశ్వతమైన ఫలాన్నిచ్చే కర్మను కోరుకుంటున్నారు.

శ్లో. 13 **చాతుర్వర్ణ్యం మయా సృష్టం గుణకర్మవిభాగశః ।**
**తస్య కర్తారమపి మాం విద్ధ్యకర్తారమవ్యయమ్ ॥**
చాతుర్వర్ణ్యమ్, మయా, సృష్టమ్, గుణకర్మవిభాగశః,
తస్య, కర్తారమ్, అపి, మామ్, విద్ధి, అకర్తారమ్, అవ్యయమ్ ॥

| | | | |
|---|---|---|---|
| గుణకర్మ | = గుణ, కర్మల | తస్య | = ఆ సృష్టికి |
| విభాగశః | = విభజనను అనుసరించి | కర్తారమ్, అపి | = కర్తను అయినప్పటికిని |
| చాతుర్వర్ణ్యమ్ | = బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్ర రూప (నాలుగు) వర్ణముల సమూహము | అవ్యయమ్ | = శాశ్వతుడ (పరమేశ్వరుడ)నైన |
| | | మామ్ | = నన్ను |
| | | అకర్తారమ్ | = అకర్తనుగా |
| మయా | = నాచేత | విద్ధి | = తెలుసుకొనుము |
| సృష్టమ్ | = సృష్టింపబడినది | | |

**మయా గుణ-కర్మ-విభాగశః చాతుర్వర్ణ్యం సృష్టమ్,**
**తస్య కర్తారమ్ అపి మామ్ అవ్యయమ్ అకర్తారం విద్ధి ।**

తా: బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్ర వర్ణముల వారిని వారి గుణకర్మలననుసరించి వేర్వేరుగా సృష్టించితిని. ఈ సృష్టి కార్యక్రమమునకు నేనే కర్తనైనను, శాశ్వతుడను పరమేశ్వరుడను అయిన నన్ను వాస్తవముగా 'అకర్తను'గా తెలిసికొనుము.

ఇంతవరకూ కృష్ణపరమాత్మ రెండు లక్ష్యాలను గురించి చెప్పాడు – లౌకిక లక్ష్యాలు, ఆధ్యాత్మిక లక్ష్యాలు. దాని తరువాత రెండు రకాల మార్గాల గురించి చెప్పాడు – కర్మమార్గం, జ్ఞానమార్గం. ఆ తరువాత వాటిని పాటించే మనుష్యుల గురించి కూడా చెప్పాడు.

ఇప్పుడు కృష్ణపరమాత్మ వేదాలను భిన్నలక్ష్యాలు అయిన లౌకిక, ఆధ్యాత్మిక లక్ష్యాలను తీర్చుకోవటానికి మాత్రమే కాక ఆ రెండూ తీర్చుకునే జీవనవిధానాన్ని కూడా ఇచ్చానంటున్నాడు. అది చాలా తెలివైన మార్గం. ఎందుకంటే సాధారణంగా ఈ రెండు లక్ష్యాలూ పూర్తిగా భిన్నమైనవి. లౌకిక లక్ష్యాలను తీర్చుకుందామని చూస్తే అది బాహ్యవస్తువులమీద ఆధారపడటం అవుతుంది. కోరికలు తీరిన కొద్దీ, ఇంకా ఇంకా కావాలనిపిస్తుంది. ఇంకా ఇంకా వాటిమీద ఆధారపడటం అవుతుంది. అదే మోక్షం విషయానికి వచ్చేసరికి నామీదే నేను ఆధారపడతాను. ఒకటి ఆధారపడటం, ఇంకొకటి విముక్తి పొందటం. ఒకటి సంపాదించటం, ఇంకొకటి త్యజించటం. ఒకటి బంధం, ఇంకొకటి బంధవిముక్తి.

**దూరమేతే విపరీతే విషూచీ అవిద్యా యా చ విద్యేతి జ్ఞాతా** – కఠ 1.2.4

అలా ఇవి భిన్నంగా ఉన్నా, నేను ఒక ప్రత్యేకమైన జీవనవిధానాన్ని ఏర్పరచాను. దానివల్ల మీరు రెండు లక్ష్యాలనూ పొందవచ్చు అంటున్నాడు కృష్ణపరమాత్మ.

సిగరెట్టు కాల్చే వ్యక్తికి ఎక్కడ చూసినా, ఏ పుస్తకం చదివినా సిగరెట్టు కాల్చటం మంచిది కాదని కనిపిస్తుంది. అవి చదివీ చదివీ మానేశాను అన్నాడుట. ఏం మానేశావు అంటే పుస్తకాలు చదవటం మానేశాను అన్నాడు. ప్రేయోమార్గంమీద కోరిక కూడా అలాగే ఉంటుంది. ధర్మ అర్థకామాలను కోరటం ప్రేయోమార్గమంటారు. ఆ మార్గం మనకు ప్రియమైనది. మోక్షం శ్రేయోమార్గం ఎందుకంటే అది మనకు శ్రేయస్కరమైనది. అందువల్ల వేదం మనకు తెలివిగా షుగర్ కోటెడ్ పిల్ ఇస్తుంది. అది మందే అయినా తీపిగా ఉండటంవల్ల ఇష్టంగా ఎలా తీసుకుంటామో అలా ఈ మార్గాన్ని ఇష్టంగా పాటిస్తాము.

అందువల్ల వేదం కూడా మన కోరికలను తీర్చుకోవటానికి ప్రోత్సాహం ఇస్తుంది. కాని కొన్ని నియమాలను విధిస్తుంది. ఆ నియమాలను పాటిస్తే, దానిలో గొప్పతనం ఏమిటంటే మనకు తెలియకుండానే, మనం బలవంతంగా అణచుకోనవసరం లేకుండానే, ఈ ప్రాపంచిక సుఖాల వెంట పరుగులు తీయటం మానతాము. అంతేకాదు, వాటి బదులు మోక్షమార్గం ఒక్కటే పాటించదగినది అని కూడా తెలుసుకుంటాము.

అలా క్రమేపీ ఆధ్యాత్మికతకు రావటానికి వేదం సూచించిన మార్గం – వర్ణాశ్రమ ధర్మం.

**2. జ్ఞానకర్మసన్యాసయోగం: శ్లోకాలు 13–24:** ఈ 13వ శ్లోకంనుంచి కృష్ణపరమాత్మ అసలు అంశంలోకి అడుగు పెట్టబోతున్నాడు. అది **జ్ఞానకర్మసన్యాసం**. ఇది కృష్ణపరమాత్మ ఎందుకు చెబుతున్నాడో, ఆ సందర్భం ఒకసారి గుర్తుకు తెచ్చుకోవాలి. అర్జునుడు కర్మ చేయటానికి ఇష్టపడటం లేదు. తన ఆత్మీయులను చంపాల్సి వస్తుంది కాబట్టి యుద్ధంనుంచి విరమించు కోవాలనుకున్నాడు. సన్యాసిగా ఉంటాను అన్నాడు. ఇక్కడ కృష్ణపరమాత్మ అర్జునునికి కర్మ గురించి ఉన్న భయాన్ని పారద్రోలాలి.

**న హి కశ్చిత్ క్షణమపి జాతు తిష్ఠత్యకర్మకృత్**

**ఎ) కర్మయోగం** శ్లోకాలు 13–17 వరకు కర్మయోగం గురించి చూస్తాము. ఎవరూ కూడా కర్మ చేయకుండా ఒక్క క్షణం కూడా ఉండలేరు. చేసే కర్మ మారుతుందేమో కాని కర్మ మానలేరు. మీరు ఏ ఆశ్రమధర్మంలో ఉన్నా సరే – బ్రహ్మచారి, గృహస్థు, వానప్రస్థుడు, సన్యాసి – కర్మ తప్పదు. ఏ జాతికి చెందినా సరే – బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్ర – కర్మ తప్పదు. గృహస్థాశ్రమం వదిలేసి సన్యాసాశ్రమం స్వీకరించినా కర్మ తప్పదు. అక్కడ ఆశ్రమనిర్వహణ చేయాల్సి ఉంటుంది. కర్మకు ముగింపు మరణంతోనే. అప్పుడు తక్కినవారందరూ మరింత ఎక్కువ కర్మ చేయాలి – శవానికి దహనసంస్కార ఏర్పాట్లు చేయాలి.

సృష్టిని చూడండి – అత్యంత చిన్న అణువునుంచి, అత్యంత పెద్ద భూమి దాకా అన్నీ నిరంతరం తిరుగుతూనే ఉన్నాయి. వ్యష్టిస్థాయిలో, సమిష్టిస్థాయిలో కర్మ ఉంది. కర్మ తప్పదు, అందువల్ల కర్మను స్వీకరించటం నేర్చుకోవాలి.

కాని వచ్చిన చిక్కేమిటంటే కర్మతో పాటు కొన్ని సైడ్ఎఫెక్ట్స్ వస్తాయి. కర్మ చేయటమంటే ఒక బాధ్యతను చేపట్టటం – ఆ బాధ్యత సక్రమంగా నిర్వర్తించగలనో లేదో అనే ఆందోళన, చేస్తుండగా ఒత్తిడి, చేశాక అనుకున్న ఫలం రాకపోతే నిరాశ. అందువల్ల కర్మ చేసేముందు, చేస్తుండగా, చేశాక కూడా మానసిక ఆందోళన ఉంటుంది. అందువల్ల కర్మ మానేద్దామనుకున్నాడు అర్జునుడు. అది కాదు పరిష్కారం అంటున్నాడు కృష్ణపరమాత్మ. కర్మ చేస్తే సైడ్ ఎఫెక్ట్స్ ఉంటాయి, తప్పదు. కాని వాటికి ఏదో పరిష్కారమార్గం చూడాలి.

ఏమిటా పరిష్కార మార్గం? దానికి మూడవ అధ్యాయంలో ఒక పరిష్కారమార్గం ముందే సూచించాడు. అది **కర్మయోగం** పద్ధతి. ఇప్పుడు ఈ అధ్యాయంలో అసలు పరిష్కారాన్ని సూచించబోతున్నాడు – అది **జ్ఞానయోగం**. జ్ఞానం ఒక్కటే పరిష్కారం. దాని ద్వారా ప్రపంచంలో ఏక్టివ్‌గా ఉండవచ్చు, అయినా కర్మవల్ల, కర్మఫలాలవల్ల బంధింపబడకుండానూ ఉండవచ్చు.

పనసపండును కోయాలంటే దానికి చాకచక్యం కావాలి. చేతికి, కత్తికి కొబ్బరినూనె రాసి పండును కోయాలి. అప్పుడు మనకు ఆ పండు అంటుకోదు. కర్మకు కూడా ఇదే సూత్రం పాటించాలి.

**కర్మణా బధ్యతే జంతుః** – కర్మ మనుష్యులను బంధిస్తుంది. అది తప్పించుకోవాలంటే జ్ఞానం అనే కొబ్బరినూనె రాయాలి. ఇదీ మనం చూడబోయే అంశం – ఎలా జ్ఞానం పొందాలి, జ్ఞానంవల్ల కర్మకూ, కర్మఫలానికీ బందీలు కాకుండా ఎలా ఉండగలమనే వివరణ.

జ్ఞానం ఎంత శక్తివంతమైనదో చూపటానికి కృష్ణపరమాత్మ తననే ఉదాహరణగా చూపుతున్నాడు. ఒకవేళ ఏదైనా గుహలో ఉన్న జ్ఞాని విషయం చెపితే, నేనూ అక్కడికి వెళ్ళి కూర్చుంటా అనే ప్రమాదముంది. కృష్ణపరమాత్మ కూడా తన జీవితంలో ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొన్నాడు. అయినా కర్మ గాని, కర్మఫలం గాని అతనికి అంటలేదు.

**తస్య కర్తారమపి మాం విద్ధి** – నా కర్మలనుంచి నేను తప్పించుకోలేదు. నా కర్మలన్నీ నేను చేశాను.

**అకర్తారమ్ (మాం విద్ధి)** – అంతరంగంలో అకర్తాగా ఉండే తెలివి ఉంది అని తెలుసుకో. అంతరంగంలో అకర్తా అంటే కర్మవల్ల బంధింపబడకుండా ఉండగలగటం. కర్మే కాదు కర్మఫలం కూడా అంటదని తరువాత వచ్చే శ్లోకంలో చెబుతాడు. **అవ్యయమ్ –** అవ్యయమ్ అంటే నిర్వికారం. **నిర్వికారః అహమ్ అస్మి.**

భగవంతుని ధర్మాలు ఏమిటి? భగవంతుడు సృష్టి, స్థితి, లయకారుడు. అంతేకాదు తను సృష్టించిన జగత్తు సమతుల్యంతో ఉండటానికి మనుష్యులకు ఒక జీవనవిధానాన్ని కూడా నిర్దేశించాడు. మనం ఒక వస్తువు కొంటే దానితో ఒక యూజర్ గైడ్ వస్తుంది. అంటే దాన్ని ఎలా వాడాలో వివరించి చెప్పే మాన్యువల్ అది. భగవంతుడు కూడా అలాగే మనని సృష్టించి ఊరుకోలేదు. మనం ఈ జగత్తులో సమతుల్యతను ఎలా పాటించాలో నిర్దేశించే మాన్యువల్‌ను కూడా ఇచ్చాడు. దాన్నే **వేదాలు** అంటారు.

వ్యక్తి ఇష్టాయిష్టాలకు, సమాజం ఇష్టాయిష్టాలకు మధ్య ఘర్షణ రావచ్చు. కాని వేదాలు అలాంటి ఘర్షణకు చోటు లేకుండా, ఒక నిర్దిష్టమైన జీవనవిధానాన్ని నిర్దేశించినాయి. దాన్ని **వర్ణాశ్రమ వ్యవస్థ** అంటారు. వ్యవస్థ అంటే పద్ధతి, జీవనవిధానం. వర్ణమూ, ఆశ్రమమూ కలగలిపిన జీవనవిధానం.దాని గురించి చూద్దాము.

**వర్ణాశ్రమధర్మాలు**

**వర్ణ వ్యవస్థ** అంటే సమాజాన్ని విభజించిన పద్ధతి. దానివల్ల సమాజంలో సమతుల్యత ఏర్పడి, ఆ సమాజం ఎదుగుతుంది. సమాజం అంటే మనచుట్టూ ఉన్న నలుగురు మాత్రమే కాదు; మన ఊరు, మనదేశం, మన ఖండం, విశ్వం అంతా వస్తుంది.

**ఆశ్రమ వ్యవస్థ** అంటే వ్యక్తి జీవితంలో పాటించాల్సిన నాలుగు అవస్థలు. ఇది వ్యక్తి ఎదుగుదలకు తోడ్పడుతుంది. నేను ఎదిగి సంఘానికి హాని చేయకూడదు. అలాగని సంఘానికి మేలు చేసి నా కుటుంబాన్ని నష్టపరచకూడదు. ఇప్పుడు రెండో విషయం జరుగుతున్నది. బాహ్యంగా విజయం సాధించినవారి కుటుంబం చాలా నష్టపోతున్నది. వారి పిల్లలు చాలా అవస్థ పడుతున్నారు. రెండూ మంచి పద్ధతులు కావు. నేను ఎదగాలి, నాతోపాటు సామాజిక ఎదుగుదలకు తోడ్పడాలి.

ఆశ్రమవ్యవస్థ వ్యక్తి ఎదుగుదలకు సహాయపడితే, వర్ణవ్యవస్థ అతని సామాజిక అవసరాలను చూసుకుంటుంది. ఈ వర్ణాశ్రమవ్యవస్థలో కృష్ణపరమాత్మ ఇక్కడ వర్ణవ్యవస్థ గురించి చెబుతున్నాడు కాని ఆశ్రమవ్యవస్థ గురించి చెప్పటం లేదు.

అందువల్ల ఆశ్రమవ్యవస్థ అంటే ఏమిటో సూక్ష్మంగా చూద్దాము. ఆశ్రమవ్యవస్థలో నాలుగు దశలున్నాయి. బ్రహ్మచర్యాశ్రమం, గృహస్థాశ్రమం, వానప్రస్థాశ్రమం, సన్న్యాసాశ్రమం. ఆశ్రమ పదం వాడటంలో ఉద్దేశ్యం, ప్రతి ఒక్క దశలోనూ మనం అంతర్గతంగా, ఆధ్యాత్మికంగా ఎదగాలి. ఆర్థికంగా మాత్రం ఎదిగితే చాలదు.

**బ్రహ్మచర్యాశ్రమం** – ఇది మొదటి దశ. ఇక్కడ విద్య నేర్చుకుంటాడు. ఈ దశలో విద్యార్థి గురుకులవాసిగా ఉంటాడు. గురువు రెండు లక్ష్యాలను బోధిస్తాడు. ప్రాపంచిక సుఖాలైన తిండి, బట్ట, గూడు పొందటానికి సమృద్ధిగా ధనం కావాలి. వేదాలు ప్రాపంచిక సుఖాలు వద్దని చెప్పవు, కాని దానితో పాటు అంతర్గతంగా ఎదగాలని నేర్పిస్తాడు గురువు. అంతర్గతంగా ఎదగటానికి ఆధ్యాత్మిక సాధన అవసరం. మొదటి దశలోనే గురువు ద్వారా రెండు లక్ష్యాల గురించీ నేర్చుకుంటాడు.

**గృహస్థాశ్రమం** – గురుకులంలో నేర్చుకున్న విద్యను ఆచరణలో పెట్టే దశ గృహస్థాశ్రమం. ఎలా ఆచరణలో పెడతాడు? ముందుగా కర్మయోగప్రధానంగా ఉంటుంది. గృహస్థుకు ఎన్నో పొందాలని ఉంటుంది. ఇది కావాలి, అది కావాలి అనుకుంటాడు. వేదాలు అన్నీ సాధించు అంటాయి. చాలామందిలో మన మతం గురించిన ఒక అపోహ ఉంది. హిందూమతం వైరాగ్యం అంటే పరిత్యజించటమే నేర్పిస్తుంది అనుకుంటారు. అది తప్పు. హిందూమతం ఐహికంగా ఎదగటం కూడా నేర్పిస్తుంది.

**ఆవహంతీ వితన్వానా కుర్వాణాఽచీరమాత్మనః। వాసాంసి మమ గావశ్చ।**

**అన్నపానే చ సర్వదా। తతో మే శ్రియమావహ** – తైత్తిరీయమ్

నాకు సమృద్ధిగా ఐశ్వర్యం, వస్త్రాలు, అన్నపానాదులు కావాలి అంటాడు.

**యశో జనేఽసాని స్వాహా। శ్రేయాన్ వస్యసోఽసాని స్వాహా** – తైత్తిరీయమ్

నేను ప్రఖ్యాతి చెందుగాక! ఐశ్వర్యవంతులకన్నా ఐశ్వర్యవంతుణ్ణి అవుగాక! ఇది గృహస్థాశ్రమ జీవనవిధానం. కాని ఏంచేసినా దానితో ఆధ్యాత్మిక చింతనను కలపాలంటుంది శాస్త్రం. భగవన్నామస్మరణతో రోజు ప్రారంభమవ్వాలి. భగవన్నామస్మరణతో రోజు ముగియాలి. అలా కర్మలు చేస్తే అతను చిత్తశుద్ధి పొందుతాడు. ముందు తనకోసం కర్మలు చేసేవాడు, ఇప్పుడు లోకంకోసం చేస్తాడు.

**సర్వే భవంతు సుఖినః సర్వే సంతు నిరామయాః**

సకామకర్మ ప్రధానంగా ఉండే గృహస్థాశ్రమం క్రమేపీ నిష్కామకర్మ ప్రధానంగా మారుతుంది. పంచమహా యజ్ఞాలు చేస్తాడు. పూజలు చేయటం ద్వారా దేవయజ్ఞం; పితృదేవతలకు తర్పణాలు వదలటం ద్వారా పితృయజ్ఞం; వేదాలను బోధించటం ద్వారా బ్రహ్మయజ్ఞం; సమాజసేవ చేయటం ద్వారా మనుష్యయజ్ఞం; పరిసరాలను పరిరక్షించటం ద్వారా భూతయజ్ఞం చేస్తాడు.

**వానప్రస్థాశ్రమం** – ఇంతవరకూ బహిర్ముఖంగా ఉన్న గృహస్థు ఇప్పుడు అంతర్ముఖుడవుతాడు. ఈ ఆశ్రమజీవనంలో **ఉపాసన ప్రధానంగా** ఉంటుంది. ఇంట్లోనే ఉండి అంతర్ముఖుడవవచ్చు లేదా బయటకు వెళ్ళవచ్చు.

**సన్న్యాసాశ్రమం** – ఇంటినుంచి వెళ్ళిపోయి సన్న్యాసం స్వీకరించవచ్చు; లేదా ఇంట్లోనే ఉండి వైరాగ్యం పెంచుకోవచ్చు. కుటుంబ సభ్యుల బాధ్యతలను మానసికంగా ఈశ్వరునికి అర్పిసాడు. ఇది **జ్ఞాన ప్రధానంగా** ఉంటుంది.

అంటే ఒక వ్యక్తి జీవితం కర్మప్రధానంనుంచి ఉపాసనప్రధానంకి మారి తరువాత జ్ఞానప్రధానానికి మారుతుంది. ఎవరైతే ఈ నాలుగు దశలూ దాటుతాడో అతను తను వ్యక్తిగా ఎదగటమే కాకుండా, సమాజ శ్రేయస్సుకు కూడా పాటుపడిన వ్యక్తి అవుతాడు. అందువల్ల ఒక వ్యక్తి నిజంగా ఆ ఆశ్రమాలలోకి వెళ్ళినా, వెళ్ళకపోయినా, మానసికంగా ఈ దశలన్నీ దాటాలి. ఇది ఆశ్రమ వ్యవస్థ.

**వర్ణ వ్యవస్థ** – ఇంకో వ్యవస్థ వర్ణవ్యవస్థ. దీన్నే **చాతుర్వర్ణ్యం మయాసృష్టమ్** అంటున్నాడు కృష్ణపరమాత్మ. నేను ఆశ్రమ వ్యవస్థే కాదు, వర్ణవ్యవస్థను కూడా ఇచ్చానంటున్నాడు. నాలుగు వర్ణాలు ఉన్నాయి. అవి – బ్రాహ్మణవర్ణం, క్షత్రియవర్ణం, వైశ్యవర్ణం, శూద్రవర్ణం.

ఈ విభజన మూడు కోణాల్లో జరిగింది – జాతి, గుణ, కర్మల ఆధారంగా.

**గుణ విభాగం** – ఇది స్వభావాన్నిబట్టి ఏర్పడుతుంది. ప్రతి వ్యక్తిలోనూ ప్రాథమికంగా మూడు గుణాలు ఉంటాయంటుంది శాస్త్రం. వాటిని **సత్త్వరజస్తమో గుణాలు** అంటుంది. ఏ గుణం ప్రధానంగా ఉంటే ఆ గుణాన్నిబట్టి వర్ణవిభజన జరుగుతుంది. ముందు ఆ గుణాల లక్షణాలేమిటో చూద్దాము.

ఈ గుణాల గురించి మళ్ళీ 14వ అధ్యాయంలో చూస్తాము. సత్త్వగుణం బుద్ధి కుశలతను, జ్ఞానాన్ని సూచిస్తుంది. రజోగుణం ఉన్నవారు హుషారుగా పనులు చేస్తారు. ఒక్క క్షణం ఖాళీగా కూర్చోరు. ఉత్సాహం ఉరకలేస్తుంది వారిలో. తమోగుణం ఎక్కువగా ఉన్నవారు మందకొడిగా, నిద్రమత్తుగా ఉంటారు. ఏ పనీ చేయరు. అంతర్గత చలాకీతనం ఉండదు. అంటే బుద్ధీ పదునుగా ఉండదు. బాహ్యంగానూ చలాకీగా ఉండరు.

ధ్యానం చేసేటప్పుడు వారు బాహ్యంగా పని చేయటం లేదు కాని మనస్సు చలాకీగా ఉంటుంది; వారు పరుగులు తీసేటప్పుడు మనస్సు చలాకీగా ఉండదు కానీ శరీరం చలాకీగా ఉంటుంది. అదే నిద్ర పోయేటప్పుడు మనస్సు, శరీరం రెండూ పడుకుంటాయి. తమోగుణం ఉన్నవారు నిద్రపోతున్నట్లు అర్థం.

మొదటిరకం వారిలో సత్త్వగుణం ప్రధానంగా ఉంటుంది. దానికన్నా తక్కువ స్థాయిలో రజోగుణం ఉండి, చాలా తక్కువగా తమోగుణం ఉంటుంది. ఇటువంటి వ్యక్తిని **గుణబ్రాహ్మణుడు** అంటారు. అతను ఏ కులంలో పుట్టినా సత్త్వగుణప్రధానంగా ఉంటే అతను గుణబ్రాహ్మణుడే. అతని గుణాలు ఈ వరుసక్రమంలో ఉంటాయి. సత్త్వరజస్తమోగుణాలు. **సరత** అనవచ్చు. ఇతను అంతర్ముఖుడిగా, తెలివైనవాడుగా ఉంటాడు.

రెండోరకం వారిలో రజోగుణం ప్రధానంగా ఉంటుంది. దానికన్నా తక్కువ స్థాయిలో సత్త్వగుణం, చాలా తక్కువ స్థాయిలో తమోగుణం ఉంటుంది. ఇటువంటి వ్యక్తిని **గుణక్షత్రియుడు** అంటారు. ఇతను చాలా హుషారుగా కర్మలు చేస్తాడు. బహిర్ముఖుడిగా ఉండి సమాజానికి సేవ చేస్తాడు. అతను చేసే కర్మలవల్ల అతను కూడా బాగుపడవచ్చు కాని, సమాజం పొందే లాభమే ఎక్కువ వుంటుంది. అతని గుణాలు ఈ వరుస క్రమంలో ఉంటాయి.రజ సత్త్వ తమో గుణాలు. **రసత** అనవచ్చు.

మూడవరకం వారిలో రజోగుణం ప్రధానంగా ఉంటుంది కాని మధ్యస్థాయిలో తమోగుణం ఉండి, చాలా తక్కువగా సత్త్వగుణం ఉంటుంది. ఇటువంటి వ్యక్తిని **గుణవైశ్యుడు** అంటారు. ఇతను కూడా గుణక్షత్రియునిలాగే చాలా హుషారుగా, పనులు చేస్తాడు కాని వీరిద్దరి మధ్య చిన్న భేదం ఉంటుంది. గుణవైశ్యునిలో సత్త్వగుణం చాలా తక్కువగా ఉంటుంది కాబట్టి అతను చేసే కర్మలు ఎక్కువ స్వార్థపూరితంగా ఉంటాయి. గుణక్షత్రియుడు నిస్వార్థంగా కర్మలు చేస్తే, గుణవైశ్యుడు స్వార్థంతో కర్మలు చేస్తాడు. ఇతని గుణాలు ఈ వరుస క్రమంలో ఉంటాయి. రజ తమో సత్త్వ గుణాలు. **రతస** అనవచ్చు. వీరు ధార్మిక పనులు చేసినా అందులో కూడా స్వార్థం ఉంటుంది. కొంతమంది తీర్థయాత్రలు ఏర్పాటు చేస్తారు. కాని అక్కడ కూడా స్వార్థం చూపించి, తీసుకున్న డబ్బుకు తగ్గ న్యాయం చేయరు. వారు చేసే వసతి, భోజనసదుపాయాలు చాలా దారుణంగా ఉంటాయి.

నాల్గవరకం వారిలో తమోగుణం ప్రధానంగా ఉంటుంది.రజోగుణం కాస్త తక్కువ స్థాయిలో, సత్త్వగుణం చాలా తక్కువ స్థాయిలోనూ ఉంటుంది. ఇటువంటి వ్యక్తిని **గుణశూద్రుడు** అంటారు. రజ, సత్త్వ గుణాలు తక్కువ స్థాయిల్లో ఉంటాయి కాబట్టి మనస్సు హుషారుగా ఉండదు, శరీరం చలాకీగా ఉండదు. మందకొడిగా ఉంటారు. ఇతను ఏదైనా పనంటూ చేస్తే, అది యాంత్రికంగా, ఆలోచనా రహితంగా ఉంటుంది. అతని గుణాలు ఈ వరుస క్రమంలో ఉంటాయి. తమో రజ సత్త్వ గుణాలు. **తరస** అనవచ్చు.

**కర్మ విభాగం** – ఈ విభజన, వారు చేసే వృత్తినిబట్టి ఉంటుంది. బుద్ధికి సంబంధించిన ఉద్యోగాలన్నీ బ్రాహ్మణకర్మ కిందికి వస్తాయి అంటుంది శాస్త్రం. ఉదాహరణకు విద్యాబోధ, రీసెర్చి. అవి బుద్ధికి సంబంధించినవి. అపరావిద్య, పరావిద్య రెండూ వస్తాయి దీని కింద. టీచర్లు, వేద గురువులు, వేదాంత గురువులు, కాలేజీ లెక్చరర్లు అందరూ **కర్మబ్రాహ్మణులు**.

రెండోరకం కర్మ పరిపాలన. యాజమాన్యం వహించటం, చట్టం, ధర్మం, నియంత్రించటం, రక్షణ, పరిపాలన క్షత్రియకర్మలు. క్షత్రియకర్మలను చేసేవారిని **కర్మక్షత్రియులు** అంటారు.

మూడవరకం కర్మ ఆర్థిక వ్యవస్థకు సంబంధించినది. వ్యాపారం, వ్యవసాయం వైశ్యకర్మలు అంటారు. వైశ్వకర్మలను చేసేవారిని **కర్మవైశ్యులు** అంటారు.

నాల్గవరకం కర్మ పై ముగ్గురికీ తోడ్పడే కర్మ. పై మూడు కర్మలకు బుద్ధి అవసరం. వారు అనేక రంగాల్లో పనులు ప్రణాళికలు వేస్తారు. వాటిని అమలులో పెట్టేవారు కావాలి. వీరు తక్కినవారు వేసిన ప్రణాళికలను యాంత్రికంగా అమలు పెడతారు. ఇలాంటి కర్మను శూద్రకర్మ అంటారు. శూద్రకర్మను చేసే వారిని **కర్మశూద్రులు** అంటారు.

ఇక్కడ ఒక విషయం గమనించాలి. కర్మబ్రాహ్మణుడు గుణబ్రాహ్మణుడు కావచ్చు, కాకపోవచ్చు. కర్మబ్రాహ్మణుడు గుణబ్రాహ్మణుడు అయితీరాలని నియమమేమీ లేదు. ఒక వ్యక్తి వేదాలను బోధిస్తూండవచ్చు. కర్మపరంగా అతను కర్మబ్రాహ్మణుడు అవుతాడు. కాని ఆ వేదాలను అమ్మి లాభం చేకూర్చుకోవాలనుకుంటే అతను గుణవైశ్యుడు అవుతాడు. అందువల్ల ఒకే వ్యక్తి కర్మబ్రాహ్మణుడు, గుణబ్రాహ్మణుడు అవవచ్చు, కాకపోవచ్చు.

**జాతి విభాగం** – ఇది పుట్టుకవల్ల ఏర్పడిన విభాగం. సంస్కృతంలో పుట్టుకను జన్మ లేదా జాతి అంటారు. బ్రాహ్మణునికి పుట్టిన వ్యక్తి జాతి బ్రాహ్మణుడు అవుతాడు. జాతి బ్రాహ్మణుడు పరిపాలన వైపు మొగ్గు చూపితే అతను కర్మక్షత్రియుడు అవుతాడు. అందులో లాభం పొందాలని చూస్తే గుణవైశ్యుడు అవుతాడు. అంటే అతను జాతిబ్రాహ్మణుడు, కర్మక్షత్రియుడు, గుణవైశ్యుడు అవుతాడు.

**హెచ్చుతగ్గులు** – ఈ నాలుగు వర్ణాల్లో ఏమైనా హెచ్చుతగ్గులు ఉన్నాయా? జాతిపరంగా హెచ్చు తగ్గులు లేవు. అందరినీ సమానంగా గౌరవించాలి. అలాగే కర్మపరంగా కూడా హెచ్చుతగ్గులు లేవు. అన్ని కర్మలూ అవసరమే. గురువు కావాలి, పరిపాలకుడు కావాలి, వ్యాపారి కావాలి, పనులు చేసిపెట్టేవాడు కావాలి. అందరూ సమానమే అని చెప్పటానికి పురుషసూక్తం ఈ నాలుగు వృత్తులనూ శరీరంలోని నాలుగు అంశాలతో పోలుస్తుంది.

**బ్రాహ్మణోఽస్య ముఖమాసీత్ బాహూరాజన్యః కృతః ఊరూ తదస్య యద్వైశ్యః పద్భ్యాగ్ం శూద్రో అజాయత**

**బ్రాహ్మణోస్య ముఖమ్ ఆసీత్** – ముఖం అంటే వాక్కు, వాక్కు జ్ఞానానికి సంకేతం. సమాజానికి జ్ఞానబోధ చేసేవారు ఎంతో ముఖ్యం.

**బాహూ రాజన్యఃకృతః** – రాజ్యాన్ని పరిరక్షించేవారు కావాలి. చేతులు రక్షణకు సంకేతం.

**ఊరూ తదస్య యద్వైశ్యః** – ఊరువులు సంపదకు సంకేతం. ఊరువులు ఆరోగ్యంగా ఉంటేనే మనిషి తిరగగలిగినట్టు. ఆర్థిక వ్యవస్థ బాగుంటేనే సమాజం బాగుంటుంది.

**పద్భ్యాగ్ంం శూద్రో అజాయత** – పాదాలు పనులకు సంకేతం. పాదాలు మనిషిని తీసుకు వెళ్ళినట్టు, సమాజానికి పనులు కర్మశూద్రులు చేస్తారు.

దీన్నిబట్టి శరీరంలో ప్రతి ఒక్క అంగమూ ఎలా ముఖ్యమో, అలా ప్రతి ఒక్క వర్ణమూ ముఖ్యమేనని తెలుస్తున్నది. పూజారి, సైనికుడు, వ్యాపారుడు, కాయకష్టం చేసేవాడు – అందరూ ముఖ్యమే. అందువల్ల ఎలా జాతిపరంగా హెచ్చుతగ్గులు లేవో, అలాగే కర్మపరంగా కూడా హెచ్చుతగ్గులు లేవు.

గుణపరంగా మాత్రమే హెచ్చుతగ్గులు ఉన్నాయంటుంది శాస్త్రం. ఉన్నతమైన నడవడిక ఉన్న వ్యక్తి ఖచ్చితంగా సంఘం గౌరవించతగ్గ వ్యక్తి. అతన్ని ఆరాధించాలి, పూజించాలి. గుణపరంగా హెచ్చుతగ్గులు ఉంటే, ఎవరు ఎక్కువ? ఎవరు తక్కువ? దీనికి జవాబు చాలా తేలిక. గుణబ్రాహ్మణుడు ఖచ్చితంగా గుణక్షత్రియునికన్నా ఎక్కువ; గుణక్షత్రియుడు ఖచ్చితంగా గుణవైశ్యునికన్నా ఎక్కువ; గుణవైశ్యుడు గుణశూద్రునికన్నా ఎక్కువ. దీన్నిబట్టి అందరికన్నా ఎక్కువ ఎవరు? **గుణబ్రాహ్మణుడు.** అతను పుట్టింది ఏ జాతిలోనైనా, అతని కర్మ ఏదైనా గుణపరంగా అతనిని గౌరవించాలి.

గుణబ్రాహ్మణుణ్ణి ఎందుకు గౌరవించాలి? ఎందుకంటే అతను సాత్త్విక పురుషుడు. అతనిలో ఆత్మజ్ఞానం మెండుగా ఉంటుంది. ఆత్మజ్ఞానం ఉంటే ముక్తపురుషుడు అవుతాడు. అందువల్ల గుణబ్రాహ్మణుడు ఈశ్వరసమీపంలో ఉంటాడు.

గుణక్షత్రియుడు కొంచెం తక్కువస్థాయిలో ఉంటాడు. అతను సమాజానికి నిస్వార్థంగా సేవ చేస్తాడు. నిజమే కాని దానివల్ల అతను మోక్షం పొందలేడు. అతను మోక్షానికి రెండు దశల దూరంలో ఉన్నాడు. అతను నిస్వార్థసేవనుంచి ఆత్మజ్ఞానం పొందటానికి రావాలి. అంటే రజోగుణంనుంచి సత్త్వగుణానికి రావాలి.

గుణవైశ్యుడు మూడు దశల దూరంలో ఉంటాడు. అతను చాలా హుషారుగా ఉంటాడు నిజమే కాని అతని కర్మలన్నీ స్వార్థంతో కూడినవే. అతను స్వార్థపూరితమైన సేవనుంచి నిస్వార్థ సేవ చేసే స్థాయికి ఎదిగి, నిస్వార్థసేవ చేసే స్థాయినుంచి ఆత్మజ్ఞానం పొందే స్థాయికి రావాలి. అంటే రజోగుణంనుంచి సత్త్వగుణంలోకి రావాలి.

గుణశూద్రుడు అట్టడుగు స్థాయిలో ఉంటాడు. అతను నిస్వార్థమైన సేవ కాదు కదా, స్వార్థపూరితమైన సేవ కూడా చేయడు. జ్ఞానం అసలే లేదు. సేవ, జ్ఞానం రెండూ లేకపోవటంతో ఇతను జంతువుకు దగ్గరగా ఉంటాడు. అతను దేవునికి దగ్గరగా రావాలంటే గుణశూద్రుణ్ణుంచి గుణవైశ్యునిగా మారి, గుణవైశ్యుణ్ణుంచి గుణక్షత్రియునిగా మారి, గుణక్షత్రియుణ్ణుంచి గుణబ్రాహ్మణునిగా మారి, అప్పుడు ఈశ్వర ఐక్యం పొందాలి.

అందువల్ల గుణబ్రాహ్మణుణ్ణి గౌరవించాలని మన శాస్త్రాలు ఘోషిస్తున్నాయి. మన పురాణాల్లో కూడా నందనార్ల కథలు ఉన్నాయి. వారు జాతిబ్రాహ్మణులు కాకపోయినా, భగవంతుడు పూజారి కలలో కనిపించి, వారిని గౌరవించమని చెప్పిన కథలు ఉన్నాయి. అలాగే 63 నాయనార్ కథలు ఉన్నాయి మనకు. అందులో చాలామంది జాతిబ్రాహ్మణులు కారు, వారు గుణబ్రాహ్మణులు.

అందువల్ల జాతిపరంగా, కర్మపరంగా హెచ్చుతగ్గులు లేవు కాని, గుణపరంగా హెచ్చుతగ్గులు ఉన్నాయి. గుణబ్రాహ్మణుణ్ణి గౌరవించటమే కాదు, మనమందరం కూడా గుణబ్రాహ్మణులం కావాలంటున్నది శాస్త్రం.

**ఎన్నుకునే స్వేచ్ఛ** – ఇప్పుడు జాతి గుణ కర్మ బ్రాహ్మణులవటంలో ఎక్కడన్నా మనం నిర్ణయం తీసుకునే అవకాశం ఉందా? జాతిపరంగా మనమేమీ చేయలేము. మనం ఏదో ఒక కులంలో పుట్టేశాము. జాతిబ్రాహ్మణులుగానో, జాతిక్షత్రియులుగానో, జాతివైశ్యులుగానో, జాతిశూద్రులుగానో పుట్టేశాము. ఇందులో ఎలాగూ స్థాయిభేదాలు లేవని చూశాము కూడా.

గుణపరంగా మారవచ్చా? మనం ఒకవేళ గుణశూద్రుడు అయితే గుణబ్రాహ్మణుడిగా అవవచ్చా? గుణబ్రాహ్మణుడిగా నిక్షేపంగా అవవచ్చు, నిజానికి అవాలి కూడా అని ఇంతకుముందే చూశాము. అసలు మనకున్న సాధనలన్నీ గుణపరంగా ఈ మార్పులు పొందటానికే. నిజానికి తమోగుణం మన జన్మహక్కు.

**ఆలస్యం హి మనుష్యాణాం శరీరస్థో మహాన్రిపుః**

బద్ధకం మన స్థూలశరీరంయొక్క స్వరూపలక్షణం. ఈ విషయం శాస్త్రమే చెబుతున్నది. ఎందుకు? మన సూక్ష్మశరీరం పంచభూతాలయొక్క సత్త్వరజోగుణాలనుంచి ఏర్పడితే, మన స్థూలశరీరం తమోగుణంనుంచి ఏర్పడింది. తమోగుణంనుంచి ఏర్పడటంవల్లనే ఈ బద్ధకం. కూర్చున్న చోటే పనులు అయిపోవాలనే మనస్తత్వం ఉంటుంది. ఆఖరికి మంచినీళ్ళు కావాలన్నా కూడా ఎవరైనా అటు వెళుతుంటే, నాక్కూడా కాసిని నీళ్ళు తెచ్చిపెట్టు అంటాము. అందువల్ల ఆ తమోగుణాన్ని వదిలించుకోకపోతే మనకూ ఆ జంతువుకూ మధ్య ఏమీ భేదం లేదంటుంది శాస్త్రం.

అందువల్ల మన ఎదుగుదల ఎలా ఉండాలి? తమోప్రధానగుణంనుంచి రజోప్రధానగుణానికి మారాలి. అలా మారటానికే శాస్త్రం అనేక యజ్ఞయాగాదులను నిర్దేశించింది. ఎందుకంటే ఈ యజ్ఞయాగాదులకు చాలా కాయిక శ్రమ ఉంటుంది. పదిసార్లు ఒంగిలేవాలి, సాష్టాంగనమస్కారాలు చేయాలి. అందువల్ల మనస్సు మొరాయించినా, ఈ కార్యక్రమాలన్నీ చేయాలి. తెల్లవారుఝామునే లేచి, గుడికి వెళ్ళి, నమస్కారాలు చెయ్యాలి. అప్పుడు తమోగుణంనుంచి రజోగుణానికి వస్తాము.

తరువాత రజోగుణంనుంచి సత్త్వగుణానికి రావాలి. కొంతమంది ఎంత సూపర్ ఏక్టివ్‌గా ఉంటారంటే వారికి గీతాక్లాసులకు వెళ్ళే తీరిక ఉండదు. అలా క్షణం ఖాళీగా కూర్చోని వారిని వర్కహాలిక్స్ అంటారు. కాని అక్కడితో ఆగిపోకూడదు. సమాజానికి ఇన్నాళ్ళు సేవచేశారు బాగానే ఉంది, ఇప్పుడన్నా కాస్త ఆగి, అంతర్ముఖులు కావాలి. ఆత్మజ్ఞానం పొందాలి. రజోగుణంనుంచి సత్త్వగుణానికి మారటానికి శాస్త్రం ఉపాసనకాండాన్ని నిర్దేశించింది. కర్మకాండ తమోగుణంనుంచి రజోగుణానికి మారటానికి తోడ్పడితే; ఉపాసనాకాండ రజోగుణంనుంచి సత్త్వగుణానికి మారటానికి తోడ్పడుతుంది. దాని తరువాత జ్ఞానకాండ సత్త్వగుణంనుంచి నిర్గుణానికి లేదా గుణాతీతానికి ఎదగటానికి తోడ్పడుతుంది. అందువల్ల మనం గుణబ్రాహ్మణుడు అయ్యి, గుణాతీతంగా ఎదగాలి. అందువల్ల గుణబ్రాహ్మణుడిగా అవటానికి మనకు ఎన్నుకునే అవకాశం ఉంది.

కర్మ విభాగంలో ఎన్నుకునే అవకాశం ఉందా? దానిలో కూడా అవకాశం ఉంది. మనం ఒక వృత్తిని రెండు అంశాలనుబట్టి ఎన్నుకోవచ్చు. జాతినిబట్టి కాని, గుణాన్నిబట్టి కాని ఎన్నుకోవచ్చు. బ్రాహ్మణుని ఇంటిలో పుట్టిన వ్యక్తి బ్రాహ్మణవృత్తిని ఎన్నుకోవచ్చు లేదా గుణాన్నిబట్టి క్షత్రియవృత్తిని ఎన్నుకోవచ్చు.

**జాతిపరంగా ఎన్నిక** – జాతిపరంగా ఎన్నుకుంటే ఒక ప్రయోజనముంది. ఏమిటది? ఏది ఎన్నుకోవాలనే సమస్య ఉండదు. మనకు పెద్ద సమస్య సరియైన నిర్ణయం తీసుకోవటం. అదే ఏ జాతిలో పుడితే, ఆ జాతిపరంగా ఎన్నుకుంటే ఈ సమస్య ఉండదు. అంతేకాదు, చిన్న వయస్సునుంచే దాంట్లో శిక్షణ ఉంటుంది. సంగీతవిద్వాంసుల ఇంట్లో పుట్టిన బాబు, తల్లిగర్భంలో ఉన్నప్పటినుంచే సంగీతం వింటూవుంటాడు. ఏ వృత్తి తీసుకున్నా, క్రీడాకారుని విషయం తీసుకున్నా కూడా చిన్న వయస్సునుంచే సాధన కావాలి. అంతేకాదు ఆహారనియమాలు కూడా తోడవ్వాలి. బ్రాహ్మణుని ఆహారం వేరు, క్షత్రియుని ఆహారం వేరు. బ్రాహ్మణుని సాత్త్విక ఆహారం తింటే అతను సైనికుడు కావటానికి అవసరమైన బలం చాలదు. జాతిపరంగా ఎన్నుకుంటే ఒక సమస్య కూడా ఉంది. జాతిపరంగా ఎన్నుకున్న వృత్తి ఒకవేళ అతనికి ఇష్టం లేకపోతే, అతని పరిస్థితి దారుణంగా ఉంటుంది.

**గుణపరంగా ఎన్నిక** – గుణపరంగా ఎన్నుకున్నా కూడా లాభనష్టాలు ఉంటాయి. ప్రయోజనం ఏమిటంటే, మనకిష్టమైన వృత్తి మనం ఎన్నుకుంటే, ఆ పని చేయటంలో ఆనందం పొందుతాము. మన ప్రారబ్ధకర్మను తిట్టుకోము. కాని దీనివల్ల ఒక నష్టం కూడా ఉంది. చిన్నప్పటినుంచీ శిక్షణ ఉండదు. ఏది ఎన్నుకోవాలో తెలియదు ముందు. మామూలు విషయాల్లోనే తర్జనభర్జనలు పడతాము. హోటల్‌కెళ్ళి దోశ చెప్పాక, పక్కబల్లమీద వ్యక్తి పూరీ తింటుంటే అయ్యో అది చెప్పి ఉండాల్సింది అనుకుంటాము. ఇది మానవనైజం. అందువల్లనే కొంతమంది అనేక ఉద్యోగాలు మారుతుంటారు కూడా.

చాలాకాలం, జాతినిబట్టి కర్మ ఉండేది. కాని గతంలో కూడా కొంతమంది వేరే ఎన్నుకున్న సందర్భాలు లేకపోలేదు. ద్రోణాచార్యుడు జాతిబ్రాహ్మణుడు, కాని క్షత్రియధర్మమైన యుద్ధం చేయటానికి వచ్చాడు. విశ్వామిత్రుడు జాతిక్షత్రియుడు, కాని ధ్యానం, తపస్సు చేశాడు. గుణబ్రాహ్మణుడయ్యాడు.

జాతిపరంగా ఎన్నుకోండి, కర్మపరంగా వృత్తిని ఎన్నుకోండి, కాని ధర్మపరంగా జీవించండి అంటున్నది శాస్త్రం. డబ్బుకోసం ఆ వృత్తిని ఎన్నుకోవద్దంటున్నది. ఆ విధంగా మనకు ఏ జాతిలో పుట్టాలి అనే అంశంలో ఎన్నుకునే అవకాశం లేదు కాని గుణం, కర్మల విషయంలో ఎన్నుకునే అవకాశం ఉంది. ఈ వర్ణవ్యవస్థను వేదాలు విధించాయి; ఆ వేదాలను మానవాళికి భగవంతుడు అందించాడు.

భగవంతునిగా కృష్ణుడు ఇక్కడ వర్ణాలను సృష్టించాను అంటున్నాడు. ఈ నేపథ్యంలో శ్లోకం మళ్ళీ చూద్దాము. **చాతుర్వర్ణ్యం మయా సృష్టం గుణకర్మవిభాగశః** – గుణ, కర్మల ఆధారంగా నేను నాలుగు వర్ణాలను సృష్టించాను. ఇక్కడ కృష్ణపరమాత్మ ప్రత్యేకించి జాతిభేదం గురించి చెప్పలేదు. ఎందుకంటే ఆ కాలంలో జాతినిబట్టి కర్మ ఉండేది. బ్రాహ్మణజాతికి చెందిన బ్రాహ్మణుడు బ్రాహ్మణవృత్తినే స్వీకరించేవాడు. కలియుగంలోనే మూడు విభజనలు జరుగుతున్నాయి. నిజానికి కృష్ణపరమాత్మ చెప్పాలనుకున్న అంశం ఇది కాదు.

కృష్ణపరమాత్మ చెప్పాలనుకున్నది – నేను కూడా కర్మ చేస్తాను కాని నన్ను కర్మ బంధించదు అని. పరమాత్మ సృష్టికర్త, స్థితికర్త, లయకర్త, వేదాలకర్త. వేదాల ద్వారా ధర్మకర్త. అందువల్ల ఎప్పుడూ కర్మ చేస్తూనే ఉంటాడు. కాని దానిలోని అద్భుతం ఏమిటంటే, అంత కర్మ చేసినా అతన్ని ఏ మాత్రం కర్మ బంధించదు.

అర్జునుడు కర్మ బంధిస్తుంది కాబట్టి, కర్మనుంచి పారిపోవాలనుకుంటున్నాడు. అందువల్ల అర్జునా, కర్మనుంచి పారిపోవాలని చూడకు అని చెప్పాలనుకుంటున్నాడు కృష్ణపరమాత్మ. అర్జునుడు పుట్టుకవల్ల జాతిక్షత్రియుడు. అంతేకాదు, అతను గుణపరంగా కూడా క్షత్రియుడే. అర్జునుని వంటివారు అడవిలోకి వెళ్ళినా నాయకుడు కాకుండా ఉండలేడు. అందువల్ల అతను కర్మను వదల్లేదు; వదలనవసరం లేదు కూడా. కర్మ చేసినా కూడా శాంతియుతంగా ఉండవచ్చు.

**తస్య కర్తారమపి** – నేను అనేక కర్మలను చేస్తున్నా కూడా ఒక విషయం అర్థం చేసుకో. ఏమిటది?
**అకర్తారం మాం విద్ధి** – నేను ఆ కర్మలకు బద్ధుణ్ణి కాను అని తెలుసుకో.
**అవ్యయమ్** – నిర్వికారంగా ఉన్నాను. వాటికి అతీతంగా ఉన్నాను.

శ్లో. 14 **న మాం కర్మాణి లింపంతి న మే కర్మఫలే స్పృహా ।**
**ఇతి మాం యోఽభిజానాతి కర్మభిర్న స బధ్యతే ॥**
న, మామ్, కర్మాణి, లింపంతి, న, మే, కర్మఫలే, స్పృహా,
ఇతి, మామ్, యః, అభిజానాతి, కర్మభిః, న, సః, బధ్యతే ॥

| | | | |
|---|---|---|---|
| కర్మఫలే | = కర్మఫలమందు | యః | = ఎవరైతే |
| మే, స్పృహా, న | = నాకు ఆసక్తి లేదని | మామ్ | = నన్ను |
| మామ్ | = నన్ను | అభిజానాతి | = తెలిసికొనునో |
| కర్మాణి | = కర్మలు | సః, కర్మభిః | = అతడు కర్మలచేత |
| న, లింపంతి, ఇతి | = అంటవు అని | న, బధ్యతే | = బంధింపబడడు. |

**కర్మ-ఫలే మే స్పృహా న (అతః) కర్మాణి మాం న లింపంతి ।**
**ఇతి యః మామ్ అభిజానాతి, సః కర్మభిః న బధ్యతే ।**

తా: నాకు కర్మఫలాసక్తి లేదు. కావున కర్మలు నన్నంటవు. ఈ విధముగా నా తత్త్వమును తెలిసినవారు కర్మబద్ధులు కారు.

కర్మ నన్ను బంధించదు అని ముందు చెప్పాడు కృష్ణపరమాత్మ. ఇక్కడ కర్మే కాదు, కర్మఫలం కూడా నన్ను బంధించదు అంటున్నాడు.

**న మాం కర్మాణి లింపంతి** – కర్మలు నన్ను బంధించవు;

భగవంతుడు కర్మసిద్ధాంతం ప్రకారం మీకు ఏది రాసిపెట్టి ఉంటే అది ఇస్తాడు, మీరు ఏది కావాలనుకున్నారో అది మీ రాతలో లేకపోతే ఇవ్వడు.

మీకు ఏది రాసిపెట్టి ఉంటే అది ఇస్తాడు అని అంటే ఇక్కడ ఒక విషయాన్ని జాగ్రత్తగా గమనించాలి. ఒక పనియొక్క ఫలితం గురించిన ప్రణాళిక వేయటం వేరు, దాని గురించి బెంగపడటం వేరు. శాస్త్రం ఎన్నడూ ప్రణాళిక వేయవద్దని చెప్పదు. ఆ మాటకొస్తే ప్రణాళిక వేయకుండా ఏ పనీ చేయలేరు కూడా. ఒక ఊరు వెళ్ళాలంటే దానికి రైలు టికెట్టో, విమానం టికెట్టో కొనాలి. ప్రణాళిక లేకపోతే పని సవ్యంగా అవదు.

వేదాంతం ప్రణాళిక వేయవద్దు అనదు. నిజానికి ప్రణాళిక వేస్తేనే మీరు మరింత సమర్థవంతంగా అవుతారు. ఫలితం గురించి బెంగపడితే సమర్థత తగ్గుతుంది. ప్రణాళిక వేయటం సమర్థతను పెంచితే, బెంగ పడటం సమర్థతను తగ్గిస్తుంది. కాని మీరు ప్రణాళిక వేస్తున్నారో, బెంగ పడుతున్నారో మీకెలా తెలుస్తుంది? చాలామంది బెంగను ప్రణాళికగా పొరపడతారు.

రెండింటికీ మధ్య సూక్ష్మభేదం ఉంది. ప్రణాళిక మీరు కోరి, ప్రయత్నపూర్వకంగా చేసే చర్య. మీరు కోరుకున్న సమయంలో ప్రణాళిక వేసుకోవచ్చు. బెంగ విషయం అలా కాదు. అది మీకు తెలియకుండా యాంత్రికంగా జరుగుతుంది. సాయంకాలం ఆరునుంచి ఏడువరకూ బెంగ పడతాను అని మీరు ప్రత్యేకించి సమయాన్ని కేటాయించలేరు.

అందువల్ల ఒకసారి ప్రణాళిక వేసి, దాన్ని ఆచరణలో పెట్టటానికి నిర్ణయించుకున్నాక, అది జరుగుతుందో లేదోనని బెంగ పడకండి. టికెట్టు కొన్నాక ఇవాళ రైలు వెళుతుందో లేదో అని బెంగ పడకూడదు.

**కర్మణ్యేవాధికారస్తే మా ఫలేషు కదాచన**

అందువల్ల భగవంతుని బోధను మనం సరిగ్గా అర్థం చేసుకోవాలి. బెంగ పడకూడదు, ప్రణాళిక వేయవచ్చు.

**న మే కర్మఫలే స్పృహా** – నాకు కర్మఫలాసక్తి లేదు అంటున్నాడు కృష్ణపరమాత్మ. ఆయన తీసుకున్న ప్రత్యేక మందు ఏమిటి? జ్ఞానం. హోరున వాన కురుస్తుంటే, మీరు వానను ఆపలేరు కాని, రెయిన్‌కోట్ వేసుకుని వెళితే తడవకుండా వెళ్ళగలరు. జ్ఞానం శక్తి; జ్ఞానం రక్షణ; జ్ఞానం అన్ని సమస్యలకూ పరిష్కారం. ఆఖరికి శారీరక సమస్యలను కూడా తొలగిస్తుంది. ఎందుకంటే జ్ఞానం మన మానసిక ఆరోగ్యాన్ని మెరుగు పరుస్తుంది. మన అనారోగ్యానికి సగం కారణం మానసిక దౌర్బల్యమే కాబట్టి, ఎప్పుడైతే మానసిక ఆరోగ్యం మెరుగు పడుతుందో, అప్పుడే శారీరక ఆరోగ్యం కూడా మెరుగు పడుతుంది.

విష్ణుమూర్తి చేతిలో సుదర్శనచక్రం ఉంటుంది. దర్శనం అంటే జ్ఞానం; సుదర్శనం అంటే సరియైన జ్ఞానం. ఈ సుదర్శనచక్రంతో సంసారాన్ని నాశనం చేయవచ్చు. అజ్ఞానంవల్ల ఏర్పడిన సంసారాన్ని; సంసారంవల్ల ఏర్పడిన పుణ్యపాపాలను; పుణ్యపాపాలవల్ల ఏర్పడిన సుఖదుఃఖాలను అన్నిటినీ నాశనం చేయవచ్చు. ఈ సుదర్శనచక్రం కేవలం నాకు చెందిందే కాదు, మీరు కూడా పొందవచ్చు అంటున్నాడు కృష్ణపరమాత్మ.

**మాం ఇతి యః అభిజానాతి** – ఎవరైతే నా ఈ రహస్యం తెలుసుకుంటారో; ఏమిటా రహస్యం? కర్మనుంచి స్వేచ్ఛ కాదు; కర్మ చేస్తున్నా కూడా స్వేచ్ఛ పొందవచ్చు. బాధ్యతనుంచి స్వేచ్ఛ కాదు; బాధ్యత ఉన్నా కూడా స్వేచ్ఛ పొందవచ్చు.

ఏమిటా జ్ఞానం?

జ్ఞానం జ్ఞానం అంటున్నాడే తప్ప అదేమిటో ఇంకా చెప్పలేదు కృష్ణపరమాత్మ. 18 నుంచి 24 వరకూ జ్ఞానం గురించిన వివరణ వస్తుంది. ఎవరైతే ఆ ఆత్మజ్ఞానం పొందుతారో –

**సః కర్మభిర్న బధ్యతే** – వారు కర్మబద్ధులు కారు. ఎలాగైతే భగవంతుడు కర్మకు బందీ కాడో, అలాగే జ్ఞాని కూడా కర్మకు బందీ కాడు.

ఈత కొట్టడం రాని వ్యక్తి స్విమ్మింగ్‌పూల్‌లో మరణించినా మరణించవచ్చు. కాని ఈత వచ్చిన మనిషికి అది క్రీడారంగం అవుతుంది. నీళ్ళలో చాలాసేపు ఆడుకుంటాడు. అలాగే కర్మ స్విమ్మింగ్‌పూల్ వంటిది. దానంతట అది ఆనందాన్నివ్వదు. దానంతట అది ప్రమాదాన్నివ్వదు. దానిలోకి దిగే ముందు అతనికున్న సంసిద్ధతనుబట్టి, నేర్పునుబట్టి ఉంటుంది. జ్ఞానికి కర్మ ఒక క్రీడ; అజ్ఞానికి కర్మ ఒక బంధం. అందువల్లనే భగవంతుడు అవతారం ఎత్తినప్పుడు చేసే కర్మలను **లీల** అంటాము. రాక్షససంహారం కూడా లీలే. జ్ఞానికి కూడా ప్రతి ఒక్క చర్యా **లీలే**. లీల అంటే ఆట.

శ్లో. 15 **ఏవం జ్ఞాత్వా కృతం కర్మ పూర్వైరపి ముముక్షుభిః ।**
**కురు కర్మైవ తస్మాత్ త్వం పూర్వైః పూర్వతరం కృతమ్ ॥**
ఏవమ్, జ్ఞాత్వా, కృతమ్, కర్మ, పూర్వైః, అపి, ముముక్షుభిః,
కురు, కర్మ, ఏవ, తస్మాత్, త్వమ్, పూర్వైః, పూర్వతరమ్, కృతమ్ ॥

| | | | |
|---|---|---|---|
| పూర్వైః | = ప్రాచీనులైన | త్వమ్ | = నీవును |
| ముముక్షుభిః అపి | = ముముక్షువులచేత గూడ | పూర్వైః | = ప్రాచీనులచేత |
| ఏవమ్ | = ఈ విధముగా | పూర్వతరమ్, కృతమ్ | = నిరంతరము చేయబడుచు వచ్చిన |
| జ్ఞాత్వా | = తెలిసికొనబడి | | |
| కర్మ, కృతమ్ | = కర్మలు చేయబడినవి | కర్మ, ఏవ | = కర్మలనే |
| తస్మాత్ | = అందువల్ల | కురు | = చేయుము |

**ఏవం జ్ఞాత్వా పూర్వైః ముముక్షుభిః అపి కర్మ కృతమ్ ।**
**తస్మాత్ త్వం పూర్వైః పూర్వతరం కృతమ్ ఏవ కర్మ కురు ।**

తా: ఓ అర్జునా! ప్రాచీనులైన ముముక్షువులు ఈ విధంగా (నా తత్త్వ రహస్యమును) తెలుసుకొని కర్మల నాచరించిరి. కావున, నీవును ఆ పూర్వులవలెనే నిష్కామభావముతో కర్మల నాచరింపుము.

ఈ జ్ఞానం రహస్యజ్ఞానమే అయినా ఇది పరంపరగా వస్తూనే ఉంది. మీ పూర్వీకులు ఈ జ్ఞానం పొందారని కృష్ణపరమాత్మ చెబుతున్నాడు.

**పూర్వైః ముముక్షుభిః ఏవం జ్ఞాత్వా** – ఓ అర్జునా! ప్రాచీనులైన ముముక్షువులు ఈ విధంగా (నా తత్త్వరహస్యాన్ని) తెలుసుకున్నారు. తెలుసుకుని ఏం చేశారు? కర్మలనుంచి పారిపోలేదు. వారు గృహస్థులుగా ఉండి, రాజ్యభారాన్ని నిర్వహించేవారు.

**కర్మ కృతమ్** – కర్మలు చేసారు కాని, అంతర్గతంగా శాంతిని పొందారు. నీ పూర్వీకులు చేయగా లేనిది, నువ్వు కూడా ఎందుకు కర్మలు చేయకూడదు?

**తస్మాత్ త్వమ్ అపి కర్మ ఏవ కురు** – అందువల్ల నువ్వు కూడా కర్మ చేయి. గృహస్థాశ్రమంలోనే ఉండి కర్మ చేయి. సన్న్యాసాశ్రమం స్వీకరించనవసరం లేదు. సమస్యలొస్తే పారిపోయి సన్న్యాసం స్వీకరించటం గొప్పకాదు; అది పలాయనవాదం అవుతుంది. జ్ఞానంకోసం తపనతో స్వీకరించాలి. అందువల్ల అర్జునుడు కర్మ చేయాలి. ఎటువంటి కర్మ?

**పూర్వైః పూర్వతరం కృతమ్** – నీ పూర్వీకులు ఏ కర్మలు చేశారో, ఆ కర్మలు చేయి. ఇక్కడ కృష్ణపరమాత్మ జాతిపరమైన కర్మను సూచిస్తున్నాడు. పూర్వం కర్మలు జాతిపరంగానే ఉండేవి కాబట్టి అవి సూచిస్తున్నాడు కృష్ణపరమాత్మ.

శ్లో. 16 **కిం కర్మ కిమకర్మేతి కవయోఽప్యత్ర మోహితాః ।**
**తత్తే కర్మ ప్రవక్ష్యామి యద్ జ్ఞాత్వా మోక్ష్యసేఽశుభాత్ ॥**
కిమ్, కర్మ, కిమ్, అకర్మ, ఇతి, కవయః, అపి, అత్ర, మోహితాః,
తత్, తే, కర్మ, ప్రవక్ష్యామి, యత్, జ్ఞాత్వా, మోక్ష్యసే, అశుభాత్ ॥

| | | | |
|---|---|---|---|
| కర్మ, కిమ్ | = కర్మ అంటే ఏమిటి? | యత్, జ్ఞాత్వా | = (కావున) దేనిని తెలిసికొని (నీవు) |
| అకర్మ, కిమ్ | = అకర్మ అంటే ఏమిటి? | అశుభాత్ | = కర్మబంధమునుంచి |
| ఇతి, అత్ర | = (అను) ఈ విషయము నిర్ణయించుటలో | మోక్ష్యసే | = విముక్తి పొందుదువో? |
| | | తత్, కర్మ | = ఆ కర్మతత్త్వమును |
| కవయః, అపి | = బుద్ధిమంతులు | తే | = నీకు |
| మోహితాః | = మోహితులగుచున్నారు | ప్రవక్ష్యామి | = వివరించుచున్నాను |

**'కిం కర్మ, కిమ్ అకర్మ' ఇతి అత్ర కవయః అపి మోహితాః ।**
**తత్ కర్మ తే ప్రవక్ష్యామి, యత్ జ్ఞాత్వా అశుభాత్ మోక్ష్యసే ।**

తా: కర్మ అంటే ఏమిటి? అకర్మ అంటే ఏమిటి? ఈ విషయమును నిర్ణయించుటలో విద్వాంసులు సైతము తికమక పడుచున్నారు. కావున, కర్మతత్త్వమును నీకు చక్కగా వివరించుచున్నాను. దానిని తెలిసికొని నీవు అశుభములనుంచి అంటే కర్మబంధములనుంచి ముక్తుడవయ్యెదవు.

కృష్ణపరమాత్మ అన్ని సమస్యలకూ పరిష్కారం జ్ఞానమేనని చెప్పబోతున్నాడు. ఏ జ్ఞానం? **కర్మ స్వరూపజ్ఞానం.** కర్మ అంటే ఏమిటి, అది ఎక్కడ మొదలవుతుంది, కర్మ ఎవరికి చెందుతుంది. మనం కర్మ మనకు చెందుతుంది

అనుకుంటున్నాము. అందువల్ల కర్మ గురించిన విచారణ అవసరం. మనం దాని విషయం పట్టించుకోవటం లేదు. ఆ మాటకొస్తే చాలా విషయాలను పట్టించుకోము.

కొన్ని శతాబ్దాలు భూమి కదలటం లేదనీ, సూర్యుడు భూమి చుట్టూ తిరుగుతున్నాడనీ అనుకునేవారు. ఒక శాస్త్రజ్ఞుడు వచ్చి భూమే సూర్యుని చుట్టూ తిరుగుతున్నదని చెపితే, ముందు ఎవరూ అతన్ని నమ్మలేదు. చాలా బాధలు పెట్టారు. తరువాత ఎప్పుడో అంగీకరించారు. అలాగే ఆపిల్ పండు కిందపడితే తీసుకు తింటున్నామే కాని, ఎందుకు కిందకే పడుతున్నది, ఎందుకు పైకి వెళ్ళదు అని ఆలోచించలేదు. ఎవరో శాస్త్రజ్ఞునికి మాత్రమే ఆ ఆలోచన వచ్చింది. అలాగే మనం పట్టించుకోకుండా వదిలేసిన అనేక విషయాలలో కర్మ విషయం ఒకటి.

**కర్మ అంటే ఏమిటి? ఎవరు చేస్తున్నారు ఆ కర్మను?** మనమే చేస్తున్నాము అనుకుంటున్నాము మనము. కాని కృష్ణపరమాత్మ ఓ అర్జునా, కర్మను చేసేది నువ్వు కాదు అంటున్నాడు. కాని పైన ఉదహరించిన సందర్భాలలో శాస్త్రజ్ఞుల మాటలను ఎలా జనులు నమ్మలేదో, ఇది కూడా వెంటనే నమ్మలేరు. అనేక సంవత్సరాలు వేదాంతశ్రవణం చేస్తే నమ్మకం కుదురుతుంది. ఓ అర్జునా, కర్మ స్వరూపజ్ఞానం మాత్రమే దీనికి పరిహారం అంటున్నాడు కృష్ణపరమాత్మ.

ఇది తెలుసుకోవటం ఏమీ తేలిక కాదని కూడా చెప్పేశాడు.

**కవయః అపి మోహితః** – కవయః అంటే కవులు కాదు; పండితులు, గొప్ప జ్ఞానం ఉన్నవారు. వారు కూడా సరిగ్గా చెప్పలేక, తికమక పడుతున్నారు. దేని గురించి?

**అత్ర** – ఈ విషయంలో; ఏమిటా విషయం? **కిం కర్మ** – కర్మ అంటే ఏమిటి? **కిమ్ అకర్మ** – అకర్మ అంటే ఏమిటి? **తత్** – తస్మాత్. కర్మ ఇంత జటిలమైన విషయం కాబట్టి; **తే కర్మ ప్రవక్ష్యామి** – నీకు కర్మ స్వరూపం గురించి చెబుతాను. ఈ విషయం ఏదో కేవలం జ్ఞానం పొందటానికి మాత్రమే కాదు, జీవితంలో అన్వయించటానికి కూడా పనికి వస్తుంది. ఏమిటా ఉపయోగం?

**యద్ జ్ఞాత్వా మోక్ష్యసే** – ఈ జ్ఞానం పొందటంవల్ల ముక్తిని పొందుతావు. దేన్నుంచి?

**అశుభాత్** – అన్ని రకాల అశుభాలనుంచి ముక్తి పొందుతావు. అశుభం అంటే అమంగళం; అమంగళం అంటే బెంగ, ఆత్రుత, దుఃఖం, ఒత్తిడి, ఈర్ష్యలాంటి భావోద్రేకాలవల్ల కలిగే బాధ. ఒకే పని ఒకరికి దుఃఖం కలిగిస్తే, ఇంకొకరికి ఆనందం కలిగిస్తుంది.

ఒక మహానుభావుడు, నువ్వు థర్మామీటర్‌లా ఉంటావా, థర్మోస్టాట్‌లా ఉంటావా అన్నాడు. థర్మామీటర్ పరిసరాలనుబట్టి మారుతుంది. థర్మోస్టాట్ పరిసరాలను అదుపులో పెడుతుంది. జ్ఞాని పరిస్థితులను అదుపులో పెడితే, అజ్ఞాని పరిస్థితులకు బానిస అవుతాడు. అందువల్ల ఈ జ్ఞానం పొందితే, పరిస్థితుల ప్రభావానికి లోను కాకుండా, థర్మోస్టాట్‌లా నిలబడ గలుగుతారు. కర్మకు, కర్మఫలాలకు కూడా లొంగరు. సంసారంనుంచి విముక్తి పొందుతారు.

శ్లో. 17 **కర్మణో హ్యపి బోద్ధవ్యం బోద్ధవ్యం చ వికర్మణః ।**
**అకర్మణశ్చ బోద్ధవ్యం గహనా కర్మణో గతిః ॥**
కర్మణః, హి, అపి, బోద్ధవ్యమ్, బోద్ధవ్యమ్, చ, వికర్మణః,
అకర్మణః, చ, బోద్ధవ్యమ్, గహనా, కర్మణః, గతిః ॥

| | | | |
|---|---|---|---|
| కర్మణః అపి | = కర్మయొక్క తత్త్వముగూడ | వికర్మణః, చ | = వికర్మ లక్షణము గూడ |
| బోద్ధవ్యమ్ | = తెలిసికొనదగినది | బోద్ధవ్యమ్ | = తెలుసుకొనదగినది |
| చ, అకర్మణః, అపి | = అలాగే అకర్మయొక్క స్వరూపము గూడ | హి | = ఎందుకంటే |
| | | కర్మణః, గతి | = కర్మయొక్క గతి (తత్త్వము) |
| బోద్ధవ్యమ్ | = తెలుసుకొనదగినది | గహనా | = అతి నిగూఢమైనది |

**కర్మణః (తత్త్వమ్) హి అపి బోద్ధవ్యమ్। వికర్మణః చ (తత్త్వమ్) బోద్ధవ్యమ్।**
**(తథా) అకర్మణః చ (తత్త్వమ్) బోద్ధవ్యమ్। కర్మణః గతిః గహనా ॥**

తా: కర్మతత్త్వము తెలుసుకోవాలి, అలాగే అకర్మస్వరూపము కూడ తెలుసుకోవాలి. వికర్మ లక్షణములను కూడా తెలిసికొనుట చాలా అవసరము. ఎందుకంటే, కర్మతత్త్వము అతి నిగూఢమైనది.

కర్మ గురించే కాదు, కర్మకు చెందిన మరో రెండు అంశాల గురించి కూడా చెబుతాను అంటున్నాడు కృష్ణపరమాత్మ. అంటే మొత్తం మూడు విషయాలు చెబుతాడు –

**కర్మణో హ్యపి బోద్ధవ్యం** – కర్మ తత్త్వం గురించి తెలుసుకోవాలి.

**వికర్మణః చ బోద్ధవ్యం** – వికర్మ అంటే విపరీతకర్మ లేదా నిషిద్ధకర్మ. నిషిద్ధకర్మ గురించి కూడా తెలుసుకోవాలి.

**అకర్మణశ్చ బోద్ధవ్యం** – అకర్మస్వరూపం గురించి కూడా తెలుసుకోవాలి. అకర్మ అంటే కర్మ చేయకపోవటం.

అందువల్ల కర్మ, వికర్మ, అకర్మల గురించి తెలుసుకోవాలి. ఎందుకు తెలుసుకోవాలి? జ్ఞానం దానంతట అది రాదు. జ్ఞానం పొందటానికి కృషి చేయాలి.

**కర్మణః గతిః గహనా** – గహనా అంటే సూక్ష్మమైనది. గతి అంటే స్వరూపం. గతికి అనేక అర్థాలున్నాయి కాని ఇక్కడ ఈ సందర్భంలో గతి అంటే స్వరూపం. అందువల్ల కర్మణః గతిః గహనా అంటే కర్మయొక్క స్వరూపం అతి సూక్ష్మమైనది. అంటే గురుశాస్త్ర ఉపదేశం లేకుండా ఎన్నటికీ అర్థం చేసుకోలేనిది.

ఇంతవరకూ జ్ఞానానికి ఉపోద్ఘాతం ఇచ్చాడు కృష్ణపరమాత్మ. ఇప్పుడు అసలు విషయంలోకి అడుగుపెట్టబోతున్నాడు. ఏమిటా జ్ఞానం? తరువాత వచ్చే శ్లోకంలో చూస్తాము.

శ్లో. 18 **కర్మణ్యకర్మ యః పశ్యేత్ అకర్మణి చ కర్మ యః ।**
**స బుద్ధిమాన్ మనుష్యేషు స యుక్తః కృత్స్నకర్మకృత్ ॥**
కర్మణి, అకర్మ, యః, పశ్యేత్, అకర్మణి, చ, కర్మ, యః,
సః, బుద్ధిమాన్, మనుష్యేషు, సః, యుక్తః, కృత్స్నకర్మకృత్ ॥

| | | | |
|---|---|---|---|
| యః | = ఎవరయితే | సః | = అతడు |
| కర్మణి | = కర్మయందు | మనుష్యేషు | = మనుష్యులలో |
| అకర్మ, పశ్యేత్ | = అకర్మను దర్శించునో | బుద్ధిమాన్ | = బుద్ధిశాలి |
| యః, చ | = ఎవరైతే | సః, యుక్తః | = అటువంటి యోగి |
| అకర్మణి | = అకర్మయందు | కృత్స్న కర్మకృత్ | = సమస్త కర్మలను చేయువాడు |
| కర్మ | = కర్మను (దర్శించునో) | | |

**యః కర్మణి అకర్మ పశ్యేత్ అకర్మణి చ యః కర్మ (పశ్యేత్) సః**
**మనుష్యేషు బుద్ధిమాన్, సః యుక్తః, (సః) కృత్స్న-కర్మ-కృత్ ।**

తా: కర్మయందు 'అకర్మ'ను, అకర్మయందు 'కర్మ'ను దర్శించువాడు మానవులలో బుద్ధిశాలి. అతడు యోగి ఇంకా సమస్త కర్మలు చేయువాడు.

**బి). జ్ఞానయోగం** - శ్లోకాలు18-24 ఈ శ్లోకాల్లో మనిషి సమస్యలన్నిటికీ జ్ఞానాన్ని పరిష్కారంగా చూపించబోతున్నాడు కృష్ణపరమాత్మ. ఈ నాల్గవ అధ్యాయానికి ఈ భాగం చాలా ముఖ్యమైన భాగం. ఈ అధ్యాయానికే కాదు, మొత్తం గీతకే ముఖ్యమైన భాగం. ఎక్కడెక్కడ జ్ఞానబోధ ఉందో, అదంతా ముఖ్యమే. ఎందుకంటే అది ఉపనిషత్తుల సారం. అందువల్లనే ప్రతి అధ్యాయం చివర **ఇతి శ్రీ మద్భగవద్గీతాసూపనిషత్సు** అంటారు. ఈ జ్ఞానకాండ గురించి ఉండటంవల్లనే గీతను ఉపనిషత్తు అంటారు.

ఉపనిషత్తుల సారం కర్మయోగం కాదు, భక్తియోగం కాదు, అష్టాంగయోగం కాదు, జ్ఞానయోగం. ఈ జ్ఞానాన్నే భగవద్గీతలో కొన్నిచోట్ల చూస్తాము. రెండవ అధ్యాయంలో 12-25 వరకూ చూశాము. ఇప్పుడు కూడా 18-24 వరకూ చూస్తాము. చాలా ముఖ్యమైన భాగాలు ఇవి.

**గ్రంథ గ్రంథి శ్లోకం-** ఈ 18వ శ్లోకం ఇంకా ముఖ్యమైనది. అది ముఖ్యమైనదే కాక చాలా క్లిష్టమైనది కూడా. దాన్ని అర్థం చేసుకోవటం చాలా కష్టం. కృష్ణపరమాత్మ వ్యతిరేక పదాలు వేస్తున్నాడు, మన మెదడుకు మేతనివ్వటానికి. అలాంటివి లేకపోతే గీతాధ్యయనం లోతుగా సాగదు. ఈ శ్లోకంలోని వాక్యాల అర్థం అక్షరాలా తీసుకుంటే - **బుద్ధిశాలి కర్మలో అకర్మను, అకర్మలో కర్మను చూస్తాడు అని వస్తుంది**. ఉన్నదున్నట్టుగా చూస్తే బుద్ధిశాలి అవుతాడు కాని, ఉన్నదాన్ని వేరే విధంగా చూస్తే బుద్ధిశాలి ఎలా అవుతాడు? ఒక పుస్తకాన్ని పుస్తకంగా చూస్తే, నేను బుద్ధిశాలిని కాని; పుస్తకాన్ని మైకుగా చూస్తే ఎలా అవుతాను? అలాగే కర్మను కర్మగా, అకర్మను అకర్మగా చూస్తే అర్థం ఉంది కాని కర్మను అకర్మగా, అకర్మను కర్మగా ఎలా చూడాలి? అందువల్లనే భాష్యకారులైన శంకరాచార్యులు ఇలాంటి సందర్భాలలో చాలా విపులంగా విశ్లేషిస్తారు. వారి పుణ్యమా అని మనం బాగా అర్థం చేసుకోగలుగుతున్నాము. ఇటువంటి శ్లోకాలను **గ్రంథ గ్రంథి శ్లోకాలు** అంటారు. అంటే గ్రంథంలో వచ్చే చిక్కుముడి శ్లోకాలన్నమాట. ఇటువంటి సందర్భం రెండవ అధ్యాయంలో వచ్చినప్పుడు దాని కారణం చూశాము.

వ్యాసాచార్యులు మహాభారత రచన చేసినప్పుడు మహాగణపతిని లేఖకునిగా ఉండమని కోరారు. మహాగణపతి అందుకు అంగీకరించాడు కాని ఒక షరతు విధించాడు. నేను చాలా త్వరగా రాస్తాను, మధ్యలో ఆగాల్సి వస్తే మాత్రం ఇంక రాయను అన్నాడు. వ్యాసాచార్యులు దేన్నో చూసి చెప్పటం కాదు; ఆయన మేధస్సులోంచి చెప్పాలి. అందువల్ల ఆయన కూడా ఒక షరతు విధించారు. సరే అలాగే త్వరగా చెప్తాను కాని నువ్వు రాసిన ప్రతిదాన్నీ అర్థం చేసుకుని రాయాలన్నారు. అలా ఆయన ఆగి ఆలోచించాల్సిన సందర్భం వచ్చినప్పుడు ఒక చిక్కుముడి శ్లోకాన్ని వదిలే వారన్నమాట. గణపతి ఆగి దాన్ని అర్థం చేసుకోవటానికి ప్రయత్నించేలోపు వ్యాసాచార్యులు ఇంకో వంద శ్లోకాలతో సిద్ధంగా ఉండేవారు. గీత మహాభారతంలో భాగం కాబట్టి, గీతలో కూడా  నాలుగు గ్రంథ గ్రంథి శ్లోకాలు ఉన్నాయి.

**నాసతో విద్యతే భావో నాభావో విద్యతే సతః ।**
**ఉభయోరపి దృష్టోఽన్తః త్వనయోస్తత్త్వదర్శిభిః ॥** – 2.16
**యా నిశా సర్వభూతానాం తస్యాం జాగర్తి సంయమీ ।**
**యస్యాం జాగ్రతి భూతాని సా నిశా పశ్యతో మునేః ॥** – 2.69
**కర్మణ్యకర్మ యః పశ్యేత్ అకర్మణి చ కర్మ యః ।**
**స బుద్ధిమాన్ మనుష్యేషు స యుక్తః కృత్స్నకర్మకృత్ ॥** – 4.18
**న చ మత్స్థాని భూతాని పశ్య మే యోగమైశ్వరమ్ ।**
**భూతభృన్న చ భూతస్థో మమాత్మా భూతభావనః ॥** – 9.5

ఇప్పుడు మనం చూస్తున్నది వీటిలో మూడవశ్లోకం. చూడటానికి వ్యతిరేక పదాలున్నట్టు ఉన్నాయి. వేదాంత ప్రాథమిక బోధ అర్థమయితే ఈ తికమక ఉండదు.

**వేదాంత ప్రాథమిక బోధ** – ప్రతి వ్యక్తిలోనూ రెండు భాగాలుంటాయి. అవి – ఆత్మ, అనాత్మ. మనశ్శరీరాలను కార్యకరణసంఘాతం అంటారని చూశాము. ఈ కార్యకరణసంఘాతాన్ని అనాత్మ అనీ, దీనికి భిన్నంగా ఉండి, దేహం అంతటా వ్యాపించి, దేహానికి చైతన్యాన్ని ఇచ్చే దాన్ని ఆత్మ అనీ అంటారు. ఉదాహరణకు ఒక బల్బు తీసుకుంటే, బల్బులో రెండు అంశాలున్నాయి. అవి బల్బు, ఫిలమెంటు. ఈ రెండింటి వెనక కనపడని విద్యుచ్ఛక్తి ఉంది. అది ఫిలమెంటు పోయినా కూడా ఉంటుంది. బల్బు ఫ్యూజ్ అయినప్పుడు, విద్యుచ్ఛక్తి  పోదు. బల్బుకు బల్బు శక్తి విద్యుచ్ఛక్తివల్లనే వచ్చింది. బల్బులు అనేకం, విద్యుచ్ఛక్తి ఏకం. ఇప్పుడు ఇదే సూత్రాన్ని మన ఆత్మ, అనాత్మలకు వర్తింపజేద్దాము.

బల్బు స్థూలశరీరం, ఫిలమెంటు సూక్ష్మశరీరం. ఈ రెండూ కలిపి అనాత్మ. ఈ బల్బుని కనపడని విద్యుచ్ఛక్తి ప్రకాశింప జేసినట్టుగా, కనబడని చైతన్యం ఈ అనాత్మకు  చేతనతత్త్వాన్ని ఇస్తున్నది. ఎలాగైతే బల్బులు అనేకం, విద్యుచ్ఛక్తి ఏకమో – అలాగే అనాత్మలు అనేకం, ఆత్మ ఏకం. పోలిక ఎంతవరకూ తీసుకోవాలో అంతవరకే తీసుకోవాలి. కరెంటు పోయినట్టుగా చైతన్యం కూడా పోతుందనకూడదు.

మనశ్శరీరాలను దేహమనీ, చైతన్యాన్ని దేహీ అనీ అంటారు. మనశ్శరీరాలను అనాత్మ అనీ, చైతన్యాన్ని ఆత్మ అనీ అంటారు. అనాత్మను అహంకారం అని కూడా అంటారు. ఈ విషయాలన్నీ రెండవ అధ్యాయంలో చూశాము. అక్కడ ఆత్మ–అనాత్మల మధ్య కొన్ని భేదాలను కూడా చూశాము. అనాత్మ అనిత్యం, అనేకం, సగుణం, సవికారం, కర్తాభోక్తా అయితే ఆత్మ నిత్యం, ఏకం, నిర్గుణం, నిర్వికారం, అకర్తా అభోక్తా అని చూశాము. ఈ భేదాలు చూస్తున్నప్పుడు ఒక భేదాన్ని ప్రత్యేకంగా చూశాము. ఇక్కడ కూడా అదే చూస్తాము. ఏమిటది?

ఆత్మ, ఆకాశంలాగా సర్వవ్యాపకం కాబట్టి కర్మ చేయలేదు. ఏదైనా కాయికకర్మ చేయాలంటే కాయిక కదలిక ఉండాలి. దాన్ని చలనాత్మకం కర్మ అంటారు. కదలలేనిది కర్మ చేయలేదు. అందువల్ల ఆకాశం అకర్త.

కృష్ణపరమాత్మ ఇక్కడ ప్రత్యేకించి చెప్పాలనుకున్న అంశం – **ఆత్మ అకర్త**. ఆత్మ కర్మను త్యజించనవసరం లేదు. ఆత్మ కర్మే చేయనప్పుడు, త్యజించే ప్రసక్తి ఎక్కడ వస్తుంది? నాకు పది ఎకరాల భూమి ఉంటే, దాన్ని నేను త్యజించగలను. నాకసలు భూమే లేకపోతే దేన్ని త్యజిస్తాను? అందువల్ల **ఆత్మ ఎప్పటికీ అకర్త. ఇది మొదటిపాఠం.**

**అనాత్మ ఎప్పటికీ కర్త. ఇది రెండవ పాఠం.** మనశ్శరీరాలను అహంకారం అని కూడా అంటారని చూశాము కదా! అహంకారం పరిమితి ఉన్నది. పంచభూతాలతో చేయబడిన వస్తువు. వస్తువు నిరంతరం కదులుతూనే ఉంటుంది. గోడ చూడటానికి స్థిరంగా ఉన్నా కూడా, విజ్ఞాన శాస్త్రపరంగా అది అనేక న్యూట్రాన్లు, ప్రోటాన్లు, ఎలక్ట్రాన్ల సముదాయం. ఎలక్ట్రాన్లు ఎప్పుడూ కదులుతూనే ఉంటాయి. అందువల్ల బాహ్యంగా కదలిక తెలియకపోయినా, సూక్ష్మంగా కదలిక ఉంటూనే ఉంటుంది.

ఒక పాశ్చాత్య శాస్త్రజ్ఞుడు నటరాజ విగ్రహాన్ని విశ్లేషిస్తూ నటరాజు ఎప్పుడూ నృత్య భంగిమలోనే ఉంటాడు అన్నాడు. ఎలా చెప్పాడు? నటరాజు జటాఝూటాలు ఎప్పుడూ భూమికి సరళరేఖలోనే ఉంటాయి. నటరాజు నృత్యం చేస్తుంటేనే అలా జటాఝూటాలు లేవటానికి ఆస్కారం ఉంటుంది. నటరాజు విశ్వరూప ఈశ్వరుడు. విశ్వమంతా కదులుతూనే ఉంటుందని చెప్పటానికి ఇది సంకేతం. అత్యంత చిన్నవైన ఎలక్ట్రాన్లు కదులుతూనే ఉంటాయి, అత్యంత పెద్దదైన భూమి ప్రదక్షిణం చేస్తూనే ఉంటుంది.

అందువల్ల అనాత్మస్థాయిలో కదలిక ఎన్నడూ ఆగదు. అది నిరంతరం కొనసాగుతూనే ఉంటుంది. అనాత్మ కదలనట్టు కనిపించినా, అవ్యక్తరూపంలో కదలిక ఉంటూనే ఉంటుంది. అందువల్ల **అనాత్మ ఎప్పటికీ కర్త**.

కృష్ణపరమాత్మ చెప్పదలుచుకున్న అంశం ఏమిటి? అనాత్మస్థాయిలో కర్మను త్యజించలేము; ఆత్మస్థాయిలో కర్మను త్యజించనవసరం లేదు. తెలివైన వ్యక్తి ఏం చేయాలి? అనాత్మస్థాయిలో కర్మను స్వీకరించాలి. కర్మ నుంచి పారిపోకూడదు. ఆత్మస్థాయిలో నేను అకర్తను, నేను ఆనందస్వరూపుడను అని అర్థం చేసుకోవాలి. **ఆత్మస్థాయిలో నేను అకర్తను, అనాత్మస్థాయిలో నేను కర్తను** అని తెలుసుకోవటమే జ్ఞానం.

ఈ అధ్యాయం పేరు జ్ఞానకర్మసన్న్యాసయోగం. అంటే జ్ఞానాన్ని, కర్మను సన్న్యసించమని కాదు అర్థం. **జ్ఞానంతో కర్మను సన్న్యసించమని అర్థం.** ఆత్మగా నేను అకర్తను అని అర్థం చేసుకోవటం. ఈ నేపథ్యంతో ఈ శ్లోకాన్ని చూద్దాము.

**కర్మణ్యకర్మ యః పశ్యేత్** – తెలివైన వ్యక్తి ఆత్మ అకర్త అని తెలుసుకుంటాడు. ఆత్మ శాంతిస్వరూపం అని తెలుసుకుంటాడు. అనాత్మ స్థాయిలో కర్మలు చేస్తున్నా కూడా, కర్మలు ఆపటంవల్ల శాంతి పొందను, కర్మలు చేస్తూ కూడా శాంతి పొందుతాను అని అర్థం చేసుకుంటాడు. చాలామంది బాధ్యతలన్నీ తీరాక లేదా పదవీవిరమణ చేశాక క్రమం తప్పకుండా గీతా క్లాసులకు వెళదామనుకుంటారు. కాని పదవీ విరమణ అయ్యాక అంతకుముందు వెళ్ళే ఒక్క క్లాసుకు కూడా వెళ్ళలేరు. అందువల్ల అలలు ఆగాక స్నానం చేద్దామనుకోవటం ఎంత అర్థం లేని మాటో, బాధ్యతలు తీరాక ఖాళీ దొరుకుతుందనుకోవటం కూడా అంత అర్థం లేని మాటే! కర్మలు ముగిశాక తీరిక దొరుకుతుందనుకోకండి; కర్మల మధ్యలోనే తీరికను వెతుక్కోండి.

అంతర్గత అకర్మ అంటే ఆత్మస్థాయిలో అకర్తగా ఉండటం, బాహ్యకర్మ అంటే అనాత్మస్థాయిలో కర్తగా ఉండటం. అందువల్ల కర్మణి అంటే అనాత్మ; అకర్మణి అంటే ఆత్మ.

**యః పశ్యేత్** – ఇప్పుడు అర్థం స్పష్టంగా వస్తుంది. అనాత్మ చేసే కర్మల మధ్య కర్మ చేయని ఆత్మను చూడాలి. చేయి–కాంతి ఉదాహరణ గుర్తు తెచ్చుకోండి. కదిలే చేతి వెనక కదలని కాంతి ఉంది. కాంతివల్లనే చేయి తెలుస్తున్నది, కాని చేయి కదిలినా కాంతి కదలటం లేదు. అలాగే మనస్సు, శరీరం నిరంతరం పనిచేస్తున్నా కూడా వాటి వెనకనుంచి వాటికి చైతన్యాన్ని ఇస్తున్న ఆత్మ కదలదు.

సినిమాలో తెరమీద పాత్రలు తీవ్రంగా కదులుతారు కాని తెర కదలదు. తెర కూడా కదిలితే, సినిమాను చూడలేము. అందువల్ల కదలని తెరమీద దృష్టి పెట్టి, కదిలే సినిమాను ఆనందించండి. అలాగే **కదలని ఆత్మమీద దృష్టి పెట్టి కదిలే అనాత్మను ఆనందించండి. ఇది మొదటి భాగం**. రెండవ భాగం ఏమిటి?

**అకర్మణి చ కర్మ యః (పశ్యేత్)** – బుద్ధిశాలి అకర్మలో కర్మను చూస్తాడు. అదెలా సాధ్యం? శరీరం, మనస్సులు విశ్రాంతి చెందుతున్నట్టు కనిపించినా కూడా, నిజంగా విశ్రాంతి తీసుకున్నట్టు కాదు. నిద్రలో కర్మలు లేవనలేము. అవి అవ్యక్తంగా ఉన్నాయి. కర్మ అంటే కనపడే కర్మ; అకర్మణి అంటే అవ్యక్తంగా ఉన్న కర్మ. తెలివైన వ్యక్తి కనపడని అంటే అవ్యక్తంగా ఉన్న కర్మను కదలకుండా ఉన్నట్టు కనబడుతున్న మనస్సు, శరీరాల్లో చూస్తాడు. అనాత్మ ఎప్పటికీ కర్తే, ఆత్మ ఎప్పటికీ అకర్తే. ఈ విషయం బుద్ధిశాలి తెలుసుకోవాలి.

అభిమన్యునికి పద్మవ్యూహంలోకి వెళ్ళటం తెలుసు కాని, బయటకు రావటం తెలియదు. మన పరిస్థితీ అంతే. మనకు కర్మల్లోకి వెళ్ళటం తెలుసు కాని, వాటినుంచి బయటపడటం తెలియదు. అంతకుముందు చూసినట్టుగా అది పులితోక పట్టుకుని తిరిగినట్టు ఉంటుంది. ఆ తోకను పట్టుకున్నా, వదిలినా ప్రమాదమే. పట్టుకుంటే గిర్రున తిరుగుతూనే ఉండాలి. వదిలితే అది మనను తినేస్తుంది. అలా మనం అనేక కర్మల్లో కూరుకుపోయాము. ఆ కర్మలను ఆనందిస్తుంటే సమస్య లేదు; వాటిలో కూరుకుపోయామంటేనే సమస్య. వాటినుంచి శాంతి పొందాలనుకుంటాము. ఎప్పటికీ శాంతినిచ్చేది ఒక్కటే ఉంది; అది నా ఆత్మ స్వరూపం. నా శాంత స్వరూపంనుంచి అంతర్గతశక్తి పొందటం తెలుసుకుంటే, కర్మను చేస్తూ కూడా ఆనందం పొందగలను.

**మనోబుద్ధ్యహంకార చిత్తాని నాహం న చ శ్రోత్రజిహ్వే న చ ఘ్రాణనేత్రే**
**న చ వ్యోమభూమిః న తేజో న వాయుః చిదానందరూపః శివోఽహం శివోఽహమ్**

నేను చిదానందరూపాన్ని. మనోబుద్ధి అహంకారాలు కాదు. ఈ ఆనందాన్ని మనం ప్రతిరోజూ అనుభవించేలా చేస్తున్నాడు భగవంతుడు. ఎప్పుడు? సుషుప్తిలో! సుషుప్తిలో మన శరీరం పడుకుంటుంది; మనస్సు పడుకుంటుంది; ఇంద్రియాలు పడుకుంటాయి; మనం కర్త కాదు; మనం భోక్త కాదు. మన స్వస్వరూపంలో లయమవుతాము. ఏమిటా స్వస్వరూపం? ఆనందస్వరూపం. సుషుప్తిలో నిర్విషయ ఆత్మానందాన్ని అనుభవిస్తాము. కాకపోతే సుషుప్తినుంచి లేచిన మరుక్షణం, మళ్ళీ మన సమస్యలు వెనక్కి వస్తాయి.

కాని జ్ఞానికి అలాకాదు. అతనికి ఆత్మానందం ఎల్లప్పుడూ ఉంటుంది.

**స బుద్ధిమాన్ మనుష్యేషు** – అటువంటి వ్యక్తి మనుష్యులందరిలోకి బుద్ధిశాలి.
**స యుక్తః** – అతనే అసలైన యోగి. **కృత్స్నకర్మకృత్** – అతను పరిపూర్ణుడు.

ఆత్మ అనాత్మలను అహం, అహంకారం అని కూడా అంటారు. మనస్సు అహంకారం. అది పాంచభౌతికం కాబట్టి స్వతహాగా జడం. కాని మనస్సుకు చైతన్యాన్ని ప్రతిబింబింపజేసే శక్తి ఉంది. చిత్‌యొక్క ప్రతిబింబాన్ని చిదాభాస అంటారు. చిదాభాస సహిత మనస్సును అహంకారం అంటారు. ఈ అహంకారమే కర్తా, భోక్తా. అహంకార లక్షణం కర్మ చేయటం. అది క్షణం కూడా ఖాళీగా కూర్చోలేదు. కర్మ చేస్తే కర్మఫలాన్ని అనుభవించక తప్పదు. కర్మఫలాలు పుణ్య పాపరూపంలో వస్తాయి. ఈ పుణ్యపాపాలన్నీ ఈ జన్మలోనే క్షయమవవు. అందువల్ల క్షయమవని పుణ్యపాపాలు వచ్చే జన్మకు తీసుకు వెళ్ళబడతాయి.

ఒకవ్యక్తి మరణించినప్పుడు చిదాభాసతో కూడిన మనస్సు అంటే అహంకారం అతని శరీరాన్ని విడిచి ప్రయాణం చేస్తుంది. అహం లేదా ఆత్మకు ప్రయాణం లేదు. అది సర్వవ్యాపకం కాబట్టి. కాకపోతే ప్రతిబింబించే మాధ్యమం అయిన మనస్సు లేదు కాబట్టి ఆత్మ ఉన్నట్టు తెలియదు. ఎలాగైతే బల్బులో ఫిలమెంటు మాడితే విద్యుచ్ఛక్తి ఉన్నట్టు తెలియదో, అలా మరణించిన వ్యక్తిలో ఆత్మ ఉన్నా కూడా, అహంకారం లేదు కాబట్టి తెలియదు. ఈ అహంకారమే ఇంకొక శరీరాన్ని తీసుకుని, ఈ పుణ్యపాపాలను క్షయం చెయ్యటానికి ప్రయత్నిస్తుంది. కాని ఆ తతంగంలో మరికొన్ని కొత్త పుణ్యపాపాలు వచ్చి చేరతాయి. అందువల్ల అహంకారాన్ని ఆపలేము. అహంకారం నేను కాదు, నేను అహం అని తెలుసుకుని ఉన్నతస్థాయికి ఎదగాలి.

ఎప్పుడైతే అహంకారాన్ని పట్టుకు పాకులాడటం మానతామో, అప్పుడు దాని శక్తి తగ్గుతుంది. అది దాని తోకాడించలేదు. కొంతమంది కుక్కలను తీసుకువెళుతుంటారు. కాని ఒక్కోసారి చూస్తే వారు కుక్కలను తీసుకువెళతున్నారో, కుక్క వారిని తీసుకువెళుతున్నదో అర్థం కాదు. ఎందుకంటే కుక్క వేగంగా పరుగెడుతుంది, వీరు కుక్క వెనకాల పరిగెత్తాల్సి వస్తుంది. అజ్ఞాని పరిస్థితి కూడా అలాగే ఉంటుంది. అతను అహంకారం వెంట పరిగెత్తాల్సి ఉంటుంది.

జ్ఞాని విషయంలో అలాకాదు. అతను మనుష్యులలో బుద్ధిశాలి. అహంకారానికి బానిస కాదు. అహంకారాన్ని తన అధీనంలో పెట్టుకుంటాడు. స యుక్తః – అతను యోగి. అతను స్వామి. స్వామి పదాన్ని సాధారణంగా సన్న్యాసికి వాడినా, నిజానికి స్వామి అంటే తన అహంకారాన్ని అదుపులో పెట్టగలిగినవాడు.

కృత్స్నకర్మకృత్ – అతను కృతకృత్యుడయ్యాడు. అన్నీ సాధించాడు అని అర్థం. ఎందుకు జ్ఞానిని కృతకృత్యుడు అంటారు? ఎవరైనా ఏదైనా సాధించాలని ఎందుకు అనుకుంటాడు? పూర్ణత్వం పొందాలనే ఉద్దేశ్యంతో కోరుకుంటాడు. ఆటలో పూర్ణత్వం పొందాలని ఒకరనుకుంటే, ఉద్యోగంలో పూర్ణత్వం పొందాలని ఇంకొకరు అనుకుంటారు.

కాని అహంకారపరంగా ఎన్నటికీ పూర్ణత్వాన్ని పొందలేము. పరిమితి+పరిమితి=పరిమితి. పరిమితి ఉన్న అహంకారం ఎన్నటికీ పూర్ణత్వం పొందలేదు. అందువల్ల జీవితం ఒక ఓటమి అవుతుంది. ఎందుకు ఓటమి అవుతుంది అంటే మనం వెళ్ళే మార్గం తప్పుగా ఉంది. జ్ఞాని విషయంలో అతను అహంకారానికి పరిమితి ఉందని తెలుసుకుని, అది పూర్ణత్వం పొందాలని ఎన్నడూ ప్రయత్నించడు. అహంకారాన్ని ఉన్నదున్నట్టుగా స్వీకరిస్తాడు.

పూర్ణత్వం కావాలనుకుంటే తన దృష్టిని అహంకారంనుంచి అహానికి మళ్ళిస్తాడు. అహం అంతకుముందూ పూర్ణమే, ఇప్పుడూ పూర్ణమే, ఎప్పటికీ పూర్ణమే. అందువల్ల జ్ఞాని ఉన్నతస్థాయిలో పూర్ణత్వాన్ని అనుభవిస్తాడు; అనాత్మ స్థాయిలో కర్మలు చేస్తాడు. అందువల్ల అతనిలో ఏ చింతా లేదు. పూర్ణత్వాన్ని ఎప్పుడూ అనుభవిస్తాడు. ఈ పని పూర్తయితే పూర్ణత్వం పొందుతాను అనుకోడు. అతనికి అటువంటి భ్రాంతులు ఉండవు. కృత్స్నకర్మకృత్ అంటే జ్ఞాని తన ఉన్నతస్థాయిలో పూర్ణత్వం పొందాడు అని అర్థం.

శ్లో. 19 **యస్య సర్వే సమారంభాః కామసంకల్పవర్జితాః ।**
**జ్ఞానాగ్నిదగ్ధకర్మాణం తమాహుః పండితం బుధాః ॥**
యస్య, సర్వే, సమారంభాః, కామసంకల్పవర్జితాః,
జ్ఞానాగ్నిదగ్ధకర్మాణమ్, తమ్, ఆహుః, పండితమ్, బుధాః ॥

| | | | |
|---|---|---|---|
| యస్య సర్వే | = ఎవరియొక్క శాస్త్ర సమ్మతములైన | జ్ఞానాగ్నిదగ్ధ కర్మాణమ్ | = ఎవరి కర్మలన్నీ జ్ఞానాగ్నిచే భస్మమగునో |
| సమారంభాః | = కర్మలన్నియు | తమ్ | = ఆ మహాపురుషునిని |
| కామసంకల్ప వర్జితాః | = కామసంకల్పరహితములై (జరుగునో) | బుధాః | = జ్ఞానులు |
| | | పండితమ్, (ఇతి) | = పండితుడని |
| | | ఆహుః | = అంటారు |

**యస్య సర్వే సమారమ్భాః కామ–సఙ్కల్ప–వర్జితాః, తం**
**జ్ఞాన–అగ్ని–దగ్ధ–కర్మాణం బుధాః పణ్డితమ్ ఆహుః ।**

తా: ఎవరి కర్మలన్నీ, శాస్త్రసమ్మతములై, కామసంకల్ప వర్జితములై జరుగునో, అలాగే ఎవరి కర్మ లన్నియును జ్ఞానాగ్నిచే భస్మమగునో, అటువంటి మహాపురుషునిని జ్ఞానులు పండితుడని అంటారు.

19 నుంచి 24 శ్లోకాల వరకూ, 18వ శ్లోకంమీద వ్యాఖ్యానం. జ్ఞాని పూర్ణత్వం పొందితే, అతనిలో కర్మ చేయాలన్న కోరిక ఉంటుందా అనే సందేహం వస్తుంది చాలామందికి. ఎందుకంటే సాధారణంగా, ఏదైనా కోరికతో ఒకపని చేస్తాము. ఒక వస్తువుమీద కోరిక, అది లేదన్న అసంతృప్తి ఆ పనిని చేయటానికి మనను

ప్రేరేపిస్తుంది. ఎప్పుడైతే మనం తృప్తిగా ఉంటామో, అప్పుడు దానికోసం ఎందుకు ప్రయత్నిస్తాము? ఎటువంటి సిద్ధాంతమో చూడండి! అసంతృప్తిగా ఉంటేనే పనులు చేసి, విజయాన్ని సాధిస్తాము అనుకుంటాము. కృష్ణపరమాత్మ అది తప్పని నిరూపిస్తున్నాడు. తృప్తిగా ఉండి కూడా పనులు చేయవచ్చు అంటున్నాడు.

నిజానికి అసలైన సేవాతత్పరత పరిపూర్ణత్వంనుంచే వస్తుంది. ఆ పూర్ణత్వం కనుక లేకపోతే, దానికి కొంత స్వార్థమనే పూత వస్తుంది. మరి పూర్ణత్వం ఉంటే, కర్మ చేసేలా ఏది ప్రేరేపిస్తుంది? **దయాగుణం** ప్రేరేపిస్తుంది అంటుంది శాస్త్రం. ఒక వ్యక్తి జ్ఞానం పొందినకొద్దీ, అతనికి చిత్త వైశాల్యత పెరుగుతుంది. వసుధైక కుటుంబభావన కలుగుతుంది. దయాగుణం అతని స్వభావమవుతుంది. ఎలాగైతే ఒక తల్లికి తన పిల్లలమీద సహజసిద్ధంగా ప్రేమ ఉంటుందో, అలాంటి ప్రేమ జ్ఞానికి మొత్తం ప్రపంచంమీద ఉంటుంది. ఎలాగైతే అగ్నినుంచి వేడిని విడదీయలేమో; ఎలాగైతే సూర్యుణ్ణుంచి సూర్యకాంతిని విడదీయలేమో; అలాగే జ్ఞానినుంచి ప్రేమతత్త్వాన్ని విడదీయలేము. అందువల్ల జ్ఞానిని **అహేతుక దయాసింధు** అంటారు. ఏమీ కారణం లేకుండానే దయ కురిపిస్తాడు.

తల్లి పిల్లవానిమీద ప్రేమ బేషరతుగా చూపిస్తుంది. అతను ఆడమంటే అతనితో ఆడుతుంది; తనకిష్టమై ఆడదు; పిల్లవాడికోసం ఆడుతుంది. అలాగే జ్ఞాని కూడా తనకోసం కర్మ చేయడు. కృష్ణపరమాత్మ మూడవ అధ్యాయంలో చెప్పినట్టుగా **లోకసంగ్రహం**కోసం చేస్తాడు. ఇది అక్షరాలా భగవంతుని అవతారంలాంటిది. భగవంతుడు లోకానికి అవసరమైనప్పుడు అవతారం ఎత్తుతాడు. జ్ఞాని కూడా లోకానికి అవసరమైన పని చేస్తాడు. జ్ఞాని, అజ్ఞాని ఇద్దరూ పనులు చేస్తే, వారి మధ్య భేదం ఏమిటి?

**కామసంకల్పవర్జితాః** – జ్ఞానికి అసంతృప్తి ఉండదు. ఏదో కావాలనే తపనతో పని చేయడు.

**నైవ తస్య కృతేనార్థో నాకృతేనేహ కశ్చన** – 3.18

కర్మ చేయకపోయినా అతను పూర్ణుడుగానే ఉంటాడు. అందువల్ల కామవర్జితా – అతనికి కోరికలు లేవు. అందువల్ల సంకల్ప వర్జితా – అందువల్ల భవిష్యత్తు గురించిన ప్రణాళికలు కూడా లేవు. ఇప్పుడు ఏదో కొరత ఉందనుకుని, భవిష్యత్తులో అది పొందితే ఆనందంగా ఉంటామని అనుకుంటాము మనము. స్వంత ఇల్లు ఉంటే ఆనందం కలుగుతుంది అనుకుంటాము. అంటే ఇప్పటి పరిస్థితిలో తృప్తిగా లేము. అందువల్ల గాలిలో మేడలు కడతాము. అవన్నీ అసంతృప్తిగా ఉన్న నేను లక్షణాలు.

దయానంద స్వామీజీ అద్భుతంగా చెబుతారు; నన్ను నేను కాదనుకున్నాను. నన్నే నేను స్వీకరించలేనప్పుడు, ప్రపంచాన్ని కూడా స్వీకరించలేను. ప్రతి ఒక్క వ్యక్తినీ, ప్రతి ఒక్క ఉద్యోగాన్నీ, ప్రతి ఒక్క పరిస్థితినీ, అందరినీ, అన్నిటినీ విమర్శిస్తాను. సమస్య ప్రపంచంలో లేదు. నాలో ఉంది. నన్ను నేను కాదనటం, ప్రపంచాన్ని కాదనటం ద్వారా ప్రకటితమవుతున్నది. అదే నన్ను నేను స్వీకరిస్తే, ప్రపంచాన్ని కూడా స్వీకరిస్తాను. జ్ఞాని తనను తాను స్వీకరిస్తాడు కాబట్టి ప్రపంచాన్ని కూడా స్వీకరిస్తాడు. అతను పగటికలలు కనడు. ఉన్నదానితో తృప్తిగా ఉంటాడు. వర్తమానంలో జీవిస్తాడు. ఏంచేసినా, ఏం చేయాల్సి వచ్చినా ఆనందంగా చేస్తాడు. అందువల్ల **అతని ప్రయాణం విచారంనుంచి ఆనందానికి ఉండదు; ఆనందంనుంచి ఆనందానికి, ఇంకా ఆనందానికే ఉంటుంది**.

ఎంత అద్భుతమైన మానసిక స్థితి! సంతోషంగా గెలుస్తాడు; సంతోషంగా ఓడిపోతాడు.

పరిస్థితులకూ, పూర్ణత్వానికీ సంబంధం లేదు. పరిస్థితులు అహంకారం స్థాయికి చెందినవి; పూర్ణత్వం ఉన్నతమైన స్థాయికి చెందినది. ఉపనిషత్తు భాషలో చెప్పాలంటే పరిస్థితులు వ్యావహారిక సత్యానికి చెందినవి; పూర్ణత్వం పారమార్థిక స్థాయికి చెందినవి. జ్ఞాని ఈ రెండు స్థాయిలనూ కలుపడు. అందువల్ల పగటికలలు కనడు.

**జ్ఞానాగ్నిదగ్ధకర్మాణమ్** – ఇంకో ఆసక్తికరమైన విషయం జరుగుతోంది. జ్ఞాని పారమార్థిక స్థాయిలో ఉంటాడు కాబట్టి అతనికి పుణ్యపాపాలు అంటవు.

**అహంకారవిమూఢాత్మా కర్తాఽహమితి మన్యతే** – 3.27

అహంకారంతో తాదాత్మ్యం చెందితేనే, అంటే సంకల్పం ఉంటేనే పుణ్యపాపాలు కలుగుతాయి. జ్ఞాని అహంకారంతో తాదాత్మ్యం చెందదు కాబట్టి అతనికి పుణ్యపాపాలు అంటవు. అందువల్ల జ్ఞానికి ఆగామి కర్మలు రావు. కర్మాణం దగ్ధ – కర్మలన్నీ ఇక్కడే దగ్ధమయిపోతాయి.

జ్ఞానిని వేయించిన విత్తనంతో పోలుస్తారు. వేయించిన విత్తనం తక్కిన విత్తనాలలాగానే ఉంటుంది. కాని దాన్నించి చెట్టు మొలకెత్తదు. తక్కిన అన్ని అంశాలు ఉంటాయి కాని చెట్టు మొలకెత్తదు. అలాగే జ్ఞాని అహంకారం వేయించిన గింజలా ఉంటుంది. వ్యవహారం నడపటానికి అహంకారం ఉంటుంది. నువ్వెవరు అంటే అతను అహంకారం గురించే చెబుతాడు. కాని అహంకారంవల్ల సంసారంలో కూరుకుపోడు. విత్తనాన్ని వేయించటానికి అగ్నిని వాడితే, అహంకారాన్ని వేయించటానికి జ్ఞానాగ్నిని వాడాలి. జ్ఞానాగ్నివల్ల జ్ఞాని సంచితకర్మలు దగ్ధమవుతాయి.

**తమాహుః పండితమ్** – అటువంటి వ్యక్తిని పండితుడు అంటారు. ఆత్మజ్ఞానం పొందిన వ్యక్తిని పండితుడు అంటారు. కృష్ణపరమాత్మ తను బోధ మొదలుపెట్టిన మొట్టమొదటి శ్లోకాన్ని అర్జునునికి గుర్తు చేయటానికి ఇక్కడ పండితం పదం వేశాడు.

**అశోచ్యానన్వశోచస్త్వం ప్రజ్ఞావాదాంశ్చ భాషసే ।**

**గతాసూనగతాసూంశ్చ నానుశోచంతి పండితాః ॥** – 2.11

ఆ పండితః పదాన్ని ఇక్కడ వివరిస్తున్నాడు కృష్ణపరమాత్మ. ఎవరా పండితుడు? తన అహంకారాన్ని వేయించి, తనకు దుఃఖాన్ని కలగకుండా చేసినతను.

**న అనుశోచంతి** – వేయించిన అహంకారం దుఃఖాన్ని కలుగజేయలేదు. అందువల్ల అటువంటి జ్ఞానిని పండితుడు అంటారు. ఎవరు?

**బుధాః** – జ్ఞానులు. ఒక శాస్త్రజ్ఞునికి నోబెల్‌ప్రైజ్ ఇవ్వాలంటే ఆ రంగంలో నిష్ణాతులైన తక్కిన శాస్త్రజ్ఞులే అతని అర్హతని నిర్ణయించగలరు. అలాగే ఒక వ్యక్తిని జ్ఞాని అనాలంటే తక్కిన జ్ఞానులే అనగలరు.

శ్లో. 20 **త్యక్త్వా కర్మఫలాసంగం నిత్యతృప్తో నిరాశ్రయః ।**
**కర్మణ్యభిప్రవృత్తోఽపి నైవ కించిత్ కరోతి సః ॥**
త్యక్త్వా, కర్మఫలాసంగమ్, నిత్యతృప్తః, నిరాశ్రయః,
కర్మణి, అభిప్రవృత్తః, అపి, న, ఏవ, కించిత్, కరోతి, సః ॥

| | | | |
|---|---|---|---|
| కర్మఫలాసంగమ్ | = సమస్త కర్మలందును, వాటి ఫలములందును ఆసక్తిని | సః | = అటువంటి పురుషుడు |
| త్యక్త్వా | = (సర్వథా) వీడి | కర్మణి | = కర్మలందు |
| నిరాశ్రయః | = ప్రాపంచిక ఆశ్రయ రహితుడై | అభిప్రవృత్తః | = పూర్తిగా ప్రవర్తించినా |
| నిత్యతృప్తః | = (పరమాత్మ యందే) నిత్య తృప్తిని పొందిన | అపి | = అయినా |
| | | కించిత్, ఏవ | = ఏ కొంచెము గూడ |
| | | న, కరోతి | = (వాస్తవముగా) చేయువాడు కాదు |

**(యః) కర్మ-ఫల-అసంగం త్యక్త్వా నిత్య-తృప్తః నిరాశ్రయః,**
**సః కర్మణి అభిప్రవృత్తః అపి న ఏవ, కిఞ్చిత్ కరోతి ।**

తా: సమస్త కర్మలందును వాటి ఫలితములందును సర్వథా ఆసక్తిని వీడి, ప్రాపంచిక ఆశ్రయరహితుడై, పరమాత్మయందే నిత్యతృప్తుడైన పురుషుడు, కర్మలను చక్కగా ఆచరించినా వాస్తవముగా వాటికి (కర్మలకు) కర్త కాడు.

జ్ఞానికి కోరిక ఉండదు, సంకల్పం ఉండదు, దుఃఖం ఉండదు. ఒక్క ముక్కలో చెప్పాలంటే జ్ఞాని ఒక ముక్త పురుషుడు. జ్ఞాని పరిస్థితులకు బానిస కాదు, పరిస్థితులను తనకు బానిసగా చేసుకుంటాడు. ఎవరైనా ఇటువంటి జ్ఞాని కావచ్చు అంటున్నాడు కృష్ణపరమాత్మ. జ్ఞాని పరిస్థితులు ఎలా ఉన్నా, తను ఎక్కడ ఉన్నా ముక్తపురుషుడు కాగలడు. కాని అజ్ఞాని బద్రీనాథ్‌లోని గొప్ప ఆశ్రమంలో ఉన్నా దుఃఖంలోనే మునిగి తేలుతాడు. అందువల్ల ఒక వ్యక్తి జ్ఞాని కాగలడా లేదా అన్నది ఆశ్రమధర్మం కాని, వర్ణం కాని నిర్ణయించదు.

**చాండాలోఽస్తు స తు ద్విజోఽస్తు గురురిత్యేషా మనీషా మమ**

మనీషా పంచకంలో చండాలుడు కూడా జ్ఞాని అయితే జీవన్ముక్తుడు కాగలడు, అదే అజ్ఞాని అయితే గొప్ప బ్రాహ్మణుడు అయినా కూడా సంసారి అవుతాడు అన్నారు శంకరులవారు. అందువల్ల జ్ఞాని అవటానికి ఆశ్రమం, వర్ణం, లింగం, వృత్తి, దేశం - ఏదీ అడ్డురాదు. ఎవరైనా, ఎక్కడైనా జ్ఞానం పొందవచ్చు.

ఈ శ్లోకాల్లో కృష్ణపరమాత్మ రెండు రకాల జ్ఞానులను వర్ణిస్తున్నాడు - గృహస్థ జ్ఞాని, సన్న్యాస జ్ఞాని. సన్న్యాసి అయినా, గృహస్థు అయినా జ్ఞానం పొందవచ్చు. గృహస్థుగా ఉండి మోక్షం పొందవచ్చు. 21వ శ్లోకంలో సన్న్యాసి జ్ఞాని గురించి చెపితే 20, 22, 23, 24 శ్లోకాల్లో గృహస్థు జ్ఞాని గురించి చెబుతున్నాడు కృష్ణపరమాత్మ. ఎటువంటి గృహస్థు? రెండవపాదం చూడండి.

**కర్మణి అపి అభి(ప్రవృత్తః** – గృహస్థు ప్రపంచంలో ఉంటూ, పంచమహాయజ్ఞాలు చేస్తూ, బాధ్యతలను నిర్వర్తిస్తూ ఉంటాడు. గృహస్థ జ్ఞాని అనేక కర్మలను చేస్తూ ఉండాలి. కాని తేడా ఏమిటి?

**నిత్యతృప్తః** – ఎప్పుడూ తృప్తిగా ఉంటాడు. పిల్లవాడి బాధ్యత తీరాలి; పిల్లవాడి చదువు అవాలి; అతని పెళ్ళి కావాలి; అతనికి అమ్మాయి పుట్టాలి, అబ్బాయి కూడా పుట్టాలి అంటూ కోరికలు పెంచుకుంటూ పోడు. జ్ఞాని ఆనందంతో కర్మలు చేస్తాడు, ఆనందంకోసం చేయడు. అతని ఆనందం ఎక్కడ ఉంది? అతనిలోనే ఉంది. అతనికి యు.పి.ఎస్. ఉంది. మామూలుగా యు.పి.ఎస్. అంటే అన్ఇంటరప్టెడ్ పవర్ సప్లై. ఇప్పటి తరానికి ప్రేమ కావాలి. ఎవరో ఒకరు ఐ లవ్ యు అని చెబుతూనే ఉండాలి. అందువల్లనే ఇప్పుడు ఫాదర్స్‌డే, మదర్స్‌డే, సిస్టర్స్‌డే అంటూ హడావుడి చేస్తున్నారు. కార్డులు, కానుకలు ఇస్తున్నారు. ఈ కార్డులేమీ రాకపోతే నిరాశ, ఒంటరితనం చుట్టుముట్టుతాయి.

జ్ఞాని విషయంలో అలా కాదు. కార్డులు వచ్చినా సంతోషమే, రాకపోయినా సంతోషమే. మనుష్యులు చుట్టూ ఉన్నా సంతోషమే, లేకపోయినా సంతోషమే. **మీరు ఎదుటివారికి చేయూత నిస్తే అది ప్రేమ. మీరు ఎదుటివారి నుంచి ప్రేమను కోరితే అది బంధకత్వం.** అటువంటి బంధాలు ఉండవు జ్ఞానికి. అందువల్ల అతను నిత్యతృప్తుడు. **అహం పూర్ణః అస్మి.** అతని యు.పి.ఎస్. **అన్ఇంటరప్టెడ్ పూర్ణత్వం సప్లై.** అటువంటి పూర్ణత్వం ఉంటే –

**నిరాశ్రయః** – ఎవరిమీదా భావపరంగా ఆధారపడడు. చేతికర్ర పట్టుకుని నడిస్తే, మనకు శారీరకశక్తి లేనట్టు; బాహ్యవస్తువులమీద, మనుష్యులమీద ఆధారపడితే మానసికశక్తి లేనట్టు అర్థం. ఈ బలహీనత అజ్ఞానంవల్ల ఏర్పడుతుంది. ఈ బలం జ్ఞానంనుంచే వస్తుంది. అందువల్లనే జ్ఞాని నిరాశ్రయుడు. జ్ఞాని భావపరంగా ప్రపంచంమీద ఆధారపడడు. శారీరకంగా ఆధారపడక తప్పదు. కూడు, గుడ్డ, తిండికోసం ప్రపంచంమీద ఆధారపడక తప్పదు. అలాగే చేతికర్రమీద కూడా ఆధారపడక తప్పదు.

అందువల్ల **శారీరకంగా ఆధారపడటం సంసారం కాదు; మానసికంగా ఆధారపడటమే సంసారం**. ఎందుకంటే ఎవరైనా నా చెయ్యి పట్టుకోవాల్సి వచ్చిన పరిస్థితి వస్తే, నాకు ఎవరైనా పట్టుకుంటే చాలదు. ఫలానా వ్యక్తే పట్టుకోవాలి, ఫలానా వ్యక్తే నాకు అన్నం తినిపించాలి అనుకుంటాను మామూలుగా. కాని జ్ఞాని విషయంలో అలాకాదు. అతను నిరాశ్రయుడు.

అతను కర్మచేసి ఫలాన్ని ఆశిస్తాడు కాని, ఆశించిన ఫలం పొందకపోతే నిరాశ చెందడు. ముందే చూశాము, ప్రణాళిక వెయ్యటం వేరు; ఫలం గురించి బెంగపడటం వేరని. పిల్లలను ఫలానా స్కూల్లో చేర్చాలని, వారు వృద్ధిలోకి రావాలని అనేక కలలు కంటాము. కాని అవి తీరకపోయినా కృంగిపోడు జ్ఞాని. దయానందస్వామి అద్భుతంగా చెబుతారు – **ఓటమికి సంసిద్ధులు కావటమే విజయం**. ఓటమిని ఎదుర్కోవటానికి సిద్ధపడాలి. ఓటమిని తట్టుకోలేకపోతే చాలా కష్టం.

**కర్మఫలాసంగం త్యక్త్వా** – సంగం అంటే ఆధారపడటం, బెంగ పడటం, ఆందోళన చెందటం. త్యక్త్వా – జ్ఞాని వీటిని వదిలివేస్తాడు. ఇటువంటి ఆరోగ్యకరమైన మనస్సుతో, ఇటువంటి సంసిద్ధతతో జ్ఞాని పనిచేస్తాడు. అతని పరిస్థితి ఎలా ఉంటుంది?

**నైవ కించిత్ కరోతి సః** – నిజానికి అటువంటి జ్ఞాని ఏ కర్మా చేయడు అని చెప్పవచ్చు. ఇటు వేదాంతపరంగా, అటు మానసికంగా కూడా. వేదాంతపరంగా అతను కర్మలో అకర్మను చూస్తాడు కాబట్టి, తను ఉన్నతస్థాయిలో ఉంటాడు కాబట్టి, తనను తాను కర్తా అనుకోడు. మానసికంగా దేనితోనూ బంధకత్వం పెంచుకోడు కాబట్టి బెంగలేదు, ఆందోళన లేదు, నిద్రలేని రాత్రులు గడపడు. అందువల్ల అతనికి అతను చేసే పనులు భారం కావు.

శ్లో. 21 **నిరాశీర్యతచిత్తాత్మా త్యక్తసర్వపరిగ్రహః ।**
**శారీరం కేవలం కర్మ కుర్వన్ నాప్నోతి కిల్బిషమ్ ॥**
నిరాశీః, యతచిత్తాత్మా, త్యక్తసర్వపరిగ్రహః,
శారీరమ్, కేవలమ్, కర్మ, కుర్వన్, న, ఆప్నోతి, కిల్బిషమ్ ॥

| | | | |
|---|---|---|---|
| యతచిత్తాత్మా | = అంతఃకరణమును, శరీరేంద్రియములను జయించినవాడును | కేవలమ్ | = కేవలము |
| త్యక్తసర్వపరిగ్రహః | = సమస్త భోగసామాగ్రిని పరిత్యజించిన వాడును | శారీరమ్, కర్మ | = శారీరిక కర్మలను |
| నిరాశీః | = ఆశారహితుడైన వాడును (అగు సాంఖ్యయోగి) | కుర్వన్ | = ఆచరించుచును |
| | | కిల్బిషమ్ | = పాపము(ల)ను |
| | | న, ఆప్నోతి | = పొందడు |

**నిరాశీః యత–చిత్త–ఆత్మా త్యక్త–సర్వ–పరిగ్రహః, కేవలం**
**శారీరం కర్మ కుర్వన్ కిల్బిషం న ఆప్నోతి ।**

తా: అంతఃకరణమును, శరీరేంద్రియములను జయించినవాడు, సమస్త భోగసామాగ్రిని పరిత్యజించినవాడు, ఆశారహితుడు అయిన సాంఖ్యయోగి కేవలము శారీరక కర్మలను ఆచరించుచు పాపములను పొందడు.

**ఎ). సన్న్యాస జ్ఞాని–** ఈ శ్లోకంలో సన్న్యాస జ్ఞానిని గురించి మాట్లాడుతున్నాడు కృష్ణపరమాత్మ.

**త్యక్తసర్వపరిగ్రహః** – ఈ సన్న్యాస జ్ఞాని తన వస్తువులను, తనవారినీ పరిత్యజించాడు. అంటే బంధుత్వాలను కూడా పరిత్యజించాడు.

**నిరాశీః** – ఇది లేదే అనే చింత ఉండదు. అన్నీ వదిలివేసుకున్నాక, వాటిని గురించి బెంగ పడితే, వదిలేసి లాభం లేదు.

**కర్మేంద్రియాణి సంయమ్య య ఆస్తే మనసా స్మరన్ ।**
**ఇంద్రియార్థాన్ విమూఢాత్మా మిథ్యాచారః స ఉచ్యతే ॥** – 3.6

బలవంతంగా ఇంద్రియాలను నిగ్రహించినవారిని మిథ్యాచారి అంటారని చూశాము. ఇంద్రియాలను బలవంతంగా నిగ్రహించకూడదు. ఇష్టంగా ఇంద్రియ విషయాలను పరిత్యజించాలి. అలా వదిలిన సన్న్యాసికి ఏ కొరతా ఉండదు.

**యతచిత్తాత్మా** – మనస్సునూ, శరీరాన్నీ జయించిన వ్యక్తి. శరీరం సుఖాలకు అలవాటు పడితే, మనస్సు సన్న్యసించినా శరీరం ఏ.సి. కోరుకుంటుంది. అందువల్ల సన్న్యాసం స్వీకరించే వ్యక్తి శరీరాన్ని కూడా అదుపులో పెట్టుకోగలగాలి. ఇక్కడ ఆత్మా అంటే శరీరం; సచ్చిదానంద ఆత్మ కాదు. చిత్తం అంటే మనస్సు.

**శారీరం కేవలం కర్మ కుర్వన్** – అతను శారీరకంగా చేయాల్సిన కర్మలను చేస్తాడు. సన్న్యాసాశ్రమానికి, గృహస్థాశ్రమానికి కూడా లాభనష్టాలున్నాయి. గృహస్థుకు కుటుంబసభ్యులనుంచి, ఆస్తులవల్ల భద్రత ఉంటుంది, కాని దానికి తగ్గ బాధ్యతలు కూడా ఉంటాయి. సన్న్యాసికి బాధ్యతలు ఉండవు, భద్రత కూడా ఉండదు. గృహస్థు యల్ ఐ సీ మీద భద్రతకోసం ఆధారపడితే, సన్న్యాసి దేవుడుమీద ఆధారపడతాడు.

**అనన్యాశ్చింతయంతో మాం యే జనాః పర్యుపాసతే ।**
**తేషాం నిత్యాభియుక్తానాం యోగక్షేమం వహామ్యహమ్ ॥** – 9.22

అందువల్ల సన్న్యాసి కర్మ చేస్తాడు కాని ఫిర్యాదులు లేవు, కోరికలు లేవు.

**కిల్బిషం న ఆప్నోతి** – అతను ఏమీ కర్మఫలం పొందడు. కిల్బిషం అంటే అసలు అర్థం పాపం. పాపం అంటే కర్మఫలం. అతను అకర్తగా చేస్తాడు కాబట్టి అతనికి పాపం అంటదు; పుణ్యం కూడా అంటదు. ఇది సన్న్యాస జ్ఞాని గురించి.

శ్లో. 22 **యదృచ్ఛాలాభసంతుష్టో ద్వంద్వాతీతో విమత్సరః ।**
**సమః సిద్ధావసిద్ధౌ చ కృత్వాపి న నిబధ్యతే ॥**
యదృచ్ఛాలాభసంతుష్టః, ద్వంద్వాతీతః, విమత్సరః,
సమః, సిద్ధౌ, అసిద్ధౌ, చ, కృత్వా, అపి, న, నిబధ్యతే ॥

| | | | |
|---|---|---|---|
| యదృచ్ఛా | = అప్రయత్నముగా అమరిన | సిద్ధౌ, అసిద్ధౌ, చ | = సిద్ధి, అసిద్ధులందును |
| లాభ సంతుష్టః | = లాభములతో సంతుష్టుడైన వాడు | సమః | = సమదృష్టి కలిగియుండు వాడు అగు కర్మయోగి |
| విమత్సరః | = అసూయ లేనివాడు | | |
| ద్వంద్వాతీతః | = హర్షశోకాది ద్వంద్వములకు అతీతుడు | కృత్వా, అపి | = కర్మలను చేయుచును |
| | | న, నిబధ్యతే | = బంధింపబడదు |

**యదృచ్ఛా-లాభ-సన్తుష్టః ద్వన్ద్వ-అతీతః విమత్సరః సిద్ధౌ**
**అసిద్ధౌ చ సమః, కృత్వా అపి న నిబధ్యతే ।**

తా: తాను కోరకుండగనే లభించిన పదార్థములతో (అప్రయత్నముగా అమరిన లాభములతో) సంతుష్టుడైనవాడు, అసూయలేనివాడు, హర్షశోకాది ద్వంద్వములకు అతీతుడు అయినవాడు సిద్ధియందును, అసిద్ధియందును సమదృష్టి కలిగియుండును. అట్టి కర్మయోగి కర్మలనాచరించుచున్నను వాటి బంధములలో చిక్కుపడడు.

**బి). గృహస్థ జ్ఞాని-** ఈ శ్లోకం గృహస్థ జ్ఞానికి, సన్న్యాస జ్ఞానికి ఇద్దరికీ వర్తిస్తుంది. కాని మనం గృహస్థుకు చెప్పినట్టుగా తీసుకోవచ్చు. జీవితం గురించి గృహస్థు దృక్పథం ఎలా ఉంటుంది?

**యదృచ్ఛాలాభ సంతుష్టః** - తన కర్మలకు ఫలంగా ఏది వచ్చినా సంతుష్టుడవుతాడు. ఒక విషయం జీవితాంతం గుర్తుంచుకోవాలి మనం. మన భవిష్యత్తులో జరిగే అంశాలమీద మనకు పూర్తిగా అధికారం లేదు.

కాని ఇక్కడ చాలా జాగ్రత్తగా ఉండాలి. ఎందుకంటే రెండు విపరీత ధోరణులు కనబడతాయి. కొంతమంది వారి భవిష్యత్తు పూర్తిగా వారి చేతుల్లోనే ఉందనుకుంటారు. అహంకారంతో చెలరేగిపోతారు. ఎప్పుడో దేవుని నుంచి ఎదురుదెబ్బ తింటారు. భవిష్యత్తును మానవమాత్రుడు పూర్తిగా నిర్దేశించలేడు. మితిమీరిన ఆత్మ విశ్వాసం ఒక విపరీత ధోరణి.

ఇంకొక విపరీతధోరణి విధిని నమ్మటం. ఏదీ మన చేతిలో లేదు, ఎలా రాసిపెట్టి ఉంటే అలా జరుగుతుంది అంటారు వీరు. మొదటిరకం మనుష్యులు నూటికి నూరుశాతం బాధ్యత వహిస్తే, రెండవరకం మనుష్యులు అసలు ఏమాత్రం బాధ్యత వహించరు. రెండు ధోరణులూ తప్పే అంటుంది గీత. అయితే అసలు ధోరణి ఏమిటి?

నా భవిష్యత్తును నేను పూర్తిగా నిర్దేశించలేను కాని, నా భవిష్యత్తును నేను ప్రభావితం చెయ్యగలను. నా పాత్ర ప్రముఖమైన పాత్ర. మరి తక్కిన పాత్రలు ఏమిటి? చాలా ఉన్నాయి. వాతావరణంనుంచి ఎక్కడో జరిగే యుద్ధం దాకా అనేక అంశాలు తోడవుతాయి. అంటే దీనర్థం ప్రపంచంలో అన్నీ ఒకదానితో ఒకటి పెనవేసుకుని ఉంటాయి. అందువల్ల నా భవిష్యత్తును నిర్దేశించే అంశాలు ఎన్నో ఉన్నాయి. అన్నీ చెప్పుకుంటూ రావటం కష్టం కాబట్టి, వాటన్నిటినీ కలిపి ఒక పెద్ద సంచీలో వేసి దైవం అంటాము. దైవం అనండి; ఈశ్వర ఇచ్ఛ అనండి; ప్రారబ్ధకర్మ అనండి - ఏదైనా ఒకటే.

మన దృక్పథం ఎలా ఉండాలి? మన శాయశక్తులా మనం ప్రయత్నం చేయాలి. కాని మన ప్రయత్నం అయ్యాక ఎటువంటి ఫలితం వచ్చినా స్వీకరించటానికి సిద్ధంగా ఉండాలి. దీన్ని యదృచ్ఛాలాభసంతుష్టః అంటారు. యదృచ్ఛా అంటే కర్మఫలంగా ఏది వచ్చినా, లాభ - ఆ లాభంతో, సంతుష్ట - తృప్తి పడాలి. కొంతమంది భాష్యకారులు యదృచ్ఛాలాభసంతుష్టః ని రెండుసార్లు చదవాలి అంటారు. అంటే ఏది వచ్చినా స్వీకరిస్తాడు. అనుకున్నది రాకపోయినా కూడా స్వీకరిస్తాడు అని అర్థం.

మళ్ళీ ఇక్కడ కూడా ఒక విషయాన్ని జాగ్రత్తగా అర్థం చేసుకోవాలి. ఏది వచ్చినా కర్మఫలంగా స్వీకరించాలి, ఈశ్వరప్రసాదంగా స్వీకరించాలి అని అంటే దానర్థం పరిస్థితిని మెరుగు పరుచుకోవటానికి ప్రయత్నించకూడదు అని కాదు. ఓటమి వస్తే ఆ విషయంలో మీరేమీ చేయలేరు, అందువల్ల ఓటమిని స్వీకరించాలి. కాని అదే సమయంలో, తరువాత చేసే పనిమీద మీకు అధికారం ఉంది. దానికోసం ఏం చేయాలో అది చేయాలి. అందువల్ల వర్తమానాన్ని ఉన్నదున్నట్టుగా స్వీకరించండి; భవిష్యత్తుకోసం పాటుపడండి. బెంగపడినంత మాత్రాన వర్తమానాన్ని మార్చలేరు, భవిష్యతును కూడా మార్చలేరు.

**వర్తమానాన్ని స్వీకరించాలి; భవిష్యత్తుకోసం కష్టపడాలి – ఇదీ గీత బోధించే సూక్ష్మతత్త్వం.** వర్తమానంతో గతాన్ని కూడా కలుపుకోవాలి. గతాన్నీ, వర్తమానాన్నీ స్వీకరించండి; భవిష్యత్తుకోసం కష్టపడండి. రెండింటి గురించీ ఆందోళన చెందకండి. అందువల్లనే కృష్ణపరమాత్మ **అశోచ్యానన్వశోచస్త్వం** అన్నాడు.

**ద్వంద్వాతీతః** – ద్వంద్వాలకు అతీతంగా ఉన్నాడు. ఈ ద్వంద్వాలను కృష్ణపరమాత్మ రెండవ అధ్యాయంలో వర్ణించాడు –

**దుఃఖేష్వనుద్విగ్నమనాః సుఖేషు విగతస్పృహః ।**
**వీతరాగభయక్రోధః స్థితధీర్మునిరుచ్యతే ॥** – 2.56

**యః సర్వత్రానభిస్నేహః తత్తత్ ప్రాప్య శుభాశుభమ్ ।**
**నాభినందతి న ద్వేష్టి తస్య ప్రజ్ఞా ప్రతిష్ఠితా ॥** – 2.57

జీవితమంటేనే ద్వందాలతో కూడిన విభిన్న అనుభవాలను ఎదుర్కోవడం. ద్వంద్వాతీతః అంటే ఈ ద్వంద్వాలకు అతీతంగా ఎదిగినవాడు. అతీతంగా ఎదిగాడు అంటే ఎలా ఎదిగాడు? ఎక్కడికి వెళ్ళినా అవి తప్పవు. సుఖదుఃఖాలు, లాభనష్టాలు, రాగద్వేషాలు ఉంటూనే ఉంటాయి. వాటిని తప్పించు కోలేము. అవి మనను కలత పెట్టకుండా చూసుకోవాలి.

ఎలా చూసుకోవాలి? గుర్తుంచుకోండి, పనసపండు కోసేటప్పుడు చేతికి, కత్తికి కొబ్బరినూనె రాసుకుని ఆ పండు కోయటం మొదలుపెడతాము. అలాగే, ద్వంద్వ విషయాలున్న ప్రపంచంలోకి అడుగు పెట్టేటప్పుడు జ్ఞానమనే కొబ్బరినూనెను రాసుకుంటే వాటికి అతీతంగా ఎదుగుతాము.

**విమత్సరః** – పోటీతత్వాన్ని అధిగమించినవాడు. నేటి ప్రపంచంలో పోటీతత్త్వం ఉంటేనే పైకి వస్తాడని అంటారు కాని శాస్త్రం దాన్ని అంగీకరించదు. పోటీతత్త్వంవల్ల పైకి వస్తారేమో కాని, దానివల్ల చెడు ప్రభావం ఎక్కువగా ఉంటుంది. మనను దాటి ముందుకు వెళ్ళినవాడిమీద పగ, ద్వేషం, ఈర్ష్య ఏర్పడుతాయి. అతన్ని మోసం చేసి అయినా, అతన్ని దాటుకుపోవాలి అనిపించవచ్చు. అలా చేయలేకపోతే కృంగి కృశించిపోవచ్చు. ఏదైనా ప్రమాదమే. అందువల్ల శాస్త్రం ప్రేమతో, సహకారంతో గెలవాలి కాని మాత్సర్యంతో కాదు అంటుంది. అందువల్లనే మనిషికి ఉన్న ఆరు శత్రువులలో మాత్సర్యాన్ని కలిపింది. అవి – కామక్రోధలోభమోహమదమాత్సర్యాలు. జ్ఞానికి మాత్సర్యం లేదు కాబట్టి అతను విమత్సరుడు అవుతాడు. ఎవరైనా గెలిస్తే మనస్ఫూర్తిగా అభినందిస్తాడు.

**సమః సిద్ధావసిద్ధౌ చ** – సిద్ధి అంటే విజయం; అసిద్ధి అంటే ఓటమి; సమ అంటే సమత్వం. వేదాంతం ప్రకారం **విజయం అంటే గెలుపు ఓటములను సమానంగా స్వీకరించటం**. అదీ అసలైన విజయం అంటే. ఎవరూ జీవితంలో నూటికి నూరుపాళ్ళు విజయం సాధించలేరు. విజయం సాధించటం ఎలా అని చాలామంది చాలా పద్ధతులు నేర్పిస్తుంటారు; కాని నూటికి నూరుపాళ్ళు విజయం రాదు. అది అసాధ్యం. ఒకవేళ అలా వస్తుందంటే ఆ రహస్యం కృష్ణపరమాత్మ బోధించి ఉండేవాడు.

కృష్ణపరమాత్మ విజయం గురించి బోధించలేదు. జ్ఞానాన్ని బోధించాడు. జ్ఞానం ఎందుకు బోధించాడు? ఎప్పుడూ విజయం పొందటానికి కాదు. జీవితంలో ఎదురయ్యే విపరీత పరిస్థితులను కూడా ఎదుర్కొనే ధైర్యం కలిగించటానికి. ఓటమి రావటంకోసం ప్రయత్నించనవసరం లేదు. అది ఎలాగూ సహజంగానే వస్తుంది; విజయంకోసం ప్రయత్నించాలి నిజమే. కాని జ్ఞానం అంటే గెలుపు ఓటములు రెండింటికీ నేను సిద్ధం అని తెలియజెప్పటం. అటువంటి వ్యక్తికి సమత్వం ఉంటుంది.

**కృత్వాపి** – అటువంటి వ్యక్తి గృహస్థుగా బోలెడు కర్మలు చేస్తున్నా కూడా **న నిబధ్యతే** – ఆ కర్మలవల్ల బంధింపబడడు. దాన్ని ఒక ఆటగా తీసుకుంటాడు. ఒకవేళ సన్న్యాసిని తీసుకున్నా సన్న్యాసి కూడా ఆశ్రమాన్ని నడపాలి, అందులోనూ అనేక ఒడిదుడుకులు ఉంటాయి; అయినా అతను బాధపడడు. జ్ఞానికి కర్మ లీలలాగా అంటే ఆటలాగా ఉంటుంది. అజ్ఞానికి కర్మ బాధ కలుగ జేస్తుంది. ఇద్దరు చేసే కర్మా ఒకటే. కాని జ్ఞానికి అది లీల; అజ్ఞానికి అది యుద్ధం.

శ్లో. 23 **గతసంగస్య ముక్తస్య జ్ఞానావస్థితచేతసః ।**
**యజ్ఞాయాచరతః కర్మ సమగ్రం ప్రవిలీయతే ॥**

గతసంగస్య, ముక్తస్య, జ్ఞానావస్థితచేతసః,
యజ్ఞాయ, ఆచరతః, కర్మ, సమగ్రమ్, ప్రవిలీయతే ॥

| | | | |
|---|---|---|---|
| గతసంగస్య | = సర్వథా ఆసక్తిరహితుడు | యజ్ఞాయ | = కేవలము యజ్ఞార్థమే |
| ముక్తస్య | = దేహాభిమానము, మమకారము ఏ మాత్రమూ లేనివాడు | ఆచరతః | = కర్మలను ఆచరించువాడు అగు పురుషునియొక్క |
| జ్ఞానావస్థితచేతసః | = పరమాత్మ జ్ఞానమందే నిరంతరము మనస్సును లగ్నమొనర్చిన వాడు | సమగ్రమ్, కర్మ | = కర్మలన్ని |
| | | ప్రవిలీయతే | = విలీనములగును. |

**గత–సంగస్య జ్ఞాన–అవస్థిత–చేతసః యజ్ఞాయ ఆచరతః**
**ముక్తస్య కర్మ సమగ్రం ప్రవిలీయతే ।**

తా: ఎందుకంటే, ఆసక్తి, దేహాభిమానము, మమకారము ఏ మాత్రమూ లేనివాడు, పరమాత్మ జ్ఞానమందే నిరంతరము మనస్సును లగ్నమొనర్చిన వాడు, కేవలము యజ్ఞార్థమే కర్మలను ఆచరించువాడును అగు మనుష్యునియొక్క కర్మలన్ని పూర్తిగా విలీనములగును అంటే మిగిలియుండవు.

ఈ శ్లోకం కూడా గృహస్థ జ్ఞానిని వర్ణిస్తున్నది. ఈ శ్లోకాలన్నీ కూడా చాలా ముఖ్యం. చాలామంది మోక్షం పొందాలంటే గృహస్థాశ్రమాన్ని వదిలేసి సన్న్యాసం స్వీకరించాలనే అపోహలో ఉంటారు. గృహస్థులు కూడా జ్ఞానులు అవచ్చు అని వారు గొప్పగా చూపించుకోగలిగే శ్లోకాలు ఇవి. బాహ్యంగా సన్న్యాసం స్వీకరించనవసరం లేదు కాని ఆంతరసన్న్యాసం స్వీకరించి తీరాలంటాడు కృష్ణపరమాత్మ.

**గత సంగస్య** – గృహస్థ జ్ఞాని వస్తువులమీద బంధకత్వాన్ని త్యజిస్తాడు. దేన్నీ తన స్వంతంగా భావించడు. అంతా ఈశ్వరార్పణం చేసేస్తాడు. 'ఇప్పుడు నేను ఏది అనుభవిస్తున్నా కూడా నేను తాత్కాలికంగా అనుభవించటానికి భగవంతుడు ఇచ్చిన కానుక. వాటితో నేను కలిసి ఉండటంవల్ల వాటి అభివృద్ధికి నేను తోడ్పడుతాను, నా అభివృద్ధికి అవి తోడ్పడుతాయి. అవన్నీ ఆయన ఇచ్చినవే కాబట్టి, ఎప్పుడు కావాలనుకుంటే అప్పుడు వెనక్కి తీసేసుకునే హక్కు ఆయనకి ఉంది. నా శరీరంమీద కూడా అంతే హక్కుంది,' అనుకుంటాడు.

అందువల్ల జ్ఞాని భగవంతుడు తనకు కానుకలు ఇచ్చినందుకు కృతజ్ఞతాభావంతో ఉంటాడు. తన వారిని ప్రేమిస్తాడు, వారి బాధ్యత వహిస్తాడు, తన ధర్మం నెరవేరుస్తాడు కాని ఎప్పుడూ మనస్సులో వారు భగవంతునికి చెందుతారని గుర్తుంచుకుంటాడు. అందువల్ల వస్తువులను వాడతాడు కాని, వాటికి బందీ అవడు.

**ముక్తస్య** – వస్తువులతో సంబంధం ఉండటం వేరు, వస్తువులమీద బంధం పెంచుకోవటం వేరు. జ్ఞాని బంధం పెంచుకోడు కాబట్టి ముక్తపురుషుడు. ఎప్పుడైతే నావి అనుకున్నవి ఏమీ నావి కావు; అవి భగవంతునికి చెందుతాయని అని అర్థం చేసుకుంటాడో అప్పుడే అతనిలో ఒక నిశ్చింత ఏర్పడుతుంది; అందువల్ల ముక్తపురుషుడు అవుతాడు. ఆందోళననుంచి స్వేచ్ఛ పొందుతాడు. అందువల్ల స్వేచ్ఛ అంటే ఎక్కడో వింతలోకంలో పొందే వింతవస్తువు కాదు. స్వేచ్ఛ అంటే ఒత్తిడినుంచి స్వేచ్ఛ; ఆందోళననుంచి స్వేచ్ఛ; అభద్రతాభావననుంచి స్వేచ్ఛ.

**జ్ఞానావస్థితచేతసః** – ఈ స్వేచ్ఛ ఎలా వచ్చింది? జ్ఞానంలో నెలకొని ఉండటంవల్ల. అతను పొందిన జ్ఞానం ఏమిటి? తను ఆత్మ, ఈ ప్రపంచం అంతా అనాత్మ. ప్రపంచమంతా పంచభూతాలనుంచి ఏర్పడింది. శరీరం కూడా పాంచభౌతికమే. 'పంచభూతాలనుంచి వచ్చిన ఈ శరీరం ఎప్పుడో ఒకప్పుడు పంచభూతాలలో కలిసిపోవాల్సిందే. అలాంటప్పుడు అది నా స్వంతమని ఎలా అంటాను? నేను తాత్కాలికంగా ఈ ప్రపంచంతో వ్యవహారం నడపటానికి నాకు ఇవ్వబడింది ఈ శరీరం.' ఈ వివేకం అతనిలో వైరాగ్యం పెంచుతుంది. ఈ వేదాంతబోధను అతను ఎన్నడూ మర్చిపోడు.

**యజ్ఞాయ కర్మ ఆచరతః** – అటువంటి వ్యక్తి అన్ని కర్మలనూ యజ్ఞంలా చేస్తాడు. యజ్ఞం అంటే ఈశ్వరపూజ. అన్ని పనులనూ ఈశ్వరపూజగా చేస్తాడు. అదే అజ్ఞాని విషయం వచ్చేసరికి అపూర్ణభావనతో చేస్తాడు. ఈ కర్మ చేస్తే ఈ ఫలం వస్తుంది; నేను ఈ లాభం పొందుతాను అనుకుంటాడు. అజ్ఞాని ఆనందంకోసం కర్మ చేస్తాడు; జ్ఞాని ఆనందంతో కర్మ చేస్తాడు. అదీ వీరిద్దరి మధ్యనున్న సూక్ష్మభేదం. ఒకరు **ఆనందంకోసం**, ఇంకొకరు **ఆనందంతో** కర్మలు చేస్తారు. జ్ఞాని కర్మలు ఏమవుతాయి?

**సమగ్రం ప్రవిలీయతే** – అతని కర్మలన్నీ విలీనమవుతాయి. అంటే అతనికి ఆగామికర్మలు అంటవు. అతను వేయించిన విత్తనంలా ఉంటాడని చూశాము. వేయించిన విత్తనం మిగతా విత్తనాలలాగే ఉంటుంది చూడటానికి, కాని మొలకెత్తలేదు. అలాగే జ్ఞాని కర్మ కూడా అజ్ఞాని కర్మలాగా ఉంటుంది చూడటానికి, కాని చిన్న భేదం ఉంది. ఏమిటది? అజ్ఞాని కర్మ పుణ్యపాపాలను కలుగజేస్తే, జ్ఞాని కర్మ దేన్నీ కలుగజేయదు.

శ్లో. 24 **బ్రహ్మార్పణం బ్రహ్మ హవిర్బ్రహ్మాగ్నౌ బ్రహ్మణా హుతమ్ ।**
**బ్రహ్మైవ తేన గంతవ్యం, బ్రహ్మకర్మసమాధినా ॥**
బ్రహ్మ, అర్పణమ్, బ్రహ్మ, హవిః, బ్రహ్మాగ్నౌ, బ్రహ్మణా, హుతమ్,
బ్రహ్మ, ఏవ, తేన, గంతవ్యమ్, బ్రహ్మకర్మసమాధినా ॥

| | | | |
|---|---|---|---|
| అర్పణమ్, బ్రహ్మ | = యజ్ఞకర్మలందు వాడబడే స్రుక్ స్రువాది సాధనములు బ్రహ్మము | హుతమ్ | = హోమము చేయబడినది బ్రహ్మము |
| హవిః, బ్రహ్మ | = హోమద్రవ్యము | తేన, బ్రహ్మకర్మ | = ఆ బ్రహ్మరూపకర్మయందు స్థితుడైన |
| బ్రహ్మణా | = బ్రహ్మరూపకర్త ద్వారా | సమాధినా | = యోగి ద్వారా |
| బ్రహ్మాగ్నౌ | = బ్రహ్మరూపాగ్నియందు | గంతవ్యమ్ | = పొందదగినది (ఫలము) కూడ |
| | | బ్రహ్మ, ఏవ | = బ్రహ్మమే |

**బ్రహ్మ అర్పణం బ్రహ్మ హవిః బ్రహ్మ–అగ్నౌ బ్రహ్మణా హుతం,**
**బ్రహ్మ–కర్మ–సమాధినా తేన బ్రహ్మ ఏవ గన్తవ్యమ్ ॥**

తా: యజ్ఞకార్యములందు వాడబడే స్రుక్కు స్రువాది సాధనములు బ్రహ్మము. హోమము చేయబడు ద్రవ్యము బ్రహ్మము. అగ్నియు బ్రహ్మము. యజ్ఞము నాచరించు కర్తయు బ్రహ్మము. హవనక్రియలు బ్రహ్మము. ఈ బ్రహ్మకర్మయందు స్థితుడై యుండు యోగి ద్వారా పొందదగిన యజ్ఞఫలము గూడ బ్రహ్మమే.

ఈ శ్లోకంతో కృష్ణపరమాత్మ జ్ఞానం అంశాన్ని ముగిస్తున్నాడు. ఇది చాలా ముఖ్యమైన శ్లోకం; చాలా లోతైన శ్లోకం. ఇది కేవలం భోజనం చేసేముందు మాత్రమే చదివే శ్లోకం కాదు. కొన్నిచోట్ల భోజనం చేసేముందు చదువుతారు కాని దానిలో లోతైన వేదాంతబోధ ఉంది. అందువల్ల ముందు దాని ప్రాముఖ్యత చూద్దాము.

ఇంతవరకూ జ్ఞానం అంటే ఆత్మానాత్మ వివేకంగా చూపించాడు కృష్ణపరమాత్మ. ప్రతి వ్యక్తిలోనూ ఆత్మ, అనాత్మ అని రెండు అంశాలుంటాయనీ, ఆత్మకు ఐదు లక్షణాలుంటాయనీ చూశాము. ఆత్మ–అనాత్మల భేదాన్ని లేదా చేతన–అచేతన విభాగాన్ని రెండవ అధ్యాయంలో 12 నుంచి 25 వరకు, ఈ అధ్యాయంలో 18 నుంచి చూశాము.

**ఆత్మ-అనాత్మలను విడదీసి చూడటం మొదటి దశ.** దాని తరువాత ఆ ఆత్మను నేనే అని అర్థం చేసుకోవాలి. నాలో ఆత్మ ఉందని చెప్పే బదులు నేను ఆత్మను అని చెప్పగలగాలి. నేను ఆత్మను అని చెప్పగలిగాక, ఆత్మకు చెప్పిన ఐదు లక్షణాలను నాకు అన్వయించి చెప్పాలి.

నేను శరీరంలో ఒక భాగం కాదు. దాన్నుంచి ఉత్పత్తి చెందలేదు, శరీరం లక్షణాలు నాకు లేవు. శరీరం లేకపోయినా నేను ఉంటాను.

**అచ్ఛేద్యోఽ యమ్; అక్లేద్యోయమ్; అశోష్య ఏవ చ; న హన్యతే హన్యమానే శరీరే.**

శరీరం పడిపోయినా నేను ఆత్మగా ఉంటాను కాని ఈ ప్రపంచంతో వ్యవహారం నడపలేను. ఎందుకంటే వ్యవహారం నడిపే శరీరం ఉండదు కాబట్టి. నిద్రలో నేను వ్యవహారం నడపను. ఎందుకంటే నేను లేను అనలేను, నా మనస్సు, శరీరాలు పనిచేయటం లేదు కాబట్టి. **నేను ఆత్మను అని అర్థం చేసుకోవాలి. ఇది రెండవ దశ.**

నేను ఆత్మను అంటే అనేక ఆత్మలు ఉన్నట్టు అర్థం వస్తుంది. ఆత్మ సర్వవ్యాపకం. ఒక మాలలో అనేక పువ్వుల వెనక ఒకటే దారం ఉన్నట్టుగా, అనేక వస్తువులలో ఒకటే ఆకాశం ఉన్నట్టుగా, అనేక శరీరాలలో ఒకటే ఆత్మ ఉంది. నిజానికి శరీరాలన్నీ ఆత్మలోనే ఉన్నాయి. నాలో ఆత్మ ఉంది దశనుంచి ఆత్మలోనే శరీరాలన్నీ ఉన్నాయి దశకు చేరుకోవాలి. **శరీరాలు అనేకం, ఆత్మ ఏకం. ఇది మూడవ దశ.**

కాని ఇక్కడితో మన బోధ పూర్తికాలేదు. నేను ఆత్మ, తక్కినదంతా అనాత్మ అని అర్థం చేసుకున్నా కూడా, మన జ్ఞానం అసంపూర్ణమే. ఎందుకు? మనం ఇంకా ద్వైతంలోనే ఉన్నాము. అద్వైతానికి రాలేదు. ఇన్నాళ్ళు **నేను శరీరం** అనుకునే స్థాయినుంచి **నేను ఆత్మను** అని అర్థం చేసుకునే స్థాయికి ఎదగటమే ఒక పెద్దగెంతు!

కాని **బ్రహ్మసత్యం, జగన్మిథ్యా** అనే విషయాన్ని జీర్ణించుకుంటేనే వేదాంతబోధ పూర్తి అవుతుంది. కంటికి అక్షరాలా కనపడే జగత్తును ఎలా మిథ్య అని కొట్టి పారేస్తాము? అది అంత తేలికగా జీర్ణించుకోలేము. ఇది ఉపనిషత్తుల్లో వివరంగా వస్తుంది కాని గీతలో అంత స్పష్టంగా రాదు. నిజానికి ఒకటి రెండు చోట్లే ఈ ప్రసక్తి వస్తుంది. ఈ శ్లోకం ఆ ఒకటి రెండు చోట్లలో ఒకటి. ఏమిటా బోధ? **సాక్షిగా చూసే నాకు భిన్నంగా ఈ జగత్తు లేదు. ఇది నాలుగవ దశ.**

ఇదెలా జీర్ణించుకోగలమంటే, వేదాంతం ఒక్కటే ఉదాహరణను ఇస్తుంది. అది మన స్వప్న దృష్టాంతం. స్వప్నంలో మనకు భిన్నంగా, బాహ్యంగా స్వప్నప్రపంచాన్ని చూస్తాము. అది ఎంత వాస్తవికంగా ఉంటుందంటే, అవి చూసి భయపడతాము కూడా. పీడకలలు అంటాము వాటిని. కలలో పులి వెంటాడినట్టు వస్తుంది. అది పెద్దపులి; భయంకరంగా ఉంటుంది; మనం భయంతో ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని పరిగెడతాము. కలలో గురువు కనపడి, అది కల; నీనుంచే ఈ పులి వచ్చింది; నువ్వే నీ కలను సృష్టించావు; నీలోనే ఆ కల లయమవుతుంది అని చెప్పినా, కలలో ఉన్నంతసేపూ కలలోని గురువు మాట నమ్మము. ఎప్పుడు నమ్ముతాము? నిద్రనుంచి లేవగానే!

అదే విధంగా ఈ జాగృత్ ప్రపంచం కూడా ఒక కలే! అది రెండవ కల; దాన్నుంచి మేలుకో అంటుంది శాస్త్రం.

**ఉత్తిష్ఠత! జాగ్రత! ప్రాప్యవరాన్ నిబోధతః** – మన కలను ప్రాతిభాసిక కల అంటే జాగ్రత్ ప్రపంచాన్ని వ్యావహారిక కల అంటున్నది శాస్త్రం. అంటే ఆత్మకు భిన్నంగా ఏదీ లేదు.

ఈ జాగ్రత్ ప్రపంచాన్ని వ్యావహారిక కల అని ఎలా అంటున్నదో గీతలో మనకు వివరంగా రాదు. బ్రహ్మసత్యం, జగన్మిథ్యా వివరించటానికి ఉపనిషత్తు ఒక ప్రత్యేక పద్ధతిని ఉపయోగిస్తుంది. దాన్ని **కార్య–కారణ సంబంధం** అంటారు.

ఆత్మకారణం, అనాత్మకార్యం. అనాత్మ అంటే నా శరీరం, నా మనస్సు, మొత్తం ప్రపంచం. అనాత్మ కార్యం అంటే నా దృక్పథంలో మార్పు వస్తుంది. ఎలా? కారణం లేకుండా కార్యానికి విడిగా ఉనికి లేదు. బంగారం లేనిదే ఆభరణాలకు విడిగా ఉనికి లేదు. ఆభరణాలు అనేకం, బంగారం ఏకం. అలాగే నదులు, సముద్రాలు, కొలనులు అనేకం; కాని వాటి అన్నిటి వెనకనున్న నీరు ఒకటే. ఆభరణాల విషయంలో సర్వత్ర ఏకస్వర్ణదర్శనం చేస్తే; నదుల విషయంలో సర్వత్ర ఏకజలదర్శనం చేస్తాము. అలాగే నానాత్వం ఉన్న జగత్తులో జ్ఞాని **సర్వత్ర ఆత్మ దర్శనం** చేస్తాడు. దీన్ని **ఆత్మ ఏకత్వదర్శనం** అంటారు.

**సర్వభూతస్థమాత్మానం సర్వభూతాని చాత్మని సంపశ్యన్ బ్రహ్మ పరమం యాతి నాన్యేన హేతునా॥**
– కైవల్యమ్ 1.10

అదే భావన ఇక్కడ కూడా చూస్తాము.

**బ్రహ్మకర్మసమాధినా** – నానాత్వం ఉన్న ప్రపంచంలో ఏకత్వం చూసే వ్యక్తిని **బ్రహ్మకర్మసమాధి** అంటారు. ఇది జ్ఞానికి ఇచ్చిన బిరుదు. అనేక ఆభరణాలను బాహ్యంగా చూస్తున్నా కూడా వాటన్నిటి సారం బంగారమే అని తెలుసుకుంటాము. దాన్ని స్వర్ణ సమాధి అంటారు. సమాధి అంటే సత్యంలో నెలకొని ఉండటం. బ్రహ్మకర్మ సమాధి అంటే ఏ కర్మ చేస్తున్నా కూడా బ్రహ్మసత్యంలో నెలకొని ఉండటం.

ఒక వ్యక్తి ఢిల్లీకి ప్రయాణిస్తున్నాడు – మధ్యలో వచ్చే అనేక స్టేషన్లలో దిగుతాడు; నీళ్ళు, పుస్తకాలు, తినుబండారాలు అనేకం కొంటాడు. డబ్బు ఇచ్చి మర్చిపోకుండా చిల్లర కూడా తీసుకుంటాడు. కాని ఇన్ని వ్యవహారాలు చేస్తున్నా తను చివరగా వెళ్ళాల్సింది ఢిల్లీకి అని మర్చిపోడు. ఇక్కడ పది నిముషాలే ఆగుతుంది, నేను త్వరగా వెళ్ళాలి అనుకుంటాడు. అంటే చేతన మనస్సుతో ఏ వ్యవహారం నడుపుతున్నా కూడా సుప్తచేతన మనస్సులో ఢిల్లీ చింతన ఉంటూనే ఉంది. దీన్నే జ్ఞాననిష్ఠ లేదా ఆత్మనిష్ఠ లేదా బ్రహ్మనిష్ఠ అంటారు. బ్రహ్మ అన్నా, ఆత్మ అన్నా ఒకటే అని చూశాము. అటువంటి జ్ఞాననిష్ఠలో ఉన్న వ్యక్తిని బ్రహ్మకర్మసమాధి అంటారు.

ఈ శ్లోకంలో కృష్ణపరమాత్మ అటువంటి జ్ఞాననిష్ఠలో ఉన్న జ్ఞాని గురించి మాట్లాడుతున్నాడు. అతను సన్న్యాస జ్ఞాని గురించి మాట్లాడుతున్నాడా? గృహస్థ జ్ఞాని గురించి మాట్లాడుతున్నాడా? గృహస్థు గురించి.

గృహస్థు జ్ఞాని అయినా కూడా నిత్యం చేసే అగ్నిహోత్ర కర్మ చేస్తాడు. అతను నిత్యనైమిత్తిక కర్మలు మానలేదు. అందువల్ల ఈ శ్లోకంలో నిత్యనైమిత్తిక కర్మలు చేస్తున్న జ్ఞాని గురించి చెబుతున్నాడు. అతను అలా కర్మలు చేస్తున్నా కూడా సర్వం బ్రహ్మమయం జగత్తు అనే నిష్ఠలో ఉంటాడు. ఈ నిష్ఠను ఇక్కడ వర్ణిస్తున్నాడు.

**బ్రహ్మార్పణమ్** – అర్పణం అంటే ఆహుతులు వేయటానికి వాడే చెక్క గరిటెలు. వాటిని స్రుక్కు, స్రువం అంటారు. అర్పణం మాటకు అనేక అర్థాలున్నాయి కాని ఇక్కడ స్రుక్కు, స్రువంగా తీసుకోవాలి. వాటిని బ్రహ్మగా చూస్తాడు జ్ఞాని.

**భావాత్ అద్వైతం సదా కుర్యాత్, క్రియాత్ అద్వైతం కశ్చిత్ న కుర్యాత్।**

వ్యవహారపరంగా గాజుకు, గొలుసుకు మధ్యనున్న వ్యత్యాసం తెలుసు. గాజులు చేతికి, గొలుసు మెడలోనూ వేసుకుంటాము. కాని మనస్సులో మాత్రం సర్వం స్వర్ణమయం. అలాగే జ్ఞాని వ్యవహారం నడుపుతాడు.

**బ్రహ్మ హవిః** – ఆ స్రుక్కు, స్రువాలలో వాడే ద్రవ్యం బ్రహ్మ. అది నెయ్యి అయినా అవచ్చు, పాలు అయినా అవచ్చు.

**బ్రహ్మాగ్నౌ** – అగ్ని కూడా బ్రహ్మే!

**బ్రహ్మణా హుతమ్** – ఆ యజ్ఞం చేసే వ్యక్తి కూడా బ్రహ్మే.

**బ్రహ్మైవ తేన గంతవ్యమ్** – యజ్ఞం చేసిన వ్యక్తికి పుణ్యఫలంగా స్వర్గలోకప్రాప్తిని చెబుతుంది వేదం. జ్ఞానికి స్వర్గంమీద మోహం లేదు. ఎందుకు? స్వర్గం కూడా బ్రహ్మే! అక్కడ ఉండే పాండురంగడు ఇక్కడ ఉన్నాడు. ఎవరనుకుంటారు?

**బ్రహ్మకర్మసమాధినా** – బ్రహ్మనిష్ఠలో ఉన్న జ్ఞాని అనుకుంటాడు. దీన్ని సర్వత్ర బ్రహ్మదర్శనం అంటారు.

**బ్రహ్మైవేదమమృతం పురస్తాద్ బ్రహ్మ పశ్చాత్** – ముండకమ్ – 2.2.11

ఉన్నది ఒక్కటే బ్రహ్మ. తక్కినవన్నీ నామ రూపాలు మాత్రమే.

శ్లో. 25 **దైవమేవాపరే యజ్ఞం యోగినః పర్యుపాసతే ।**
**బ్రహ్మాగ్నావపరే యజ్ఞం యజ్ఞేనైవోపజుహ్వతి ॥**
దైవమ్, ఏవ, అపరే, యజ్ఞమ్, యోగినః, పర్యుపాసతే,
బ్రహ్మాగ్నౌ, అపరే, యజ్ఞమ్, యజ్ఞేన, ఏవ, ఉపజుహ్వతి ॥

| | | | |
|---|---|---|---|
| అపరే | = ఇతరులు (కొందరు) | బ్రహ్మాగ్నౌ | = పరబ్రహ్మ పరమాత్మ రూప అగ్నియందు |
| యోగినః | = యోగులు | యజ్ఞేన, ఏవ | = (అభేదదర్శనరూప) యజ్ఞము ద్వారా మాత్రమే |
| దైవమ్, యజ్ఞమ్, ఏవ | = దైవపూజా రూప యజ్ఞమునే | యజ్ఞమ్ | = ఆత్మరూపయజ్ఞమును |
| పర్యుపాసతే | = చక్కగా అనుష్ఠింతురు | ఉపజుహ్వతి | = ఆచరింతురు |
| అపరే | = మరికొందరు | | |

**అపరే యోగినః దైవమ్ ఏవ యజ్ఞం పర్యుపాసతే, అపరే**
**బ్రహ్మ-అగ్నౌ యజ్ఞేన యజ్ఞమ్ ఏవ ఉపజుహ్వతి ।**

తా: కొందరు యోగులు దైవపూజారూపయజ్ఞమును చక్కగా అనుష్ఠింతురు. మరికొందరు యోగులు బ్రహ్మాగ్నియందు అంటే పరబ్రహ్మ పరమాత్మరూపాగ్నియందు అభేద దర్శనరూపయజ్ఞము ద్వారా ఆత్మ రూపయజ్ఞమును ఆచరింతురు.

**3 జ్ఞానసాధన, ఫలాలు శ్లోకాలు 25-42 –** ముందు శ్లోకంతో జ్ఞానం గురించిన వివరణ అయిపోయింది. 25 నుంచి 33 వరకు జ్ఞానస్తుతి వస్తుంది. దీనికి ఒక ప్రత్యేక పద్ధతిని వాడుతున్నాడు కృష్ణపరమాత్మ. అనేక సాధనలను చెప్పి, చివరగా జ్ఞానసాధన అన్నిటికన్నా గొప్పదని నిరూపించబోతున్నాడు.

**ఎ) జ్ఞానయజ్ఞసాధనలు –** శ్లోకాలు 25-33 మన హిందూమతంలో అనేక సాధనలున్నాయి. ఒక్కొక్కరు ఒక్కొక్కటి గొప్పది అంటారు. నామజపం, ధ్యానం, యోగాసనం, తీర్థయాత్రలు, దానం – ఇలా ఎన్నో ఉన్నాయి. కృష్ణపరమాత్మ వాటిల్లో 12 ఎన్నుకున్నాడు. ఈ సాధనలన్నిటికీ యజ్ఞం మాట కలిపాడు. జపయజ్ఞం, ధ్యానయజ్ఞం, ఉపవాసయజ్ఞం, యాత్రయజ్ఞం, ప్రాణాయామయజ్ఞం వగైరా. ఎందుకంటే అన్ని యజ్ఞాల్లోనూ సమానంగా ఉన్న అంశం – భగవానుడు. అన్నిటిలోనూ –

**మమోపాత్త సమస్త దురితక్షయ ద్వారా శ్రీ పరమేశ్వరప్రీత్యర్థమ్**

అంటాము. మనలోని మలినాలు పోగొట్టి, మనకు భగవానుడు చిత్తశుద్ధి కలుగజేయాలని కోరుకుంటాము.

యజ్ఞం అంటే అగ్ని, ఆహుతులు ఉండితీరాలని లేదు. ఆఖరికి మన ఇంటిని శుభ్రం చేస్తున్నప్పుడు కూడా, ఇంటిని దేవాలయంగా భావిస్తే, దేవాలయాన్ని శుభ్రం చేసినట్టు అవుతుంది. అందువల్ల మన దృక్పథం మారాలి. ప్రతిదీ ఒక పూజలాగా చేస్తే, మనం శుద్ధి పొందుతాము. అందువల్ల కృష్ణపరమాత్మ అన్నిటినీ యజ్ఞం అంటున్నాడు.

ఆఖరికి భోజనం చేయటం కూడా యజ్ఞమే! మన ఉదరంలోకి భగవంతుణ్ణి ఆవాహన చేస్తే, తినటం కూడా యజ్ఞమే! 15వ అధ్యాయంలో నేను అందరి ఉదరంలోనూ ఉంటానని చెబుతాడు. దీన్ని ప్రాణాగ్నిహోత్ర యజ్ఞం అంటారు. ఆ విధంగా అత్యంత స్థూలవిషయమైన భోజనం చేయటం దగ్గరనుంచి, అత్యంత గొప్ప విషయమైన జ్ఞానం దాకా, అన్నీ యజ్ఞాలే. శాస్త్రాన్ని అధ్యయనం చేయటం కూడా ఒకవిధమైన యజ్ఞమే.

అందువల్లనే గీత గురించిన ప్రవచనాలను **జ్ఞానయజ్ఞం** అంటారు. చిన్మయానందస్వామి మొట్టమొదట వాడారు ఈ జ్ఞానయజ్ఞం పదాన్ని. కృష్ణపరమాత్మ ఈ యజ్ఞాలన్నిటినీ పేర్కొన్నాక, బ్రహ్మజ్ఞానయజ్ఞం అన్నిటికన్నా గొప్ప ఆధ్యాత్మిక సాధన అని చెప్పబోతున్నాడు. ఎందుకు గొప్పదో కూడా కృష్ణపరమాత్మే తరువాత కారణాన్ని చెబుతాడు; కాని ఇక్కడ ఒక విషయాన్ని సరిగ్గా అర్థం చేసుకోవాలి. కృష్ణపరమాత్మ తక్కిన యజ్ఞాలవల్ల ఏమీ ప్రయోజనం లేదని అనటం లేదు. అన్నీ ఉపయోగపడే సాధనలే, కాని ఏవీ ప్రత్యక్షంగా భగవంతుని దగ్గరకు

తీసుకువెళ్ళవు. అవి గీతాబోధకు తీసుకువెళతాయి. అందువల్ల జ్ఞానం మాత్రమే మోక్షాన్నిస్తుంది కాబట్టి జ్ఞానయజ్ఞాన్ని సాక్షాత్ సాధన అనీ, తక్కిన సాధనలను పరంపర సాధనలనీ అంటారు.

ఉదాహరణకు చీకటిగా ఉన్న గదినుంచి చీకటిని పారద్రోలాలంటే ఒక దీపం తెచ్చి, అందులో నూనె పోసి, వత్తులు వేసి, అగ్గిపెట్టె తెస్తారు. అవన్నీ అవసరమే కాని, వాటివల్ల చీకటి పోదు; ఆ దీపాన్ని వెలిగించాలి; అప్పుడే చీకటి పోతుంది. అందువల్ల పైన చెప్పినవన్నీ పరంపర సాధనలు అయితే, జ్యోతి సాక్షాత్ సాధన. ఇవి లేకుండా జ్యోతి వెలగదు. అలాగే తక్కిన సాధనలు లేకుండా జ్ఞానసాధన సాధ్యం కాదు.

**జ్ఞానయోగానికి రానిదే కర్మయోగం అసంపూర్ణం**
**కర్మయోగం లేనిదే జ్ఞానయోగం అసంభవం**

అందువల్ల తక్కిన సాధనలు ఎన్ని చేసినా, ఎప్పుడో అప్పుడు జ్ఞానానికి వచ్చితీరాలి. నాకు జ్ఞానం వద్దు, కర్మలే చేస్తానంటే చేయండి. కాని ఇప్పుడు కాకపోతే కొన్ని సంవత్సరాల తరువాతైనా, కొన్ని జన్మల తరువాతైనా జ్ఞానానికి రావాలి. జ్ఞానంవల్లనే మోక్షం పొందుతారు. ఇదీ ఈ శ్లోకాల సారాంశం. అనేక యజ్ఞాల గురించి చెప్పబోతున్నాడు. ముందు మనం జ్ఞానయజ్ఞం తీసుకుందాము. అది రెండవపాదంలో వస్తుంది.

1. **జ్ఞానయజ్ఞం** – మామూలుగా యజ్ఞం చేసేటప్పుడు అగ్నిలో ఆహుతులు వేస్తారు. జ్ఞానయజ్ఞాన్ని యజ్ఞం అంటే అందులో అగ్ని ఏది? ఆహుతులు ఏమిటి? పరమాత్మ అగ్ని, జీవాత్మ లేదా అహంకారం ఆహుతులు అంటున్నాడు కృష్ణపరమాత్మ.

**బ్రహ్మాగ్నావపరే యజ్ఞం యజ్ఞేనైవోపజుహ్వతి** – పరమాత్మ అగ్ని; అహంకారం ఆహుతి. గీతాధ్యయనం ద్వారా జీవాత్మ, పరమాత్మల ఐక్యం అర్థం చేసుకోవాలి. ఉదాహరణకు అల విషయం తీసుకుంటే ఒక అల తను చిన్న అలను అనుకుంటే, తనకు పరిమితి ఉందనీ; చావుపుట్టుకలు ఉన్నాయనీ బాధపడుతుంది. ఒక గురువు ద్వారా తను చిన్న అల కాదనీ, తనలోనూ సముద్రంలోనూ ఉన్నది నీరేనని తెలుసుకుంటుంది. అంటే తను నీరు ఉన్న చిన్న అల కాదు, నీటిగా సముద్రానికే అధిష్ఠానం అని తెలుసుకుంటుంది.

**న జాయతే మ్రియతే వా కదాచిత్ నాయం భూత్వా భవితా వా న భూయః ।**
**అజో నిత్యః శాశ్వతోఽయం పురాణో న హన్యతే హన్యమానే శరీరే ॥** – 2.20

ఎంత మార్పు వస్తుందో చూడండి! నేను చిన్న అలను అని బాధపడే స్థాయినుంచి, నేను నీరుగా అధిష్ఠానాన్ని అని అర్థం చేసుకునే స్థాయికి వస్తుంది.

అలాగే మనం ఏం చేయాలి? యజ్ఞమ్ ఉపజుహ్వతి – ఇక్కడ యజ్ఞం జీవాత్మ లేదా అహంకారం. ఈ జీవాత్మను ఎందులో ఆహుతిగా వెయ్యాలి? బ్రహ్మాగ్నౌ – పరమాత్మలో వెయ్యాలి. జీవాత్మను పరమాత్మలో వెయ్యాలంటే అక్షరాలా వెయ్యటానికి లేదు. అల విషయంలో ఏం జరిగింది? అల ముందు తను అల అనుకుంది; తరువాత తను నీరు అని తెలుసుకుంది. అంటే అర్థం చేసుకోవటంలో వచ్చిన మార్పు అది.

ఇక్కడ ఆహుతి వేయటం అనేది పూర్తిగా బుద్ధికి సంబంధించిన పని. అర్థం చేసుకోవటంలో కలిగే మార్పు. అంతకుముందు ఆభరణాలను చూసే మనం, ఆభరణాలన్నింటిలోనూ ఉన్నది బంగారమే అని అర్థం చేసుకున్నాక, ఆభరణాల వెనకనున్న బంగారాన్ని చూస్తాము. ఈ బుద్ధిలో కలిగే ఈ మార్పును జ్ఞానయజ్ఞం అంటారు. ఎవరు చేస్తారు ఆ పని? **యజ్ఞేనైవ** – జీవాత్మే చేస్తుంది. అందువల్ల ఈ వాక్యాన్ని ఇలా చదవాలి – జీవాత్మ, జీవాత్మనే పరమాత్మ అనే అగ్నిలో ఆహుతిగా వేస్తుంది. దీన్ని జ్ఞానయజ్ఞం అంటారు.

నవవిధభక్తిలో ఆఖరిభక్తి ఆత్మ నివేదనం. అవి వరుసగా – శ్రవణం, కీర్తనం, విష్ణుస్మరణం, పాదసేవనం, అర్చనం, వందనం, దాస్యం, సఖ్యం, ఆత్మనివేదనం. తక్కిన సేవల్లో మనం పండ్లు, పాలు లాంటి ద్రవ్యాలను ప్రసాదంగా సమర్పిస్తాము. ఏదైనా సమర్పించినప్పుడు మన అహంకారం పెరుగుతుంది కూడా. నేను భగవంతునికి ఇన్ని లక్షలు ఇచ్చాను అంటాము. ప్రతి దానానికీ ఆర్భాటం చేసి ఫోటోలు తీయించుకుంటాము. కాని ఆత్మనివేదన అంటే మనను మనమే నివేదించుకోవటం. అలా ఆత్మనివేదన చేసిన భక్తుణ్ణి నువ్వు ఏమిచ్చావు అంటే నేను విడిగా లేనప్పుడు, నేను ఇచ్చే ప్రసక్తి ఎక్కడ వస్తుంది అంటాడు. ఈ ఆత్మనివేదన జ్ఞానం ద్వారానే సాధ్యమవుతుంది. **సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ** అర్థం ఇదే. ఆత్మనివేదన రూపంలో జ్ఞాన యోగ భక్తి చూపించు. **జ్ఞానయజ్ఞం** మొదటి యజ్ఞం.

2. **దైవయజ్ఞం–** మొదటిపాదంలో దైవయజ్ఞం గురించి వస్తుంది.

**యోగినః అపరే దైవం యజ్ఞం పర్యుపాసతే** – కొంతమంది దైవయజ్ఞం చేస్తారు. దైవయజ్ఞం అంటే అగ్నిహోత్ర యజ్ఞం లేదా పూజ. అనేక దేవతలను ఆవాహన చేస్తారు. అందరూ జ్ఞానయజ్ఞానికి రాలేరు. కొందరు దైవయజ్ఞాన్నే ఇష్టపడతారు.

శ్లో. 26 **శ్రోత్రాదీనీంద్రియాణ్యన్యే సంయమాగ్నిషు జుహ్వతి ।**
**శబ్దాదీన్ విషయానన్య ఇంద్రియాగ్నిషు జుహ్వతి ॥**
శ్రోత్రాదీని, ఇంద్రియాణి, అన్యే, సంయమాగ్నిషు, జుహ్వతి,
శబ్దాదీన్, విషయాన్, అన్యే, ఇంద్రియాగ్నిషు, జుహ్వతి ॥

| | | | |
|---|---|---|---|
| అన్యే | = కొందరు యోగులు | అన్యే | = మరికొందరు యోగులు |
| శ్రోత్రాదీని | = శ్రోత్రాది సమస్త | శబ్దాదీన్ | = శబ్దాది సమస్త |
| ఇంద్రియాణి | = ఇంద్రియములను | విషయాన్ | = విషయములను |
| సంయమాగ్నిషు | = సంయమన రూపాగ్నులందు | ఇంద్రియాగ్నిషు | = ఇంద్రియ రూపాగ్నులందు |
| జుహ్వతి | = హెూమము చేయుదురు | జుహ్వతి | = హవనము చేయుదురు. |

**అన్యే శ్రోత్ర–ఆదీని ఇన్ద్రియాణి సంయమ–అగ్నిషు జుహ్వతి, అన్యే**
**శబ్ద–ఆదీన్ విషయాన్ ఇన్ద్రియ–అగ్నిషు జుహ్వతి ।**

తా: కొందరు యోగులు శ్రోత్రాది-ఇంద్రియములను సంయమన రూపాగ్నులయందు హోమము చేయుదురు. మరికొందరు యోగులు శబ్దాది సమస్త విషయములను ఇంద్రియరూపాగ్నులందు హవనము చేయుదురు. అంటే – యోగులు మనోనిగ్రహము ద్వారా ఇంద్రియములను అదుపు చేయుదురు. తత్ఫలితముగా శబ్దాది విషయములు ఎదురుగా ఉన్నను లేకున్నను వాటి ప్రభావము వారి ఇంద్రియములపై ఏ మాత్రమూ ఉండదు.

ఈ శ్లోకంలో మరిరెండు యజ్ఞాలు చూస్తాము.

3. **దమయజ్ఞం** – దమం అంటే ఇంద్రియనిగ్రహం. ఇంద్రియనిగ్రహం వేరు, ఇంద్రియాలను అణగద్రొక్కటం వేరు. గుర్తుంచుకోండి, శాస్త్రం ఎప్పుడూ ఇంద్రియాలను అణగద్రొక్కమని చెప్పదు. ఎందుకంటే ఇంద్రియాలకు బానిస అవటం ఎంత ప్రమాదకరమో, ఇంద్రియాలను అణగద్రొక్కటం కూడా అంతే ప్రమాదకరం.

అణగద్రొక్కటం ఎవరో బలవంతపెడితే జరుగుతుంది. ఇంద్రియనిగ్రహం మీ స్వయం నిర్ణయంతో జరుగుతుంది. ఉదాహరణకు మీరు ఏకాంతం కోరుకుని, మీ అంతట మీరు ఒక గదిలో తలుపు వేసుకుని గంటసేపు కూర్చుంటే అది ఇంద్రియనిగ్రహం అవుతుంది. అదే ఎవరో మిమ్మల్ని బలవంతంగా ఒకగదిలో తలుపువేసి గంటసేపు కూర్చోబెడితే అది అణగద్రొక్కటం అవుతుంది.

ఇక్కడ ఇంద్రియసంయమనం అంటే బలవంతంగా కాదు, మీ ఇష్టపూర్వకంగా మీరు కొన్ని వదులుకోవటానికి సిద్ధపడటం. దీన్ని దమం అంటారు. ఇది వివేకంతో కూడిన, ఇచ్ఛాపూర్వకమైన నిగ్రహం; బలవంతంగా చేసేది కాదు. దీన్ని కూడా యజ్ఞం అంటారు. దీన్ని దమయజ్ఞం అంటారు.

**శ్రోత్రాదీనీంద్రియాణ్యన్యే సంయమాగ్నిషు జుహ్వతి** – ఇక్కడ కూడా నిజంగా యజ్ఞం జరగటం లేదు. ఒక వ్యక్తి ఇంద్రియనిగ్రహం పాటిస్తే, అదుపు తప్పిన ఇంద్రియాలను ఆహుతిగా వేసినట్టు అర్థం. యజ్ఞంలో నెయ్యివేస్తే, నెయ్యి కనపడదు. అలాగే ఈ యజ్ఞంలో అదుపుతప్పిన ఇంద్రియాలు మాయమవుతాయి. వాటి స్థానంలో అదుపులోకి వచ్చిన ఇంద్రియాలు వస్తాయి. అంటే అదుపు తప్పిన ఇంద్రియాలనే ఆహుతులను, అదుపులో ఉన్న ఇంద్రియాలనే యజ్ఞంలో వేస్తారు.

4. **విషయభోగ యజ్ఞం** – ఇంతకుముందు యజ్ఞంలో ఇంద్రియనిగ్రహం చూశాము. ఇంద్రియాలు అదుపు తప్పితే, అవి మీకు యజమాని అయి కూర్చుంటాయి; మీరు వాటికి బానిసనవుతారు. అలా బానిస అవుతున్నట్టు తెలిస్తే, సాధకుడిగా మీరు వాటిని అదుపులో పెట్టుకోవాలి. మీరు కాఫీకి బానిస కాకూడదు. మీకిష్టమైనప్పుడు తాగాలి. నాలుక పీకుతున్నదని తాగితే, మీరు నాలుకకు బానిస అయినట్టు అర్థం. అలాంటప్పుడు వారం రోజులు కాఫీ తాగనని నియమం పెట్టుకోవాలి. అలా నియమం పెట్టుకున్నప్పుడు నాలుక మిమ్మల్ని ఆడించకూడదు.

అలా మీ ఇంద్రియాలను అదుపులో పెట్టుకుని, ఇంద్రియ విషయ వస్తువులను అనుభవిస్తారు. అంతకుముందు ఇంద్రియాలు కోరినవాటికి 'నో' అని చెప్పటం ఒక యజ్ఞం. ఇప్పుడు వాటి విషయ వస్తువులను అనుభవించటం ఇంకొక యజ్ఞం. ఈ యజ్ఞంలో హోమకుండం ఇంద్రియాలు; అందులో వేసే ఆహుతులు – విషయ వస్తువులు.

**సప్త ప్రాణాః ప్రభవంతి తస్మాత్ సప్తార్చిషః సమిధః సప్తహోమాః ।**
**సప్త ఇమే లోకా ఏషు చరంతి ప్రాణా గుహాశయా నిహితాః సప్త సప్త ॥** – ముండకమ్ 2.1.8

ముండకోపనిషత్తు ఐదు ఇంద్రియాలను ఏడుగా వర్ణిస్తుంది. అవి రెండు కళ్ళు, రెండు చెవులు, రెండు నాసికాపుటలు, ఒక నోరు. కళ్ళనే హోమకుండంలో అనేక రంగు, రూపాలను వేస్తారు. చెవులనే హోమకుండంలో అనేక శబ్దాలను వేస్తారు. అలా ఏదో ఒక హోమకుండంలో ఏదో ఒక ఆహుతి వేస్తూనే ఉంటారు. ఆ విధంగా తినటం కూడా ఒక యజ్ఞమే!

**అన్యే శబ్దాదీన్ విషయాన్ జుహ్వతి** – మరికొంతమంది శబ్దంలాంటి విషయాలను హోమంలో వేస్తారు. శబ్దాదీన్ అంటే శబ్దం, స్పర్శ, రూపం, రసం, గంధం. మీ రోజువారీ కార్యక్రమాలను యాగంలా మలుచుకోవటానికి ఒక అద్భుతమైన ప్రార్థన ఉంది.

**ఆత్మాత్వం గిరిజా మతిః సహచరాః ప్రాణాః శరీరం గృహం**
**పూజా తే విషయోపభోగరచనా నిద్రా సమాధి స్థితిః**
**సంచారః పదయోః ప్రదక్షిణవిధిః స్తోత్రాణి సర్వాగిరో**
**యద్యత్ కర్మ కరోమి తత్తదఖిలం శంభో తవారాధనమ్॥ –** శివ మానసపూజ

ఓ శివశంభో, నువ్వు నాలో ఆత్మగా ఉన్నావు. నా మనస్సు పార్వతీదేవి, నా ప్రాణాలు శివగణాలు, నా అనుభవాలన్నీ నీకు ఆహుతులు. నేను రోజూ ఎక్కడికి నడిచినా అది నీ ప్రదక్షిణం, నేను ఏం మాట్లాడినా అది నీ స్తుతి, నేను చేసే ప్రతిపని కూడా నీ ఆరాధనే! ఈ ఆరాధన ఎప్పుడు సాధ్యం? నా దృక్పథం మారితే సాధ్యం! భగవంతుడు నాలో ఉన్నాడు అనే దృక్పథం అలవరచుకోవాలి. అప్పుడు నేను చూసేది, తినేది, వినేది అన్నీ భగవంతునికి అర్పించే పువ్వులు అవుతాయి. నిజానికి దీన్ని దృక్పథం అంటే చాలదు; అది నిజం కూడా! భగవంతుడు ఎవరు? చైతన్యం. ఆ చైతన్యం నాలో ఉంది; అందువల్ల నేనేం చేసినా అది చైతన్యానికి చెందుతుంది. శబ్దం చేస్తే అది శబ్దజ్ఞానం అవుతుంది; స్పర్శ అనుభవిస్తే అది స్పర్శజ్ఞానం అవుతుంది.

శ్లో. 27 **సర్వాణీంద్రియకర్మాణి ప్రాణకర్మాణి చాపరే ।**
**ఆత్మసంయమయోగాగ్నౌ జుహ్వతి జ్ఞానదీపితే ॥**
సర్వాణి, ఇంద్రియకర్మాణి, ప్రాణకర్మాణి, చ, అపరే,
ఆత్మసంయమయోగాగ్నౌ, జుహ్వతి, జ్ఞానదీపితే ॥

| | | | |
|---|---|---|---|
| అపరే | = మరికొందరు యోగులు | జ్ఞానదీపితే | = జ్ఞానముచే ప్రకాశితమైన |
| సర్వాణి, | = ఇంద్రియ కర్మలను | ఆత్మసంయమ | = ఆత్మసంయమ |
| ఇంద్రియకర్మాణి | అన్నింటిని | యోగాగ్నౌ | యోగరూపాగ్నియందు |
| చ | = ఇంకా | జుహ్వతి | = హవనము చేయుచుందురు |
| ప్రాణకర్మాణి | = ప్రాణక్రియలను అన్నింటిని | | |

**అపరే జ్ఞాన-దీపితే ఆత్మ-సంయమ-యోగ-అగ్నౌ సర్వాణి**
**ఇన్ద్రియ-కర్మాణి ప్రాణ-కర్మాణి చ జుహ్వతి ।**

తా: మరికొందరు యోగులు ఇంద్రియముల క్రియలను, ప్రాణముల క్రియలను అన్నింటిని జ్ఞానముచే ప్రకాశితమైన ఆత్మసంయమయోగరూపాగ్నిలో హవనము చేయుచుందురు. అటువంటి వారు పూర్తిగా పరమాత్మయందే స్థితులై యుందురు. అప్పుడు ప్రాణ-ఇంద్రియక్రియల ప్రభావము వారిపై ఏ మాత్రమూ ఉండదు. ఎందుకంటే వారి బుద్ధియందు పరమాత్మ మాత్రమే నిలిచియుండును.

ఈ శ్లోకంలో మరొక యజ్ఞం చూస్తాము.

5. **ఆత్మసంయమయజ్ఞం** – ఆత్మ సంయమయజ్ఞం అంటే మనోయజ్ఞం. ఇది ఇంద్రియనిగ్రహంకన్నా కష్టతరమైనది. ఎందుకు? మీ కంటికి నచ్చని విషయం ఒకటి ఎదురుగా ఉంటే, మీరు కళ్ళు మూసుకోవచ్చు. కర్ణకఠోరమైన శబ్దాలు వినిపిస్తుంటే చెవులు మూసుకోవచ్చు లేదా అక్కడినుంచి వెళ్ళిపోవచ్చు. కాని మనస్సు విషయంలో అలాకాదు. అక్కడినుంచి వెళ్ళినా, ఆలోచన వదలదు. కొంతమంది ఈ యజ్ఞాన్ని పాటిస్తారు.

ఈ మనోనిగ్రహం పాటిస్తే పది ఇంద్రియాలూ మీ ఆధీనంలో ఉంటాయి. కన్ను, ముక్కు, చెవి, నోరు, చర్మాలు – పంచజ్ఞానేంద్రియాలు; వాక్కు, పాణి, పాదం, పాయు, ఉపస్థలు – పంచ కర్మేంద్రియాలు. ఈ పదీ వాటిష్టం వచ్చినట్టు ప్రవర్తిస్తాయి. వీటిని దుష్ట అశ్వాలు అంటుంది కఠోపనిషత్తు. వాటిని అదుపులో పెట్టగలిగింది ఎవరు? మనస్సు! అందువల్ల మనస్సును అదుపులో పెట్టగలిగితే, తక్కినవన్నీ అవే మాట వింటాయి. ఒక్క నోరుని అదుపులో పెడితేనే తక్కిన ఇంద్రియాలు లొంగుతాయి. నోరు అంటే తినే నోరు, మాట్లాడే నోరు కూడా. దీన్ని ఇంద్రియనిగ్రహం లేదా దమం అంటారు. నోటిని కూడా అదుపులో పెట్టేది మనస్సు. దీన్ని మనోనిగ్రహం లేదా శమం అంటారు.

**సర్వాణి ఇంద్రియకర్మాణి** – జ్ఞానేంద్రియాలు చేసే అన్ని కర్మలనూ; **ప్రాణకర్మాణి చ** – అంటే కర్మేంద్రియాలు చేసే అన్ని పనులనూ; **అపరే** – మరికొందరు; **ఆత్మసంయమ యోగాగ్నౌ** – మనస్సనే అగ్నిలో వేస్తారు. మనస్సును అదుపులో పెట్టకుండా ఇంద్రియాలను మాత్రం అదుపులో పెట్టాలని చూస్తే అది శాశ్వతపరిష్కారం కాదు. పిల్లలను బలవంతంగా అదుపులో పెట్టినట్టు ఉంటుంది అది. అలా నియంత్రించబడిన పిల్లలు తల్లిదండ్రులు ఎదురుగా ఉన్నంతసేపే బుద్ధిగా ఉంటారు. తరువాత వారిష్టం వచ్చినట్టు ప్రవర్తిస్తారు. అందువల్ల బలవంతం చేయకూడదు. మనస్సుకు నచ్చచెప్పాలి. వివేకం ద్వారా వచ్చే వైరాగ్యమే పదికాలాలు నిలుస్తుంది.

మనస్సును అదుపులో పెట్టటమంటే ఆలోచనలను అదుపులో పెట్టటం. ఆలోచనల సంఖ్యను, ఆలోచనల తీరును కూడా అదుపులో పెట్టాలి. ముందు సంఖ్యను తగ్గించుకుంటే, తీరుతెన్నులు గమనించటం తేలిక అవుతుంది. సంఖ్య ఎక్కువ ఉంటే నాణ్యత గమనించటం కష్టమవుతుంది. ఇది రోజంతా చేస్తూ ఉండాలి కాబట్టి కొంచెం కష్టమే. దీన్ని **శమయజ్ఞం** అంటారు.

శ్లో. 28 **ద్రవ్యయజ్ఞాస్తపోయజ్ఞా యోగయజ్ఞాస్తథాపరే ।**
**స్వాధ్యాయజ్ఞానయజ్ఞాశ్చ యతయః సంశితవ్రతాః ॥**
ద్రవ్యయజ్ఞాః, తపోయజ్ఞాః, యోగయజ్ఞాః, తథా, అపరే,
స్వాధ్యాయజ్ఞానయజ్ఞాః, చ, యతయః, సంశితవ్రతాః ॥

| | | | |
|---|---|---|---|
| అపరే | = కొందరు | చ | = ఇంకా |
| ద్రవ్యయజ్ఞాః | = ద్రవ్యసంబంధ యజ్ఞములను | సంశితవ్రతాః | = అహింసాది తీవ్రవ్రతములను చేపట్టిన |
| తపోయజ్ఞాః | = (కొందరు) తపోరూప యజ్ఞములను | యతయః | = యత్నశీలురైన వారు |
| తథా | = అలాగే | స్వాధ్యాయజ్ఞాన యజ్ఞాః | = స్వాధ్యాయరూప జ్ఞాన యజ్ఞములను ఆచరింతురు. |
| యోగయజ్ఞాః | = (కొందరు) యోగరూప యజ్ఞములను | | |

**అపరే సంశితవ్రతాః ద్రవ్య-యజ్ఞాః తపో-యజ్ఞాః యోగ-యజ్ఞాః**
**తథా చ స్వాధ్యాయ-జ్ఞాన-యజ్ఞాః యతయః (సన్తి) ।**

తా: కొందరు ద్రవ్యసంబంధ యజ్ఞములను, మరికొందరు తపోరూపయజ్ఞములను, కొందరు యోగరూప యజ్ఞములను చేయుదురు. మరికొందరు అహింసాది తీవ్రవ్రతములను చేపట్టి, యత్నశీలురై స్వాధ్యాయరూప జ్ఞానయజ్ఞములను ఆచరింతురు.

ఈ శ్లోకంలో ఐదు ఆధ్యాత్మిక సాధనలను ఇస్తున్నాడు కృష్ణపరమాత్మ. అవి వరుసగా ద్రవ్యయజ్ఞం; తపోయజ్ఞం; యోగయజ్ఞం; స్వాధ్యాయయజ్ఞం; జ్ఞానయజ్ఞం.

6. **ద్రవ్యయజ్ఞం** – ద్రవ్యయజ్ఞం అంటే దానయజ్ఞం. దానం అంటే ధనమే ఇవ్వాలని నియమం లేదు. వస్త్రాలు ఇవ్వవచ్చు; జ్ఞానం ఉచితంగా పంచవచ్చు; మీ సమయాన్ని ఇతరులకు వెచ్చించవచ్చు; నాలుగు మంచి మాటలు చెప్పి రోగిని ఓదార్చవచ్చు. ఇది చాలా ముఖ్యమైన దానం. ఎందుకంటే సృష్టిలో ప్రతిదీ ఒక ప్రవాహంలా సాగుతుంది. ఏదీ నిశ్చలంగా ఒకచోట ఉండదు.

నది విషయమే తీసుకోండి – అది కొండలనుంచి నీరు తీసుకుని సముద్రానికి ఇస్తుంది. ఒకపక్క తీసుకుని, మరొకపక్క ఇస్తుంది. సముద్రమూ అంతే! ఒకపక్క తీసుకుని, మేఘాలకు ఇస్తుంది. మేఘమూ అంతే నీరు తీసుకుని కొండలకు ఇస్తుంది. మళ్ళీ ఆ నీరు నదిగా మారుతుంది. అంటే అంతా ఒక వృత్తంలా సాగుతున్నది. ఇదే కాదు, ఏదైనా అంతే! ఆహారం ఒక వృత్తం. ప్రాణవాయువు ఒక వృత్తం.

మీరు లోభిగా ఉండి ఇవ్వకపోతే ఆ వృత్తం తెగిపోతుంది. వృత్తం అంటే తీసుకోవాలి, ఇవ్వాలి. కోటికి పడగలెత్తుతున్నా సరే కొంతమందికి ఇవ్వాలని ఉండదు. హారతి పళ్ళెంలో ఒక్కరూపాయి వెయ్యటానికి కూడా మనస్సు రాదు. ఒక రూపాయి వేసి, అర్ధరూపాయి వెనక్కి తీసుకుంటారు.

**ఏవం ప్రవర్తితం చక్రం నానువర్తయతీహ యః** – 3.16

ఇలా పరంపరగా సాగుతున్న చక్రాన్ని పాటించకపోతే, చలనం ఆగిపోతుంది. బీదా గొప్పల మధ్య భేదం పెచ్చుపెరిగి పోతుంది. దానివల్ల దొంగతనాలు, దోపిడీలు, అరాచకత్వాలు పెరిగిపోతాయి. బలవంతంగా తీసుకుంటే అది సరైన పద్ధతి కాదు; ఇష్టంగా ఇస్తే అది దానం. ఏ మతం కూడా బలవంతంగా తీసుకోమనదు. ఇష్టంగా ఇవ్వమంటుంది.

**యజ్ఞదానతపఃకర్మ న త్యాజ్యం కార్యమేవ తత్** – 18.5

**తమేతం వేదాను వచనేన బ్రాహ్మణా వివిదిషంతి యజ్ఞేన దానేన తపసా అనాసకేన** – బృహదారణ్యకం

ఉపనిషత్తూ, కృష్ణపరమాత్మ కూడా నొక్కి వక్కాణించే మూడు సాధనలు ఇవి; అంటే యజ్ఞం, దానం, తపస్సు. అందువల్లనే పూర్వకాలం ఎక్కువ డబ్బు ఉంటే మహారుద్రం లేదా అతిరుద్రం ఇంకా మహాయజ్ఞాలు చేసేవారు. యజ్ఞంలో భాగంగా దానం చేసేవారు. విడిగా దానం చేస్తే గర్వంగా కనిపిస్తుంది; అదే యజ్ఞంలో ఒక భాగంగా చేస్తే అణకువ కనిపిస్తుంది. పైగా యజ్ఞం చేస్తే అన్నదానం, దక్షిణదానం, వస్త్రదానం, పుస్తకదానం, క్షేత్రదానం, స్వర్ణదానం ఇలా అనేక దానాలు చేయటానికి ఆస్కారం ఉంటుంది. అందువల్లనే పూర్వం వివాహాన్ని కూడా కన్యాదానం అనేవారు.

7. **తపోయజ్ఞం** – తపస్సు అంటే ఇంద్రియాలను అదుపులో పెట్టటం. **నా ఇంద్రియాలను నేను అదుపులో పెట్టుకోవటానికి నేను ఇష్టపూర్వకంగా పాటించే వైరాగ్యం.** ఇందులో ప్రతిపదమూ ముఖ్యమే. కొంతమంది ఇవాళ నాకు ఏకాదశి అంటారు. ఎందుకని అడిగితే, ఇంట్లో వంట చేయలేదు అంటారు. అంటే వంట చేస్తే తినేవారే. అప్పుడది ఉపవాసం అవదు; తినకపోవటం అవుతుంది. ఉపవాసం చేస్తే ఆధ్యాత్మిక ఎదుగుదల ఉంటుంది; ఆనందం ఉంటుంది; తినలేక పోతే ఆధ్యాత్మిక ఎదుగుదల ఉండదు సరికదా పైపెచ్చు నొప్పి, బాధ ఉంటాయి.

మీరు రోజూ వాడే వాటికి 'నో' చెప్పగలగటం తపస్సు. అయ్యప్ప దీక్షలో ఈ అంశం చూస్తాము. దిండు వాడరు; నేలమీద పడుకుంటారు; చెప్పులు వేసుకోరు; ఏకభుక్తం ఉంటారు కాని ఇవేవీ వారిని బాధించవు. ఎందుకు? వారంతట వారు ఇష్టపడి, మెడలో మాల వేసుకుని, ఈ దీక్షను స్వీకరిస్తారు. అలాగే శివరాత్రి రోజున ఆహారం తీసుకోకుండా, నిద్ర పోకుండా ఉంటారు. అన్ని వ్రతాలూ తపోయజ్ఞం కింద వస్తాయి.

8. **యోగయజ్ఞం** – పతంజలి యోగశాస్త్రంలో చెప్పిన అష్టాంగయోగాలు వస్తాయి. మన పంచకోశాల్లో నాలుగు కోశాలను అదుపులో పెట్టటానికి అష్టాంగయోగం ఉపయోగపడుతుంది. అన్నమయకోశానికి యోగాసనం; ప్రాణమయకోశానికి ప్రాణాయామం; మనోమయకోశానికి ధ్యానం; విజ్ఞానమయకోశానికి జ్ఞానం ఉపయోగ పడతాయి.

ఒక పాట కచేరీలో అన్ని వాయిద్యాలు, సంగీత విద్వాంసుడు ఒక శ్రుతిలో ఉంటేనే ఆ కచేరీ రాణిస్తుంది. అలాగే మన జీవితం కచేరీ అయితే మనసొక వాయిద్యం; ఇంద్రియాలు, శరీరం తక్కిన వాయిద్యాలు. అన్నీ

ఏకత్రాటిమీద నడిస్తేనే అది ఇంపైన సంగీతం అవుతుంది లేదా కర్ణకఠోరంగా ఉంటుంది. అష్టాంగయోగం ద్వారా ఇది సాధ్యం.

9. **స్వాధ్యాయయజ్ఞం** – స్వాధ్యాయయజ్ఞం అంటే శాస్త్ర పారాయణం. పారాయణం అంటే శాస్త్రాన్ని చదవటం, నేర్చుకోవటం వస్తుంది; దీన్ని కంఠతా పట్టటమూ వస్తుంది. ముందు చదవటం నేర్చుకోవాలి. లేకపోతే అక్షరశుద్ధి ఉండదు. తరువాత కంఠతా పట్టాలి. దాని అర్థం తెలుసుకోవాలంటే ముందు అది కంఠతా రావాలి. ఉదాహరణకు గీతలోని ఈ నాల్గవ అధ్యాయమే తీసుకోండి – ఇందులోని శ్లోకాలు కంఠతా రాకపోతే, వాటి పూర్తి అర్థం తెలియదు. ఒక వ్యక్తిని చాలా దగ్గరగా చూస్తే అతని పూర్తి మొహం తెలియదు. కన్ను చూస్తే చెవి కనబడదు; చేయి చూస్తే కాలు కనబడదు. పూర్తి మొహం చూడాలంటే దూరంగా నిల్చుని చూడాలి.

అలాగే గీత నాల్గవ అధ్యాయం నేర్చుకుంటున్నప్పుడు చివరి శ్లోకాలకి వెళితే, మొదటి శ్లోకాలు మర్చిపోతారు. అదే ఆ అధ్యాయం కంఠతా వస్తే మొత్తం అధ్యాయం సారాంశం తెలుస్తుంది. మొదట్లో అవతారం గురించి ఎలా చెప్పాడో, ఆత్మానాత్మ వివేకం ఎలా చూపించాడో, అదంతా గుర్తుకొస్తుంది.

కాని ఇప్పటి కాలమాన పరిస్థితుల్లో గీతాబోధకు వచ్చేవారిని గీత కంఠతా పట్టిరండి అంటే క్లాసులకు రావటం మానేస్తారు. అందువల్లనే అధ్యాయం చివర్లో సారాంశం ఇవ్వటం జరుగుతున్నది. మన సాంప్రదాయంలో సారాంశం ఇచ్చే పద్ధతి లేదు. మొత్తం అధ్యాయం కంఠతా వస్తే, సారాంశం దానంతట అదే గుర్తుకొచ్చేస్తుంది.

ఇలా నేర్చుకోవటానికి వీలుగా మనకు శాస్త్రం రెండురకాలుగా ఉంది. అవి – సూత్రాలు, శ్లోకాలు. సూత్రాలు అంటే అతి చిన్న వాక్యాలు.

**అథాతో బ్రహ్మజిజ్ఞాసా, జన్మాద్యస్య యతః, శాస్త్రయోనిత్వాత్, తత్తు సమన్వయాత్** – బ్రహ్మ సూత్రాలు.

ఈ నాలుగూ బ్రహ్మసూత్రాల్లో మొదటి నాలుగు సూత్రాలు. తరువాత రకం శ్లోకం పద్ధతి. గీతను ఒక రాగంలో పాడవచ్చు. అలా పాడగలిగితే, తేలిగ్గా గుర్తుంటుంది. అలా సూత్రాలు, శ్లోకాలు కంఠతా పట్టటానికి వీలుగా ఇవ్వబడ్డాయి. అందువల్లనే పూర్వం పుస్తకాలు కాని, వ్రాత ప్రతులు కాని ఉండేవి కావు. ఏది చదివితే అది కంఠతా రావాలి. ఇప్పటికీ కొన్ని ఆశ్రమాల్లో బ్రహ్మచారికి ఆ నియమం ఉంది.

కంఠతా పట్టటంలోని ఇంకో గూఢార్థం ఉంది. ఏమిటది? అది పారాయణం చేసీ చేసీ దానర్థం తెలుసుకోవాలనే తపన బయలుదేరుతుంది.

10. **జ్ఞానయజ్ఞం** – జ్ఞానయజ్ఞం అంటే అధ్యయనం చేసిన శాస్త్రంయొక్క అర్థం తెలుసుకోవటం. విశ్లేషణ, విచారణ అంటారు దీన్ని. ముందు యజ్ఞంలో కేవలం పారాయణం చేయటం మాత్రమే. దాన్ని **శబ్దగ్రహణం** అంటారు; జ్ఞానయజ్ఞంలో అర్థం తెలుసుకుంటారు కాబట్టి దీన్ని **అర్థగ్రహణం** అంటారు.

అందువల్లనే పూర్వం స్వాధ్యాయనాన్ని లేత వయస్సులోనే మొదలుపెట్టేవారు. అంటే ఐదవ సంవత్సరం నుంచే ప్రారంభించేవారు. చిన్న వయస్సులో నేర్చుకోవటం, గుర్తుపెట్టుకోవటం తేలిక. 15 ఏళ్ళ లోపు మొత్తం వేదం కంఠతా వచ్చేస్తుంది. అప్పుడు అర్థం తెలియదు. తరువాత జ్ఞానయజ్ఞానికి వస్తే తెలుస్తుంది.

ఇక్కడ ఒక సందేహం రావచ్చు మీకు. ఈ పన్నెండు యజ్ఞాల జాబితా మొదలుపెట్టినప్పుడే, మొట్టమొదటి యజ్ఞాన్నే జ్ఞానయజ్ఞం అన్నారు. ఇప్పుడు మళ్ళీ జ్ఞానయజ్ఞం అంటున్నాము. అదెలా సాధ్యం? పునరుక్తిదోషం అంటదా? దానికీ, దీనికీ చిన్న భేదం ఉంది. మొదటి జ్ఞానయజ్ఞం పరావిద్యకు చెందినది; ఈ జ్ఞానయజ్ఞం అపరావిద్యకు చెందినది. అంటే కర్మకాండ భాగం, తర్కశాస్త్రం, మీమాంసా శాస్త్రం, వ్యాకరణ శాస్త్రం అన్నీ అపరావిద్యలోకి వస్తాయి. ఇప్పుడు శ్లోకం చూద్దాము.

**ద్రవ్యయజ్ఞాస్తపోయజ్ఞా యోగయజ్ఞాస్తథాపరే స్వాధ్యాయజ్ఞానయజ్ఞాశ్చ** – మరి కొంతమంది ద్రవ్యయజ్ఞం, తపోయజ్ఞం, యోగయజ్ఞం, స్వాధ్యాయయజ్ఞం, జ్ఞానయజ్ఞం చేస్తారు.

**యతయః** – ఈ యజ్ఞాలు చేసేవారిని యతులు అంటారు. నిజానికి యతి అంటే సన్న్యాసి. గొప్ప సన్న్యాసిని యతిరాజు అంటారు. కాని ఇక్కడ యతి అంటే ఆధ్యాత్మిక సాధకుడు. ఈ సాధన ఆషామాషీగా ఉండదు. తపన ఉంటుంది. అతను గృహస్థు అయినా కూడా, ఈ సాధనకు చాలా ప్రాముఖ్యతనిస్తాడు.

**సంశితవ్రతాః** – వారికి తపన ఉండటమే కాదు; తీవ్రంగా దాన్ని అమలులో పెడతారు. ఏకాదశి రోజు ఏమీ తినకూడదు అని నిశ్చయించుకుంటే ససేమిరా తినరు. ఆత్మసంయమనం లేకపోతే ఆధ్యాత్మిక సాధన అసాధ్యం. అందువల్లనే కృష్ణపరమాత్మ అటువంటి సాధకుణ్ణి మెచ్చుకుంటున్నాడు.

శ్లో. 29 **అపానే జుహ్వతి ప్రాణం ప్రాణేఽపానం తథాపరే ।**
**ప్రాణాపానగతీ రుద్ధ్వా ప్రాణాయామపరాయణాః ॥**
అపానే, జుహ్వతి, ప్రాణమ్, ప్రాణే, అపానమ్, తథా, అపరే,
ప్రాణాపానగతీ, రుద్ధ్వా, ప్రాణాయామపరాయణాః ॥

| | | | |
|---|---|---|---|
| అపరే | = కొందరు యోగులు | అపానమ్ | = అపానవాయువును (హవనము చేయుదురు) |
| అపానే | = అపానవాయువునందు | ప్రాణాయామ | = ప్రాణాయామ |
| ప్రాణమ్ | = ప్రాణవాయువును | పరాయణాః | = పరాయణులైనవారు |
| జుహ్వతి | = హెూమము చేయుదురు | ప్రాణాపానగతీ | = ప్రాణాపాన గమనములను |
| తథా | = అలా మరికొందరు యోగులు | రుద్ధ్వా | = నిలిపి |
| ప్రాణే | = ప్రాణవాయువునందు | | |

**అపానే ప్రాణం ప్రాణే అపానం జుహ్వతి । (తథా అపరే)**
**ప్రాణ–అపాన–గతీ రుద్ధ్వా ప్రాణాయామ–పరాయణాః (సన్తి) ।**

తా: కొందరు యోగులు అపానవాయువునందు ప్రాణవాయువును, మరికొందరు ప్రాణవాయువునందు అపానవాయువును హవనము చేయుదురు.

ఈ శ్లోకంలో ఇంకొక యజ్ఞం చూస్తాము.

11. **ప్రాణమయ యజ్ఞం** – ఈ శ్లోకంలో కృష్ణపరమాత్మ ప్రాణమయ యజ్ఞం గురించి మాట్లాడుతున్నాడు. ఇది కూడా చాలా ముఖ్యమైన సాధన. మన పంచకోశాలను మళ్ళీ ఒకసారి చూస్తే అవి వరుసగా అన్నమయకోశం, ప్రాణమయకోశం, మనోమయకోశం, విజ్ఞానమయకోశం, ఆనందమయకోశం. ప్రాణమయకోశం అన్నమయకోశానికీ, మనోమయకోశానికీ మధ్యలో ఉంది. అందువల్ల ఎవరైనా ప్రాణాయామం చేసి, ప్రాణమయకోశాన్ని అదుపులో పెట్టుకోగలిగితే ఇటు అన్నమయకోశం, అటు మనోమయకోశం – రెండూ బాగుపడతాయి. ప్రాణం బాగుంటే శారీరక ఆరోగ్యం, మానసిక ఆరోగ్యం రెండూ కుదుట పడతాయి. అందువల్లనే పూజల్లో భాగంగా ప్రాణాయామం చేయిస్తారు.

ఈ ప్రాణాయామాన్ని రెండురకాలుగా చేయవచ్చు. అవి – శారీరక వ్యాయామం, ఆధ్యాత్మిక సాధన. వేదం దాన్ని ఆధ్యాత్మిక సాధనగా చేయమంటుంది. అంటే ప్రాణాయామం చేసేటప్పుడు, ఏదైనా దైవనామస్మరణ చేయాలి. ప్రాణాయామానికి మంత్రం జోడిస్తే దాన్ని సగర్భ ప్రాణాయామం అంటారు; కేవలం ప్రాణాయామమే చేస్తే అగర్భ ప్రాణాయామం అంటారు. రెండవ పద్ధతిలో మీ శారీరక ఆరోగ్యమే మెరుగుపడుతుంది కాని, ఆధ్యాత్మిక ఆరోగ్యం మెరుగుపడదు. అందువల్ల దైవనామస్మరణ జోడిస్తేనే ప్రాణాయామం **ప్రాణమయ యజ్ఞం** అవుతుంది.

కుండలిని శక్తిని లేపటం కూడా ఒక విధమైన ప్రాణశక్తే! కుండలినిని ముడుచుకుని పడుకున్న పాముతో పోలుస్తారు. కుండలిని శక్తి అంటే స్థితిజశక్తి. ఈ స్థితిజశక్తి మనకు అన్ని కోశాల్లోనూ ఉంటుంది. అన్నమయకోశంలో మనకు పరుగుపెట్టే శక్తి ఉంటుంది. కాని మనం నడవనే నడవము; ఇంక పరుగులు తీసే శక్తి ఎలా తెలుస్తుంది? ముందు నడవటం మొదలుపెట్టి, నెమ్మదిగా ఆ శక్తిని తట్టిలేపితే, అది వెలువడుతుంది.

అలాగే మనోమయకోశంలో కూడా స్థితిజశక్తి ఉంటుంది. కాని ఇప్పుడు మనం ఈ సెల్‌ఫోన్‌లకు, ట్యాబ్‌లకు ఎంతగా అలవాటు పడిపోయామంటే మన పేరడిగినా అందులో చూసి చెప్పాల్సొచ్చే పరిస్థితి వస్తోంది. ప్రాణాయామం చేస్తే కుండలినీ శక్తి విడుదలయి, కొన్ని సిద్ధులు రావచ్చు. కాని ఇది వ్యావహారిక స్థాయికి చెందినది అంటే అనాత్మస్థాయికి చెందినది. కుండలినీ శక్తికీ, ఆత్మజ్ఞానానికీ సంబంధం లేదు. అన్నమయకోశంలో పరుగుపెట్టే శక్తిని తట్టి లేపటంతో మోక్షం రాదుకదా! ఇదీ అంతే! అక్కడ అన్నమయకోశంలో అయితే, ఇక్కడ ప్రాణమయ కోశంలో శక్తిని తట్టిలేపుతారు. అంతే! సిద్ధులు మోక్షసాధనాలు కావు. అవి మాయలోకి వస్తాయి. మోక్షం కావాలనుకునేవారు ఈ సిద్ధులు పొందగానే తేలికగా వాటి వలలో పడిపోతారు. అలా పడకూడదు.

ప్రాణాయామం ఉద్దేశ్యం ఏమిటి? చిత్తశుద్ధి, చిత్త ఏకాగ్రతను పెంచుతుంది. మనస్సును శాంతపరచి, సునాయాసంగా ఊపిరి పీల్చుకునేటందుకు తోడ్పడుతుంది. ఈ ప్రాణాయామం మూడు రకాలుగా చేయవచ్చు– పూరక ప్రాణాయామం, రేచక ప్రాణాయామం, కుంభక ప్రాణాయామం.

పూరక ప్రాణాయామంలో ఊపిరి పీల్చుకోవటానికి ప్రాముఖ్యతనిస్తాము. బాగా ఊపిరి పీల్చుకుని, ఊపిరితిత్తులలో (కడుపులో కాదు) బాగా గాలి నింపాలి. పూరకం అంటే నింపటం. రేచక ప్రాణాయామంలో శ్వాస వదలటం. రేచకం అంటే ఖాళీ చేయటం. ఊపిరితిత్తులను పూర్తిగా ఖాళీ చెయ్యాలి. కుంభక ప్రాణాయామంలో

గాలిని స్థంభింపచేయటం. ఈ కుంభకంలో రెండురకాలున్నాయి – అంతరకుంభకం, బాహ్యకుంభకం. అంతరకుంభకంలో గాలిని లోపల కుంభిస్తే, బాహ్యకుంభకంలో గాలిని బయట కుంభిస్తారు. అన్నిరకాల ప్రాణాయామాలు యజ్ఞమే!

**అపానే ప్రాణం జుహ్వతి** – ఇది పూరక ప్రాణాయామాన్ని సూచిస్తుంది. కొంతమంది అపానానికి ప్రాముఖ్యతనిస్తారు. ఇక్కడ అపానం అంటే ఉచ్ఛ్వాసక్రియ; ప్రాణం అంటే నిశ్శ్వాసక్రియ. కొంతమంది అపానంలో ప్రాణాన్ని ఆహుతిగా వేస్తారు అంటే ఉచ్ఛ్వాసక్రియలో నిశ్శ్వాసక్రియను ఆహుతిగా వేస్తారు. అంటే నిశ్శ్వాసక్రియ లేదని అర్థం వస్తుంది. దీన్ని పూరకం అంటారు.

**ప్రాణే అపానం** – దీన్ని రేచక ప్రాణాయామం అంటారు. కొంతమంది ఉచ్ఛ్వాసను నిశ్శ్వాస క్రియలో వేస్తారు. అంటే ప్రాణంలో అపానాన్ని వేస్తారు.

**ప్రాణాపానగతీ రుధ్వా** – కొంతమంది రెండూ ఆపేస్తారు. అంటే పూరకం, రేచకం రెండూ ఆపి, కుంభక ప్రాణాయామం చేస్తారు. మనస్సు మరీ అలజడిగా ఉన్నప్పుడు కుంభక ప్రాణాయామం చేస్తే మంచిది.

మనస్సు అలజడి చెందినప్పుడు జ్ఞానంతో ప్రశాంతత పొందటం మంచి పద్ధతి. కాని ఇదెలా ఉంటుందంటే పిచ్చి కుదిరితే కాని పెళ్ళి కుదరదు; పెళ్ళి కుదిరితే కాని పిచ్చి కుదరదు సామెతలా ఉంటుంది. మనస్సు అలజడి చెందితే జ్ఞానం పొందలేము; జ్ఞానం పొందకపోతే మనస్సు అలజడి తగ్గదు. దీనికి అనువైన మార్గం ప్రాణాయామం చేయటం.

రోడ్డుమీద ప్రమాదం జరిగిన వ్యక్తికి ముందుగా ఫస్ట్ఎయిడ్ చేయాలి. అక్కడితో ఆగితే ప్రాణానికే ముప్పు. తరువాత ఆసుపత్రికి తీసుకువెళ్ళాలి. ఎలాగూ తీసుకువెళతాము కదాని ఫస్ట్ ఎయిడ్ చేయకపోతే అక్కడికక్కడే ప్రాణం పోవచ్చు. అలాగే అలజడిగా ఉన్న మనస్సుకు ప్రాణాయామం ఫస్ట్ఎయిడ్లాంటిది. అది కొంచెం కుదుటపడ్డాక, జ్ఞానమార్గమనే ఆసుపత్రికి తీసుకువెళ్ళాలి. అందువల్ల ప్రాణమయ యజ్ఞం కూడా ముఖ్యమే.

ప్రాణాయామాన్ని ప్రాణ+యమః అనకూడదు; ప్రాణ+ఆయామః అనాలి. యమధర్మరాజు జనాభా సంఖ్యను నియంత్రిస్తే, ప్రాణ ఆయామం ప్రాణాన్ని నియంత్రిస్తుంది. ప్రాణాన్ని నియంత్రించటం ద్వారా తక్కిన నాలుగు ప్రాణాలైన అపానం, వ్యానం, ఉదానం, సమానం కూడా నియంత్రించబడతాయి. అంటే జీర్ణక్రియ, రక్తప్రసరణ క్రియ, విసర్జన క్రియలు బాగుపడతాయి.

శ్లో. 30 **అపరే నియతాహారాః ప్రాణాన్ ప్రాణేషు జుహ్వతి ।**
**సర్వేఽ ప్యేతే యజ్ఞవిదో యజ్ఞక్షపితకల్మషాః ॥**
అపరే, నియతాహారాః, ప్రాణాన్, ప్రాణేషు, జుహ్వతి,
సర్వే, అపి, ఏతే, యజ్ఞవిదః, యజ్ఞక్షపితకల్మషాః ॥

| | | | |
|---|---|---|---|
| అపరే | = మరికొందరు | ఏతే, యజ్ఞవిదః | = యజ్ఞవిదులైన ఈ సాధకులు |
| నియతాహారాః | = నియమితాహార నిష్ఠితులై | సర్వే, అపి | = అందరూ |
| ప్రాణాన్ | = ప్రాణములను | యజ్ఞక్షపిత | = యజ్ఞముల ద్వారా |
| ప్రాణేషు | = ప్రాణములందు | కల్మషాః | పాపములను రూపుమాపినవారు |
| జుహ్వతి | = హోమము చేయుదురు | | |

**అపరే నియత-ఆహారాః ప్రాణాన్ ప్రాణేషు జుహ్వతి । ఏతే సర్వే అపి**
**యజ్ఞవిదః యజ్ఞ-క్షపిత-కల్మషాః (సన్తి) ।**

తా: ఇంకను కొందరు నియమితాహార నిష్ఠితులై, ప్రాణాయామ పరాయణులైనవారు ప్రాణాపానగమనములను నిలిపి, ప్రాణములను ప్రాణములయందే హవనము చేయుదురు. యజ్ఞవిదులైన ఈ సాధకులందరూ యజ్ఞముల ద్వారా పాపములను రూపుమాపుదురు.

ఇప్పుడు ఆఖరి యజ్ఞం చూస్తాము.

12. **ఆహార నియమ యజ్ఞం** – ఆహార నియమాన్ని రెండు దశల్లో చేయాలి. అవి – తినే కొలతలో, వస్తు నాణ్యతలో. ఎంత తినాలనే విషయాన్ని 6వ అధ్యాయంలోను, ఏం తినాలనేది 17వ అధ్యాయంలోను వివరిస్తాడు కృష్ణపరమాత్మ. అప్పుడు వాటి గురించి వివరంగా చూద్దాము. ముందు ఎక్కువసార్లు తినటం, రోజంతా ఏదో తింటూ ఉండటం తగ్గించాలి. తరువాత రాజసిక ఆహారంనుంచి సాత్త్విక ఆహారానికి రావాలి.

**అపరే నియతాహారాః** – కొంతమంది ఆహారం విషయంలో నియమం పాటిస్తారు. దీనివల్ల ఏమవుతుంది?

**ప్రాణాన్ ప్రాణేషు జుహ్వతి** – ఆహార నియమాలు పాటించకపోతే పంచప్రాణాల శక్తి తగ్గుతుంది. అవి అనారోగ్యకరంగా అవుతాయి. అందువల్ల ఎవరైతే ఆహార నియమాన్ని పాటిస్తారో, వారి పంచప్రాణాలు మళ్ళీ ఆరోగ్యాన్ని పుంజుకుంటాయి. అందువల్ల అనారోగ్య పాణాలను ఆరోగ్యప్రాణాల్లో ఆహుతిగా వేస్తారు. ఆహుతిలో వేసింది నాశనమవుతుంది. అందువల్ల ప్రాణాలు మళ్ళీ ఆరోగ్యాన్ని పుంజుకుంటాయి. జీర్ణక్రియ, రక్తప్రసరణక్రియ అన్నీ బాగుంటాయి.

**సర్వేఽ ప్యేతే యజ్ఞవిదః** – ఈ 12 సాధనలనూ పాటించేవారు గొప్ప సాధకులు. వారు పొందే ఫలమేమిటి?

**యజ్ఞక్షపితకల్మషాః** – యజ్ఞాల ద్వారా వారి కల్మషాలను నాశనం చేస్తారు. ఏమిటవి? కామక్రోధాలు, లోభమోహాలు, మదమాత్సర్యాలు.

ఈ పన్నెండు సాధనలనూ యజ్ఞాలని పిలవటానికి రెండు నియమాలను పాటించాలని చూశాము. ఒకటి ఆయా సాధనలలో దైవాన్ని జోడించాలి. దైవనామస్మరణ లేకుండా చేస్తే వారి శారీరక ఆరోగ్యం మెరుగుపడవచ్చు;

మానసిక ఆరోగ్యం బాగుపడవచ్చు కాని ఆధ్యాత్మిక సాధన మాత్రం కుదరదు. ఆఖరికి ఆహారం తినటం కూడా యజ్ఞంగా మలుచుకోవచ్చు. ఎలా? ఆ ఆహారాన్ని ఈశ్వరునికి అర్పించటం ద్వారా.

రెండవ నియమం: ఆ సాధన ఆధ్యాత్మిక ఎదుగుదలకోసమే చేయాలి. ఈ సాధనలను లౌకిక లక్ష్యాలకు కూడా వాడవచ్చు. ఇప్పుడు మేనేజ్‌మెంట్ కోర్సులలో గీతాసాధనలు ప్రవేశపెడుతున్నారు. వారు చేసే పనులను మరింత మెరుగ్గా చేయటంకోసం చేస్తున్నారు; తప్పేం లేదు. కాని దాన్ని యజ్ఞంగా పిలువలేము. ఆధ్యాత్మిక ఎదుగుదలకు తోడ్పడితేనే అది యజ్ఞం అవుతుంది.

ఆహారం తినటం కూడా యజ్ఞంలా చేయవచ్చు అని చూశాము. నిజానికి ఉపవాసం కూడా ఒక విధమైన యజ్ఞమే! ఎందుకు? ఉప అంటే సమీపం. వాసం అంటే ఉండటం. ఉపవాసం అంటే సమీపంగా ఉండటం. దేనికి సమీపంగా ఉండటం? ఆహారానికి కాదు, భగవానునికి సమీపంగా ఉండటం. ఇంద్రియ విషయాలకు దూరంగా ఉండి, ఆ రోజన్నా భగవానునికి సమీపంగా ఉండాలి. కాని మనమేం చేస్తున్నాం? శివరాత్రి రోజు జాగరణ అంటూ రాత్రిపూట వేసే ప్రత్యేక సినిమాలు చూస్తాము. అది అసలైన పద్ధతి కాదు. ఉపవాసం, జాగరణ చేసేటప్పుడు జపమో, పారాయణో, పూజో చేయాలి.

దీనితో 12 యజ్ఞాలు అయిపోయాయి. అందరూ అన్ని యజ్ఞాలు చేయాలన్న నియమమేమీ లేదు. ఎసిడిటీ సమస్య ఉన్నవారు ఉపవాసముంటే అవస్థ పడతారు. ఉపవాసంలో కూడా రకాలుంటాయి. కొంతమంది నీరు కూడా తాగకుండా ఉంటారు. దాన్ని నిర్జల ఉపవాసం అంటారు. కొంతమంది పాలు, పండ్లు తిని ఉంటారు.

మనిషై పుట్టాక కొన్ని యజ్ఞాలు చేయాలి. ఇక్కడ యజ్ఞం అంటే ఆత్మ సంయమనం. ఉదాహరణకు ఆహారవిషయమే తీసుకోండి! కొంతమంది ఏది పడితే అది, ఎప్పుడుపడితే అప్పుడు తినవచ్చు అనుకుంటారు. అలా చేస్తే, మనిషికీ, పశువుకూ బేధం లేదు. అందువల్ల ఈ యజ్ఞవిధులను నియమించింది శాస్త్రం. యజ్ఞోపవీతం వేసిందే అందుకు. ఒకటో అంతకన్నా ఎక్కువో యజ్ఞాలను పాటించటానికి వేసింది యజ్ఞోపవీతం. అవి పాటించకపోతే యజ్ఞోపవీతం వేసీ ఫలితముండదు.

స్వామీ చిన్మయానంద అద్భుతంగా చెబుతారు: ముందు పశుప్రవృత్తి ఉన్న మనిషిగా జీవితం మొదలుపెట్టినా, వీలున్నంత త్వరలో మనిషి ప్రవృత్తి ఉన్న మనిషిగా ఎదగాలి. అక్కడితో ఆగిపోకూడదు. ఈ యజ్ఞాల్లో దేన్నైనా పాటించి, వీటిద్వారా ఆత్మజ్ఞానం పొందటానికి అర్హత సంపాదించి, ఆత్మజ్ఞానం పొంది, దైవప్రవృత్తి ఉన్న మనిషిగా ఎదగాలి. జంతుప్రవృత్తినుంచి మనుష్య ప్రవృత్తికి, మనుష్యప్రవృత్తినుంచి దైవప్రవృత్తికి రావాలి.

**సర్వే అపి యజ్ఞవిదః (భవన్తి) –** వీరిని ద్విజులు అంటారు. మనిషి రెండుసార్లు పుడతాడు – మామూలు పుట్టుక ఒకటి, శాస్త్రప్రకారం నడుచుకోవటం రెండవది. అలా నడుచుకునే వ్యక్తిని ద్విజుడు అంటారు. ద్విజుడే తరువాత బ్రహ్మ అవుతాడు. అంటే పుట్టుక లేనివాడు అవుతాడు. పన్నెండు యజ్ఞాలు చెప్పినంత మాత్రాన పన్నెండే ఉన్నాయనుకోకూడదు. అవి కొన్ని ఉదాహరణలుగా ఇచ్చాడు.

శ్లో. 31 **యజ్ఞశిష్టామృతభుజో యాంతి బ్రహ్మ సనాతనమ్ ।**
**నాయం లోకోఽస్త్యయజ్ఞస్య కుతోఽన్యః కురుసత్తమ ॥**
యజ్ఞశిష్టామృతభుజః, యాంతి, బ్రహ్మ, సనాతనమ్,
న, అయమ్, లోకః, అస్తి, అయజ్ఞస్య, కుతః, అన్యః, కురుసత్తమ ॥

| | | | |
|---|---|---|---|
| కురుసత్తమ! | = కురుశ్రేష్ఠుడవైన ఓ అర్జునా! | యాంతి | = పొందుచున్నారు |
| యజ్ఞశిష్టామృతభుజః | = యజ్ఞపూత శేషమైన అమృతమును అనుభవించు యోగులు | అయజ్ఞస్య | = యజ్ఞము చేయనివానికి |
| | | అయమ్, లోకః | = ఈ లోకమే |
| | | న, అస్తి | = సుఖప్రదము కాదు |
| సనాతనమ్ | = సనాతనుడైన | అన్యః | = (ఇంక) పరలోక(విషయ)ము |
| బ్రహ్మ | = పరబ్రహ్మమును | కుతః | = ఎక్కడిది? |

**హే కురుసత్తమ! యజ్ఞ-శిష్ట-అమృత-భుజః సనాతనం బ్రహ్మ యాన్తి**
**అయజ్ఞస్య అయం లోకః న అస్తి, కుతః అన్యః ।**

తా: ఓ కురుసత్తమా! (అర్జునా!) యజ్ఞపూతశేషమైన అమృతమును అనుభవించు యోగులకు సనాతనుడును, పరబ్రహ్మమును అగు పరమాత్మయొక్క లాభము కలుగును. యజ్ఞము చేయనివారికి ఈ మర్త్యలోకమే సుఖప్రదము కాదు. ఇంక పరలోకవిషయము చెప్పనేల?

శాస్త్రం ప్రకారం మనం సూర్యోదయం ముందే లేవాలి. ఎందుకంటే సూర్యుడు సాక్షాత్తూ భగవానునియొక్క ప్రత్యక్షరూపం. ఆయన మనను దీవించటానికి వస్తున్నాడు. సూర్యభగవానుడు మన అతిథిగా వస్తుంటే మనం ఆయనకన్నా ముందు సిద్ధంగా ఉండాలి. బెడ్‌కాఫీ తాగటం, పొద్దున్నే టీవీ చూడటం, వార్తాపత్రికలు చదవటం మన సాంప్రదాయం కాదు. పొద్దున్న లేస్తూనే స్నానం చేయాలి. స్నానమే ఒక పెద్ద యజ్ఞం. ఎందుకంటే, స్నానం చేయటంవల్ల రెండు లాభాలున్నాయి.

ఒకటి శరీరానికి పట్టిన దుమ్మును వదిలిస్తుంది; రెండవది మనస్సుకు పట్టిన మలినాన్ని వదిలిస్తుంది. మనం ఏపని చేసినా దానివల్ల మనస్సులో కల్మషం పేర్చుకుంటున్నాము. కోపం, అసూయ, ఆందోళనలాంటి భావాలు పేరుకుపోతున్నాయి. అందువల్ల ఈ మలినాన్ని కూడా వదిలించుకోవాలి. మనకు స్నానం చేసేటప్పుడు జపించాల్సిన ప్రత్యేకమంత్రాలు ఉన్నాయి.

వరుణదేవుడు నీటికి అధిష్ఠానదేవుడు. అఘమర్షణసూక్తంలో- ఓ వరుణా! నేను నిన్న అతిగా తిన్నాను. నా పాపాన్ని కడిగివెయ్యి అని వస్తుంది. ఈ ప్రార్థన తెలియకపోయినా ఫర్వాలేదు. ఏదో ఒక నామజపమో, స్తోత్రమో చేయాలి. అలా చేశాక ఏదైనా తింటే దాన్ని బ్రేక్‌ఫాస్ట్ అంటారు. కాని ఇప్పుడు ఆ మాటకు అర్థం లేకుండాపోయింది. 24 గంటలూ తింటూనే ఉంటే, ఫాస్ట్‌ని బ్రేక్‌చేసే అవకాశమేది? అసలు చాలామందికి ఆకలి అంటే ఏమిటో తెలియదు. పేగులు అరవటం అంటే ఏమిటో తెలియదు.

**యజ్ఞశిష్టామృతభుజః** – స్నానం చేసి, పూజ చేసాక తినేది యజ్ఞశిష్టం అవుతుంది. ఎంత ఆకలిమీద ఉన్నా కూడా అది చటుక్కున తినేయకూడదు. ఏదైనా ప్రార్థన చేయాలి. బ్రహ్మార్పణం బ్రహ్మహవిః శ్లోకం చెప్పాలి. అది తెలియకపోతే కనీసం నారాయణ, నారాయణ అనాలి. అప్పుడు తినే ఆహారం యజ్ఞశిష్టం అవుతుంది. ఈ యజ్ఞప్రసాదం అమృతం అవుతుంది.

ఎందుకు ఈ ఆహారం అమృతం అవుతుంది? ఇది మోక్షకారణభూత యజ్ఞప్రసాదం కాబట్టి. భుజః అంటే దీన్ని తినేవారు. నిజానికి అలా తింటే మీకే మీ మనస్సులో మార్పు తెలుస్తుంది. కొన్నాళ్ళు మీ ఇష్టం వచ్చినట్టు తిని చూడండి (నిజానికి మనం చేస్తున్నది అదే). తరువాత ఈ విధమైన క్రమశిక్షణ పాటించి, ఆహారం యజ్ఞప్రసాదంలా తీసుకుని చూడండి. మీకే మనస్సు తేలికగా అనిపిస్తుంది.

**సనాతనం బ్రహ్మ యాంతి** – వారు బ్రహ్మను పొందుతారు; వారు మోక్షాన్ని పొందుతారు. ఎలా పొందుతారు? మనం ఇంతకుముందు 12 యజ్ఞాలను చూశాము. అందులో ఒకటి జ్ఞానయజ్ఞం అనికూడా చూశాము. అందువల్ల ఎవరైనా ముందు 11 యజ్ఞాలు పాటిస్తే, అవే అతనిని జ్ఞానమార్గానికి తీసుకువస్తాయి. అది చాలా శక్తివంతమైనది. అంటే అవే అతనిలో జ్ఞానం పొందాలనే ఇచ్ఛను ఏర్పరుస్తాయి. మతపరమైన జీవనం గడిపితే, అది ఆధ్యాత్మిక జ్ఞానం పొందాలనే కోరికను పెంపొందిస్తుంది. ఎప్పుడైతే జ్ఞానం పొందాలన్న కోరిక కలుగుతుందో, అప్పుడే తక్కిన ఏర్పాట్లన్నీ భగవంతుడే చూసుకుంటాడు; గురువును ఏర్పరుస్తాడు, నేర్చుకునేందుకు అనువైన వాతావరణాన్ని ఏర్పరుస్తాడు. అప్పుడు జ్ఞానం పొందటం తేలిక అవుతుంది. దాని ఫలితంగా సనాతనబ్రహ్మను పొందుతాడు. ఆ విధంగా ఈ యజ్ఞాలు చేసేవారిని కృష్ణపరమాత్మ స్తుతిస్తున్నాడు. వీరిని కర్మయోగులు అంటారు.

ఈ కర్మయోగులను స్తుతించాక ఒక్క యజ్ఞం కూడా చేయని వారిని కృష్ణపరమాత్మ తీవ్రంగా విమర్శిస్తున్నాడు.

**అయజ్ఞస్య** – ఏ యజ్ఞాన్నీ చేయనివారు కొందరుంటారు. వారికి మానవహక్కులంటే ఏమిటో సరిగ్గా తెలియదు. నేనెందుకు శాస్త్రాన్ని పాటించాలి, నేనెందుకు గురువు మాట వినాలి, నేను ఏం చేయాలనుకుంటే అది చేసే స్వేచ్ఛ నాకుంది అనుకుంటారు. అనారోగ్యం వచ్చినప్పుడు డాక్టరు ఏవన్నా నియమాలు పాటించాలని చెపితే, తన మంచికోసమే చెబుతున్నాడని అనుకోరు కొందరు. అలాగే శాస్త్రం, గురువు మన మంచికోసమే చెబుతున్నారని అనుకోరు మరికొందరు. అలా ఇష్టం వచ్చినట్టు జీవించేవారిని కామచారులు, కామవాదులు, కామభక్షులు అంటారు. అటువంటి వారి పరిస్థితి ఏమిటి?

**అయం లోకః న అస్తి** – ఇహలోక సుఖాలే దొరకవు. ఎందుకంటే ఇష్టం వచ్చినట్టు ప్రవర్తించే వారి జీవితంలో ముందస్తుగా శారీరక ఆరోగ్యం దెబ్బతింటుంది. అది మానసిక అలజడికి దారి తీస్తుంది. అప్పుడు ఎంత డబ్బు ఉన్నా కూడ వృథా అవుతుంది. సుఖం అనుభవించలేడు.

**కుతః అన్యః** – ఇహలోకసుఖాలే పొందలేనప్పుడు, ఇంక స్వర్గలోకసుఖాలను ఎలా పొందగలరు? ఇహలోక సుఖం లేదు, పరలోకసుఖం లేదు, ఇంక మోక్షసుఖం గురించి ఖచ్చితంగా మాట్లాడే అవకాశమే లేదు.

శ్లో. 32 **ఏవం బహువిధా యజ్ఞా వితతా బ్రహ్మణో ముఖే ।**
**కర్మజాన్ విద్ధి తాన్ సర్వాన్ ఏవం జ్ఞాత్వా విమోక్ష్యసే ॥**
ఏవమ్, బహువిధాః, యజ్ఞాః, వితతాః, బ్రహ్మణః, ముఖే,
కర్మజాన్, విద్ధి, తాన్, సర్వాన్, ఏవమ్, జ్ఞాత్వా విమోక్ష్యసే ॥

| | | | |
|---|---|---|---|
| ఏవమ్ | = ఈ ప్రకారముగనే | కర్మజాన్ | = మనోవాక్కాయ కర్మల ద్వారా సుసంపన్నమగునని |
| బహువిధాః | = బహువిధములైన | విద్ధి | = తెలిసికొనుము |
| యజ్ఞాః | = యజ్ఞములు | ఏవమ్, జ్ఞాత్వా | = ఇలా తెలిసికొని |
| బ్రహ్మణః, ముఖే | = వేదము(ల) ద్వారా | విమోక్ష్యసే | = విముక్తుడవయ్యెదవు |
| వితతాః | = వివరించబడ్డాయి | | |
| తాన్, సర్వాన్ | = వాటినన్నింటిని | | |

**ఏవం బహువిధాః యజ్ఞాః బ్రహ్మణః ముఖే వితతాః (సన్తి, త్వమ్)**
**తాన్ సర్వాన్ కర్మజాన్ విద్ధి। ఏవం జ్ఞాత్వా (త్వమ్) విమోక్ష్యసే ।**

తా: ఈ ప్రకారముగనే ఇంకను బహువిధములైన యజ్ఞములు వేదములలో విస్తృతముగా వివరింపబడినవి. ఈ యజ్ఞములనన్నింటిని త్రికరణశుద్ధిగా (మనోవాక్కాయములచే) ఆచరించినప్పుడే అవి సుసంపన్నము అగునని తెలిసికొనుము. ఇట్లు ఈ కర్మతత్త్వమును తెలిసికొని, అనుష్ఠించుటవల్ల నీవు ప్రాపంచిక (కర్మ) బంధములనుంచి సర్వథా విముక్తుడయ్యెదవు.

ఈ శ్లోకంలో కృష్ణపరమాత్మ ఈ 12 యజ్ఞాలు మాత్రమే లేవు, ఇంకా చాలా ఉన్నాయని చెబుతున్నాడు. గీత వేదాలసారం అని అందరికీ తెలిసిందే. అందువల్ల వేదాల్లో ఉన్న అనేక యజ్ఞాల్లోంచి ఇవి ఉదాహరణల కింద ఇవ్వబడ్డాయి. గీత వేదాల సారం అని కృష్ణపరమాత్మే చెప్పాడు.

**స కాలేనేహ మహతా యోగో నష్టః పరంతప ॥** – 4.12

హే అర్జునా! వైదికజ్ఞానం హరించిపోతున్నది, నేను దాన్ని పునరుద్ధరిస్తున్నాను అన్నాడు.

**ఏవమ్** – అంతకుముందు చెప్పిన 12 యజ్ఞాలలో; **బహు విధా యజ్ఞాః** – అనేక యజ్ఞాలు ఉన్నాయి. అవేమిటో తెలుసుకోవాలంటే వేదాలకు వెళ్ళాలి. నిజానికి తెలుసుకున్న వాటిల్లో కొన్నన్నా అనుష్ఠానం చేస్తే, తక్కినవి తెలుసుకున్న దానికన్నా ఎక్కువ. యోగాసనాలు వేస్తే ఫలానా లాభాలుంటాయని తెలుసుకుని లాభం లేదు. అవి వేస్తేనే లాభం.

**బ్రహ్మణః ముఖే వితతాః** – బ్రహ్మముఖం అంటే వేదాలు. అందులో అనేక యజ్ఞాలు చెప్పబడ్డాయి. అన్ని యజ్ఞాలు ఎందుకంటే అందరి సామర్థ్యం ఒక్కలాగే ఉండదు కాబట్టి. లేచి నిల్చోవటమే కష్టమయ్యే వ్యక్తిని సూర్యనమస్కారాలు చేయమంటే ఎలా చేస్తాడు? అలాంటి వ్యక్తి మానసయజ్ఞం చేయాలి. కొన్ని యజ్ఞాలకు డబ్బు కావాలి. డబ్బు లేకపోతే బాధపడనవసరం లేదు, జపయజ్ఞం చేయవచ్చు. దానివల్ల రెండు విధాల లాభం

పొందవచ్చు – ఒకటి దైవనామస్మరణ చేస్తున్నారు; ఇంకొకటి ఆ కాసేపు అన్నా మీ బాధనుంచి ఇతరులు తప్పించుకుంటారు. 24 గంటలూ కబుర్లు చెప్పి, విసిగించే నోరుకు వేరే పని అప్పజెప్పటంవల్ల మీకూ, ఇతరులకూ కూడా లాభమే! అందువల్లనే కృష్ణపరమాత్మ – **యజ్ఞానాం జపయజ్ఞోస్మి** – అంటాడు పదవ అధ్యాయంలో. ఆ విధంగా వారి ఆశ్రమధర్మానికి కూడా తగ్గట్టుగా యజ్ఞాలు ఇవ్వబడ్డాయి.

ఈ యజ్ఞాలన్నింటినీ రెండు రకాల యజ్ఞాలుగా విభజించవచ్చు – జ్ఞానయజ్ఞం, కర్మయజ్ఞం. పూజ, జపం, ప్రాణాయామం, అష్టాంగయోగం, ఆఖరికి ఉపాసన కూడా కర్మయజ్ఞం క్రిందికే వస్తాయి. కర్మయోగం పాత్ర ఏమిటో, జ్ఞానయోగం పాత్ర ఏమిటో స్పష్టంగా తెలుసుకోవాలి. మీరు ఎక్కడికన్నా ప్రయాణం చేసేటప్పుడు ఎటు వెళ్ళాలో తెలియాలి. అంతేకాదు ఆ వైపు ఎంత మేరకు వెళ్ళాలో కూడా తెలియాలి. అలాగే ఈ రెండు యోగాలు ఎటు తీసుకువెళతాయో, ఎంత మేరకు తీసుకువెళతాయో తెలుసుకోవాలి.

కర్మయజ్ఞంలో ఏ యజ్ఞం పాటించినా కూడా అది చిత్తశుద్ధిని కలుగజేసి, జ్ఞానయోగ్యతా ప్రాప్తిని ఇస్తుంది. చిత్తశుద్ధి పొందటానికి మీకు అనేక మార్గాలున్నాయి కాని జ్ఞానం పొందటానికి ఒకటే మార్గముంది.

**తమేవం విద్వాన్ అమృత ఇహ భవతి। నాన్యః పంథా అయనాయ విద్యతే** – పురుషసూక్తం

**సంపశ్యన్ బ్రహ్మ పరమం యాతి నాన్యేన హేతునా** – కైవల్యం

**తం ఆత్మస్థం యేఽనుపశ్యన్తి ధీరాః తేషాం శాన్తిః శాశ్వతీ నేతరేషాం** – కఠ 2.2.13

అందువల్ల కృష్ణపరమాత్మ బోధ ఏమిటి?

**ఏదైనా కర్మయజ్ఞం చేయండి, చిత్తశుద్ధి పొందండి; జ్ఞానయజ్ఞం చేయండి, మోక్షం పొందండి**

**తాన్ సర్వాన్ కర్మజాన్ విద్ధి** – సర్వాన్ అంటే జ్ఞానయజ్ఞం తప్ప తక్కిన అన్ని యజ్ఞాలు, కర్మయజ్ఞాలని తెలుసుకో. కర్మయజ్ఞంవల్ల కలిగే లాభనష్టాలు తెలుసుకోవాలి. లాభం ఏమిటి? చిత్తశుద్ధి పొందుతారు. నష్టం ఏమిటి? అది జ్ఞానం ఇవ్వలేదు. అంతకుముందు మనం అశుద్ధ అజ్ఞానిగా ఉంటే, కర్మయజ్ఞం చేశాక శుద్ధ అజ్ఞాని అవుతాము. అష్టాంగయోగం కూడా జ్ఞానాన్ని ఇవ్వలేదు. నిర్వికల్పసమాధి కూడా జ్ఞానాన్ని ఇవ్వలేదు. జ్ఞానయోగ్యతా ప్రాప్తిని ఇస్తుంది. జ్ఞానయజ్ఞం పూర్తిగా వేరే అంశం. అదేమిటో ఇప్పుడు చెప్పడు.

**ఏవం జ్ఞాత్వా** – ఈ విధంగా తెలుసుకుని అంటే కర్మయజ్ఞం చిత్తశుద్ధిని ఇస్తుంది; జ్ఞానయజ్ఞం మోక్షాన్నిస్తుంది; కాబట్టి మీరు రెండూ పాటించాలని తెలుసుకుని;

**విమోక్ష్యసే** – కేవలం తెలుసుకుంటే చాలదు; కర్మయజ్ఞాన్ని చేసి చిత్తశుద్ధి పొంది, జ్ఞానయజ్ఞాన్ని చేసి జ్ఞానం పొంది మోక్షం పొందాలి.

శ్లో. 33 **శ్రేయాన్ ద్రవ్యమయాద్యజ్ఞాత్ జ్ఞానయజ్ఞః పరంతప ।**
**సర్వం కర్మాఖిలం పార్థ జ్ఞానే పరిసమాప్యతే ॥**

శ్రేయాన్, ద్రవ్యమయాత్, యజ్ఞాత్, జ్ఞానయజ్ఞః, పరంతప,
సర్వం, కర్మ, అఖిలమ్, పార్థ, జ్ఞానే, పరిసమాప్యతే ॥

| | | | |
|---|---|---|---|
| పరంతప! పార్థ! | = ఓ పరంతపా! ఓ పార్థా! | శ్రేయాన్ | = మిక్కిలి శ్రేష్ఠమైనది |
| ద్రవ్యమయాత్ | = ద్రవ్యములతో ఆచరింపబడు | అఖిలమ్, సర్వమ్, కర్మ | = కర్మలన్నియు |
| యజ్ఞాత్ | = యజ్ఞముకన్నా | జ్ఞానే | = జ్ఞానమునందు |
| జ్ఞానయజ్ఞః | = జ్ఞానయజ్ఞము | పరిసమాప్యతే | = పరిసమాప్తమగును |

**హే పరన్తప! ద్రవ్యమయాత్ యజ్ఞాత్ జ్ఞాన-యజ్ఞః శ్రేయాన్ ।**
**హే పార్థ! సర్వమ్ అఖిలం కర్మ జ్ఞానే పరిసమాప్యతే ।**

తా: ఓ పరంతపా! అర్జునా! ద్రవ్యమయ యజ్ఞముకన్నా జ్ఞానయజ్ఞము మిక్కిలి శ్రేష్ఠమైనది. కర్మలన్నియు జ్ఞానమునందే పరిసమాప్తమగును.

ఇప్పుడు కృష్ణపరమాత్మ జ్ఞానయజ్ఞాన్ని స్తుతిస్తున్నాడు.

**జ్ఞానయజ్ఞః శ్రేయాన్** – జ్ఞానయజ్ఞం శ్రేష్ఠమైనది. దేనికన్నా?

**ద్రవ్యమయాత్ యజ్ఞాత్** – ద్రవ్యయజ్ఞాలకన్నా శ్రేష్ఠమైనది. ద్రవ్యయజ్ఞం అంటే తక్కిన పదకొండు యజ్ఞాలు. అవే కాక కర్మయజ్ఞం కింద వచ్చే ఏ యజ్ఞమైనా కూడా ద్రవ్యంతో కూడిన యజ్ఞమే అవుతుంది. ఏ యజ్ఞం చేసినా, ఆఖరికి పారాయణం చేసినా, చివర్లో ఒక పూజతో దాన్ని ముగించాలి; పూజ అంటే దానికి సంబంధించిన ద్రవ్యాలు కావాలి. ఎందుకు జ్ఞానయజ్ఞాన్ని శ్రేష్ఠం అన్నాడు?

**సర్వం కర్మాఖిలం పార్థ జ్ఞానే పరిసమాప్యతే** – ఈ వాక్యాన్ని రెండురకాలుగా వ్యాఖ్యానించవచ్చు. మొదటి అర్థం అన్ని కర్మలు జ్ఞానంతో ముగుస్తాయి.

**జ్ఞానయోగానికి రానిదే కర్మయోగం అసంపూర్ణం.**

ఒకవ్యక్తి కూరలు, వాటికి సంబంధించిన వస్తువులు అన్నీ తెచ్చి, చాలా ఓపిగ్గా పెద్దవంట చేసి, భోజనం చేయకపోతే ఎలా ఉంటుంది? భోజనం చేయకపోతే పడిన శ్రమంతా బూడిదలో పోసిన పన్నీరు అవుతుంది. అలాగే జ్ఞానయోగానికి రానిదే కర్మయోగం అసంపూర్ణం.

జ్ఞానయోగానికి రావాలంటుంది కాని, ఎప్పుడు రావాలో నొక్కి వక్కాణించదు వేదం. ఆ విషయం మిమ్మల్నే నిర్ణయించుకోమంటుంది. ఇవాళే రండి అనదు. మీకు జ్ఞానంమీద ఆసక్తి లేదు; పూజలు, జపాలు కొనసాగిస్తాను అంటే – సరే మీయిష్టం, తరువాతే రండి అంటుంది. ఆ తరువాత ఎప్పుడు? పది సంవత్సరాల తరువాత కావచ్చు, వచ్చే జన్మలో కావచ్చు, పది జన్మల తరువాత కావచ్చు. కాని ఎప్పుడో అప్పుడు రాకతప్పదు. అలా రాకపోతే మీ శ్రమ అంతా పరిమితినుంచి పరిమితి వైపు ప్రయాణానికి వెచ్చించినట్టు అవుతుంది. అది కదలని సైకిలుమీద కూర్చుని తొక్కినట్టు ఉంటుంది. ఎన్ని గంటలు తొక్కినా సైకిలు ఎక్కడికీ వెళ్ళదు. అలాగే ఎన్ని కర్మలు చేసినా శాశ్వతఫలం రాదు. అశాశ్వతమైన కర్మలు అశాశ్వతమైన ఫలాలనే ఇస్తాయి. జ్ఞానయజ్ఞం ఒక్కటే మోక్షానికి ప్రత్యక్ష సాధనం. అందువల్ల ఓ పార్థా! అన్ని కర్మలూ జ్ఞానయజ్ఞంలో పరిసమాప్తమవుతాయి అంటున్నాడు కృష్ణపరమాత్మ.

దీనివల్ల ఒక ముఖ్య విషయం అర్థం చేసుకోవాలి. జ్ఞానయజ్ఞమే సాక్షాత్ కారణం అనగానే, కర్మయజ్ఞాలు పరోక్షకారణాలు అవుతాయి కదా! అలా అయితే నేను కర్మయజ్ఞాలు చేయటం ఎందుకు; సరాసరి జ్ఞానయజ్ఞానికి వెళ్ళిపోతాను అనవచ్చు ఎవరైనా! అంటే అది కుదరదు. అంతకుముందు జ్ఞానయోగానికి రానిదే, కర్మయోగం అసంపూర్ణం అని చూశాము. దానికి ఇంకో వాక్యం కలుపుకోవాలి ఇప్పుడు.

**కర్మయోగం లేనిదే జ్ఞానయోగం అసంభవం**

దీనికి దగ్గర దారులు లేవు. ఎలాగూ అందరూ చివరికి యూనివర్సిటీకి వెళతారు కదా, దానికోసం ప్రైమరీ స్కూలు, సెకండరీ స్కూలు – ఇవన్నీ చదవటం ఎందుకు, నేను సరాసరి యూనివర్సిటీకి వెళతానంటే ఎలా ఉంటుంది? అలా వెళ్ళలేడు. ఒకవేళ ఐదు సంవత్సరాలకు వెళ్ళి యూనివర్సిటీలో కూర్చున్నా ఒక్కముక్క అర్థం కాదు.

**యూనివర్సిటీకి వెళ్ళందే స్కూలు విద్య అసంపూర్ణం – స్కూలు విద్య లేనిదే యూనివర్సిటీకి వెళ్ళటం అసంభవం**

అందువల్ల సూక్ష్మంలో మోక్షం రాదు. కర్మయజ్ఞం చేయాలి, జ్ఞానయజ్ఞం చేయాలి, అప్పుడు మోక్షం పొందుతారు. ఇది ఒక అర్థం.

రెండవ అర్థం కర్మఫలాలన్నీ జ్ఞానఫలంలో వస్తాయి. సమాప్యతే అంటే అంతర్భవతి. కర్మకన్నా జ్ఞానం ఎందుకు శ్రేష్ఠం అంటే కర్మఫలాలు కూడా జ్ఞానఫలాలతో కలిసివస్తాయి. ఎలా? దీనికి వెనకున్న తర్కం ఇది. కర్మ చేస్తే ఒక ఫలం వస్తుంది కదా. కర్మ అశాశ్వతం కాబట్టి, దాని ఫలం కూడా అశాశ్వతం అని చూశాము కదా! ఇప్పుడు జ్ఞానఫలం ఏమిటి? మోక్షం. అది శాశ్వతఫలం. అహం పూర్ణః అస్మి; బ్రహ్మ అస్మి; సత్యం జ్ఞానమనంతం బ్రహ్మ అస్మి. ఇది జ్ఞానం. నేను అనంతమైన బ్రహ్మను అయినప్పుడు, నాకు వచ్చే ఫలం అనంతం, శాశ్వతం.

అశాశ్వతమైన ఫలాన్ని శాశ్వతమైన ఫలంతో కలపవచ్చు. కాని శాశ్వతమైన ఫలాన్ని అశాశ్వతఫలంతో కలపవచ్చా? లేదు! తమిళనాడును ఇండియాలో కలుపగలం కాని తమిళనాడులో ఇండియాను కలపలేం కదా! అందువల్ల జ్ఞానే అంటే జ్ఞానఫలంవల్ల అంటే పూర్ణఫలంవల్ల సర్వం కర్మ, సర్వం ఫలమ్ అంతర్భవతి. ఈ విషయం కృష్ణపరమాత్మ రెండవ అధ్యాయంలో చెప్పాడు.

**యావానర్థ ఉదపానే సర్వతః సంప్లుతోదకే ।**
**తావాన్ సర్వేషు వేదేషు బ్రాహ్మణస్య విజానతః ॥** – 2.46

అన్ని వైపులా జలాలతో నిండివున్న మహాజలాశయం అందుబాటులో ఉంటే, చిన్న కొలనుతో ఏమిటి అవసరం? జ్ఞానఫలం మహాజలాశయంతో సమానమైతే. కర్మఫలాలు చిన్న కొలనులు. ఆ విధంగా చూసినా కూడా జ్ఞానం శ్రేష్ఠమే.

మళ్ళీ రెండు కారణాలు టూకీగా చూస్తే – మోక్షం పొందటానికి జ్ఞానం సాక్షాత్ కారణం కాబట్టి జ్ఞానం శ్రేష్ఠం. జ్ఞానఫలంలో కర్మఫలాలు కూడా వస్తాయి కాబట్టి జ్ఞానం శ్రేష్ఠం.

జ్ఞానయజ్ఞం గురించి ఇంతగా చెప్పేసరికి, సహజంగానే ఆ జ్ఞానయజ్ఞం ఎలా చేయాలనే కుతూహలం ఏర్పడుతుంది. ఎలా చేయాలో తరువాత వచ్చే శ్లోకంలో చెబుతున్నాడు కృష్ణపరమాత్మ.

శ్లో. 34 **తద్విద్ధి ప్రణిపాతేన పరిప్రశ్నేన సేవయా ।**
**ఉపదేక్ష్యంతి తే జ్ఞానం జ్ఞానినస్తత్త్వదర్శినః ॥**
తత్, విద్ధి, ప్రణిపాతేన, పరిప్రశ్నేన, సేవయా,
ఉపదేక్ష్యంతి, తే, జ్ఞానమ్, జ్ఞానినః, తత్త్వదర్శినః ॥

| | | | |
|---|---|---|---|
| తత్త్వదర్శినః | = పరమాత్మ తత్త్వమును తెలిసిన | ప్రణిపాతేన | = (వారికి) సాష్టాంగనమస్కారము చేయుట ద్వారా |
| జ్ఞానినః | = జ్ఞానులు | | |
| జ్ఞానమ్ | = తత్త్వజ్ఞానమును | సేవయా | = సేవలొనర్చుట ద్వారా |
| తే | = నీకు | పరిప్రశ్నేన | = వినయముతో ప్రశ్నించుటవల్ల |
| ఉపదేక్ష్యంతి | = ఉపదేశించెదరు | తత్ | = ఆ తత్త్వజ్ఞానమును |
| | | విద్ధి | = (నీవు) తెలిసికొనుము |

**ప్రణిపాతేన పరిప్రశ్నేన సేవయా తత్త్వ-దర్శినః జ్ఞానినః**
**జ్ఞానం తే ఉపదేక్ష్యన్తి తత్ (త్వమ్) విద్ధి ।**

తా: నీవు తత్త్వమును దర్శించిన జ్ఞానుల వద్దకు వెళ్ళి, ఆ జ్ఞానమును తెలిసికొనుము. వారికి సాష్టాంగ నమస్కారము చేయుట ద్వారా, సేవలొనర్చుట ద్వారా, వినయముతో ప్రశ్నించుటవల్ల పరమాత్మతత్త్వమును చక్కగా నెరింగిన జ్ఞానులు సంప్రీతులై, నీకు ఆ పరమాత్మ తత్త్వజ్ఞానమును ఉపదేశించెదరు.

**బి). జ్ఞానం పొందే మార్గం –** శ్లోకం 34 జ్ఞానయజ్ఞాన్ని స్వంతంగా చేయలేమని ప్రత్యేకించి చెబుతున్నాడు కృష్ణపరమాత్మ. తక్కిన యజ్ఞాలను స్వంతంగా చేయవచ్చు కాని జ్ఞానయజ్ఞాన్ని స్వంతంగా పొందలేము. దానికి బాహ్యంగా సహాయం కావాలి. అవి శాస్త్రం, గురువు.

ఆత్మజ్ఞానం మనకు తెలిసిన ప్రమాణాల ద్వారా పొందలేము. ఎందుకంటే అవన్నీ బాహ్యప్రపంచాన్ని చూపించటానికే పనికివస్తాయి. బాహ్యప్రపంచాన్ని చూసే కన్నునే మనం స్వయంగా చూడలేము. మన కన్నును మనం చూసుకోవాలంటే దానికి ఒక్కటే మార్గముంది. ఏమిటది? దర్పణం వాడటమే! అద్దంలో చూసుకోవాలి మన కన్నును. స్థూలమైన దర్పణం, మన స్థూలశరీరాన్ని మాత్రమే చూపగలదు. సూక్ష్మశరీరంలో ఉన్న మనస్సునే చూపలేదు, ఇంక ఆత్మను ఎలా చూపించగలదు? అందువల్ల ఆత్మను చూడటానికి **శాస్త్రదర్పణం** కావాలి. శాస్త్రం మన ఆత్మస్వరూపాన్ని వివరిస్తుంది.

కన్నును అద్దంలో మాత్రమే చూడగలమన్నాము. కాని ఆ అద్దం చూడటం చేతకాకపోతే కన్నును చూసుకోలేము. అద్దం ఉన్నవైపు కాకుండా, చెక్క ఉన్నవైపు చూస్తే మొహం కాని, కన్ను కాని కనబడదు. అలాగే అద్దంమీద దుమ్ము పేరుకుపోయినా కూడా కనబడదు. అద్దం ఎలా వాడాలో తెలియాలి. అలాగే శాస్త్రమనే అద్దం ఎలా వాడాలో కూడా తెలియాలి. అది గురువే చూపించగలడు. శాస్త్రం చెప్పినదాన్ని గురువు విడమరిచి చెపితే, బాగా అర్థమవుతుంది.

అద్దంమీద దుమ్మును తుడిచినట్టుగా, మన మనస్సులో ఉన్న దుమ్మును గురువు దులుపుతాడు. అంటే మనకున్న అజ్ఞానాన్ని, సందేహాలను గురువు తీరుస్తాడు. గురువు సహాయం లేకుండా స్వంతంగా నేర్చుకోవటానికి ప్రయత్నిస్తే, శాస్త్రం సరిగ్గా అర్థం కాకపోయినా ఫర్వాలేదు కాని తప్పుగా అర్థం చేసుకునే ఆస్కారం ఉంది. అది చాలా పెద్ద ప్రమాదం. అందువల్ల గురువు ద్వారానే శాస్త్ర ఉపదేశాన్ని పొందాలి.

గురువు దగ్గర నేర్చుకోకుండానే జ్ఞానం పొందినవారు లేరా అనవచ్చు మీరు. కాని అది అందరికీ వర్తించదు. అలాంటివారు ధన్యజీవులు. ఏదైనా ఒక సూత్రం చెప్పినప్పుడు ఆ సూత్రాన్ని తీసుకోవాలి కాని దానికి ఉన్న ఎక్సప్షన్లు (మినహాయింపులు) తీసుకోకూడదు. శాస్త్రం వారు గతజన్మలో జ్ఞానం పొంది ఉండవచ్చు అంటుంది.

గురువు అంటే మూడు రకాల గురువులు ఉన్నారు. మంత్రోపదేశం చేసే గురువు, ప్రేరణనిచ్చే గురువు, బోధ చేసే గురువు. ఈ ముగ్గురు గురువుల మధ్య ఉన్న భేదాన్ని సరిగ్గా అర్థం చేసుకోవాలి మనం. మంత్రోపదేశం సుమారు అరగంటలో అయిపోతుంది. శిష్యుడు పాదపూజ చేస్తాడు, గురువు ఒక మంత్రాన్ని బోధిస్తాడు. అందులో ప్రశ్నలు అడిగే అవకాశం లేదు. ఎందుకంటే అందులో జ్ఞానం పొందేది లేదు.

ప్రేరణ కలిగించే గురువు శిష్యునిలో ఉత్సాహం కలుగజేయటానికి ప్రయత్నిస్తాడు. కృష్ణపరమాత్మ మంత్రోపదేశం చేయలేదు. ప్రేరణ కలిగించి, బోధ చేశాడు.

**క్లైబ్యం మా స్మ గమః పార్థ నైతత్త్వయ్యుపపద్యతే ।**

**క్షుద్రం హృదయదౌర్బల్యం త్యక్త్వోత్తిష్ఠ పరంతప ॥** – 2.3

ఓ అర్జునా! పిరికితనానికి లోనుకావద్దు. నీకిది ఉచితం కాదు. తుచ్ఛమైన ఈ హృదయదౌర్బల్యాన్ని విడిచిపెట్టు అని ముందు ప్రేరేపించాడు. కాని అక్కడితో ఊరుకోలేదు. వేదాంతాన్ని బోధించాడు. అది కూడా ఒక క్రమపద్ధతిలో. ఎలా ఫిజిక్స్ కాని కెమిస్ట్రీ కాని ఒక క్రమపద్ధతిలో నేర్చుకుంటామో, శాస్త్రం కూడా అలాగే నేర్చుకోవాలి. బోధ ఉన్న చోట ప్రశ్నలకు, సందేహాలకు చోటు ఉంటుంది. గుడ్డిగా నమ్మరు. శిష్యుడు అనేక ప్రశ్నలు వెయ్యవచ్చు.

ఆ బోధను శ్రద్ధగా వినాలి. అందువల్లనే కృష్ణపరమాత్మ అనేకచోట్ల శృణు, శృణు, శృణు అంటాడు. ఆత్మజ్ఞానం కథ విన్నట్టు వింటూపోతే కుదరదు. కథ వినేటప్పుడు మెదడుకు మేత పెట్టనవసరం లేదు. కాని ఒక బోధ వింటున్నప్పుడు శ్రద్ధగా వినాలి. ఒకదానితో ఒకటి సమన్వయం కుదరాలి. ఒకచోట జ్ఞానంవల్లనే మోక్షం పొందగలవని చెప్పి, ఇంకోచోట నాలుగు మార్గాల ద్వారా మోక్షం పొందవచ్చని గురువు చెప్పకూడదు. గురువు సరిగ్గా బోధించాలి.

శిష్యుడు ప్రశ్నలు అడగగలగాలి. అర్జునుడు మూడవ అధ్యాయంలో ప్రశ్నలు అడిగాడు, ఈ అధ్యాయంలో అడిగాడు, చాలాచోట్ల అడిగాడు. చివరికి 18వ అధ్యాయంలో కూడా అడిగాడు. దీని అర్థం ఏమిటి? వేదం ఒక క్రమపద్ధతిలో చెప్పబడే శాస్త్రం; దాన్ని అర్థం చేసుకోవాలి, ఆలోచించాలి, ప్రశ్నలు వేయాలి, జీర్ణించుకోవాలి.

ఫిజిక్స్‌లో ఒక సూత్రాన్ని చెప్పాలంటే అది చెప్పి దానిమీద జపం చేయండి అనరు. దాన్ని విడమర్చి చెబుతారు. అలాగే వేదాంతంలో కూడా అహం బ్రహ్మ అస్మి అనే సూత్రం చెప్పాలంటే అది చెప్పి దాన్ని జపం చేయండి అనరు, దాన్ని విశ్లేషించి, విడమర్చి చెబుతాడు గురువు. సోహం పదాన్ని జపం చేయండి అని ఒకవేళ గురువు చెపితే, సోహం, సోహం, శోకం అనేస్తారు చివరికి. పైగా దాన్ని శోకమస్మి అంటారు. అంటే నేను శోకం అనుకుంటారు. అసలు అర్థం నాలో ఉన్న చైతన్యం, బ్రహ్మలో ఉన్న చైతన్యం ఒకటే! ఈ విషయాన్ని జపం చేస్తేనో, నమ్మితేనో కుదరదు. ఈ విషయాన్ని అర్థం చేసుకుని, జీర్ణించుకోవాలి. అది అర్థమయి, జీర్ణించుకుంటే బోధ పూర్తయినట్టు అర్థం. అన్ని అధ్యాయాల్లో వివరించాక, చివర్లో అర్జునుడు అంటాడు –

**నష్టో మోహః స్మృతిర్లబ్ధా త్వత్ప్రసాదాన్మయాచ్యుత** – 18.73

ఓ కృష్ణా! నా మోహం పోయింది; నాకు నీ బోధ చక్కగా అర్థమయింది అంటాడు.

అందువల్ల కృష్ణపరమాత్మ ఈ 34వ శ్లోకంలో చెబుతున్నది బోధ చేసే గురువు గురించి.

**జ్ఞానినః తత్త్వదర్శినః** – ఈ వేదాంత శాస్త్రాన్ని బాగా అర్థం చేసుకుని, బాగా బోధించగలిగిన గురువు. జ్ఞానం ఉండటం ఒక ఎత్తు; దాన్ని సరిగ్గా బోధించగలగటం ఇంకో ఎత్తు. జ్ఞానం ఉండగానే సరిపోదు, దాన్ని సరిగ్గా విడమర్చి చెప్పగలగాలి. అటువంటి గురువును **శ్రోత్రియః బ్రహ్మనిష్ఠః** అంటుంది ముండకోపనిషత్తు. బ్రహ్మనిష్ఠ అంటే జ్ఞానం ఉన్న వ్యక్తి! శ్రోత్రియం అంటే బాగా చెప్పగలగిన వ్యక్తి. అటువంటి శ్రోత్రియ బ్రహ్మనిష్ఠ గురువునే కృష్ణపరమాత్మ **జ్ఞానినః తత్త్వదర్శినః** అంటున్నాడు. తత్త్వదర్శి అంటే బ్రహ్మనిష్ఠలో ఉన్న వ్యక్తి. నేను బ్రహ్మను అనే విషయం, అంటే అహం బ్రహ్మ అస్మి – తను అర్థం చేసుకుని జీర్ణించుకున్న గురువే శిష్యునికి తత్త్వమసి అని చెప్పగలడు. అంటే నువ్వు బ్రహ్మవు అని చెప్పగలుగుతాడు.

అంతేకాదు, అతను జ్ఞానినః కూడా. అంటే బోధ చేయగలిగిన శక్తి ఉన్న వ్యక్తి. సంప్రదాయ పద్ధతిలో చెబుతాడు.

**ఇతి శుశ్రుమ పూర్వేషాం యే నస్తద్ వ్యాచచక్షిరే** – కేన. 4

ఎవరూ ఈ విషయం బోధించలేరు అంటూనే, కేనోపనిషత్తులో గురువు, కాని మా గురువు బోధించినట్టుగా నేను నీకు బోధిస్తాను అంటాడు. ఇటువంటి గురువును సంప్రదాయవిత్ అంటారు.

**అసంప్రదాయవిత్ మూర్ఖవత్ ఉపేక్షణీయః**

ఒకవ్యక్తి గొప్ప జ్ఞాని అయినా కూడా అతను గురుపరంపరను పాటించకపోతే, అతన్ని బోధ చేసే గురువుగా తీసుకోకూడదు అంటారు శంకరులవారు. వారిని మంత్రోపదేశం చేసే గురువుగానో, ప్రేరణనిచ్చే గురువుగానో

చూడవచ్చు తప్ప, బోధ చేసే గురువుగా చూడకూడదు. అందువల్ల శ్రోత్రియబ్రహ్మనిష్ఠ అయిన గురువు దగ్గరకే వెళ్ళాలి. ఆ గురువు ఏం బోధిస్తాడు? ఆత్మవిద్య బోధిస్తాడు.

గురువు చెబుతాడు సరే మనకు అది అందుకునే అర్హత ఉందా? ఒక పాత్రలో పాలు పొయ్యాలంటే ఆ పాత్ర అనువుగా ఉండాలి. అందులో చిల్లులు ఉండకూడదు. అది సరిగా లేకపోతే పాలు విరిగిపోవచ్చు కూడా. అలాగే మన మనస్సు సిద్ధంగా లేకపోతే ఆ జ్ఞానం సరిగా పొందలేము. ఇక్కడ కృష్ణపరమాత్మ మూడు అర్హతలను వివరిస్తున్నాడు. ఏమిటవి? **జిజ్ఞాస, వినయం, సేవ.** ఈ జ్ఞానం పొందాలనే తీవ్రమైన తపన ఉండాలి. ఈ జ్ఞానమే జీవితంలో నా సమస్యలను పారద్రోలగలదని తెలుసుకోవాలి – ఇది జిజ్ఞాస. రెండవది వినయం. నా అజ్ఞానాన్ని వినయంగా ఒప్పుకోవాలి. ఇదే చాలా కష్టం. వినయం చూపాలంటే అహంకారాన్ని తగ్గించుకోవాలి. నాకే అన్నీ తెలుసు, నేను అనేక పుస్తకాలను చదివాను అని గొప్పలు చెప్పుకునే వ్యక్తి గురువు దగ్గరకు వెళ్ళలేడు. శిష్యునికి వినయం ఉందో లేదో ఎలా తెలుస్తుంది?

**తత్ విద్ధి** – గురువు దగ్గరికి వెళితే, ఆయన ఒక క్రమపద్ధతిలో బోధ చేస్తాడు. సరే, కాని శిష్యుడు ఎలా వెళ్ళాలి? **ప్రణిపాతేన** – గురువు దగ్గరకు వెళ్ళి సాష్టాంగనమస్కారం చేయాలి. అది ఎప్పుడు చేయగలడు? శిష్యుడు వినయంగా ఉన్నప్పుడు.

కాని గురువు దగ్గరకు వచ్చి సాష్టాంగనమస్కారం చేసిన ప్రతిశిష్యునికీ జిజ్ఞాస ఉంటుందని చెప్పలేము. చాలామంది ఆచార్యుల దగ్గరకు వెళ్ళి బారులుతీర్చి నిల్చుంటారు. ఎందుకు? వారి సమస్యలను చెప్పుకోవటానికి. మూడవ అబ్బాయికి పెళ్ళి కాలేదనో, రెండవ అబ్బాయికి అమెరికాకి వీసా రాలేదనో, స్థలం తగాదాల్లో పడిందనో, కడుపునొప్పి తగ్గటం లేదనో చెప్పుకుంటారు. పాత్రనెరిగి దానం చేయాలి అంటారు. అలా సమస్యలతో వచ్చిన శిష్యుడికి నువ్వు బ్రహ్మవనో, నువ్వు శరీరానివి కావనో చెపితే వారు వినరు.

**పరిప్రశ్నేన** – అందువల్ల శిష్యుడు జ్ఞానం కావాలని అడగాలి అంటాడు కృష్ణపరమాత్మ. ప్రణిపాతం చేయాలి. ప్రణిపాతం వినయాన్ని సూచిస్తే, పరిప్రశ్న జిజ్ఞాసను సూచిస్తుంది.

**సేవయా** – ఇంకొక ముఖ్యలక్షణం సేవ చేయటం. గురువుకు సేవ చేయాలి. గురువుకు ఎందుకు సేవ చేయాలి? అలా చేయటంవల్ల రెండు విధాల ప్రయోజనం ఉంది. శిష్యుడు గురువు దగ్గరికి వచ్చి, అక్కడే ఉండి నేర్చుకుంటాడు కాబట్టి, అతనికి వేరే కర్మలు ఏవీ చేసే అవకాశం ఉండదు. కర్మ చేస్తే చిత్తశుద్ధి పొందుతారని చూశాము కదా! చిత్తశుద్ధి పూర్తిగా పొందకపోతే గురువుకు సేవ చేయటంవల్ల పొందుతారు. ఒకలాభం **చిత్తశుద్ధి పొందటం**.

ఇంకొక లాభం గురుశిష్యుల మధ్య **అనుబంధం** ఏర్పడుతుంది. మనం కొత్తగా ఏదైనా ప్రసంగానికి వెళితే, ప్రసంగం శ్రద్ధగా వినకుండా ఎంతమంది వచ్చారు, ఏ వయస్సువారు ఎక్కువగా ఉన్నారు, అది కూడా స్త్రీలా, పురుషులా వంటి విషయాలను బేరీజు వేస్తాము. అంటే ఆ వాతావరణానికి అలవాటు పడటానికి కొంత

సమయం పడుతుంది. పర్వతారోహణ చేసేవారు ఒకేసారి 29000 అడుగుల ఎత్తు ఉన్న శిఖరానికి చేరుకోరు. ముందు బేస్‌క్యాంపులో కొన్ని రోజులుండి, అక్కడ వాతావరణానికి అలవాటుపడ్డాక నెమ్మది నెమ్మదిగా ఎక్కుతారు.

అలాగే గురువు కూడా శిష్యుల స్థాయికి తగ్గట్టుగా బోధిస్తాడు. ఎలా చెపితే వారికి అర్థమవుతుంది, ఏ జోక్ చెపితే వారు ఆస్వాదిస్తారు తెలుసుకుంటాడు గురువు. అలా గురుశిష్యుల మధ్య అనుబంధం ఏర్పడటానికి కొంత సమయం పడుతుంది. శిష్యుడు సేవ చేయటం ద్వారా ఒకరినొకరు బాగా అర్థం చేసుకుంటారు.

పరమార్థానంద స్వామీజీ, దయానంద స్వామీజీ దగ్గర ఆశ్రమంలో ఉండి, మూడేళ్ళ కోర్సు చేస్తున్నప్పుడు పూజ్య స్వామీజీ వీరిని నోట్సు వ్రాయమనేవారట. అదే పద్ధతిని పరమార్థానంద స్వామీజీ కూడా మొదట్లో పాటించేవారట. శిష్యులు నోట్సు రాయటంవల్ల వారికి ఎంత అర్థమయింది, ఏది అర్థం కాలేదు తెలుస్తుంది గురువుకు. సరిగ్గా అర్థం కాకపోయినా ఫర్వాలేదు, ఒక్కోసారి తప్పుగా అర్థం చేసుకుంటారు.

ఒకసారి స్వామీజీ కుండలినీ యోగం గురించి మాట్లాడుతూ – అది కొన్ని సిద్ధులను ఇస్తుంది కాని జ్ఞానాన్ని ఇవ్వదు. మనకు జ్ఞానమే కావాలని చెప్పారుట. కాని ఎవరో శిష్యుడు హిందూ పేపర్‌లో రాసాడుట– కుండలినీ యోగం మోక్షసాధనమని స్వామీజీ చెప్పారని. అందువల్ల గురుశిష్యుల మధ్య అనుబంధం సరిగ్గా ఉండి, జ్ఞానం సరిగ్గా పొందాలంటే గురుశుశ్రూష దోహదం చేస్తుంది.

శ్లో. 35 **యద్ జ్ఞాత్వా న పునర్మోహమ్ ఏవం యాస్యసి పాండవ ।**
**యేన భూతాన్యశేషేణ ద్రక్ష్యస్యాత్మన్యథో మయి ॥**
యత్, జ్ఞాత్వా, న, పునః, మోహమ్, ఏవమ్, యాస్యసి, పాండవ,
యేన, భూతాని, అశేషేణ, ద్రక్ష్యసి, ఆత్మని, అథో, మయి ॥

| | | | |
|---|---|---|---|
| పాండవ! | = ఓ అర్జునా | భూతాని | = సమస్త భూతములను |
| యత్, జ్ఞాత్వా | = దేనిని తెలిసికొని | అశేషేణ | = నిశ్శేషముగా |
| పునః | = మరల | ఆత్మని | = (మొదట) నీ ఆత్మయందును |
| ఏవమ్, మోహమ్ | = ఇటువంటి మోహమును | అథో | = తరువాత |
| న, యాస్యసి | = పొందవో | మయి | = పరమాత్మనైన నాలో |
| యేన | = ఏ జ్ఞానప్రభావముచేత | ద్రక్ష్యసి | = చూడగలవు |

**హే పాణ్డవ! యత్ జ్ఞాత్వా (త్వమ్) పునః ఏవం మోహం**
**న యాస్యసి, యేన భూతాని అశేషేణ ఆత్మని అథో మయి ద్రక్ష్యసి ।**

తా: ఓ అర్జునా! ఈ తత్త్వజ్ఞానము నెరింగినచో మరల ఇటువంటి వ్యామోహములో చిక్కుకొనవు. ఈ జ్ఞానప్రభావముతో సమస్త ప్రాణులను నీలో సంపూర్ణముగా చూడగలవు.తరువాత పరమాత్మనైన నాలో చూడగలవు.

**సి) జ్ఞానఫలం –** శ్లోకాలు 35–37 ముందు శ్లోకం వరకూ జ్ఞానయజ్ఞ సాధనలు, జ్ఞానం పొందే మార్గం చూశాము. ఇప్పుడు జ్ఞానఫలం గురించి చెప్పబోతున్నాడు కృష్ణపరమాత్మ. భిన్నసందర్భంలో భిన్నఫలాలు చెబుతాడు. ఇక్కడ ఈ శ్లోకంలో రెండు ఫలాలు చెబుతున్నాడు.

అవి మోహనాశనం, జీవ–ఈశ్వర ఐక్యదర్శనం.

1. **మోహనాశనం** – మోహనాశనం అవటంవల్ల జీవితంలో పడే ఘర్షణలు పోతాయి. అర్జునుడు కృష్ణపరమాత్మను ఎందుకు శరణు వేడాడు? అతని ఘర్షణవల్లనే. అర్జునునికి ధర్మశాస్త్రం తెలుసు. దుర్యోధనాదులు ఆతతాయిలని అతనికి తెలుసు. అతనే వాడాడు ఆ పదాన్ని. ఆతతాయిలు అంటే ఉరిశిక్ష విధింపబడాల్సిన గొప్ప నేరస్థులు. సామదాన పద్ధతులన్నీ వాడి చూశాడు దుర్యోధనునితో. అయినా అతను పెడచెవిన పెట్టాడు. అలాంటప్పుడు అతనికి దండనే శిక్ష.

అది తెలిసీ అర్జునుని మనస్సులో ఘర్షణ వచ్చింది. దీన్నిబట్టి ఒక విషయం స్పష్టంగా తెలుస్తున్నది. ఎంత జ్ఞానం ఉన్నా, అది మోహంతో కూడితే, ఘర్షణ తప్పదు. ఘర్షణకు మూలకారణం మోహం. మోహం అంటే బంధం. భీష్మద్రోణులమీద ఉన్న బంధం, అర్జునుణ్ణి మోహంలో పడవేసింది. వారు ఈ భూమ్మీద ఉండబోరు అనే విషయాన్ని అతను స్వీకరించలేక పోతున్నాడు. వారు తన చేతిలో మరణిస్తారు అనే నిజాన్ని ఎదుర్కోవటానికి సిద్ధంగా లేనప్పుడు, అడవిలోనే ఎందుకు ఉండిపోలేదు? దానికీ సిద్ధంగా లేడు. ఘర్షణ ఎప్పుడు వస్తుంది? రెండు నిర్ణయాల మధ్య నలిగినప్పుడు వస్తుంది.

భవిష్యత్తును ఎదుర్కోవటానికి సిద్ధంగా లేనప్పుడు వస్తుంది. అది మోహంవల్ల వస్తుంది. కొన్ని నిర్ణయాలు తీసుకోకతప్పదు. దానికి తగ్గ ఫలం అనుభవించక తప్పదు. నిర్ణయం తీసుకోకుండా కొన్నాళ్ళు కాలయాపన చేయటానికి చూస్తాము. తరువాతన్నా తీసుకోవాలిగా? పెళ్ళి చేసుకోవాలా, వద్దా? అమెరికా వెళ్ళాలా, వద్దా? ఈ ఉద్యోగం చేయాలా, వద్దా? సన్న్యాసి అవాలా, వద్దా? ఏ నిర్ణయం తీసుకున్నా అది సాహసంతో కూడిన వ్యవహారమే. ఫలితం ఎలా ఉంటుందో అనే భయంతో నిర్ణయం తీసుకోవటానికి వెనుకంజ వేస్తాము.

ఎప్పుడైతే ఆత్మజ్ఞానం పొందుతామో, అప్పుడే భవిష్యత్తును ఎదుర్కోవటానికి సిద్ధంగా ఉంటాము. మనం తీసుకునే నిర్ణయం మనకు నచ్చిన ఫలం తీసుకురావచ్చు, నచ్చని ఫలం తీసుకురావచ్చు. కాని జ్ఞాని తీసుకోవాల్సిన నిర్ణయాన్ని ఆలశ్యం చేయడు – ఏదొచ్చినా సమభావంతో స్వీకరిస్తాడు. పెళ్ళి చేసుకోవాలనుకుంటే, వెంటనే చేసుకుంటాడు, మీనమేషాలు లెక్కపెట్టడు.

**యద్ జ్ఞాత్వా పాండవ** – జ్ఞానం జీవితంలో నిర్ణయాలు తీసుకునే శక్తినిచ్చి, ఘర్షణను తొలగిస్తుంది. అందువల్ల ఈ జ్ఞానం పొందటంవల్ల, ఓ అర్జునా!

**మోహం న యాస్యసి** – మళ్ళీ ఎన్నడూ నువ్వు మోహంలో పడవు. ఎన్నడూ ఘర్షణకు లోను కావు.

**ఏవమ్** – ఇప్పుడు నీకున్న మోహం ఉండదు. ఎందుకన్నాడు ఆ మాట? అర్జునుడే చెప్పుకున్నాడు.

**న చైతద్విద్మః కతరన్నో గరీయో యద్వా జయేమ యది వా నో జయేయుః** – 2.6

హే కృష్ణా! యుద్ధం చేయటం శ్రేష్ఠమో, చేయకపోవటం శ్రేష్ఠమో అర్థం కావటం లేదు. యుద్ధంలో వారిని మనం జయిస్తామో, లేక వారు మనను జయిస్తారో కూడా తెలియదు. అందువల్ల ఏ నిర్ణయం తీసుకోవాలో తేల్చుకోలేక పోతున్నాను. అటువంటి స్థితినుంచి ఆత్మజ్ఞానం పొందటంవల్ల స్థిరంగా ఉంటాడు. ఇటువంటి మోహంలో మళ్ళీ చిక్కుకోడు.

2. **జీవ ఈశ్వర ఐక్యదర్శనం – యేన భూతాన్యశేషేణ ద్రక్ష్యస్యాత్మన్యథో మయి** – జీవాత్మ పరమాత్మ ఐక్యదర్శనం కలుగుతుంది. ఇది రెండవ ఫలం. కాని కృష్ణపరమాత్మ ఈ ఐక్యాన్ని ప్రత్యక్షంగా చెప్పడు. పరోక్షంగా చెబుతాడు.

ఈ జ్ఞానం పొందాక సమస్త ప్రాణులను నీలో చూడగలవు అంటున్నాడు. తరువాత ఇంకొక వాక్యం చెబుతున్నాడు. సమస్త ప్రాణులను నాలో చూడగలవు అంటున్నాడు. అది అర్థం చేసుకోగలము. భగవంతుణ్ణి విశ్వాధారం, గగనసదృశం అంటాము. ఆకాశం లాగా భగవంతుడు సర్వవ్యాపకుడు, సర్వాధారం. సర్వప్రాణులను భగవంతునిలో చూస్తావు; సర్వప్రాణులను నీలో చూస్తావు. ఇప్పుడు ఈ రెండు వాక్యాలను కలిపితే ఏం అర్థం వస్తుంది? **నువ్వు భగవంతుడివి.**

అల, సముద్రం ఒక్కటే అని చెప్పినట్టువుతుంది. అంత చిన్న అల, అంత పెద్ద సముద్రం ఒకటే ఎలా అవుతాయి? అలలో ఉన్నదీ నీరే, సముద్రంలో ఉన్నదీ నీరే! వాటి స్వరూప దృష్ట్యా రెండూ ఒకటే. అలాగే నేను స్వరూపదృష్ట్యా చైతన్యాన్ని. భగవంతుడు స్వరూపదృష్ట్యా చైతన్యం. అలా చైతన్యపరంగా జీవాత్మ పరమాత్మ ఐక్యం చూస్తాము.

**అశేషేణ భూతాని ఆత్మని ద్రక్ష్యసి** – సమస్త ప్రాణులను నీలో చూస్తావు అంటున్నాడు కృష్ణపరమాత్మ.
**అథో మయి** – నాలో కూడా చూస్తావు. ఆత్మని అంటే ఇక్కడ వ్యష్టి. మయి అంటే సమష్టి. సమస్త జగత్తును సమష్టిలో చూస్తావు, అది వ్యష్టికి భిన్నంగా లేదు.

శ్లో. 36 **అపి చేదసి పాపేభ్యః సర్వేభ్యః పాపకృత్తమః ।**
**సర్వం జ్ఞానప్లవేనైవ వృజినం సంతరిష్యసి ॥**
అపి, చేత్, అసి, పాపేభ్యః, సర్వేభ్యః, పాపకృత్తమః,
సర్వమ్, జ్ఞానప్లవేన, ఏవ, వృజినమ్, సంతరిష్యసి ॥

| | | | |
|---|---|---|---|
| (త్వమ్) | = నీవు | జ్ఞానప్లవేన, ఏవ | = జ్ఞానమనెడి నౌక ద్వారా |
| సర్వేభ్యః, పాపేభ్యః, | = పాపులందరి | సర్వమ్, వృజినమ్ | = సమస్త పాపసముద్రమును |
| అపి | కన్నా | సంతరిష్యసి | = పూర్తిగా దాటగలవు |
| పాపకృత్తమః, | = అధికముగా పాపములను | | |
| అసి, చేత్ | చేసినవాడవైతే | | |

**(త్వమ్) సర్వేభ్యః పాపేభ్యః అపి పాప-కృత్తమః అసి చేత్ సర్వం**
**వృజినం జ్ఞాన-ప్లవేన ఏవ సన్తరిష్యసి ।**

తా: ఒకవేళ పాపాత్ములందరికన్నా నీవు ఒక మహాపాపివి అయినచో, జ్ఞాననౌక సహాయముతో పాపసముద్రమునుంచి నిస్సందేహముగా పూర్తిగా బయట పడగలవు.

ఇంతకుముందు జ్ఞానంవల్ల కలిగే రెండు ఫలాలను చూశాము. అవి **మోహనాశనం, జీవ ఈశ్వర ఐక్యదర్శనం.** ఇప్పుడు మూడవది చూస్తాము. అది **సర్వపాప నాశనం.**

3. **సర్వపాప నాశనం** – ఆత్మజ్ఞానం పొందితే అన్ని పాపాలూ దగ్ధమవుతాయి. అలా వేరే ఏ మార్గంలోనూ దగ్ధమవవు.

పాపాలను కడిగే ఇంకో మార్గం ప్రాయశ్చిత్త కర్మలు చేయటం. కాని మనం జన్మజన్మలనుంచి ప్రోగుచేసుకున్న పాపాలను దగ్ధం చేయాలంటే ఎన్ని ప్రాయశ్చిత్త కర్మలు చేయాలి? మన పాపాల మూట వందకోట్ల హిమాలయాల కన్నా ఎత్తుగా ఉంది. వీటన్నిటికీ ఎప్పటికి ప్రాయశ్చిత్త కర్మలు చేయగలము? ఒక పాపకర్మకు ఒక ప్రాయశ్చిత్తకర్మ చేయాలి. అది ఒక సమస్య. అదికాక ఒకపక్కనుంచి చేసిన పాపకర్మలకు ప్రాయశ్చిత్తకర్మలు చేస్తూ వస్తుంటే, ఇంకోపక్కనుంచి కొత్త పాపాలను పోగుచేసుకు వస్తున్నాము. అంతేకాదు కొన్ని పాపకర్మలు చేయటానికి తక్కువ సమయం పడుతుంది కాని దాని ఫలాన్ని జన్మజన్మలకూ అనుభవించాల్సి ఉంటుంది.

ఉదాహరణకు పెళ్ళి చేసుకుని, ఆ తరువాత భార్యను వదిలేస్తే అది మహాపాపం కింద వస్తుంది. ధర్మశాస్త్రం ప్రకారం ఆ వ్యక్తి ఆ పాపఫలాన్ని ఏడు జన్మల వరకూ అనుభవిస్తాడుట! ఏడు జన్మలలోనూ అతను స్త్రీగా పుట్టి, అతని భార్య పడ్డ అవస్థలు అతను పడతాడు. అంటే ఈ జన్మలో చేసిన కర్మను, ఏడు జన్మలు అనుభవించాల్సి ఉంటుంది.

ఈ పాపాలను పెద్ద సముద్రంతో పోలుస్తున్నాడు కృష్ణపరమాత్మ. అలా పాపాలు జన్మజన్మలకూ పేరుకు పోతుంటాయి.

**వృజినమ్** – కృష్ణపరమాత్మ ఈ పాపాలను ఒక మహాసముద్రంతో పోలుస్తున్నాడు. ఆ పాపాలను జ్ఞానం దగ్ధం చేస్తుంది. సంచిత పాపాలనే కాదు, ఆగామి పాపాలను కూడా నాశనం చేస్తుంది. అర్జునుడు గొప్ప పాపాత్ముడు కాదు. అయినా విషయం వివరించటంకోసం కృష్ణపరమాత్మ చెబుతున్నాడు –

**అపి చేదసి సర్వేభ్యః పాపేభ్యః పాపకృత్తమః** – ఒకవేళ పాపాత్ములందరికన్నా కూడా నువ్వు ఒక మహాపాపివి అయి ఉన్నాకూడా;

**సర్వం సంతరిష్యసి** – సర్వపాపం సంతరిష్యసి. నువ్వు బెంగ పడనవసరం లేదు. నీకు అపరాధభావన ఉండనవసరం లేదు. వీటన్నిటినీ నువ్వు అవలీలగా దాటగలవు. అంటే కొత్త పాపాలు చేయవచ్చా అనకూడదు. జ్ఞానం కలిగితే, అది పాతపాపాలను నాశనం చేయటమే కాదు, కొత్తపాపాలను చేయనివ్వదు కూడా.

**జ్ఞానప్లవేన ఏవ (సంతరిష్యసి)** – ప్లవః అంటే నౌక. జ్ఞానమనే నౌకతో మహాసాగరాన్ని దాటవచ్చు. వృజినం అంటే పాపసాగరం. అందువల్ల జ్ఞానం పొందటంవల్ల పాపనాశనం జరుగుతుంది.

శ్లో. 37 **యథైధాంసి సమిద్ధో౽గ్నిః భస్మసాత్కురుతే౽ర్జున ।**
**జ్ఞానాగ్నిః సర్వకర్మాణి భస్మసాత్కురుతే తథా ॥**
యథా, ఏధాంసి, సమిద్ధః, అగ్నిః, భస్మసాత్, కురుతే, అర్జున,
జ్ఞానాగ్నిః, సర్వకర్మాణి, భస్మసాత్, కురుతే, తథా ॥

| | | | |
|---|---|---|---|
| అర్జున! | = ఓ అర్జునా! | తథా | = అలాగే |
| యథా | = ఎలాగైతే | జ్ఞానాగ్నిః | = జ్ఞానమనెడి అగ్ని |
| సమిద్ధః, అగ్నిః | = ప్రజ్వలిస్తున్న అగ్ని | సర్వకర్మాణి | = కర్మలను అన్నింటిని |
| ఏధాంసి | = సమిధలను | భస్మసాత్, కురుతే | = భస్మమొనరించును |
| భస్మసాత్, కురుతే | = భస్మమొనర్చునో | | |

**హే అర్జున! యథా సమిద్ధః అగ్నిః ఏధాంసి భస్మసాత్ కురుతే,**
**తథా జ్ఞాన–అగ్నిః సర్వ–కర్మాణి భస్మసాత్ కురుతే ।**

తా: ఓ అర్జునా! ప్రజ్వలిస్తున్న అగ్ని సమిధలను భస్మము చేసినట్లు జ్ఞానమను అగ్ని కర్మలనన్నింటిని భస్మమొనరించును.

4. **సర్వకర్మ నాశనం** – ఈ శ్లోకంలో కృష్ణపరమాత్మ కర్మనాశనం గురించి చెబుతున్నాడు. ఇది నాలుగవ ఫలం. సర్వకర్మ నాశనం జరుగుతుంది. ఇక్కడ కర్మ అంటే కర్మఫలం. శాస్త్రం మూడు రకాల కర్మఫలాల గురించి మాట్లాడుతుందని తెలుసు కదా! అవి – సంచితకర్మఫలం, ప్రారబ్ధకర్మఫలం, ఆగామికర్మఫలం.

సంచిత కర్మఫలం అంటే గతజన్మల్లో ప్రోగుచేసుకుని ఈ జన్మకు తీసుకువచ్చిన పుణ్యపాపాలు. ఆ సంచిత కర్మలోంచి కొన్ని కర్మలు ఫలించి ఈ జన్మను ఇస్తాయి. దాన్ని ప్రారబ్ధకర్మ అంటారు. ప్రారబ్ధకర్మ పుణ్యపాపాలు ఉన్నంతవరకూ ఈ జన్మ ఉంటుంది. అవి క్షయమవగానే, ఈ జీవితం పడిపోతుంది. ఈ జన్మలో కొత్తగా కొన్ని కర్మలు చేస్తాము. వాటివల్ల మరికొన్ని పుణ్యపాపాలు వచ్చి చేరతాయి. వీటిని ఆగామి కర్మ పుణ్యపాపాలు అంటారు. ఈ ఆగామికర్మల్లో కొన్ని వాటి తీవ్రతనుబట్టి ప్రారబ్ధకర్మలుగా మారుతాయి. మరికొన్ని సంచితకర్మల్లో కలుస్తాయి. వాటివల్ల పునరపి జననం, పునరపి మరణం పొందుతూ ఉంటాము.

ఇక్కడ అన్ని కర్మలూ దగ్ధమవుతాయి అంటున్నాడు కృష్ణపరమాత్మ. సంచితకర్మలు జ్ఞానాగ్నిలో దగ్ధమవుతాయి, ఆగామి కర్మలు అంటవు. ప్రారబ్ధకర్మ క్షయమవుతుంది. జ్ఞాని తను శరీరం కాదని తెలుసుకుంటాడు కాబట్టి కర్మలను నేను చేస్తున్నాను అనుకోడు. అతను అకర్తా, అభోక్తగా ఉంటాడు కాబట్టి, అతనికి ఆగామికర్మ పుణ్యపాపాలు అంటవు. ప్రారబ్ధకర్మ క్షయమవుతుంది అంటే అతను ప్రారబ్ధకర్మకు చలించడు.

జ్ఞాని ప్రారబ్ధకర్మకు చలించడు అని చెప్పటానికి అనేక ఉదాహరణలు చూడవచ్చు. ఒకటి ముందే చూశాము. పనసపండును కోసేముందు చేతికి, కత్తికి నూనె రాసుకుంటే, దానిలోని జిగురు అంటుకోదు. అలాగే ఎలక్ట్రీషియన్ చేతికి గ్లవ్స్ తొడుక్కుంటే, లైవ్ వైరును పట్టుకున్నా అతనికేమీ కాదు. కారు గతుకుల రోడ్డుమీద వెళుతున్నా, కారులో షాక్అబ్సార్బర్స్ ఉంటే ప్రయాణం చేసే వ్యక్తికి ఏమీ తెలియదు. హెూరున వాన కురుస్తుంటే, రెయిన్‌కోటు వేసుకువెళితే ఆ వ్యక్తి వానలో తడవడు. ఈ ఉదాహరణలన్నింటిలోనూ పరిస్థితి అలాగే ఉంది, పరిస్థితిని ఏమీ మార్చలేదు. కాని దాన్ని ఎదుర్కోవటానికి తనను తాను సిద్ధం చేసుకున్నాడు వ్యక్తి. అలాగే జ్ఞానికి జ్ఞానమనే షాక్ అబ్సార్బర్స్ ఉండటంవల్ల, ప్రారబ్ధకర్మ తెచ్చే పుణ్యపాపాలకు అతను చలించడు. అంటే అతను నాకే ఎందుకు వచ్చిందని బాధపడుతూ కూర్చోడు. తప్పించుకోలేని పరిస్థితిని కూడా నవ్వుతూ స్వీకరిస్తాడు. అందువల్ల జ్ఞానికి ప్రారబ్ధకర్మ ఉన్నా, అతని దృష్టిలో అది లేనట్టే.

ఆ విధంగా సంచితకర్మ నాశనమవుతుంది; ఆగామికర్మ అంటదు; ప్రారబ్ధకర్మ నాశనమయినట్టుగా అనిపిస్తుంది. ఇదీ ఈ శ్లోకం సారాంశం. ఇందులో జ్ఞానాన్ని పెద్ద జ్వాలతో పోలుస్తున్నాడు. జ్ఞానం అగ్ని; మనం చేసే కర్మలన్నీ అగ్నిలో వేసే అన్నిరకాల వస్తువులూను. అందువల్లనే ఆ అగ్నిని పెద్దగా మండుతున్న జ్వాల అన్నాడు. పెద్ద జ్వాలలో ఎటువంటి కట్టెను వేసినా అది కాలిపోతుంది. అలాగే జ్ఞానాగ్నిలో అన్ని కర్మలూ దగ్ధమవుతాయి.

**అగ్నిః యథా ఏధాంసి భస్మసాత్ కురుతే** – అగ్ని అన్ని రకాల సమిధలను, కట్టెలను బూడిద చేస్తుంది. కాని అది ఎటువంటి అగ్ని అయి ఉండాలి?

**సమిద్ధః అగ్నిః** – బాగా ప్రజ్వలిస్తున్న అగ్ని అయి ఉండాలి. ఒకవేళ అది చిన్నమంట అయి, దానిమీద పెద్ద కుర్చీ గాని, బల్ల గాని వేస్తే, దాన్ని దగ్ధం చేసే బదులు ఆ మంటే ఆరిపోతుంది. అందువల్ల అగ్నిలో ఏదైనా వేసేముందు ఆ అగ్ని బాగా మండేలాగా చూడాలి.

అలాగే మీరు వేదాంతం వింటున్న కొత్తల్లో జ్ఞానం పొందుతారు కాని అది ఒక చిన్నమంటగా మాత్రమే ఉంటుంది. ఈ మిడిమిడి జ్ఞానంతో తక్కిన పుస్తకాలు చదివితే, ఉన్న సందేహాలు తీరక పోగా, మీరు పొందిన గీతాజ్ఞానమనే అగ్నిని ఆర్పివేస్తాయి అవి. **అందువల్ల మీకు జ్ఞాననిష్ఠ కలిగే వరకూ, ఒక ప్రత్యేకమైన ఆచార్యుని వద్ద, ఒక ప్రత్యేకమైన పరంపరలో విద్యను కొనసాగించాలి.** అనేకమంది ఆచార్యుల ప్రసంగాలు విన్నా, అనేక పుస్తకాలు చదివినా, మిమ్మల్ని అయోమయంలో పడవేయవచ్చు. అందువల్ల ఒక ఆచార్యుని వద్ద నేర్చుకుని, ఏదైనా సందేహాలుంటే ఆ ఆచార్యుణ్ణి అడిగి తెలుసుకుంటే మీ జ్ఞానాగ్ని బాగా ప్రజ్వలిస్తున్న అగ్నిలాగా అవుతుంది. శ్రవణ, మనన, నిదిధ్యాసనలు చేస్తే జ్ఞానాగ్ని బాగా ప్రజ్వలిస్తుంది.

**సర్వకర్మాణి భస్మసాత్కురుతే** – జ్ఞానాగ్ని అన్ని కర్మలను భస్మం చేస్తుంది.

ముందు శ్లోకంలో **సర్వపాప నాశనం** అన్నాడు కృష్ణపరమాత్మ. ఈ శ్లోకంలో **సర్వకర్మ నాశనం** అంటున్నాడు. ఈ రెండింటికీ మధ్య ఉన్న భేదమేమిటి? పాపం అన్నా కూడా కర్మే. మరి ఏమిటి భేదం అంటే, ముందు శ్లోకంలో పాపం అంటే పాపమే. పాపాలన్నీ నాశనమవుతాయి. కాని ఈ శ్లోకంలో కర్మ పదం వాడటంవల్ల కర్మవల్ల

వచ్చే **పాప, పుణ్యాలు** రెండూ చెబుతున్నాడు కృష్ణపరమాత్మ. అంటే జ్ఞానాగ్నిలో పాపాలే కాదు, పుణ్యాలు కూడా దగ్ధమవుతాయి అంటున్నాడు.

ఎందుకంటే, పుణ్యకర్మలు కూడా సంసారంలోకే వస్తాయి. పుణ్యకర్మలు స్వర్గలోకానికి తీసుకు వెళతాయి. అక్కడే శాశ్వతంగా ఉండిపోతే బ్రహ్మాండంగా ఉంటుంది. కాని –

**క్షీణే పుణ్యే మర్త్యలోకం విశంతి**

పుణ్యఫలం హరించిపోగానే మళ్ళీ భూలోకంలో పుడతాము అని కృష్ణపరమాత్మ చెప్పాడు. కఠోపనిషత్తులో భూలోకంలో కాని, ఇంకా హీనతరమైన లోకాల్లో కాని పుట్టవచ్చు అని వస్తుంది.

అమెరికా వెళ్ళివచ్చిన వారు ఇండియాకు తిరిగిరాగానే, దోమలు కుట్టి చంపేస్తున్నాయని బాధ పడతారు. జ్ఞానికి ఆ బాధ లేదు; దోమలతో సహజీవన సౌభాగ్యాన్ని అనుభవిస్తాడు. జ్ఞానికి దోమ కుడితే ఏమీ అనిపించదు. అమెరికానే భూతల స్వర్గంగా అభివర్ణిస్తారు. అలాంటిచోటునుంచి మన దేశానికి వస్తేనే నరకంలో పడ్డట్టు బాధపడితే, నిజంగా స్వర్గలోకానికి వెళ్ళి, అనేక సంవత్సరాలు స్వర్గసుఖాలు అనుభవించి, దాన్నుంచి వేరే జన్మ ఎత్తాల్సివస్తే ఎలా ఉంటుందో చూడండి!

వేదాంతం ప్రకారం పాపం వెంటనే దుఃఖాన్ని కలుగజేస్తే, పుణ్యం దుఃఖాన్ని తరువాత కలుగజేస్తుంది. అందువల్ల వేదాంతం ప్రకారం పుణ్యం కూడా బంధమే!

**తదా విద్వాన్ పుణ్యపాపే విధూయ నిరంజనః పరమం సామ్యముపైతిః** – ముండకమ్ 3.1.3

**సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ** – 18.66

మోక్షం అంటే పుణ్యపాపాలు తొలగిపోవటం.

**జ్ఞానాగ్నిః సర్వకర్మాణి** – అంటే జ్ఞానమనే అగ్ని పుణ్యపాపకర్మఫలాలను రెండింటినీ భస్మం చేస్తుంది. అందువల్ల ఈ ఫలాన్ని **సర్వపుణ్యస్యపి నాశః** అని కూడా అనవచ్చు.

శ్లో. 38 **న హి జ్ఞానేన సదృశం పవిత్రమిహ విద్యతే ।**
**తత్స్వయం యోగసంసిద్ధః కాలేనాత్మని విందతి ॥**

న, హి, జ్ఞానేన, సదృశమ్, పవిత్రమ్, ఇహ, విద్యతే,
తత్, స్వయమ్, యోగసంసిద్ధః, కాలేన, ఆత్మని, విందతి ॥

| | | | |
|---|---|---|---|
| ఇహ | = ఈ జగత్తునందు | కాలేన | = దీర్ఘకాలము వరకు |
| జ్ఞానేన, సదృశమ్ | = జ్ఞానముతో సమానముగా | యోగసంసిద్ధః | = కర్మయోగము ద్వారా శుద్ధ అంతఃకరణముగలవాడు |
| పవిత్రమ్ | = పవిత్రమైనది | స్వయమ్ | = స్వయముగనే |
| హి | = నిస్సందేహముగా | ఆత్మని | = ఆత్మజ్ఞానమును |
| న, విద్యతే | = (ఏదియును) లేదు | విందతి | = పొందును |
| తత్ | = ఆ జ్ఞానమును | | |

**హి ఇహ జ్ఞానేన సదృశం పవిత్రం న విద్యతే। తత్ (జ్ఞానమ్)**
**స్వయం యోగ-సంసిద్ధః కాలేన ఆత్మని విన్దతి।**

తా: ప్రపంచమున జ్ఞానముతో సమానముగా పవిత్రమైనది మరియొకటి లేనేలేదు. శుద్ధాంతఃకరణముగల సాధకుడు చాలా కాలము కర్మయోగాచరణము చేసి, ఆత్మయందు అదే జ్ఞానమును స్వయముగా పొందగలడు.

ముందు శ్లోకంతో జ్ఞానఫలం అయిపోయింది. నాలుగు జ్ఞానఫలాలు చూశాము. ఇంకా కొన్ని ఫలాలు ఉన్నాయి కాని అవి తక్కిన సందర్భాలలో చూస్తాము.

**డి) జ్ఞానసాధనలు-** శ్లోకాలు 38-42 ఇప్పుడు నాలుగు సానుకూల సాధనల గురించి, మూడు వ్యతిరేక సాధనల గురించి చెబుతున్నాడు. చేయవలసిన వాటిని, చేయకూడని వాటిని గురించి చెబుతున్నాడు. మొదటి పాదంలో ఈ జ్ఞానంయొక్క గొప్పదనం గురించి వస్తుంది.

**జ్ఞానేన సదృశం పవిత్రమిహ న హి (అస్తి)** - ఈ ప్రపంచంలో జ్ఞానంతో సమానమైనది, పవిత్రమైనది ఇంకొకటి లేదు. మరికొన్ని పవిత్రమైన అంశాలున్నాయి. అవి - గంగాస్నానం, ప్రాయశ్చిత్త కర్మ, నామజపం. ఇవన్నీ పాపాలను కడిగివేయగలవు కాని అవి జ్ఞానంతో సమానం కావు. ఎందుకు? ఎందుకంటే, వేదాంతం ప్రకారం ప్రాథమిక పాపం **అజ్ఞానం**. జంధ్యాలపౌర్ణమినాడు చెప్పే సంకల్పంలో **అనాది అవిద్యా వాసనయా** అని వస్తుంది. అవిద్యా అంటే అజ్ఞానం.

ప్రాయశ్చిత్తకర్మ గోహత్య, శిశుహత్య, సువర్ణస్తేయం, సురాపానాల పాపాలను తొలగిస్తుంది కాని అజ్ఞానాన్ని తొలగించదు. అలాగే గంగాస్నానం పాపాన్ని తొలగిస్తుంది కాని అజ్ఞానాన్ని తొలగించదు. అలా గనుక గంగాస్నానానికి అజ్ఞానాన్ని తొలగించే శక్తి ఉంటే, ఇన్ని సంవత్సరాలుగా జ్ఞానబోధ చేయాల్సిన అవసరం లేదు; అప్పుచేసైనా అందరినీ తీసుకువెళ్ళి, బలవంతంగానైనా గంగలో స్నానం చేయించవచ్చు.

**మలనిర్మోచనం పుంసాం జలస్నానం దినే దినే।**
**సకృత్ గీతామ్భసి స్నానం సంసారమలనాశనమ్ ॥**

గంగాస్నానం పాపాన్ని కడిగితే, జ్ఞానగంగా స్నానం సంసారాన్ని తొలగించగలదు. అందువల్ల నహి జ్ఞానేన సదృశం పవిత్రమ్ - జ్ఞానంతో సమానంగా పవిత్రమైనది ఇంకొకటి లేదు. ఇప్పుడు సాధన విషయం.

1. **యోగం - యోగ సంసిద్ధః -** సంసిద్ధః అంటే అర్హత ఉన్నవ్యక్తి; సంసిద్ధుడై ఉన్న వ్యక్తి; చిత్తశుద్ధి పొందిన వ్యక్తి; జ్ఞానమనే విత్తనం, మోక్షవృక్షంగా పెరిగి తనకు ఆనంద ఫలమిస్తుందని సంసిద్ధుడైన వ్యక్తి. భూమిలో విత్తనాన్ని నాటేముందు భూమిని చదును చేయాలి; నీరు జల్లాలి; అలా కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. అలాగే జ్ఞానమనే విత్తనం మనస్సనే భూమిలో పెరగటానికి మనస్సును సిద్ధం చేయాలి. మనస్సును ఎలా సిద్ధం చేయాలి? యోగం ద్వారా చేయాలి. ఈ యోగం రెండు విధాలు - **కర్మయోగం, ఉపాసనయోగం**.

నిజానికి మన వైదిక సాంప్రదాయమే మనం ఆత్మజ్ఞానం పొందటానికి మార్గాన్ని సిద్ధం చేసింది. వేదం మనకు ఆత్మజ్ఞానం కావాలా అని అడగదు. తల్లి తన పిల్లలకు ఏది మంచో ఎలా నిర్ణయిస్తుందో, అలా వేదం మనకు ఆత్మజ్ఞానం మంచిదని నిశ్చయించి, ఆ మార్గంలో వెళ్ళటానికి మన మనస్సును సిద్ధం చేసుకోవటానికి మార్గనిర్దేశం కూడా చేసింది. వేదం గొప్పతనం, దాని ప్రాథమిక ఉద్దేశ్యం ఆధ్యాత్మిక ఎదుగుదలే అయినా కూడా, అది వ్యావహారిక ఎదుగుదలను నిర్లక్ష్యం చేయలేదు. అందువల్ల యోగ సంసిద్ధః అంటే ధర్మపరమైన జీవన విధానానికి సిద్ధపడ్డ మనస్సు కలవాడు. అలా సిద్ధపడితే అదే అతని శారీరక ఆరోగ్యం, మానసిక ఆరోగ్యం, భావపర ఆరోగ్యం, నైతిక ఆరోగ్యం, బుద్ధిపర ఆరోగ్యం – అలా అన్నిటినీ సమన్వయ పరుస్తూ, అన్నిటినీ సమకూరుస్తుంది. వైదికభాషలో చెప్పాలంటే అతన్ని సాధనచతుష్టయ సంపన్నుణ్ణి చేస్తుంది.

**తత్ విందతి** – అతను జ్ఞానం పొందుతాడు. ఎక్కడ పొందుతాడు ఈ జ్ఞానాన్ని?

**ఆత్మని** – స్వచ్ఛమైన మనస్సులో. ఏ జ్ఞానమైనా కూడా బుద్ధిలోనే కలగాలి. ఆత్మలో కాదు. ఈ జ్ఞానం పొందటానికి ఎంతకాలం పడుతుంది? కృష్ణపరమాత్మ ఇంత కాలంలో అని హామీ ఇవ్వదలచుకోలేదు. ఎందుకంటే, లౌకిక విద్యలో కూడా, కాలేజీలో అధ్యాపకుడు విద్య నేర్పించగలడు కాని ఎన్ని ప్రయత్నాల్లో ఆ విద్యార్థి పాసవుతాడో చెప్పలేడు. ఒకవ్యక్తి సి.ఎ. పరీక్ష 27 సార్లు రాశాడుట. అన్నిసార్లూ ఫెయిలవుతూ వస్తున్నాడు. 27వ సారి రాసి బయటకు వచ్చాక, ఒకచోట 'జీసస్ నెవ్వర్ ఫెయిల్స్' అనే బోర్డు చూశాడుట. అతను వెళ్ళి దాని కింద 'లెట్ హిమ్ ట్రై సి.ఎ.' అని రాశాడుట. అతను ఎంతగా విసిగిపోయాడంటే, జీసస్ కూడా ఆ పరీక్ష ఫెయిలవుతాడని నిర్ణయించేసుకున్నాడు. అందువల్ల కృష్ణపరమాత్మ ఇంత కాలంలో పొందుతాడు అని చెప్పలేదు. **కాలేనాత్మని విందతి** – అంటే కొంతకాలంలో పొందుతాడు అని అర్థం. ప్రయాణం చేసేటప్పుడు ఇంకా ఎంతదూరం ఉందని అడగకండి, ప్రయాణాన్ని ఆస్వాదించండి. అలాగే జ్ఞానమార్గంలో ప్రయాణం చేసేటప్పుడు కూడా ఇంకా ఎప్పుడు మోక్షం పొందుతాను అని అడగకండి. ఆస్వాదించండి.

శ్లో. 39 **శ్రద్ధావాన్ లభతే జ్ఞానం తత్పరః సంయతేంద్రియః ।**
**జ్ఞానం లబ్ధ్వా పరామ్ శాంతిమచిరేణాధిగచ్ఛతి ॥**
శ్రద్ధావాన్, లభతే, జ్ఞానమ్, తత్పరః, సంయతేంద్రియః,
జ్ఞానమ్, లబ్ధ్వా, పరామ్, శాంతిమ్, అచిరేణ, అధిగచ్ఛతి ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| సంయతేంద్రియః | = | జితేంద్రియుడు | జ్ఞానమ్, లబ్ధ్వా | = | (ఈ) జ్ఞానమును పొంది |
| తత్పరః | = | సాధన పరాయణుడు | అచిరేణ | = | తత్క్షణముననే |
| శ్రద్ధావాన్ | = | శ్రద్ధ గలవాడు | పరామ్, శాంతిమ్ | = | పరమశాంతిని |
| జ్ఞానమ్ | = | ఈ తత్త్వజ్ఞానమును | అధిగచ్ఛతి | = | పొందును |
| లభతే | = | పొందును | | | |

**శ్రద్ధావాన్, తత్పరః, సంయత–ఇన్ద్రియః జ్ఞానం లభతే ।**
**జ్ఞానం లబ్ధ్వా అచిరేణ పరాం శాన్తిమ్ అధిగచ్ఛతి ।**

తా: జితేంద్రియుడు, సాధన పరాయణుడు శ్రద్ధాళువైన మనుజునకు ఈ భగవత్తత్త్వజ్ఞానము లభించును. ఆ జ్ఞానము కలిగిన వెంటనే అతడు భగవత్తత్త్వరూపమైన పరమశాంతిని పొందును.

ఈ శ్లోకంలో మరికొన్ని సాధనలు చూస్తాము.

2. **శ్రద్ధ** – శాస్త్రంమీద నమ్మకం పెట్టుకోవాలి. శాస్త్రం చెప్పింది స్పష్టంగా అర్థం కాకపోయినా; దాంట్లో ఏవైనా సందేహాలు వచ్చినా, శాస్త్రంమీద శ్రద్ధ పోగొట్టుకోకూడదు. ఆ సందేహాలను పక్కనపెట్టి వింటూనే వుండాలి. ఇది నేను నమ్మలేను; ఇది నాకు స్పష్టంగా అర్థం కాలేదు అనిపించినా, కనీసం గీత చివరివరకూ అధ్యయనం చేయాలి. **అలా ఆపకుండా వింటూపోతే, చివరికొచ్చేలోపు ఆ సందేహాలు వాటంతటవే తీరతాయి.** అంతదాకా ఆగలేకపోతే, గురువును ప్రశ్నలు అడగండి. గురువు ప్రశ్నలకు భయపడడు. జవాబులు చెప్పటానికి ఎప్పుడూ సిద్ధంగానే ఉంటాడు. వేదాంతవిజ్ఞానం అర్థం చేసుకోవాలంటే సందేహాలను తీర్చుకోవాలి. మీకు సందేహాలు రాకపోయినా గురువు సందేహం కలుగజేసి, దాన్ని తీరుస్తాడు. (కొన్ని చోట్ల స్వామీజీ మీకిక్కడ ఒక సందేహం రావాలి, ఒకవేళ మీకు రాకపోయినా నేనే ఆ సందేహాన్ని చెప్పి, జవాబు చెబుతాను అంటారు.)

సందేహాలు తీర్చటానికి ప్రత్యేకంగా కొన్ని గ్రంథాలున్నాయి. వాటిని సిద్ధిగ్రంథాలు అంటారు. మనం ఎటువంటి ప్రశ్నలను వేయాలో అవే సూచిస్తాయి. అందువల్ల ఏదైనా అర్థం కాకపోతే, శాస్త్రాన్ని ప్రశ్నించకూడదు. మనం సరిగ్గా అర్థం చేసుకున్నామా లేదా అని చూడాలి.

**శ్రద్ధావాన్ లభతే జ్ఞానమ్** – అందువల్ల శ్రద్ధ ఉన్న వ్యక్తికే జ్ఞానం కలుగుతుంది. శ్రద్ధవల్ల నిశ్చయజ్ఞానం కలుగుతుంది. ఈ నిశ్చయజ్ఞానం గురువుకూ కలుగుతుంది; శిష్యునికీ కలుగుతుంది. వేదాంతం నిశ్చయజ్ఞానాన్ని, సంపూర్ణజ్ఞానాన్ని ఇస్తుంది.

3. **తపన** – తపన ఉన్న విద్యార్థికి ఈ జ్ఞానం కలుగుతుంది. **తత్పరః** అన్నాడు కృష్ణపరమాత్మ. గురువును ప్రశ్నలు అడగాలి అన్నారు కదా అని ఏది పడితే అది అడగకూడదు. ఒక నెలంతా గీతాబోధ చెప్పాక, గురువు ఏదైనా సందేహాలుంటే అడగండి అంటే – గుడిలో ప్రదక్షిణలు ఎందుకు చేస్తారు అని అడిగితే గురువుకు ఎలా ఉంటుంది? ప్రశ్న అడగాలి అంటే ముందు విషయం అర్థం కావాలి. అంటే శిష్యుడు మననం చేయాలి.

మననం చేయకపోతే, న్యాయబద్ధమైన ప్రశ్నలు ఉదయించవు. మననం చేయకపోతే అసలు సందేహాలే రావు, లేదా అర్థంలేని సందేహాలు కలుగుతాయి. తత్పరః అంటే తపన ఉండాలి. హోమ్‌వర్క్ చేయాలి; పూర్తి ఏకాగ్రతతో వినాలి. ఈ ఏకాగ్రత లేకపోతే గీతాబోధవల్ల లాభం పొందదని చెప్పలేము. ఏవో కొన్ని విషయాలు అర్థమవుతాయి; కనీసం కొన్ని జోక్స్ తెలుస్తాయి; ప్రాణాయామం గురించి కాని వేరే ఏదైనా విషయం గురించి కాని తెలుస్తాయి. తపన లేకపోతే ఆశించిన ఫలం రాదు. జ్ఞానం పొందలేరు. అందువల్ల నేర్చుకోవాలన్న తపన ఉండాలి.

4. **ఇంద్రియనిగ్రహం** – ఇంద్రియనిగ్రహం ఉండాలి. దీన్ని **సంయతేంద్రియః** అన్నాడు కృష్ణపరమాత్మ. ఒక గంటసేపు క్లాసు వినాలంటే పూర్తి ఏకాగ్రత చూపాలి. వేదాంతం ఒక శాస్త్రం. అది ఒక క్రమపద్ధతిలో నేర్చుకోవాలి. ఒకదానిమీద ఆధారపడి ఇంకొకటి వస్తుంది. అందువల్ల ఏకాగ్రతతో వినకపోతే విషయం అర్థం కాదు.

**జ్ఞానం లబ్ధ్వా** – అందువల్ల ఆత్మజ్ఞానం పొందాలంటే **శ్రద్ధ, తపన, ఇంద్రియనిగ్రహం** ఉండాలి. ఇవి ఉంటే ఆ వ్యక్తి జ్ఞానం పొందుతాడు. జ్ఞానం పొందితే కలిగే ఫలం ఏమిటి?

**పరామ్ శాంతిమ్ అధిగచ్ఛతి** – పరమశాంతిని పొందుతాడు. ఫలం ఎప్పుడో మరణించాక వస్తుందనటం లేదు. ఇక్కడే, ఇప్పుడే ఫలం పొందుతాడు అంటున్నాడు కృష్ణపరమాత్మ. గీత మీకు మానసిక ప్రశాంతత చేకూరుస్తుంది. అది కూడా మామూలు శాంతి కాదు; **పరమశాంతి**. ఇది నిజంగా పొందుతామా అని అడగకండి. ప్రతిజ్ఞాని తన అనుభవంలోంచి చెబుతాడు – తాను పరమశాంతిని పొందినట్టుగా. ఎప్పుడు పొందుతాడు?

**అచిరేణ** – వీలున్నంత త్వరగా పొందుతాడు. మీరు పొందిన జ్ఞానం, మీకు జ్ఞానఫలాన్నివ్వాలంటే మీ అలవాట్లు సమస్యలకు అతీతంగా ఎదగాలి. మీ అలవాట్ల గురించి కృష్ణపరమాత్మ ఆరవ అధ్యాయంలో చర్చిస్తాడు. జ్ఞానం పొందినంత మాత్రాన మీకున్న అలవాట్లు పోవు.

ఉదాహరణకు మీరు మీ టూత్‌బ్రష్‌ను, పేస్టును మీ బాత్రూమ్‌లో పడమర దిక్కునుంచి తూర్పు వైపుకు మార్చారనుకోండి. అప్పుడేమవుతుంది? మీరు బాత్రూమ్‌లోకి వెళ్ళగానే మీకు తెలియకుండానే, అప్రయత్నంగానే, మీ చెయ్యి పడమర దిక్కుకి వెళుతుంది. అది తూర్పుదిక్కులో ఉంది అని మీకు తెలుసా లేదా? చక్కగా తెలుసు! ఎవరో వాస్తు బాగోలేదు, అటునించి ఇటు మార్చు అంటే మీరే స్వయంగా మార్చారు. ఇక్కడ సమస్య ఏమిటి? **అజ్ఞానం కాదు, అలవాటు**.

అందువల్ల మీ కర్మలు, మీ స్పందనలు రెండు అంశాలమీద ఆధారపడి ఉంటాయి. ఒకటి మీ జ్ఞానం, ఇంకొకటి మీ వాసనలు. మీ సమస్యను జ్ఞానం కొంతవరకు పరిష్కరిస్తుంది కాని మీ వాసనలు లేదా మీ అలవాట్లు అడ్డు పడుతుంటాయి. మీ అలవాట్లను మీరు ప్రయత్నపూర్వకంగా మార్చుకోవాలి. ఆత్మన్యూనతా భావన, ఈర్ష్య, కోపం, చిరాకు, ఒంటరితనం భావాలను తొందరగా పారద్రోలలేరు. అవి ఎంతగా మీలో కూరుకుపోయి ఉన్నాయంటే మీరు ఒక్కొక్కదాన్ని విడివిడిగా అతి ప్రయత్నంమీద పారద్రోలాలి. అది ఎంతసేపట్లో సాధ్యం అవుతుందన్నది మీ శ్రద్ధమీద, మీరు దానికి కేటాయించే సమయంమీద, మీరు దానికిచ్చే ప్రాముఖ్యతమీద ఆధారపడి ఉంటుంది. అందువల్ల కృష్ణపరమాత్మ ఎంతసేపట్లో అవుతుందో చెప్పడు – కాని మీరు మారతారు, మారాలి. మారకపోతే మీ కుటుంబసభ్యులే నువ్వు గీత నేర్చుకుని ఏం సాధించావు అంటారు.

శ్లో. 40 **అజ్ఞశ్చాశ్రద్ధధానశ్చ సంశయాత్మా వినశ్యతి ।**
**నాయం లోకోఽస్తి న పరో న సుఖం సంశయాత్మనః ॥**

అజ్ఞః, చ, అశ్రద్ధధానః, చ, సంశయాత్మా, వినశ్యతి,
న, అయమ్, లోకః, అస్తి, న, పరః, న, సుఖమ్, సంశయాత్మనః ॥

| | | | |
|---|---|---|---|
| అజ్ఞః | = వివేకహీనుడు | సంశయాత్మనః | = సంశయాత్మునకు |
| చ | = ఇంకా | అయమ్, లోకః | = ఈ లోకము |
| అశ్రద్ధధానః | = శ్రద్ధారహితుడు | న, అస్తి | = ఉండదు |
| సంశయాత్మా | = సంశయంతో ఉన్నవాడు | న, పరః, చ | = పరలోకమూ ఉండదు |
| వినశ్యతి | = భ్రష్టుడై నశించును | న, సుఖమ్ | = సుఖము ఉండదు |

**అజ్ఞః చ అశ్రద్ధధానః చ సంశయ-ఆత్మా వినశ్యతి ।**
**సంశయాత్మనః అయం లోకః న అస్తి, న పరః (లోకః), న (చ) సుఖం (అస్తి) ।**

తా: అవివేకియు, శ్రద్ధారహితుడును అయిన సంశయాత్ముడు పరమార్థ విషయమున అవశ్యము భ్రష్టుడే యగును. అటువంటి సంశయాత్మునకు ఈ లోకమందు గాని, పరలోకమందుగాని సుఖము ఉండదు.

ఇంతవరకూ కొన్ని సాధనలు చెప్పాడు. మనం పెంపొందించుకోవాల్సిన కొన్ని సానుకూల లక్షణాలను చెప్పాడు. ఇప్పుడు మనం పారద్రోలాల్సిన మూడు వ్యతిరేక లక్షణాల గురించి చెబుతున్నాడు. అవి – **అజ్ఞానం, అశ్రద్ధ, సంశయం**.

1. **అజ్ఞానం** – వ్యావహారిక జీవనంలో కూడా అజ్ఞానం పనికిరాదు. రైల్వేస్టేషన్‌కు వెళ్ళాలంటే ఏదైనా రోడ్డు మూసేసారా, ఆ రోజు ఆ రైలు వెళుతోందా అనే కనీసవిషయాలు తెలియాలి. కొంతమంది నేను వేదాంతానికి వచ్చాను కాబట్టి నేను వార్తాపత్రికలు చదవను అంటారు. వాటిలో అనేక అనవసరమైన విషయాలు ఉంటే ఉండవచ్చు గాక, కాని అవసరమైన విషయాలు కూడా ఉంటాయి. అందువల్ల వ్యావహారిక జీవితం బాగా సాగించాలంటే దాని గురించిన జ్ఞానం ఉండాలి.

2. **అశ్రద్ధ** – శాస్త్రంమీద శ్రద్ధ ఉండదు కొందరికి.

3. **సంశయం** – సంశయాత్మక బుద్ధి ఉన్నతను ఈ ముగ్గురిలోకీ ఎక్కువగా అవస్థ పడతాడు. ఇతన్ని ఇంగ్లీషులో **డౌటింగ్ థామస్** అంటారు. ఇతను ఎందుకు ఎక్కువగా అవస్థ పడతాడు?

అజ్ఞానం ఉన్న వ్యక్తిని తీసుకుందాం ముందు – అతనికి లౌకికజ్ఞానం లేదు కాని, శాస్త్రంమీద శ్రద్ధ ఉంది. అతను అజ్ఞానంవల్ల ఇహలోకసుఖాలను పొందలేక పోవచ్చు కాని శాస్త్రంమీద శ్రద్ధవల్ల పరలోకసుఖాలు పొందుతాడు. శాస్త్రం చెప్పిన కర్మలు తూచా తప్పకుండా పాటిస్తాడు కాబట్టి స్వర్గలోకానికి వెళ్ళి, అక్కడ సుఖాలను పొందుతాడు.

ఇక రెండవరకం వ్యక్తి దగ్గరకు వస్తే – అతను శాస్త్రాన్ని నమ్మడు. కర్మ, పుణ్యం, పాపం, స్వర్గం, నరకం – ఇవేమీ లేవు పొమ్మంటాడు. కాని లౌకికజ్ఞానం మెండుగా ఉంది. అందువల్ల అతను ఇహలోక సుఖాలను బాగా అనుభవిస్తాడు. కాని శాస్త్రంమీద శ్రద్ధ లేదు కాబట్టి శాస్త్రం చెప్పిన కర్మలు చేయడు కాబట్టి, పరలోకసుఖం ఉండదు. అంటే అజ్ఞాని పరలోకసుఖాలను పొందితే, శ్రద్ధలేని వ్యక్తి ఇహలోకసుఖాలను పొందుతాడు. కాని సంశయాత్మక బుద్ధి ఉన్నతను మాత్రం రెంటికీ చెడ్డ రేవడవుతాడు.

శాస్త్రం చెప్పింది అవుతుందో లేదోననే సంశయంవల్ల పరలోకసుఖం పొందడు. ఇహలోకజ్ఞానం ఉన్నా కూడా అతను సందేహాల పుట్ట అవటంవల్ల అనేక సందేహాలు కలుగుతాయి. గీతాబోధలో కూర్చున్నాక ఇంటితాళం సరిగ్గా వేసానా లేదా అనే సందేహం కలుగుతుంది. అంతే ఇంక ఆరోజు గీతాబోధ మెదడులోకి ఎక్కదు. లౌకిక విషయాలమీదే ఇన్ని సందేహాలుంటే, పుణ్యపాపాలమీద ఇంకెంత సందేహం ఉండాలి? అందువల్ల అతనికి ఇహలోకసుఖమూ లేదు, పరలోకసుఖమూ లేదు. ఇప్పుడు శ్లోకం చూద్దాము.

**అజ్ఞశ్చాశ్రద్దధానశ్చ సంశయాత్మా వినశ్యతి** – ఈ ముగ్గురు వ్యక్తులు ప్రతికూల లక్షణాలు ఉండటంవల్ల జీవితంలో నష్టపోతారు. ఎవరు వారు? అజ్ఞాని, శ్రద్ధ లేనివాడు, సంశయాత్ముడు నష్టపోతారు. వీరిలో ఎక్కువగా నష్టపోయేది ఎవరు? సంశయాత్ముడు. ఎందుకు?

**అయం లోకః న అస్తి, న పరః (లోకః)** – అతనికి ఇహలోక సుఖమూ ఉండదు; పరలోక సుఖమూ ఉండదు. మరి మోక్షం మాటేమిటి? ఇహలోక పరలోక సుఖాలే లేనివానికి మోక్షానికి తావేది? అందువల్ల సంశయం మనకు పెద్ద శత్రువు. కుటుంబ సభ్యులమీద, తోటి ఉద్యోగులమీద నమ్మకం ఉండాలి. పిల్లలు ఉద్యోగరీత్యా విదేశాలకు వెళతారు. వారి ప్రవర్తనమీద నమ్మకం ఉండాలి. ఎవరినీ నమ్మకపోతే మనం జీవించలేము. ఒక్కోసారి మన నమ్మకం వీగిపోవచ్చు కూడా. అయినా నమ్మకం పెట్టుకోవటం మానకూడదు. వేదాంతం నేర్చుకుంటే ఏమైనా లాభం వస్తుందా లేదా అనే సందేహం ఉంటే – నేర్చుకుని లాభం లేదు.

**న సుఖం సంశయాత్మనః** – అందువల్ల సంశయాలు పేరుకుపోయిన వ్యక్తికి సుఖం ఉండదు.

శ్లో. 41 **యోగసన్న్యస్తకర్మాణం జ్ఞానసంఛిన్నసంశయమ్ ।**
**ఆత్మవంతం న కర్మాణి నిబధ్నంతి ధనంజయ ॥**
యోగసన్న్యస్తకర్మాణమ్, జ్ఞానసంఛిన్నసంశయమ్,
ఆత్మవంతమ్, న, కర్మాణి, నిబధ్నంతి, ధనంజయ ॥

ధనంజయ! = ఓ ధనంజయా! (అర్జునా)
యోగసన్న్యస్త = విధ్యుక్త కర్మలను
కర్మాణమ్ = ఆచరించుచు వాటిని భగవదర్పణము చేయువాడును
జ్ఞానసంఛిన్న = వివేకము ద్వారా
సంశయమ్ = సంశయములను అన్నింటిని తొలగించు కొనినవాడును
ఆత్మవంతమ్ = అంతఃకరణమును వశమునందు ఉంచుకొనిన వాడును అగువానిని
కర్మాణి = కర్మలు
న, నిబధ్నంతి = ఏమాత్రము బంధింపవు

**హే ధనఞ్జయ! యోగ-సంన్యస్తకర్మాణం జ్ఞానసఞ్ఛిన్నసంశయమ్**
**ఆత్మవన్తం కర్మాణి న నిబధ్నన్తి ।**

తా: ఓ ధనంజయా! (ఓ అర్జునా!) విధిపూర్వకముగా కర్మలను ఆచరించుచు కర్మఫలములను అన్నింటిని భగవదర్పణము చేయుచు, వివేకము ద్వారా సంశయములను అన్నింటిని తొలగించుకొనుచు, అంతఃకరణమును వశమునందుంచుకొనిన వానిని కర్మలు బంధింపజాలవు.

ఈ శ్లోకంలో కృష్ణపరమాత్మ జ్ఞానసాధనకు, దాని ఫలానికి ముక్తాయింపు పలుకుతున్నాడు.

**యోగసన్న్యస్త కర్మాణమ్** – యోగః అంటే జ్ఞానం. ఏ జ్ఞానం? నేను ఆత్మను; నేను అకర్తను అనే జ్ఞానం. అకర్తృత్వజ్ఞానాన్ని ఇక్కడ యోగం అంటున్నాడు. ఈ యోగం పాటించటంవల్ల కర్మలన్నిటినుంచీ మనం విముక్తి పొందుతాము. కర్మలు మనశ్శరీరాలకు చెందుతాయి కాని ఆత్మ అయిన నాకు చెందవు అని తెలుసుకుంటాము. వాటి ద్వారా వ్యవహారం నడుపుతాము కాని వాటితో బంధం పెంచుకోము. **ఇది శ్రవణదశ.**

**జ్ఞానసంఛిన్నసంశయమ్** – ఇప్పుడు మనన దశ. మననం ద్వారా మనలో ఉన్న సందేహాలను నాశనం చేశాము. నిశ్చయజ్ఞానం పొందాము. ఆత్మ గురించిన నిశ్చయజ్ఞానం కలిగితే చాలు, వేరే ఎవరికీ మనం నచ్చచెప్పాల్సిన పని లేదు. మన మనస్సును మనం ప్రశ్నించుకోవాలి – నువ్వు ఆత్మస్వరూపమని అర్థం చేసుకున్నావా అని. ఒకవేళ బుద్ధి ఒప్పుకోకపోతే దానికి నమ్మకం కలిగేవరకూ శ్రవణం చేస్తూనే ఉండాలి. మననం అంటే నిశ్చయజ్ఞానం. **ఇది మననదశ.**

**ఆత్మవంతమ్** – జ్ఞానం పొందగానే సరిపోదు, ఆ జ్ఞాననిష్ఠలో నిలబడ గలగాలి. నోట్సులో రాసుకుంటేను, సీ.డీ.ల్లోకి ఎక్కించుకుంటేను చాలదు. మనకొక సమస్య వచ్చినప్పుడు ఈ జ్ఞానాన్ని దానికి అన్వయించుకోగలగాలి. అందువల్ల ఆత్మవాన్ అంటే అప్రమత్తంగా ఉండే వ్యక్తి, జ్ఞాననిష్ఠలో ఉండే వ్యక్తి. 24 గంటలూ ఆ జ్ఞానం అతనిలో తాజాగా ఉండాలి. అతను ఏ వ్యవహారం నడుపుతున్నా కూడా ఈ విషయం మర్చిపోకూడదు. **ఇది నిదిధ్యాసనదశ.**

**కర్మాణి న నిబధ్నంతి** – శ్రవణ, మనన, నిదిధ్యాసనలు చేసిన వ్యక్తిని కర్మలు బంధించలేవు.

శ్లో. 42 **తస్మాదజ్ఞానసంభూతం హృత్స్థం జ్ఞానాసినాత్మనః ॥**
**ఛిత్త్వైనం సంశయం యోగమ్ ఆతిష్ఠోత్తిష్ఠ భారత ॥**
తస్మాత్, అజ్ఞానసంభూతమ్, హృత్స్థమ్, జ్ఞానాసినా, ఆత్మనః,
ఛిత్త్వా, ఏనమ్, సంశయమ్, యోగమ్, ఆతిష్ఠ, ఉత్తిష్ఠ, భారత ॥

| | | | |
|---|---|---|---|
| తస్మాత్ | = అందువల్ల | ఏనమ్, అజ్ఞాన సంభూతమ్ | = ఈ అజ్ఞాన జనితమైన |
| భారత! | = ఓ అర్జునా! | | |
| హృత్స్థమ్ | = (నీ) హృదయమందున్న | ఆత్మనః, సంశయమ్ | = నీ సంశయమును |

| | | | |
|---|---|---|---|
| జ్ఞానాసినా | = వివేకమనె ఖడ్గముచే | ఆతిష్ఠ | = స్థితుడవు కమ్ము |
| ఛిత్త్వా | = ఛేదించి | ఉత్తిష్ఠ | = యుద్ధమునకై లెమ్ము |
| యోగమ్ | = సమత్వరూపకర్మయోగమందు | | |

**హే భారత! తస్మాత్ అజ్ఞాన-సమ్భూతం హృత్స్థమ్ ఆత్మనః**
**ఏనం సంశయం జ్ఞాన-అసినా ఛిత్త్వా యోగమ్ ఆతిష్ఠ, (యుద్ధాయ చ) ఉత్తిష్ఠ।**

తా: కావున, ఓ భారతా! (అర్జునా!) నీ హృదయమందుగల అజ్ఞానజనితమైన ఈ సంశయమును వివేకజ్ఞానమను ఖడ్గముతో రూపుమాపి, సమత్వరూపకర్మయోగమందు స్థితుడవై యుద్ధమునకు సన్నద్ధుడవగుము.

ఈ శ్లోకంలో కృష్ణపరమాత్మ, అర్జునునికి ప్రత్యక్షంగా సలహా ఇస్తున్నాడు. ఓ అర్జునా! నువ్వు కూడా నీ సందేహాలనుంచి బయటపడు. అదే నీకు పెద్ద శత్రువు. నీకు రెండు ముఖ్యమైన పాఠాలు నేర్పాను. **కర్మయోగం పాటించు, చిత్తశుద్ధి పొందు; జ్ఞానయోగం పాటించు, జ్ఞానం పొందు, విముక్తి పొందు.** ఇది గీతయొక్క ప్రాథమిక బోధ. కర్మయోగం జ్ఞానయోగ్యతా ప్రాప్తికి; జ్ఞానయోగం జ్ఞానం పొందటానికి. అందువల్ల ఇంక నీ సందేహాలను పారద్రోలు.

**జ్ఞానాసినాత్మనః సంశయం ఛిత్త్వా** – కర్మయోగం గురించీ, జ్ఞానయోగం గురించిన నీ సందేహాలన్నిటినీ జ్ఞానమనే కత్తితో రూపుమాపు. ఈ సందేహాలు ఎటువంటివి?

**అజ్ఞానసంభూతమ్** – సందేహాలన్నీ అజ్ఞానంవల్ల ఏర్పడుతాయి. అందువల్ల, జ్ఞానమనే కత్తితో అజ్ఞానజనిత సందేహాలను రూపుమాపు. అతని సందేహాలు ఏమిటి? యుద్ధం చేయాలా, వద్దా? గృహస్థుగా ఉండాలా, సన్న్యాసం స్వీకరించాలా? కర్మయోగం పాటించాలా, జ్ఞానయోగం పాటించాలా? వీటన్నింటి గురించిన సందేహాలు తొలగించుకో. ఎందుకు?

**హృత్స్థమ్** – ఆ సందేహాలు నీ మనస్సులో ఏర్పడ్డాయి కాబట్టి నువ్వే వాటిని తొలగించుకోవాలి. గురువు నీకు తోడ్పడగలడే కాని, వాటిని నాశనం చేయటం శిష్యుడే చేయాలి. ఒక మనిషి 64 గుర్రాలను నీటి దగ్గరకు తీసుకువెళ్ళగలడు కాని, 64 మంది ఒక గుర్రానికి నీళ్ళు త్రాగించలేరు. గురువు శ్రుతి ప్రమాణం, యుక్తి ప్రమాణం, అనుభవప్రమాణాల ద్వారా సంశయనివృత్తి చేయగలడు కాని వాటిని తన మనస్సులోంచి శిష్యుడే పారద్రోలగలడు.

**యోగమ్ ఆతిష్ఠ** – కర్మయోగం పాటించు. అదే నీ ప్రస్తుత పరిస్థితికి సరియైన మార్గం. సన్న్యాసాశ్రమానికి ఇప్పుడు నువ్వు తగవు. గృహస్థుగానే ఉండి, నీ ధర్మాన్ని నిర్వర్తించు. ఆ ధర్మం చేదుగా ఉండవచ్చు, నీ వారిని చంపాల్సి రావచ్చు. కాని తప్పదు.

**ఉత్తిష్ఠ భారత** – అర్జునా లే, నీ గాండీవం తీసుకో, నీ ధర్మాన్ని నెరవేర్చు.

ఇక్కడితో ఈ అధ్యాయంలో కృష్ణపరమాత్మ బోధ ముగిసింది.

**ఓం తత్సదితి శ్రీమద్భగవద్గీతాసూపనిషత్సు బ్రహ్మవిద్యాయాం యోగశాస్త్రే శ్రీకృష్ణార్జునసంవాదే జ్ఞాన, కర్మ సన్న్యాసయోగోనామ చతుర్థోఽధ్యాయః**

హరి ఓం తత్సత్

ఇది శ్రీమద్భగవద్గీతయందు, ఉపనిషత్తులయందు, బ్రహ్మవిద్యయందు, యోగశాస్త్రమునందు, శ్రీకృష్ణార్జునసంవాదమునందు జ్ఞాన, కర్మ, సన్న్యాసయోగము అనే నాలుగవ అధ్యాయము.

## స్వామీజీ ఆణిముత్యాలు

**సమిద్ధః అగ్నిః** – బాగా ప్రజ్వలిస్తున్న అగ్ని అయి ఉండాలి. ఒకవేళ అది చిన్నమంట అయి, దానిమీద పెద్ద కుర్చీ గాని, బల్ల గాని వేస్తే, దాన్ని దగ్ధం చేసే బదులు ఆ మంటే ఆరిపోతుంది. అందువల్ల అగ్నిలో ఏదైనా వేసేముందు ఆ అగ్ని బాగా మండేలాగా చూడాలి.

అలాగే మీరు వేదాంతం వింటున్న కొత్తల్లో జ్ఞానం పొందుతారు కాని అది ఒక చిన్నమంటగా మాత్రమే ఉంటుంది. ఈ మిడిమిడి జ్ఞానంతో తక్కిన పుస్తకాలు చదివితే, ఉన్న సందేహాలు తీరక పోగా, మీరు పొందిన గీతాజ్ఞానమనే అగ్నిని ఆర్పివేస్తాయి అవి. **అందువల్ల మీకు జ్ఞాననిష్ఠ కలిగే వరకూ, ఒక ప్రత్యేకమైన ఆచార్యుని వద్ద, ఒక ప్రత్యేకమైన పరంపరలో విద్యను కొనసాగించాలి.** అనేకమంది ఆచార్యుల ప్రసంగాలు విన్నా, అనేక పుస్తకాలు చదివినా, మిమ్మల్ని అయోమయంలో పడవేయవచ్చు. అందువల్ల ఒక ఆచార్యుని వద్ద నేర్చుకుని, ఏదైనా సందేహాలుంటే ఆ ఆచార్యుణ్ణి అడిగి తెలుసుకుంటే మీ జ్ఞానాగ్ని బాగా ప్రజ్వలిస్తున్న అగ్నిలాగా అవుతుంది. శ్రవణ, మనన, నిదిధ్యాసనలు చేస్తే జ్ఞానాగ్ని బాగా ప్రజ్వలిస్తుంది.

# అధ్యాయము 4 - జ్ఞానకర్మసన్న్యాసయోగము సారాంశము

నాల్గవ అధ్యాయాన్ని ప్రధానంగా మూడు భాగాలుగా విభజించవచ్చు. అవి -

**1. అవతార రహస్యం శ్లోకాలు - 1 -12;**

**2. జ్ఞానకర్మ సన్న్యాస యోగం శ్లోకాలు - 13-24;**

**3. జ్ఞానసాధన ఫలాలు శ్లోకాలు - 25-45**

**1. అవతార రహస్యం - శ్లోకాలు 1-12:** ఈ శ్లోకాల్లో కృష్ణపరమాత్మ ఈశ్వర అవతారానికీ జీవజన్మకూ మధ్యనున్న భేదాలను చూపించాడు. చూడటానికి రెండూ ఒకేలా ఉంటాయి. కొన్ని అవతారాల్లో భగవంతుడు కూడా తల్లిదండ్రులకు పుడతాడు; పుట్టినరోజు ఉంటుంది; మనుష్యులలాగానే పెరుగుతాడు. కాని అవతారానికీ, జీవునికీ చాలా భేదాలు ఉన్నాయి. అవి తెలుసుకోవాలి. ఈ అధ్యాయంలో మూడు భేదాలను చూశాము. అవి కారణభేదం, స్వరూపభేదం, కార్యభేదం.

1. **కారణభేదం** - మనుష్యజన్మకు కారణం అజ్ఞానం అయితే, ఈశ్వర అవతారానికి కారణం సర్వజ్ఞత్వం. జీవుడు అజ్ఞానంవల్ల నేను చేస్తున్నాననుకుంటాడు. కర్తగా కర్మలు చేసి, పుణ్యపాపాలు పొంది, వాటిని అనుభవించటానికి పునరపి జననం, పునరపి మరణం పొందుతూ ఉంటాడు. ఈ జన్మలో మనుష్యజన్మకు కారణం- అజ్ఞానం, అహంకారం, కర్త, కర్మఫలం, పుణ్యపాపం, సుఖదుఃఖాలు, పునర్జన్మ.

ఈశ్వరుని విషయానికి వచ్చేసరికి ఈశ్వరుడు సర్వజ్ఞుడు. ఈశ్వరుని అవతారం దయతో, జ్ఞానంతో, కావాలని తెలిసిచేస్తున్న అవతరణ. మనిషిజన్మను **కింద పడటం** అంటే, భగవంతుని అవతారాన్ని **కిందకు దిగటం** అంటారు.

2. **స్వరూపభేదం** - ఈ స్వరూపభేదంలో రెండు భేదాలున్నాయి. ఒకటి- జీవుడు అజ్ఞానంవల్ల జన్మనెత్తుతాడు కాబట్టి అతను బద్ధస్వరూపుడు. ఈశ్వరుడు జ్ఞానంతో శరీరధారణ చేస్తాడు కాబట్టి అతను నిత్యముక్తస్వరూపుడు. రెండు- జీవిశరీరం పంచభూతాలనుంచి ఏర్పడుతుంది. అందువల్ల దాన్ని పాంచభౌతిక శరీరం అంటారు. కాని ఈశ్వరుని విషయంలో మాయనుంచి వస్తుంది కాబట్టి దాన్ని మాయిక శరీరం అంటారు. అందువల్ల భగవంతునిది మాయా మానుషవేషం అంటారు.

3. **కార్యభేదం** - జీవుడు పుట్టేది కేవలం పుణ్యపాపాలను క్షయం చేసుకోవటానికి. పుణ్యపాపాలను క్షయం చేసుకోవాలంటే, సుఖదుఃఖాలను అనుభవించాలి; సుఖదుఃఖాలను అనుభవించాలంటే శరీరం కావాలి.

**శరీరం వినా సుఖం వా దుఃఖం వా అనుభోక్తుం నైవ శక్యతే**

కాని ఈశ్వరుని విషయంలో అలా కాదు. ఆయన పుణ్యపాపాలకు అతీతుడు. జగత్తును ఉద్ధరించటానికి అవతారం ఎత్తుతాడు. అందువల్ల ఈశ్వరుని రాకను లీలగా వర్ణిస్తారు. దుష్టశిక్షణ, శిష్టరక్షణ చేయటానికి వస్తాడు.

**యదా యదా హి ధర్మస్య గ్లానిర్భవతి భారత ।**
**అభ్యుత్థానమధర్మస్య తదాత్మానం సృజామ్యహమ్ ॥** – 4.7

ఈశ్వరుడు సృష్టికర్త, స్థితికర్త. ఆయన మనం ధర్మబద్ధంగా జీవనం నడపటానికి వేదాలనే మాన్యువల్‌ను ఇచ్చాడు. మనం వాటిని పాటించి, ధర్మబద్ధంగా జీవనం నడపాలని ఆశిస్తాడు. కాని ధర్మానికి గ్లాని కలిగినప్పుడు, ఆయన అవతారం ఎత్తాల్సి ఉంటుంది.

అవతారంలో రెండు పద్ధతుల్లో ధర్మసంస్థాపన చేస్తాడు. ఉదాహరణకు డాక్టర్లు చేసే వైద్యమే తీసుకోండి. కొన్ని సందర్భాలలో ఏదైనా అవయవం పాడయితే, ఆ అవయవాన్ని తీసేస్తారు. పాడయిన గాల్‌బ్లాడర్, యుటిరస్ వంటివి తీసేస్తారు. కాని అలా ఎన్నని తీస్తూపోతారు? చివరికి అంగాలు లేకుండా శరీరమనే బ్యాగు మాత్రమే మిగులుతుంది. రెండవ పద్ధతి – అనారోగ్యం తగ్గటానికి మందులు ఇస్తారు. తలనొప్పిగా ఉంటే శిరచ్ఛేదం చేయలేరు గదా! ఆ నొప్పి తగ్గటానికి మందు ఇస్తారు. భగవంతుడు కూడా ఈ రెండురకాల వైద్యాలూ చేస్తాడు.

నరసింహావతారంలో రాక్షససంహారం చేశాడు. కాని కొన్ని అవతారాల్లో రెండు రకాలుగానూ ధర్మసంస్థాపన చేశాడు. అంటే రాక్షససంహారమూ చేశాడు, జ్ఞానబోధనూ చేశాడు. అది రెండు అవతారాల్లో చేశాడు. అందువల్ల ఈ రెండు అవతారాలు చాలా ముఖ్యం. అవి రామావతారం, కృష్ణావతారం.

రామావతారంలో తనే ధర్మానికి ప్రతీకగా నిలిచాడు; కృష్ణావతారంలో ధర్మాన్ని బోధించాడు. రామాయణం అంటే రామ+అయనం; రాముడు నడిచిన మార్గం. అందువల్ల **రాముడు నడిచిన మార్గంలో నడవండి, కృష్ణుడు చెప్పిన బాటలో వెళ్ళండి** అంటారు. కృష్ణుడు చేసిన పనులు చేయకండి, కృష్ణుడు చెప్పిన బోధను ఆకళింపు చేసుకోండి. లేదు మేము కృష్ణుడు నడిచిన బాటలో నడుస్తాము, కృష్ణుడు వెన్న దొంగతనం చేసినట్టుగా మేమూ దొంగతనం చేస్తామంటే అలాంటివారికి ఒక్కటే జవాబు! దొంగతనం చేసేముందు కృష్ణుడు చిటికెన వేలితో గోవర్ధన పర్వతం ఎత్తాడు కదా, మీరు కూడా ఎత్తండి అనాలి. కృష్ణపరమాత్మ చెప్పాడు – శాస్త్రం మటుమాయమవుతున్నది కాబట్టి దాన్ని అంతరించి పోకుండా రక్షించే బాధ్యత కూడా నాదే అన్నాడు.

**స ఏవాయం మయా తేఽద్య యోగః ప్రోక్తః పురాతనః** – 4.3

నేను వైదిక ధర్మాన్ని మళ్ళీ నిలబెట్టటంకోసం నీకు చెబుతున్నాను అన్నాడు. అవతార రహస్యం గురించి చెప్పాక, ఒక అందమైన వాక్యంతో ఈ విషయాన్ని ముగించాడు.

**జన్మ కర్మ చ మే దివ్యమ్ ఏవం యో వేత్తి తత్త్వతః ।**
**త్యక్త్వా దేహం పునర్జన్మ నైతి మామేతి సోఽర్జున ॥** – 4.9

ఎవరైతే భగవంతుని గురించి పూర్తిగా తెలుసుకుంటారో, వారు ముక్తిని పొందుతారు. ఇక్కడ గుర్తించాల్సిన విషయం పూర్తిగా తెలుసుకోవటం. ఎందుకంటే భగవంతుని స్వరూపాలు రెండు ఉన్నాయి – సగుణరూపం, నిర్గుణం. నిర్గుణబ్రహ్మకు జననమరణాలు లేవు.

**అజాయమానో బహుధా విజాయతే** – పురుషసూక్తం

పుట్టకుండా పుట్టాడుట భగవంతుడు. అదెలా? భగవంతుని స్వరూపదృష్ట్యా, చైతన్యదృష్ట్యా, భగవంతునికి పుట్టుక లేదు. సగుణరూపానికే ఉంది. హే అర్జునా! నేను ఎన్నడూ పుట్టలేదు, పుట్టినట్టుగా ఉన్నాను.

**అజోఽపి సన్నవ్యయాత్మా భూతానామీశ్వరోఽపి సన్** – 4.6

సగుణబ్రహ్మ, నిర్గుణబ్రహ్మలను ఏడవ అధ్యాయంలో అపరాప్రకృతి, పరాప్రకృతిగా వర్ణిస్తాడు కృష్ణపరమాత్మ. ఈ అవతారవర్ణన గీతలో వేరే ఎక్కడా చూడము.

**2. జ్ఞానకర్మసన్న్యాసయోగం – శ్లోకాలు 13-24:** ఈ అంశం మొత్తం గీతకే ముఖ్యాంశం. సృష్టిని చూడండి – అత్యంత చిన్న అణువునుంచి, అత్యంత పెద్ద సూర్యుడు దాకా అన్నీ నిరంతరం తిరుగుతూనే ఉన్నాయి. కాని ఆత్మ ఎప్పటికీ అకర్త. అనాత్మ ఎప్పటికీ కర్త. ఈ భాగంలో రెండు రకాల కర్మసన్న్యాసం గురించి వివరించాడు కృష్ణపరమాత్మ.

**ఎ) సన్న్యాస జ్ఞాని** – ఈ విధమైన సన్న్యాసంలో ఒక వ్యక్తి తన కర్మలను త్యజించి సన్న్యాసం స్వీకరిస్తాడు. ఆశ్రమధర్మాల్లో ఇది నాలుగవ ధర్మం కిందకు వస్తుంది. ఇది బాహ్యసన్న్యాసం. దీనికి దీక్ష తీసుకోవాలి, ఇంట్లో ఉండకూడదు.

**బి) గృహస్థ జ్ఞాని –** ఇంకొక రకం సన్న్యాసంలో బాహ్యంగా ఏమీ మార్పు ఉండదు. అది పూర్తిగా అంతర్గతం. తామరాకుమీద నీటిబొట్టులాగా, సమాజంలో అందరి మధ్య ఉంటాడు. కాని దేనికీ చలించడు.

అనాత్మస్థాయిలో కదలిక ఎన్నడూ ఆగదు. అది నిరంతరం కొనసాగుతూనే ఉంటుంది. అనాత్మ కదలనట్టు కనిపించినా, అవ్యక్తరూపంలో కదలిక ఉంటూనే ఉంటుంది. అందువల్ల **అనాత్మ ఎప్పటికీ కర్త**. అనాత్మస్థాయిలో కర్మను త్యజించలేము; ఆత్మస్థాయిలో కర్మను త్యజించనవసరం లేదు. తెలివైన వ్యక్తి ఏం చెయ్యాలి? అనాత్మస్థాయిలో కర్మను స్వీకరించాలి. కర్మనుంచి పారిపోకూడదు. ఆత్మస్థాయిలో నేను అకర్తను, నేను ఆనందస్వరూపుడను అని అర్థం చేసుకోవాలి. **ఆత్మస్థాయిలో నేను అకర్తను, అనాత్మస్థాయిలో నేను కర్తను** అని తెలుసుకోవటమే జ్ఞానం.

ఈ జ్ఞానం పొందాలంటే వేదాంత శ్రవణ, మనన, నిదిధ్యాసనలు చేయాలి. జ్ఞానయోగం ద్వారా కర్మల నుంచి అంతర్గతంగా విముక్తి పొందటాన్ని అంతరసన్న్యాసం అంటారు. దీనికి కృష్ణపరమాత్మ ఇచ్చిన పేరు **జ్ఞానకర్మసన్న్యాసం**. దీని అర్థం జ్ఞానం, కర్మ రెండూ త్యజించమని కాదు. జ్ఞానేన కర్మసన్న్యాసః అంటే జ్ఞానం ద్వారా కర్మను సన్న్యసించమని.

అది మీ ఇల్లు అమ్మి, అందులోనే అద్దెకున్నట్టు ఉంటుంది. మీరుండే ఇల్లు మీ స్వంతం అయినప్పుడు, గోడకు మేకు కొట్టాలన్నా కూడా పదిసార్లు ఆలోచిస్తారు. అదే అద్దెఇంట్లో ఉంటే క్షణం కూడా ఆలోచించరు. ఇప్పుడు మీ ఇల్లును ఎవరికో అమ్మేశారు కాని అందులోనే ఉంటున్నారు అనుకుందాము. ఇల్లు అదే, వస్తువులు అవే. కాని మీ దృక్పథంలో పెద్ద మార్పు వచ్చింది. కేవలం చిన్న సంతకం పెట్టారు, మీ ఆలోచన మారిపోయింది.

జ్ఞాని కూడా అదే చేశాడు. జ్ఞాని కూడా తన శరీరమనే ఇంటిని భగవానునికి అమ్మేశాడు. కాని ఆ శరీరానికి ధర్మకర్తగా వ్యవహరిస్తున్నాడు. ఈ శరీరంతో వ్యవహారాలు నడుపుతాడు కాని తను అంతర్గత సన్న్యాసం చేస్తాడు. దీన్నే **జ్ఞానకర్మ సన్న్యాసం** అన్నాడు కృష్ణపరమాత్మ. ఇందులోని శ్లోకాలన్నీ అద్భుతమైనవి.

**యస్య సర్వే సమారంభాః కామసంకల్పవర్జితాః ।**
**జ్ఞానాగ్నిదగ్ధకర్మాణం తమాహుః పండితం బుధాః ॥** – 4.19

ఎంత మార్పు వస్తుందో అతనిలో! అతనేమీ రాయిలా మారడు. అతను కూడా గెలుపు ఓటమిలను చవిచూస్తాడు. కాని వాటి ప్రభావం అతనిమీద ఎక్కువగా ఉండదు. త్వరగా వాటినుంచి కోలుకుంటాడు.

**త్యక్త్వా కర్మఫలాసంగం నిత్యతృప్తో నిరాశ్రయః** – 4.20

జ్ఞాని పనులు చేస్తాడు కాని, వాటికి చలించడు. ఈ జ్ఞాని గురించి వర్ణించేటప్పుడు కృష్ణపరమాత్మ గృహస్థ జ్ఞాని గురించీ, సన్న్యాస జ్ఞాని గురించీ చెప్పాడు.

**కర్మణ్యభిప్రవృత్తోఽపి నైవ కించిత్ కరోతి సః ॥** – 4.20

**బ్రహ్మార్పణం బ్రహ్మ హవిర్బ్రహ్మాగ్నౌ బ్రహ్మణా హుతమ్ ।**
**బ్రహ్మైవ తేన గంతవ్యం, బ్రహ్మకర్మసమాధినా ॥** – 4.24

నిజానికి బ్రహ్మార్పణం శ్లోకం గృహస్థ జ్ఞాని గురించిన వర్ణన. మొత్తం భగవద్గీతలోనే దాన్ని చాలా ముఖ్యమైన శ్లోకంగా పరిగణిస్తారు. అది భోజనం ముందు పఠిస్తారనే కాదు, గృహస్థ జ్ఞాని గురించి చెబుతుంది కాబట్టి. దీన్నిబట్టి ఏ ఆశ్రమంలో ఉన్నా మోక్షం పొందవచ్చని అర్థమవుతుంది. నిజానికి జ్ఞానం పొందకపోతే సన్న్యాసాశ్రమ జీవనం చాలా భారంగా సాగుతుంది. గృహస్థు – జ్ఞాని అవచ్చు, అజ్ఞాని గానే ఉండిపోవచ్చు, అతను నష్టపోయేదేమీ లేదు. కాని సన్న్యాస జ్ఞాని కాకపోతే చాలా అవస్థ పడతాడు.

### 3. జ్ఞానసాధన ఫలాలు – శ్లోకాలు 25–42

శ్లోకాలు 25–34 వరకు జ్ఞానస్తుతి వస్తుంది. దీనికి ఒక ప్రత్యేక పద్ధతిని వాడుతున్నాడు కృష్ణపరమాత్మ. అనేక సాధనలను చెప్పి, చివరగా జ్ఞానసాధన అన్నిటికన్నా గొప్పదని నిరూపించబోతున్నాడు.

**ఎ) జ్ఞానయజ్ఞసాధనలు–** శ్లోకాలు 25–33 ఈ శ్లోకాల్లో కృష్ణపరమాత్మ 12 యజ్ఞాల గురించి ప్రస్తావించాడు. అవి టూకీగా – **జ్ఞానయజ్ఞం–** జీవాత్మ పరమాత్మల ఐక్యం నేర్చుకోవటం. ఇది పరావిద్య; **దైవయజ్ఞం** – దేవునికి చేసే పూజలు; **దమయజ్ఞం** – ఇంద్రియనిగ్రహం; **విషయభోగయజ్ఞం** – చేసే పనులను ఈశ్వరార్పణ భావనతో చేయటం; **శమయజ్ఞం** – మనోనిగ్రహం; **ద్రవ్యయజ్ఞం** – దానం; **తపోయజ్ఞం** – ఏదీ అతిగా చేయక పోవటం; **యోగయజ్ఞం** – పతంజలి చెప్పిన అష్టాంగయోగం; **స్వాధ్యాయయజ్ఞం** – శాస్త్రాన్ని పారాయణం చేయటం; **జ్ఞానయజ్ఞం** – అపరావిద్య నేర్చుకోవటం; **ప్రాణమయయజ్ఞం** – ప్రాణాయామాన్ని చేయటం; **ఆహారనియమయజ్ఞం–** ఏం తినాలి, ఎంత తినాలి తెలుసుకుని తినటం.

అన్నింటిలోకి ముఖ్యమైన సాధన ఏమిటి? జ్ఞానయజ్ఞం. శాస్త్రం ద్వారా ఆత్మజ్ఞానం పొందటం. ఇది ఎందుకు చాలా ముఖ్యమైనదంటే – జ్ఞానం ద్వారానే మోక్షం పొందగలము. తక్కిన సాధనలన్నీ సహకారీ సాధనలే.

అందువల్ల జ్ఞానయోగం సాక్షాత్తు సాధన అయితే, తక్కిన సాధనలు సహకారీ సాధనలు. ఆ విషయం కృష్ణపరమాత్మే చెప్పాడు.

**శ్రేయాన్ ద్రవ్యమయాద్యజ్ఞాత్ జ్ఞానయజ్ఞః పరంతప ।**
**సర్వం కర్మాఖిలం పార్థ జ్ఞానే పరిసమాప్యతే ॥** – 4.33

హే అర్జునా! జ్ఞానయజ్ఞమే మోక్షసాధన, తక్కిన సాధనల విషయంలో ఏదో ఒకటో, ఏవో కొన్నో ఎన్నుకోవచ్చు. కాని జ్ఞానయజ్ఞం విషయంలో ఎన్నుకునే అవకాశం లేదు. ఎప్పుడో అప్పుడు జ్ఞానయజ్ఞానికి వచ్చితీరాలి. ఒక గుడిలోకి తూర్పుద్వారంనుంచో, పడమరద్వారంనుంచో, దక్షిణద్వారంనుంచో, ఉత్తరద్వారంనుంచో వెళ్ళవచ్చు. కాని గర్భగుడిలోకి మాత్రం ఒక్కమార్గమే ఉంటుంది. అలాగే చిత్తశుద్ధి పొందటానికి ఏ యజ్ఞమైనా ఎన్నుకోవచ్చు, కాని మోక్షం పొందటానికి ఒక్క మార్గమే ఉంది.

**బి) జ్ఞానంపొందే మార్గం–** శ్లోకం 34 జ్ఞానాన్ని స్వంతంగా పొందలేము. మన మొహం చూసుకోవటానికి ఎలా దర్పణం వాడతామో, అలా ఆత్మజ్ఞానం పొందటానికి శాస్త్రదర్పణం వాడాలి. ఇందులో గురువుయొక్క ప్రాముఖ్యత గురించి కూడా ప్రస్తావించాడు. గురువుల్లో మూడు రకాలు  ఉంటారని చూశాము. వారు – మంత్రోపదేశం చేసే గురువు; ప్రేరణనిచ్చే గురువు; బోధ చేసే గురువు. ఈ ముగ్గురు గురువుల మధ్య ఉన్న భేదాన్ని సరిగ్గా అర్థం చేసుకోవాలి మనం. బోధ చేసే గురువు దగ్గరకు వెళ్ళాలి అన్నాడు కృష్ణపరమాత్మ.

**తద్విద్ధి ప్రణిపాతేన పరిప్రశ్నేన సేవయా । ఉపదేక్ష్యంతి తే జ్ఞానం జ్ఞానినస్తత్త్వదర్శినః ॥** – 4.34

ఆ గురువు దగ్గరకు వెళ్ళి నమస్కారం చేయాలి, ప్రశ్నలు వెయ్యాలి, సేవలు చేయాలి. మొదటి రెండింటివల్ల శిష్యునికున్న జిజ్ఞాస, వినయం తెలుస్తాయి. సేవ చేయటంవల్ల గురుశిష్యుల మధ్య అనుబంధం పెరుగుతుంది.

**సి) జ్ఞానసాధనలు–** శ్లోకాలు 35–37 ఇందులో నాలుగు సానుకూల సాధనల గురించి, మూడు వ్యతిరేక సాధనల గురించి కృష్ణపరమాత్మ చెబుతున్నాడు.

**1. యోగం – యోగ సంసిద్ధః కాలేనాత్మని విందతి** –జ్ఞానమనే విత్తనం మనస్సనే భూమిలో పెరగటానికి మనస్సును సిద్ధం చేయాలి. మనస్సును ఎలా సిద్ధం చేయాలి? యోగం ద్వారా చేయాలి. ఈ యోగం రెండు విధాలు – **కర్మయోగం, ఉపాసనయోగం.**

**2. శ్రద్ధ–** శాస్త్రంమీద నమ్మకం పెట్టుకోవాలి. ఏవైనా సందేహాలు కలిగినా వింటూపోతే చివరికొచ్చేసరికి ఆ సందేహాలు వాటంతట అవే తీరతాయి. వేదాంతం నిశ్చయజ్ఞానాన్ని ఇస్తుంది.

**శ్రద్ధావాన్ లభతే జ్ఞానం తత్పరః సంయతేంద్రియః ।**
**జ్ఞానం లబ్ధ్వా పరామ్ శాంతిమచిరేణాధిగచ్ఛతి ॥** – 4.39

3. **తపన – తత్పరః** అన్నాడు కృష్ణపరమాత్మ. తపన ఉన్న విద్యార్థికి ఈ జ్ఞానం కలుగుతుంది. కొంతమంది గీతాక్లాసులకు వెళ్ళటానికి సిగ్గు పడతారు. ఈ ముసలివయస్సులో వీరు నేర్చుకుంటున్నారేమిటా అని ఎవరైనా నవ్వుతారేమోనని బెరుకు. అలాంటివి పట్టించుకోని తపన ఉండాలి. తపన లేకపోతే ఆశించిన ఫలం రాదు. జ్ఞానం పొందలేరు.

4. **ఇంద్రియనిగ్రహం – సంయతేంద్రియః** అన్నాడు కృష్ణపరమాత్మ. ఇంద్రియనిగ్రహం ఉండాలి.

**అజ్ఞశ్చాశ్రద్ధధానశ్చ సంశయాత్మా వినశ్యతి** – ఈ ముగ్గురు వ్యక్తులు ప్రతికూల లక్షణాలు ఉండటంవల్ల జీవితంలో నష్టపోతారు. అజ్ఞాని, శ్రద్ధ లేనివాడు, సంశయాత్ముడు నష్టపోతారు. వీరిలో ఎక్కువగా నష్టపోయేది సంశయాత్ముడు.

**డి) జ్ఞానఫలం –** శ్లోకాలు 38–42 కృష్ణపరమాత్మ నాలుగు ఫలాలను పేర్కొన్నాడు. అవి మోహనాశనం, జీవ ఈశ్వర ఐక్యదర్శనం. సర్వపాపనాశనం, సర్వకర్మ నాశనం,

**1. మోహనాశనం–** మోహనాశనం అవటంవల్ల జీవితంలో పడే ఘర్షణలు పోతాయి. ఘర్షణకు మూలకారణం మోహం. మోహం అంటే బంధం. ఎప్పుడైతే ఆత్మజ్ఞానం పొందుతామో, అప్పుడు భవిష్యత్తును ఎదుర్కోవటానికి సిద్ధంగా ఉంటాము.

**2. జీవ ఈశ్వర ఐక్యదర్శనం–** జీవఈశ్వర ఐక్యదర్శనం అవుతుంది. అల, సముద్రం ఒకటే అని చెప్పినట్టవుతుంది. అంత చిన్న అల, అంత పెద్ద సముద్రం ఒకటే ఎలా అవుతాయి? అలలో ఉన్నదీ నీరే, సముద్రంలో ఉన్నదీ నీరే. అలాగే స్వరూపదృష్ట్యా నేనూ, భగవంతుడూ ఒకటే. ఇద్దరం ఒకటే చైతన్యస్వరూపం.

**3. సర్వపాపనాశనం –**ఆత్మజ్ఞానం పొందితే అన్ని పాపాలూ దగ్ధమవుతాయి. **జ్ఞానప్లవేన ఏవ సంతరిష్యసి –** ప్లవః అంటే నౌక. జ్ఞానమనే నౌకతో మహాసాగరాన్ని దాటవచ్చు. వృజినం అంటే పాపసాగరం.

**4. సర్వకర్మనాశనం–**సంచితకర్మలు దగ్ధమవుతాయి; ఆగామి కర్మలు అంటవు; ప్రారబ్ధకర్మలు చలింపచేయవు. అలా పాపనాశనం అవుతుంది. సర్వకర్మనాశనంలో పాపాలే కాదు, పుణ్యాలు కూడా నాశనమవుతాయి. పుణ్యకర్మలు కూడా పునర్జన్మనిస్తాయి కాబట్టి జ్ఞానికి పునర్జన్మ లేకుండా, పుణ్యకర్మలు కూడా నాశనమవుతాయి.

**కర్మాణి న నిబధ్నంతి** – శ్రవణ, మనన, నిదిధ్యాసనలు చేసిన వ్యక్తిని కర్మలు బంధించలేవు.

కర్మయోగం జ్ఞానయోగ్యతా ప్రాప్తికి; జ్ఞానయోగం జ్ఞానం పొందటానికి కావాలి.

**కృష్ణపరమాత్మ బోధ సారాంశం కర్మయోగం పాటించు, చిత్తశుద్ధి పొందు, జ్ఞానయోగం పాటించు, జ్ఞానం పొందు, విముక్తి పొందు.**